'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 254

శుక్రవారం 5-12-2025

రెండోరోజూ విమానాల రద్దు

సిబ్బంది కొరతతో నిలిచిపోయిన 550కుపైగా సర్వీసులు - 8లో

టెస్టు ఫార్మాట్‌కే పరిమితమా!

సిరాజ్‌పై సెలక్టర్ల శీతకన్ను, వన్డే, టి20లకు దూరం -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

• చంద్రబాబు 'గోబెల్స్' గురువు..

సూపర్ 6 పేరిట

'సూపర్' మోసం

సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సక్రమంగా ఎక్కడ అమలు చేశారు?

సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

ఆడబిడ్డ నిధి కింద మహిళలకు ఏటా రూ. 18 వేల చొప్పున రెండేళ్లలో రూ.36 వేలు ఇవ్వాలి.. ఒక్కరికైనా ఇచ్చావా? ఇది మోసం కాదా?

నిరుద్యోగులకు భృతి కింద నెలకు రూ. 3 వేల చొప్పున రెండేళ్లలో రూ.72 వేలు ఇవ్వాలి.. ఎంత మందికి ఇచ్చావ్? ఇది మోసం కాదా?

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే నెలకు రూ.4 వేలు చొప్పన పింఛన్ ఎక్కడిస్తున్నారు?
- ఈ రెండేళ్లలో రూ.96 వేలు ఎంత మందికి పంపిణీ చేశారు? ఇది కూడా మోసం కాదా?
- రైతు భరోసా కింద కేంద్రం ఇచ్చేది కాకుండా ఏటా రూ.20 వేలు ఇస్తామన్నారు
- రెండేళ్లలో రూ.40 వేలకుగాను రూ.10 వేలే ఇచ్చి రూ.30 వేలు ఎగ్గొట్టడం మోసం కాదా?
- తల్లికి వందనం కింద రెండేళ్లకు గాను ప్రతి పిల్లాడికి రూ.30 వేలు ఎక్కడిచ్చారు?
- తొలి ఏడాది ఎగ్గొట్టి.. రెండో ఏడాది అరకొరగా ఇవ్వడం మోసం కాదా?
- రాష్ట్రమంతటా మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి ఆంక్షలు పెట్టడం మోసం కాదా?
- 420 చేష్టలతో ప్రజలను మోసగించి గోబెల్స్‌కు టీచర్, మెంటార్‌లా ప్రచారం
- చంద్రబాబుపై చీటింగ్ కేసుపెట్టి లోపల వేయాలి

2లో

ఉద్యోగులను ముంచేశారు

5 డీఏలకుగానూ ఇచ్చింది ఒకే ఒక్కటి.. అదీ వాయిదాల్లో

ఐఆర్ ఊసే లేదు.. పీఆర్సీ హామీ గాలికి వదిలేశారు

రూ.31 వేల కోట్ల బకాయిలు పెండింగ్ : వైఎస్ జగన్

రైతుల జీవితాలు చిన్నాభిన్నం

ఈ-క్రాప్ నిర్వీర్యం.. ఉచిత పంటల బీమా ఎత్తేశారు..

ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు.. రూ.1,100 కోట్ల

ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు చెల్లించలేదు : వైఎస్ జగన్



విశాఖ స్టీల్‌కు సొంత గని అడగరు..

ప్రైవేటు ప్లాంట్‌కు అడుగుతారా?

- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం

ఆ 53 వేల ఎకరాలకే దిక్కులేదు

ఇప్పుడు మళ్లీ 53 వేల ఎకరాలా?

రాజధానిలో రెండో విడత భూ సమీకరణపై జగన్

- వివరాలు 2,6,7 పేజీల్లో..

లడ్డూ ప్రసాదంపై నిరాధార నిందలా?



- తిరుమల లడ్డూ ప్రసాదం జంతువుల కొవ్వు కలిసిన నెయ్యితో తయారు చేశారన్నావ్..
- వాటిని భక్తులు తిన్నారన్నావ్.. వాటికి ఆధారాలు దొరికాయా?
- రాజకీయ లబ్ధి కోసం తిరుమల శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీస్తారా?
- బాబుపై వైఎస్ జగన్ ఆగ్రహం

ఈ సర్కారుకు మాయరోగం

- మీ స్కామ్‌ల కోసం ప్రజల ఆరోగ్య భద్రతను దెబ్బతీస్తారా బాబూ?: వైఎస్ జగన్
- ఆరోగ్యశ్రీని పూర్తిగా ఎత్తేశారు.. కొత్త వైద్య కళాశాలలు ప్రైవేటుకిస్తున్నారు
- ప్రైవేటుపరం చేసి ప్రభుత్వమే జీతాలు ఇస్తుందట.. ఇంతకన్నా పెద్ద స్కామ్ ఉందా?

సందట్లో సడేమియా!

- అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అవినీతి కేసులను తీసేయించుకుంటున్న చంద్రబాబు
- బెయిల్‌పై ఉన్న చంద్రబాబు షరతులు ఉల్లంఘిస్తుంటే ఎందుకు ఆయన బెయిల్ రద్దు చేయకూడదు?: వైఎస్ జగన్

- వివరాలు 2,6,7 పేజీల్లో..

పుతిన్‌కు ఘనస్వాగతం

ఎయిర్‌పోర్టుకు స్వయంగా వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ

భారత పర్యటన కోసం గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కారులో తన అధికారిక నివాసానికి తీసుకెళ్తున్న ప్రధాని మోదీ

మోదీ అధికారిక నివాసానికి ఒకే కారులో వెళ్లిన ఇరువురు నేతలు...

రష్యా అధినేతకు ప్రైవేట్ విందు ఇచ్చిన ప్రధానమంత్రి

నేడు 23వ ఇండియా-రష్యా సదస్సుకు హాజరు కానున్న పుతిన్, మోదీ

కీలక ఒప్పందాలకు అవకాశం

8లో

ఎవరికీ వ్యతిరేకం కాదు: పుతిన్

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల ట్రేటిల్ ధర ₹90	ఫారం దగ్గర లైవ్ బర్డ్	135 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	235 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	162 కిలో	స్కిన్ లెస్	267 కిలో

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఎన్ని అబద్ధాలు చెప్పినా, ఎల్లో మీడియాతో ఎంత ప్రచారం చేయించినా.. జీవోలో నిజం చెప్పక తప్పింది కాదు.. అదే సార్ బాధ!!

కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో

పీజీ సీటు రూ.29 లక్షలు



చంద్రబాబు సర్కారు నిర్ణయం

■ వైద్య విద్యార్థులకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. ఒకవైపు 10 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏకంగా ప్రైవేట్‌కు కట్టబెడుతున్నారు. మరోవైపు పీజీ సీట్లను అమ్మకానికి పెట్టేశారు. వైఎస్ జగన్ హయాంలో ప్రారంభించిన ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలకు మంజూరైన పీజీ సీట్లకు రూ.29 లక్షల చొప్పున వసూలు చేసేందుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు.

10లో

ఇలా 'సెలవిచ్చారు'

2026 సెలవుల జాబితా విడుదల చేసిన ప్రభుత్వం

■ 2026 క్యాలెండర్ ఇయర్‌లో సాధారణ సెలవులు, ఆప్షనల్ హాలిడేల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం మొత్తం 24 సెలవు దినాలు ప్రకటించింది. ఇందులో మహాశివరాత్రి, బాబూ జగ్జీవన్‌రాం జయంతి, దుర్గాష్టమి, దీపావళి ఆదివారం వచ్చాయి. ఈసారి అత్యధిక సెలవులు శుక్రవారం రావడం విశేషం.

10లో



సాక్షి బిజినెస్

శుక్రవారం
5-12-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	158	85,265
నిఫ్టీ ▲	48	26,034

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,483	▲	29
డోజోన్స్	47,855	▲	27
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,719	▲	28
డాక్స్	23,873	▲	179
షాంఘై	3,876	▽	2
నికాయ్	51,028	▲	1,164

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	90.00	91.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	119.20	122.15
€	యూరో	ఎస్‌బీఐ	104.10	106.92
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.51	60.90
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.05	60.90
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.10	70.82
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.11	24.60
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.61	24.87
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.85	13.67

రిటైల్ ఇన్వెస్టర్లు స్మార్ట్‌గురూ!

ఈ కేలండర్ ఏడాది(2025) మార్చి మొదలు రిటైల్ ఇన్వెస్టర్లు ఈక్విటీ పెట్టుబడులపట్ల కొంత మేర విముఖతను ప్రదర్శిస్తున్నారు. దీంతో అప్పుడప్పుడూ కొనుగోళ్లకు కట్టుబడినప్పటికీ అడపాదడపా విక్రయాలకే అధిక ప్రాధాన్యమిస్తూ వచ్చారు. ఇదే బాటలో గత రెండు నెలల్లో మరింత అధికంగా పెట్టుబడులు వెనక్కి తీసుకోవడం ద్వారా స్మార్ట్‌గా వ్యవహరిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం.. – సాక్షి, బిజినెస్ డెస్క్

- మార్కెట్లు రికార్డుల వేటలో
- చిన్న ఇన్వెస్టర్లు అమ్మకాల బాటలో
- 2 నెలల్లో రూ. 23,000 కోట్లు వెనక్కి
- ఫండ్స్ పెట్టుబడుల కొనసాగింపు

కొద్ది నెలలుగా ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు సరికొత్త గరిష్టాలను తాకుతూ కదులుతున్నాయి. ఇటీవలే ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ 86,100 పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ 26,300ను అధిగమించాయి. ఈ బాటలో గత రెండు నెలల్లోనూ హెచ్చుతగ్గుల మధ్య లాభాలు ఆర్జించాయి. అక్టోబర్‌లో ఇండెక్సులు 4.5 శాతం పుంజుకోగా.. నిఫ్టీ మిడ్ క్యాప్(100) 5.8 శాతం, స్మాల్ క్యాప్(100) 4.7 శాతం చొప్పున ఎగశాయి. ఈ ప్రభావంతో నవంబర్‌లోనూ నిఫ్టీ, నిఫ్టీ మిడ్ క్యాప్ మరింత బలపడినప్పటికీ స్మాల్ క్యాప్ 3 శాతం క్షీణించింది. సరిగ్గా ఇదే సమయంలో అంటే గత రెండు నెలల్లో రిటైల్ ఇన్వెస్టర్లు ఉమ్మడిగా రూ. 23,405 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం గమనార్హం! ఈ ట్రెండ్ ఇప్పటివరకూ 2025 పొడవునా కనిపించినట్లు విశ్లేషకులు తెలియజేశారు.

అప్రమత్తతతో..

నిజానికి మార్కెట్లు బలపడుతున్నప్పుడు విక్రయాలకు ప్రాధాన్యమిస్తూ వచ్చిన రిటైలర్లు దిద్దుబాటుకు లోనైనప్పుడు కొనుగోళ్లు చేపడుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. తద్వారా దేశీ స్టాక్స్‌పట్ల అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలియజేశారు. అయితే మరోపక్క ఇదే సమయంలో దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు(మ్యూచువల్ ఫండ్స్, బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్స్) పెట్టుబడులను కొనసాగించడం ప్రస్తావించదగ్గ అంశం! వివిధ పథకాలలో కొంతమంది రిటైలర్లు సిప్‌ల ద్వారా పెట్టుబడులు కొనసాగించడం మ్యూచువల్ ఫండ్‌లకు దన్నుగా నిలుస్తున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ప్రధానంగా స్వల్పకాలిక పెట్టుబడుల విషయంలో రిటైలర్లు అప్రమత్తతతో వ్యవహరిస్తున్నట్లు తెలియజేశారు. అధిక విలువల్లో కొనుగోలు చేసిన షేర్ల విషయంలోనూ మార్కెట్ల తీరు ఆధారంగా కొద్దిపాటి నష్టాలకు లేదా లాభాలకు అమ్మకాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. మరోపక్క అంతగా లాభాలకు ఆస్కారం లేదనిపించిన దీర్ఘకాలిక పెట్టుబడులపైనా ఇదే ధోరణి అనుసరిస్తున్నట్లు వివరించారు.

ఐపీవోలలోనూ

2025లో ప్రైమరీ మార్కెట్లు సరికొత్త రికార్డులు సాధిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే 96 ఇష్యూలు రూ. 1.6 లక్షల కోట్లు సమీకరించాయి.

2025లో పెట్టుబడులు, సెన్సెక్స్ తీరిలా

నెల	రూ. కోట్లలో	శాతంలో
మార్చి	-14,325	+5.8
ఏప్రిల్	-2,720	+3.7
జూన్	-5,263	+2.6
జూలై	+11,104	-2.9
అక్టోబర్	-11,232	+4.6
నవంబర్	-12,173	+2.1

అయితే రిటైలర్లు ఐపీవోలో లిస్టింగ్ లాభాలకోసమే ఇన్వెస్ట్ చేస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో లిస్టింగ్ రోజునే అత్యధిక శాతం ఇన్వెస్టర్లు హోల్డింగ్స్ విక్రయించడం ద్వారా పెట్టుబడులు వెనక్కి తీసుకుంటున్నట్లు తెలియజేశారు.

లిస్టింగ్‌కు సాయి పేరెంటరల్స్

- సెబీకి ఫార్మా సంస్థ దరఖాస్తు
- ఐపీవోలో ప్రమోటర్ల వాటా విక్రయించం: ఎండీ అనిల్‌కుమార్
- కొత్త ఇన్వెస్టర్లలో జెరోధా కామత్, కిమ్స్ ఫౌండర్ భాస్కరరావు

ఐపీవో స్ట్రీట్

సాక్షి, బిజినెస్ బ్యూరో: వేగంగా ఎదుగుతున్న డైవర్సిఫైడ్ ఫార్మా ఫార్ములేషన్ సంస్థ 'సాయి పేరెంటరల్స్' పబ్లిక్ ఇష్యూకు రానున్నట్లు సంస్థ ఎండీ కె.అనిల్‌కుమార్ వెల్లడించారు. సెప్టెంబర్లో సెబీ వద్ద డీఆర్‌హెచ్‌పీ దాఖలు చేశామని చెప్పారాయన. గురువారమిక్కడ విలేకరులతో మాట్లాడుతూ... తమ సంస్థ రూ.125 కోట్లతో ఆస్ట్రేలియాకు చెందిన నౌమెడ్ ఫార్మాస్యూటికల్స్‌ను కొనుగోలు చేసినట్లు ప్రకటించారు. ''ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్న నౌమెడ్ ఫార్మా కోసం ఇండియాలోని పలు సంస్థలు కాంట్రాక్టు మాన్యుఫాక్చరింగ్ చేస్తున్నాయి. అలా చేస్తున్న సంస్థల్లో మాది కూడా ఒకటి. మేం ఇపుడు నౌమెడ్‌ను కొనుగోలు చేయటం ద్వారా మేమే అత్యధికంగా నౌమెడ్ కోసం తయారు చేసే అవకాశం దక్కుతుంది. పైపెచ్చు నౌమెడ్ సంస్థ ఆస్ట్రేలియాలో ఒక ప్లాంటు నిర్మిస్తోంది. అది 2026 సెప్టెంబరుకు పూర్తవుతుంది. 450కి పైగా పేటెంట్లు (ఐపీ) దాఖలు చేసిన నౌమెడ్ ఫార్మా అడిలైడ్ ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి 2027 జనవరి నుంచి మొదలవుతుంది. దీంతో 2028–2029 నుంచి మా వ్యాపార పరిణామం గణనీయంగా పెరుగుతుంది'' అని అనిల్‌కుమార్ వివరించారు. గతేడాది తమ వ్యాపారం, నౌమెడ్ వ్యాపారం కలిపితే సుమారుగా రూ.500 కోట్లకు పైనేనని, మూడేళ్లలో ఇది మూడు రెట్లకు పైగా పెరుగుతుందని అంచనా వేస్తున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారాయన. మూడేళ్ల కిందట తమ విస్తరణ ప్రణాళికల కోసం కొందరు ఇన్వెస్ట్ చేశారని, వారికి ఎగ్జిట్ అవకాశం కల్పించడానికే ప్రస్తుతం పబ్లిక్ ఇష్యూకు వస్తున్నామని అనిల్‌కుమార్ చెప్పారు. కొంత ఫ్రెష్ ఇష్యూ ఉన్నా... ఆ నిధులు విస్తరణకు, ఆర్ అండ్ డీ బలోపేతానికి వినియోగిస్తామని తెలియజేశారు. ప్రమోటర్లు మాత్రం తమ వాటాలో 1% కూడా విక్రయించడం లేదని, కంపెనీ భవిష్యత్తుపై నమ్మకానికి అదే ప్రతీక అని చెప్పారు. గడిచిన ఏడాదికాలంగా తమ సంస్థలో ఇన్వెస్ట్ చేసిన వారిలో జెరోధా నిఖిల్ కామత్, కిమ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, బ్లూ లోటస్ క్యాపిటల్ వంటి ప్రధాన ఇన్వెస్టర్లున్నారని, వారు ఇన్వెస్టర్లుగానే కొనసాగుతారని ఆయన వివరించారు.

నెఫ్రోకేర్ హెల్త్@ రూ. 438–460

- 10–12 మధ్య పబ్లిక్ ఇష్యూ
- రూ. 871 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: డయాలసిస్ సేవలు అందించే హైదరాబాద్ కంపెనీ నెఫ్రోకేర్ హెల్త్ సరీ్వసెస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 438–460 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 10న ప్రారంభం కానున్న ఇష్యూలో భాగంగా రూ. 353.4 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 517.6 కోట్ల విలువైన(1.12 కోట్ల) షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 871 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇష్యూ 12న ముగియనుంది. నెఫ్రోప్లస్ బ్రాండ్‌తో డయాలసిస్ సేవలందించే కంపెనీ యాంకర్ ఇన్వెస్టర్లకు 9న షేర్లను ఆఫర్ చేయనుంది. కాగా.. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 129 కోట్లు కొత్త డయాలసిస్ క్లినిక్‌ల ఏర్పాటుకు, రూ. 136 కోట్లు రుణ చెల్లింపులకు, మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

రష్యా బ్యాంక్ విస్తరణ బాట

- దేశీయంగా బ్రాంచీల ఏర్పాటుకు రెడీ
- మూడేళ్లలో రూ. 890 కోట్ల పెట్టుబడులు
- పుతిన్‌తో భారత్‌కు వచ్చిన సీఈవో గ్రెఫ్

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగ రష్యా దిగ్గజం స్బెర్‌బ్యాంక్ దేశీయంగా కార్యకలాపాల విస్తరణపై దృష్టి పెట్టింది. ఇందుకు అనుగుణంగా మూడేళ్లలో 10 కోట్ల డాలర్లు(దాదాపు రూ. 900 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. ఇక్కడ పూర్తిస్థాయిలో బ్యాంకింగ్ లైసెన్స్ కలిగి ఉన్న తాము మూడేళ్లలో క్రమంగా బిజినెస్‌ను విస్తరించుకోనున్నట్లు స్బెర్‌బ్యాంక్ సీఈవో, చైర్మన్ హెర్మన్ గ్రెఫ్ పేర్కొన్నారు. బీటూబీ బిజినెస్‌ను పెంచుకోవడంతోపాటు బీటూసీ విభాగంలోనూ ప్రవేశించనున్నట్లు వెల్లడించారు. 2010లో కార్యకలాపాలు ప్రారంభించిన సంస్థ తాజాగా 10 పట్టణాలలో బ్రాంచీలు తెరిచేందుకు లైసెన్సుల కోసం ఆర్‌బీఐకు దరఖాస్తు చేసింది. ప్రస్తుతం బెంగళూరులో సొంత డేటా ప్రాసెసింగ్ కోసం ఐటీ యూనిట్‌తో పాటు రెండు బ్రాంచీలను కలిగి ఉంది. హైదరాబాద్‌లోనూ మరో సొంత డేటా సెంటర్ ఏర్పాటు ప్రణాళికల్లో ఉన్నట్లు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. ప్రస్తుతం భారత పర్యటనకు రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్‌తో గ్రెఫ్ సైతం కలసి వచ్చారు. గురువారం నుంచి ప్రారంభమైన 23వ భారత్–రష్యా వార్షిక సదస్సులో పాల్గొనేందుకు పుతిన్ విచ్చేసిన సంగతి తెలిసిందే.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌కు డిమాండ్	నేడే ఆర్‌బీఐ ఎంపీసీ నిర్ణయాలు

4 రోజుల నష్టాలకు చెక్

- ఐటీ, టెక్ షేర్లకు డిమాండ్
- స్వల్ప లాభాలతో ముగింపు

ముంబై: ఐటీ, టెక్ షేర్లకు డిమాండ్ లభించడంతో దేశీయ స్టాక్ మార్కెట్ నాలుగు రోజుల నష్టాల నుంచి గట్టెక్కింది. సెన్సెక్స్ 158 పాయింట్లు పెరిగి 85,265 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 48 పాయింట్లు బలపడి 26,034 వద్ద నిలిచింది. ఆసియాలో కొరియా, చైనా మార్కెట్లు నష్టపోగా, జపాన్, హాంగ్‌కాంగ్ లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.30 నుంచి 1% వరకు లాభపడ్డాయి. అమెరికా సూచీలు పావు శాతం లాభంతో ట్రేడవుతున్నాయి.

రూపాయి రికవరీ: రూపాయి విలువ జీవితకాల కనిష్ట స్థాయిల నుంచి రికవరీ అయ్యింది. డాలర్ మారకంలో 26 పైసలు బలపడి 90 స్థాయికి ఎగువన 89.89 వద్ద స్థిరపడింది. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 90.36 వద్ద రూపాయి ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో 28 పైసలు క్షీణించి 90.43 వద్ద జీవితకాల కనిష్టాన్ని నమోదు చేసింది. అయితే ఆర్‌బీఐ జోక్యంతో పాటు యూఎస్ కరెన్సీ బలహీనత కలిసిరావడంతో నష్టాలు భర్తీ చేసుకుంది.

సాక్షి స్పోర్ట్స్

ఆనంద్‌పై నెగ్గి విజేతగా నిలిచిన అర్జున్

జెరూసలేమ్: భారత చెస్ నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ సంచలనం సృష్టించాడు. జెరూసలేమ్ మాస్టర్స్ ర్యాపిడ్ చెస్ టోర్నీలో చాంపియన్‌గా అవతరించాడు. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్, భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌తో జరిగిన ఫైనల్లో 22 ఏళ్ల అర్జున్ 2.5–1.5తో నెగ్గాడు. వీరిద్దరి మధ్య తొలి గేమ్ 58 ఎత్తుల్లో... రెండో గేమ్ 30 ఎత్తుల్లో 'డ్రా' అయ్యాయి. దాంతో 1–1తో సమంగా నిలిచారు. విజేతను నిర్ణయించేందుకు రెండు బ్లిట్జ్ గేమ్‌లు నిర్వహించారు. తొలి గేమ్‌లో అర్జున్ 45 ఎత్తుల్లో ఆనంద్‌ను ఓడించి, రెండో గేమ్‌ను 36 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని టైటిల్‌ను దక్కించుకున్నాడు. సెమీఫైనల్స్‌లో అర్జున్ 1.5–0.5తో పీటర్ స్విడ్లెర్(రష్యా) పై, ఆనంద్ 1.5–0.5తో ఇయాన్ నిపోమ్‌నిషి (రష్యా)పై గెలిచారు. విజేతగా నిలిచిన అర్జున్‌కు 55 వేల డాలర్లు (రూ. 49 లక్షల 44 వేలు), రన్నరప్ ఆనంద్‌కు 35 వేల డాలర్లు (రూ. 31 లక్షల 46 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

జనం తాకిడిని ఊహించి...

వేదిక మారిన హార్దిక్ పాండ్యా మ్యాచ్

హార్దిక్ పాండ్యా

సాక్షి, హైదరాబాద్: భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న దేశవాళీ టి20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా జట్టు తరఫున ఆడుతున్నాడు. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో పంజాబ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అతని మెరుపు ప్రదర్శనను అభిమానులు ప్రత్యక్షంగా చూశారు. షెడ్యూల్ ప్రకారం గురువారం సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగే మ్యాచ్‌లో గుజరాత్‌తో బరోడా తలపడాల్సి ఉంది. అయితే నగరం మధ్యన కీలక ప్రాంతంలో మైదానం ఉండటం... ఫెన్సింగ్ మినహా తగిన భద్రతా ఏర్పాట్లు లేని జింఖానా మైదానంలో మ్యాచ్‌పై పోలీసులు సందేహం వ్యక్తం చేశారు. పాండ్యా ఆట కోసం జనం ఎగబడితే వారిని నిలువరించడం కష్టం కావడంతో పాటు పరిస్థితి పూర్తిగా చేయి దాటే ప్రమాదం ఉండటంతో ఇదే విషయాన్ని బుధవారం రాత్రి హెచ్‌సీఏ అధికారులకు తెలియజేశారు. ఏదైనా అనుకోనిది జరిగితే హెచ్‌సీఏను పూర్తిగా బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. దాంతో ఈ మ్యాచ్‌ను మెరుగైన సౌకర్యాలు ఉన్న ఉప్పల్ స్టేడియానికి మార్చాల్సి వచ్చింది. ఉప్పల్ స్టేడియంలో జరగాల్సిన బెంగాల్, సర్వీసెస్ మ్యాచ్‌ను జింఖానా మైదానంలో నిర్వహించారు. గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో బరోడా 8 వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా గుజరాత్ 14.1 ఓవర్లలో 73 పరుగులకు ఆలౌటైంది. హార్దిక్ పాండ్యా 4 ఓవర్లలో 16 పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు. అనంతరం బరోడా 6.4 ఓవర్లలో 2 వికెట్లకు 74 పరుగులు చేసి నెగ్గింది. హార్దిక్ పాండ్యా 6 బంతుల్లో 2 ఫోర్లతో 10 పరుగులు చేసి అవుటయ్యాడు.

షమీకి 4 వికెట్లు: సర్వీసెస్‌పై బెంగాల్ గెలుపు

జింఖానా మైదానంలో సర్వీసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ జట్టు 7 వికెట్ల తేడాతో గెలిచింది. సర్వీసెస్ 18.2 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. బెంగాల్ జట్టుకు ఆడుతున్న భారత పేసర్లు షమీ 3.2 ఓవర్లలో 13 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా... ఆకాశ్‌దీప్ 4 ఓవర్లలో 27 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. అనంతరం బెంగాల్ 15.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసి నెగ్గింది. అభిషేక్ పొరెల్ (56; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిమన్యు ఈశ్వరన్ (58; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేసి బెంగాల్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

ఆంధ్రను గెలిపించిన అశ్విన్, రషీద్

రషీద్

అశ్విన్

లక్నో: సమష్టి ఆటతీరుతో రాణించిన ఆంధ్ర జట్టు ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో నాలుగో విజయం నమోదు చేసుకుంది. ఛత్తీస్‌గఢ్ జట్టుతో గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' ఐదో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో నెగ్గింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఛత్తీస్‌గఢ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 158 పరుగులు చేసింది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్, పృథ్వీరాజ్, బైలాపుడి యశ్వంత్ రెండు వికెట్ల చొప్పున తీశారు. అనంతరం ఆంధ్ర జట్టు 18.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసి గెలిచింది. అశ్విన్ హెబ్బార్ (40 బంతుల్లో 50; 4 ఫోర్లు, 1 సిక్స్), షేక్ రషీద్ (44 బంతుల్లో 59 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేసి ఆంధ్ర విజయంలో ముఖ్యపాత్ర పోషించారు. కేఎస్ భరత్ (17 బంతుల్లో 24; 4 ఫోర్లు), కెప్టెన్ రికీ భుయ్ (12 బంతుల్లో 14 నాటౌట్; 1 ఫోర్) కూడా రాణించారు. ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర జట్టు 16 పాయింట్లతో ముంబైతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది. శనివారం జరిగే ఆరో లీగ్ మ్యాచ్‌లో కేరళ జట్టుతో ఆంధ్ర తలపడుతుంది.

టెస్టు ఫార్మాట్‌కే పరిమితమా!

సిరాజ్‌పై సెలక్టర్ల శీతకన్ను

- వన్డే, టి20లకు దూరమవుతున్న హైదరాబాద్ పేసర్
- ఎంపికపై స్పష్టత లేని పరిస్థితి

దక్షిణాఫ్రికాతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ భారత జట్టును ప్రకటించింది. హైదరాబాదీ పేస్ బౌలర్ సిరాజ్‌కు ఇందులో చోటు కల్పించలేదు. సిరీస్ నుంచి విశ్రాంతి నిచ్చారా అనుకుంటే దానికి ముందు వన్డే సిరీస్‌లో కూడా అతను ఆడలేదు. తగినంత విరామం లభించిన అతను ఇప్పుడు దేశవాళీ టి20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్‌కు ఆడుతున్నాడు. అంతకుముందు ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో కూడా సిరాజ్‌ను ఎంపిక చేయలేదు. టి20 వరల్డ్ కప్ చేరువైన నేపథ్యంలో సెలక్టర్ల ఆలోచనను బట్టి చూస్తే సిరాజ్‌కు అవకాశం సందేహంగానే కనిపిస్తోంది. వన్డేల విషయంలో కూడా అతని ఎంపికపై ఎలాంటి స్పష్టతా లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

సాక్షి క్రీడా విభాగం

సరిగ్గా నాలుగు నెలల క్రితం... ఇంగ్లండ్ గడ్డపై ఓవల్ టెస్టులో అసాధారణ బౌలింగ్‌తో భారత్‌ను గెలిపించిన హైదరాబాద్ పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ ఒక్కసారి హీరోగా మారిపోయాడు. ముఖ్యంగా చివరి రోజు పోరాటయోధుడిలా బౌలింగ్ చేసి ప్రత్యర్థిని కుప్పకూల్చిన అతను... భారత్‌ను సిరీస్ కోల్పోయే ప్రమాదం నుంచి కాపాడటంతో పాటు ఒక రకంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పరువు నిలబెట్టాడు. లేదంటే భారత్ 1–3తో ఓడి తిరుగుముఖం పట్టేది. అలాంటి అద్భుత ప్రదర్శన తర్వాత సిరాజ్ ఒక్కసారిగా తెర వెనక్కి వెళ్లిపోయినట్లు కనిపిస్తోంది. అసలు భారత జట్టులో ఉన్నాడా లేదా అనే సందేహాల మధ్య అతని ఆట కొనసాగుతోంది. నిజానికి ఇంగ్లండ్‌తో టెస్టుల్లో చెలరేగినా... అప్పటికే అతను వన్డే ఫార్మాట్‌లో తానేమిటో నిరూపించుకున్నాడు. టి20ల్లో కూడా పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లపై పైచేయి సాధించడంతో పాటు ఐపీఎల్‌లో రెగ్యులర్‌గా రాణిస్తున్న బౌలర్లలో అతనూ ఒకడు. కానీ తాజా పరిణామాలు చూస్తే 31 ఏళ్ల సిరాజ్‌ను ఒక ఫార్మాట్‌కే పరిమితం చేశారా అనే సందేహాలు కలుగుతున్నాయి.

నిలకడైన ప్రదర్శన...

ఓవరాల్‌గా సిరాజ్ వన్డే కెరీర్ రికార్డు చాలా బాగుంది. 47 వన్డేల్లో కేవలం 24.67 సగటుతో అతను 73 వికెట్లు పడగొట్టాడు. గత కొంత కాలంగా ఫార్మాట్‌కు తగినట్లు తన ఆటను మార్చుకుంటూ నిలకడైన ప్రదర్శనతో సిరాజ్ తనను తాను 'ఆల్ ఫార్మాట్ బౌలర్'గా మలచుకున్నాడు. ప్రస్తుతం భారత బౌలింగ్ దళంలో బుమ్రా తర్వాత నిస్సందేహంగా రెండో స్థానం తనదే. నిజానికి చాంపియన్స్ ట్రోఫీలో సిరాజ్‌కు చోటు దక్కకపోవడమే ఆశ్చర్యం కలిగించింది. అంతకుముందు రెండేళ్లలో భారత్ తరఫున వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా సిరాజ్ నిలిచాడు. బంతి పాతబడితే ప్రభావం చూపలేకపోతున్నాడంటూ కెప్టెన్ రోహిత్ శర్మ ఇచ్చిన వివరణ కూడా సరైంది కాదని అందరికీ అర్థమైంది. ఓవల్ టెస్టు ప్రదర్శనతో పాటు వన్డేల్లో నిలకడైన ప్రదర్శన చూసుకుంటే సిరాజ్‌కు వన్డేల్లోనూ వరుస సిరీస్‌లలో స్థానం లభించాలి. ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన 3 వన్డేల్లో ఎక్కువ వికెట్లు తీయకపోయినా కేవలం 4.94 ఎకానమీతో పరుగులివ్వడం చక్కటి ప్రదర్శనే. కానీ స్వదేశంలో దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు వచ్చేసరికి టీమ్‌లో స్థానం లేదు. గత రెండు వన్డేల్లో ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రాణాల బౌలింగ్ ప్రదర్శన చూస్తుంటే సిరాజ్ కచ్చితంగా ఇంతకంటే బాగా బౌలింగ్ చేసేవాడనే అభిప్రాయం అన్ని వైపుల నుంచి వ్యక్తమవుతోంది. ఇప్పుడు టి20లకు కూడా ఎంపిక చేయకపోవడం, త్వరలోనే వరల్డ్ కప్‌కు కూడా దాదాపు ఇదే జట్టు ఎంపికయ్యే అవకాశం ఉండటంతో ఈ ఫార్మాట్‌లో సిరాజ్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదని అర్థమవుతోంది.

విశ్రాంతి ఇచ్చారా...వేటు వేశారా...

సిరాజ్‌కు వన్డే, టి20 ఫార్మాట్‌లలో స్థానం లభించకపోవడంపై కావాల్సినంత చర్చ జరగడం లేదని అర్థమవుతోంది. సెలక్టర్లు సాధారణంగా తమ ఎంపికపై ఎలాంటి వివరణా ఇవ్వడం లేదు. ఇటీవల ఒకటి రెండు సందర్భాల్లో చైర్మన్ అజిత్ అగార్కర్ మాట్లాడినా అసలు సిరాజ్ పేరును కూడా ప్రస్తావించనే లేదు. జట్టుకు దూరమైన షమీ గురించి కూడా మాట్లాడిన అగార్కర్... రెగ్యులర్ సభ్యుడిగా ఉన్న ఆటగాడి గురించి సమాచారం ఇవ్వడం లేదు. బుమ్రా ఫిట్‌నెస్, విశ్రాంతి విషయంలో ప్రతీ సిరీస్, ప్రతీ మ్యాచ్ సందర్భంగా సెలక్టర్లు స్పష్టతనిస్తున్నారు. అదే సిరాజ్‌కు విశ్రాంతినిచ్చారా లేక వేటు వేశారా కూడా తెలియడం లేదు. సిరాజ్ పూర్తి ఫిట్‌గా ఉన్నాడు. ఎలాంటి గాయాల సమస్యలు లేవు. తాను ఎలాంటి విశ్రాంతి కోరుకోవడం లేదు. ఏ స్థితిలోనైనా మైదానంలో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఇంగ్లండ్‌లో ఐదు టెస్టులూ ఆడాడు కాబట్టి విశ్రాంతి అవసరమని భావించి ఆసియా కప్‌కు ఎంపిక చేయలేదని అనిపించింది. నిజానికి సిరాజ్‌కు విరామం ఇవ్వాలని అనుకుంటే స్వదేశంలో పేసర్లకు ప్రాధాన్యత లేని వెస్టిండీస్‌తో సిరీస్‌లో ఇవ్వాల్సింది. నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి అతను మొత్తం 49 ఓవర్లే బౌలింగ్ చేశాడు. వెంటనే దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల్లోనూ ఆడించడం అంటే ఈ ఫార్మాట్‌లోనే అతని అవసరాన్ని చూపించింది. కానీ ఎలాంటి కారణం లేకుండా ఇప్పుడు వన్డే, టి20ల నుంచి అతడిని పక్కన పెట్టారు. లోయర్ ఆర్డర్‌లో కొన్ని పరుగులు సాధించే హర్షిత్ రాణా వల్ల సిరాజ్ స్థానం సందేహంలో పడినట్లు కనిపిస్తోంది. కానీ సిరాజ్ లాంటి టాప్ బౌలర్‌ను బ్యాటింగ్ కారణంగా పక్కన పెట్టడంతో అర్థం లేదు. మున్ముందు సిరాజ్ విషయంలో సెలక్టర్లు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది చూడాలి.

రూట్ సెంచరీ: ఇంగ్లండ్ 325/9
ఆస్ట్రేలియాతో 'యాషెస్' రెండో టెస్టు
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 254

శుక్రవారం 5-12-2025

విజేత అర్జున్

మాస్టర్స్ ర్యాపిడ్ చెస్ టోర్నీలో విశ్వనాథన్ ఆనంద్‌పై విజయం - స్పోర్ట్స్‌లో

నష్టాలకు బ్రేక్

ఐటీ, టెక్ షేర్లకు డిమాండ్.. సెన్సెక్స్ 158 పాయింట్లు అప్ - బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఎలక్ట్రానిక్ టోల్ వ్యవస్థ

హైవేలపై ఏడాదిలోగా ఎలక్ట్రానిక్ టోల్ వసూలు వ్యవస్థను అందుబాటులోకి తేనున్నట్లు కేంద్ర మంత్రి గడ్కరీ చెప్పారు.

వివరాలు 8లో ▸

ఏవీఎం శరవణన్ ఇకలేరు

ప్రఖ్యాత సినీ నిర్మాత, వ్యాపారవేత్త, స్టూడియో, థియేటర్ అధినేత ఏవీఎం శరవణన్ గురువారం కన్నుమూశారు.

వివరాలు 8లో ▸

ఎక్సైజ్ బిల్లుకు పార్లమెంట్ ఓకే

పొగాకు, తత్సంబంధ ఉత్పత్తులపై భారీ సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన ఎక్సైజ్ సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించింది.

వివరాలు 8లో ▸



ట్రాలర్‌ను ఢీకొన్న కారు

పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలో ట్రాలర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 10లో ▸

నాలుగొచ్చినా.. నరక'వేతన'

జీతమేది బాబూ?

ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీనే చెల్లింపు ఒకనెల ముచ్చటే

విడతల వారీగా చెల్లించే తంతుగా మార్చేసిన సర్కారు

మంగళవారం రూ.3,000 కోట్లు అప్పు తెచ్చినా ఫలితం శూన్యం

ప్రభుత్వ ఉద్యోగుల హాహాకారాలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు, పెన్షన్లు చెల్లిస్తామంటూ ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన చంద్రబాబు సర్కారు ఈ నెల 4వ తేదీ వచ్చినా ఉద్యోగులకు జీతాలు జమ చేయలేదు. కలెక్టరేట్లు, తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకూ జీతాలు పడలేదు. వ్యవసాయ, జలవనరులు, పంచాయతీరాజ్, సమాచార, ప్రణాళికా శాఖలో పనిచేసే ఉద్యోగులు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. ఫలితంగా వారు రుణ వాయిదాల చెల్లింపులు.. పిల్లల ఫీజులు, ఖర్చులకు నరకయాతన అనుభవిస్తున్నారు. 3వతేదీన అరకొరగా కొన్నిశాఖల్లో అదీ అతికొద్దిమందికి మాత్రమే జీతాలు జమైనట్టు సమాచారం. దీంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు చెల్లింపులను విడతల వారీ తంతుగా చంద్రబాబు సర్కారు మార్చేసిందని మండిపడుతున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని గత ఎన్నికల ముందు ప్రతిసభలోనూ ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలినెల మాత్రమే ఉద్యోగులకు ఒకటో తేదీ చెల్లించారని, ఆ తర్వాత పూర్తిగా చతికిలపడ్డారని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతితక్కువ గౌరవ వేతనాలు తీసుకునే ఉద్యోగులకూ సర్కారు చెల్లింపులు చేయలేకపోతోందని

మిగతా 10వ పేజీలో ▶

న్యూస్‌రీల్

జలదిగ్బంధంలో నెల్లూరు

దిత్వా తుపాను అల్పపీడనంగా మారి తీరం దాటినా.. దాని ప్రభావంతో నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాలు నీటమునిగాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి.

వివరాలు 10లో ▸

ఏలూరులో అమానుషం

ఏలూరులో అర్ధరాత్రి వేళ అమానుష ఘటన చోటుచేసుకుంది. ఒంటరిగా ఉంటున్న ఇద్దరు యువతులపై రౌడీషీటర్లు దౌర్జన్యానికి పాల్పడ్డారు. వారిని దారుణంగా బెల్టుతో కొట్టి.. ఒక యువతిని లాక్కెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. దీనిపై పోలీసులను ఆశ్రయిస్తే వారు సరిగ్గా స్పందించలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

వివరాలు 10లో ▸

ఊలపల్లి సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం బారులు

5లో

తూర్పుగోదావరి జిల్లా ఊలపల్లిలో గంటలకొద్దీ రైతుల పడిగాపులు

పోలవరం రిజర్వాయర్ కాదు.. బ్యారేజే

- లోక్‌సభలో పరోక్షంగా తేల్చిచెప్పిన కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్
- ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయం రూ.30,436 కోట్లేనని స్పష్టీకరణ
- సకాలంలో ప్రాజెక్టు పూర్తికి రూ.12,157 కోట్ల అదనపు సాయం చేస్తున్నట్లు వెల్లడి.. ఇప్పటివరకూ రూ.20,658 కోట్లు విడుదల చేశామన్న మంత్రి
- ఈ అన్యాయంపై కేంద్రాన్ని ప్రశ్నించని టీడీపీ ఎంపీలు
- పోలవరం సవరించిన అంచనా వ్యయం 2017-18 ధరల ప్రకారం రూ.55,656.87 కోట్లు
- 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేసేలా ప్రాజెక్టును పూర్తిచేయాలంటే ఆ మేరకు నిధులు అవసరం

5లో

టయోటా ప్రారంభించింది "రిమెంబర్ డిసెంబర్" క్యాంపెయిన్ ముందెన్నడు లేని ఆఫర్లతో

ఎంతో ఎదురు చూస్తున్న "రిమెంబర్ డిసెంబర్" 2025 క్యాంపెయిన్ ను టయోటా వారు మళ్ళీ ప్రారంభించారు. అంతేకాదు హైరెడర్, గ్లాంజా, టైజర్‌పై ఎప్పుడూ లేని ఇయర్ - ఎండ్ ఆఫర్లను, అద్భుతమైన కొనుగోలు అనుభవాన్ని మనందరికీ అందిస్తున్నారు. ప్రతి ఏటా జరిగే ఈ ఇయర్-ఎండ్ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ టయోటాని ఎంచుకోవాలనుకునే వినియోగదారులందరికీ లాభాపేక్ష లేకుండా మరిన్ని ప్రయోజనాలను దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమం ద్వారా మీకు అందిస్తున్నాము. టయోటా ఓనర్‌షిప్ మరింత సులభతరం అయ్యి వినియోగదార్లకు భరోసా ఇచ్చేలా చేసి విలువ జోడింపును ఈ క్యాంపెయిన్ మీకందిస్తుంది. వినియోగదార్లు ఇప్పుడు సులువుగా కొనుగోలు చేసేందుకు వీలుగా 5.99% వద్ద మొదలుకొని తక్కువ ROI తో పాటు 5-సంవత్సరాల వారంటీ పొందవచ్చు. ఎంపిక చేసిన మోడళ్లపై రూ. 1,50,000 వరకు ప్రయోజనాలను అందించడమే కాక, ఈ సీజన్‌లో కొనుగోలుదార్లకు మరిన్ని ప్రయోజనాలు కల్పించడం జరుగుతుంది.

టయోటా స్ట్రాంగ్-హైబ్రిడ్ SUV అయిన హైరెడర్, ఆకట్టుకునే 27.97 కి.మీ / లీ. మైలేజీ మరియు అసాధారణ 1200+ కి.మీ. రేంజ్‌తో, సిటీలో ప్రయాణించేందుకు, అదే విధంగా సుదూర ప్రయాణాల కోసం సాటిలేని సామర్థ్యాన్ని అందిస్తుంది. వివిధ సామర్థ్యాలు ఉన్న టైజర్ మీకు స్టైలిష్‌నెస్ తెస్తే, గ్లాంజా రోజువారి కంఫర్ట్ కోసం నమ్మదగిన ఎంపికగా ఉండి ప్రతి ఒక్కరికీ టయోటా నచ్చిన ఛాయిస్ అయింది.

వినియోగదార్ల విభిన్న అవసరాలను అర్థం చేసుకొని, ప్రభుత్వ, కార్పొరేట్ & గ్రామీణ ప్రాంతాలకు చెందిన కొనుగోలుదార్ల కోసం టయోటా ప్రత్యేక ప్రయోజనాలను ప్రవేశపెట్టింది. అప్‌గ్రేడ్ ఎక్స్‌పీరియన్స్‌ను మరింత పెంచి, టయోటా U- ట్రస్ట్ మార్కెట్‌లోనే మంచిధర, పారదర్శకమైన ఎవాల్యుయేషన్, ఎక్స్‌ఛేంజ్ ప్రాసెస్‌ను అందించి, టయోటాకి మారేందుకు గాను ప్రాసెస్‌ను మరింత సులభతరం చేసింది.

టయోటా వారి కస్టమర్-ఫస్ట్ ఫిలాసఫీకి అనుగుణంగా, దేశవ్యాప్తంగా గల డీలర్‌షిప్‌లలో పేపర్‌లెస్ ప్రాసెస్, డిజిటల్ చెల్లింపులు & సరళీకృత డాక్యుమెంటేషన్ ద్వారా సరళమైన, పారదర్శకమైన, అవరోధాలు లేని అనుభూతిని ఈ క్యాంపెయిన్ మీకందిస్తుంది.

ఈ పరిమిత కాల ఆఫర్లు డిసెంబర్ అంతటా లేదా స్టాక్ ఉన్నంత వరకు అన్ని టయోటా డీలర్‌షిప్‌లలో మీకు లభిస్తాయి. టయోటాను మీ ఇంటికి తీసుకెళ్లేందుకు ఈ మంచి అవకాశాన్ని అందిపుచ్చుకుని, ఈ సంవత్సరానికి ఉత్సాహంగా ముగింపు పలకండి.

• చంద్రబాబు గోబెల్స్ గురువు

సూపర్ సిక్స్ పేరిట 'సూపర్' మోసం

సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సక్రమంగా ఎక్కడ అమలు చేశారు?

సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

ఈ ప్రశ్నలకు బదులివ్వండి

? ఎన్నికలకు ముందు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామన్నారు. రెండేళ్లకు కలిపి రూ.72 వేలు భృతి ఇవ్వాలి. ఏ ఒక్క నిరుద్యోగికైనా భృతిగా రూ.72 వేలు చెల్లించారా? ఇది మోసం కాదా? చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు ఎన్నికలకు ముందు బాండ్‌లు కూడా ఇచ్చారు. నిరుద్యోగ భృతి ఇవ్వనేలేదు. మరి సూపర్ సిక్స్ ఎక్కడ అమలైంది?

? ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు పైబడిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500 ఇస్తామన్నారు. సంవత్సరానికి రూ.18 వేలు.. రెండేళ్లకు ఒక్కరికైనా రూ.36 వేలు ఇచ్చారా? ఇది మోసం కాదా?

? బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ అన్నారు. నెలకు రూ.4 వేలు చొప్పున ఏడాదికి రూ.48 వేలు, రెండేళ్లకు రూ.96 వేలు ఇచ్చారా? ఎవరికి ఇచ్చారు? అన్నదాత సుఖీభవ కింద పీఎం కిసాన్ కాకుండా ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. రెండేళ్లకు కలిపి రూ.40 వేలు ఇవ్వాలి. ఇచ్చింది రూ.10 వేలే. ఇది మోసం కాదా?

? అమ్మ ఒడి పథకం పేరు మార్చారు. తల్లికి వందనం అన్నారు. ప్రతి పిల్లాడికి రూ.15 వేలు అన్నారు. తీరా చూస్తే తొలి ఏడాది ఎగ్గొట్టారు. రెండో ఏడాదికి వచ్చే సరికి 20 లక్షల మంది పిల్లలకు ఎగ్గొట్టారు. రూ.15 వేలు కాకుండా రూ.8 వేలు, రూ.9 వేలు, రూ.10 వేలు ఇచ్చారు. కొందరికి మాత్రమే రూ.13 వేలు ఇచ్చారు. రెండేళ్లకు ప్రతి పిల్లాడికి రూ.30 వేలు ఇవ్వాలి. ఇలా ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడం మోసం కాదా?

? దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామన్నారు. రెండేళ్లకు ఆరు సిలిండర్లు ఇవ్వాలి. కానీ ఇచ్చింది రెండే. అవీ అందరికీ ఇవ్వలేదు. ఇది మోసం కాదా?

? ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. ఎక్కడికైనా వెళ్లొచ్చని, ఏ బస్ అయినా ఎక్కొచ్చని ఎన్నికలకు ముందు చెప్పారు. ఇప్పుడేమో షరతులు పెడుతున్నారు. ఇది మోసం కాదా? ఇన్ని 420 చేష్టలు చేస్తున్న చంద్రబాబుపై చీటింగ్ కేసు పెట్టి బొక్కలో వేయాల్సిందే కదా? అసలు వాళ్ల ముగ్గురినీ బొక్కలో వేయాలి. ఇదే మోసం చిట్‌ఫండ్, ఫైనాన్స్ స్కీమ్స్ నడిపే వాళ్లు చేస్తే జైల్లో పెట్టేవారు. వీళ్లు కాబట్టి ఈనాడు రాయదు.. ఆంధ్రజ్యోతి చూపదు.. టీవీ5 పట్టించుకోదు.. అంతా గజ దొంగల ముఠా.

> రాష్ట్రంలో మీరు ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అమలయ్యాయా? ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. ఎక్కడికైనా వెళ్లొచ్చని, ఏ బస్ అయినా ఎక్కొచ్చని ఎన్నికలకు ముందు చెప్పారు. ఇప్పుడేమో షరతులు పెడుతున్నారు. ఇది మోసం కాదా? ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఎక్కడ ఇచ్చారు? ఇలా ఎన్నెన్నో 420 చేష్టలు చేస్తున్న చంద్రబాబుపై చీటింగ్ కేసు పెట్టి బొక్కలో వేయాల్సిందే. అసలు వాళ్ల ముగ్గురినీ బొక్కలో వేయాలి. ఇదే మోసం చిట్‌ఫండ్, ఫైనాన్స్ స్కీమ్స్ నడిపే వాళ్లు చేస్తే జైల్లో పెట్టేవారు. వీళ్లు కాబట్టి ఈనాడు రాయదు.. ఆంధ్రజ్యోతి చూపదు.. టీవీ-5 పట్టించుకోదు.. అంతా గజ దొంగల ముఠా.

> రాష్ట్రంలో వ్యవసాయం, రైతుల పరిస్థితి చూస్తే బాధేస్తోంది. ధాన్యం, ఉల్లి, టమాటా, అరటి.. ఇలా ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేదు. రాష్ట్రంలో పాలన 'సేవ్ ఏపీ' అన్న తరహాలో ఉంది. హలో ఇండియా.. ఆంధ్రప్రదేశ్ వైపు ఒకసారి చూడండని అందరూ అనాల్సిన దుస్థితి కొనసాగుతోంది.
>
> - వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలన్నీ అమలు చేసేశామని చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఈ మధ్య కాలంలో చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధం ఆడేస్తున్నారని ధ్వజమెత్తారు. వాళ్లకు సంబంధించిన పాంప్లెట్ పేపర్లు, ఎల్లో మీడియా టీవీ ఛానళ్లలో సూపర్ సిక్స్ విజయవంతం అంటూ ప్రకటనలు కూడా ఇచ్చేస్తున్నారని.. చంద్రబాబు గోబెల్స్‌కు టీచర్, మెంటార్ లాంటి వాడని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలిచ్చి, ఇప్పుడు ప్రజలను మోసగిస్తూ 420 చేష్టలు చేస్తున్న చంద్రబాబుపై చీటింగ్ కేసు పెట్టి బొక్కలో వేయాలని నిప్పులు చెరిగారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై మీడియాతో మాట్లాడారు. అసలు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ కింద ఏం చేశారో చెప్పాలని, సక్రమంగా ఒక్క హామీ కూడా అమలు చేయకుండా సూపర్ హిట్టని ఎలా ప్రచారం చేసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో రైతులు పండించిన చీని, అరటి ఎగుమతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యేకంగా రైళ్లు నడిపాం. 23 వేల టన్నులు ఉన్న అరటి ఎగుమతులను 2023–24 నాటికి 3 లక్షల టన్నులకు తీసుకెళ్లాం. దళారుల బెడద లేకుండా చేశాం. రవాణా ఖర్చులను 40 శాతం మేర తగ్గించాం. ఈ 19 నెలల పాలనలో రైతుల కోసం మీరేం చేశారు? రైతుల కష్టాలు పట్టవా?' అని సీఎం చంద్రబాబును నిలదీశారు. రైతుల జీవితాలు చిన్నాభిన్నం అవుతుంటే నిద్రపోతున్నారా.. అని ప్రశ్నించారు. మిమ్మల్ని సీఎం చేసినది గాడిదలు కాయడానికి కాదు కదా.. అంటూ మండిపడ్డారు. వ్యవసాయంపై 62 శాతం మంది ఆధారపడిన పరిస్థితుల్లో ఏ ప్రభుత్వమైనా సాగును పండుగ చేసి.. రైతులను సంతోష పెడితేనే రాష్ట్రం సంతోషంగా ఉంటుందన్నారు. రైతు, రైతు కూలీ సంతోషంగా లేకుంటే రాష్ట్రం ఎదగదని, వెనకబడి పోతుందని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో పండుగలా ఉన్న వ్యవసాయాన్ని చంద్రబాబు దండగలా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కాపాడాలని.. దేశమంతా ఆంధ్రప్రదేశ్ వైపు ఒకసారి చూడండని అందరూ అనాల్సిన దుస్థితి కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఉచిత పంటల బీమాకు మంగళం

- ఇటీవల మొంథా తుపాను వచ్చిన సమయంలో ఆర్టీజీఎస్ నుంచి చంద్రబాబు, ఆయన కొడుకు, ఆయన దత్తపుత్రుడూ కంప్యూటర్ల ముందు కూర్చొని పెద్ద బిల్డప్ ఇచ్చారు. వీళ్లకు తోడు ఎల్లో మీడియా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5లు ఎలా బిల్డప్ ఇచ్చాయంటే.. వీరు తుపాను పీకపట్టి డైవర్ట్ చేసినట్టు బిల్డప్ ఇచ్చాయి. వీళ్లు కాబట్టే తుపానును ఆపగలిగారన్నట్టుగా ఆకాశానికి ఎత్తారు.
- కానీ, వాస్తవ పరిస్థితులు గమనిస్తే.. తుపాను కారణంగా నష్టపోయిన ఏ ఒక్క రైతుకూ ప్రభుత్వం నుంచి పైసా సాయం అందలేదు. తుపాను ప్రభావం వల్ల 15 లక్షల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లితే.. దాన్ని నాలుగైదు లక్షల ఎకరాలకు కుదించారు. వీరికి కూడా నష్ట పరిహారం ఇవ్వలేదు. బాబు 19 నెలల పాలనలో ఇప్పటి వరకు 17 ప్రకృతి వైపరీత్యాలు వచ్చాయి. ఆ విపత్తుల కారణంగా రైతుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి.
- ప్రభుత్వం నుంచి 17 విపత్తులకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ రూ.1,100 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. ఒక్క పైసా ఇవ్వనేలేదు. దీనికి తోడు మా ప్రభుత్వ హయాంలో రైతులకు హక్కుగా దక్కిన ఉచిత పంటల బీమాను రద్దు చేశారు. ఉచిత పంటల బీమా కింద రైతు తరఫున కూడా ప్రభుత్వమే ప్రీమియం కట్టి.. పంట నష్టపోయిన రైతులకు రూ.7,400 కోట్లు నుంచి రూ.7,800 కోట్ల మేర బీమా పరిహారం అందించాం.
- మా ప్రభుత్వ హయాంలో రైతులకు హక్కుగా దక్కిన ఉచిత పంటల బీమా పథకాన్ని చంద్రబాబు లేకుండా చేయడంతో బీమా పరిహారం రాకుండా పోయింది. ఇటీవల ఖరీఫ్ సమయంలో 84 లక్షల మంది రైతులు, కౌలు రైతులు పంటలు సాగు చేస్తే.. కేవలం 19 లక్షల మంది రైతులు మాత్రమే ఇన్సూరెన్స్ చేయించుకున్నారు. మరి మిగిలిన వారి పరిస్థితి ఏంటి? రోజూ చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుంటారు. నష్టపోయిన రైతులకు ఆ నష్టాన్ని ఎలా పూడుస్తారో ఆ ఉపన్యాసాల్లో ఎక్కడా చెప్పరు.
- రైతులకు పెట్టుబడి సాయం.. పీఎం కిసాన్ కింద కేంద్రం ఇచ్చేది కాకుండా అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. రెండేళ్లలో రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.10 వేలు ఇచ్చి రూ.30 వేలు ఎగ్గొట్టారు. ఒకవైపు పెట్టుబడి సాయం దక్కలేదు. మరోవైపు మా ప్రభుత్వంలో సీజన్ ముగిసే సమయానికి అందే ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా కనిపించకుండా పోయింది. హక్కుగా రావాల్సిన ఇన్సూరెన్స్ సొమ్ము రాకుండా పోయింది.

ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు

- ఇన్ని కష్టాల మధ్య రైతు సాగు చేసిన ఏ పంటకూ గిట్టుబాటు ధర రాని దుస్థితి చూస్తున్నాం. పోయిన ఏడాది ధాన్యం, పొగాకు, ఉల్లి, టమాట, మామిడి, సజ్జ, చీని, మిర్చి ఇలా ఏ పంట తీసుకున్నా గిట్టుబాటు ధర దక్కలేదు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. మొంథా తుపానులో నష్టపోయిన రైతు నుంచి ధాన్యం కొనేవారు లేరు. 75 కేజీల బస్తాకు ఎంఎస్పీ ప్రకారం రూ.1,776 రావాలి. అయితే రూ.1,200, రూ. 1,300కు ఇస్తారా అని దళారులు రైతులను అడుగుతున్నారు.
- ఇంకో పక్క దిత్వా తుపాను పంట కోతల(హార్వెస్టింగ్) సమయంలో వస్తుందని 10 రోజుల ముందే మనకు తెలుసు. కోసిన పంట కళ్లాల మీదే ఉందని తెలుసు. పంట కొనకుంటే ధాన్యం తడిచి పోతుందని తెలుసు. రైతులు ఇప్పటికే దెబ్బతిని ఉన్నారు. ధాన్యం కొనకపోతే మరింత నష్టాల్లో కూరుకుపోతారని తెలిసి కూడా చంద్రబాబు రైతులను ఆదుకునే ప్రయత్నం చేయలేదు.
- మా హయాంలో ఇలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు ఎలాంటి స్పందన ఉండేదో ప్రజలు ఆలోచించాలి. యుద్ధ ప్రాతిపదికన యంత్రాంగం మొత్తం పనిచేసేది. వెంటనే గన్నీ బ్యాగ్స్, ధాన్యం సరఫరాకు లారీలు సమకూరేవి. ధాన్యం కొనుగోలుకు వెనువెంటనే చర్యలు తీసుకునేవాళ్లం. ధాన్యం సేకరణ, తరలింపునకు మొత్తం యంత్రాంగం అప్రమత్తం అయ్యేది. వర్షాని కన్నా మునుపే పంట కొనుగోలు పూర్తి చేసేవాళ్లం. ఇవన్నీ గతంలో జరిగాయి. ఈ రోజున రైతులు ఏమైపోయినా పట్టించుకునే వారే లేకుండా పోయారు.

కేజీ అరటి పండ్లు అర్ధ రూపాయి

- కొబ్బరి, అరటి, వేరుశనగ పంటలదీ ఇదే పరిస్థితి. ఏ పంటకూ రేట్లు లేవు. కేజీ అరటి అర్ధ రూపాయి అంటున్నారు. ఇలా అయితే రైతులు ఎలా బతుకుతారు? ఇంత ఘోరంగా పాలన సాగుతోంది. అదే మా ప్రభుత్వ హయాంలో అరటి, చీని రైతుల కోసం ఏకంగా ప్రత్యేకంగా రైళ్లు నడిపాం. అనంతపురం నుంచి ఢిల్లీకి, తాడిపత్రి నుంచి ముంబైకి, నంద్యాల, కర్నూలు నుంచి ఘజియాబాద్, లక్నోకు ప్రత్యేక రైళ్లు నడిచాయి.
- దీంతో రైతులకు దళారుల బెడదల తప్పింది. రవాణా ఖర్చులు తగ్గాయి. ఎగుమతులు పెరిగాయి. మా ప్రభుత్వం రాక మునుపు అరటి ఎగుమతి 23 వేల టన్నులు ఉంటే 2023–24లో 3 లక్షల టన్నులకు పెరిగింది. రైతులకు అదనంగా 20 నుంచి 40% రేట్లు పెరిగాయి. మరి ఈ ప్రభుత్వం, చంద్రబాబు ఏం చేస్తున్నారు? నిద్రపోతున్నారా? పులివెందులలో 600 టన్నుల కోల్డ్ స్టోరేజ్ మా హయాంలో ప్రారంభించాం. కరెంట్ బిల్లుల ఖర్చు వస్తుందని దానిని మనుగడలో లేకుండా చేయడం దుర్మార్గం.

డైవర్ట్ చేయడం కోసమే 'రైతన్నా.. మీ కోసం'

- ఎన్నికలకు ముందు చంద్రబాబు రైతులకు ఇచ్చిన ప్రతి హామీ మోసంగా మారిపోయింది. ఆర్బీకేలు, ఈ–క్రాప్ వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. తూతూ మంత్రంగా ఈ–క్రాప్ చేస్తున్నారు. ఒక పొలంలో రైతును నిలబెట్టి, ఎన్ని ఎకరాల్లో, ఏ పంట సాగు చేశారో ఆర్బీకేకు అనుసంధానం చేసేదే ఈ క్రాప్. ఆ రైతుకు భవిష్యత్తులో గిట్టుబాటు ధర రాకపోయినా, పంట నష్టం వాటిల్లినా ఆదుకునే వ్యవస్థ ఆర్బీకే ద్వారా ఉండేది.
- ఆర్బీకేల్లో పంటల వారీగా గిట్టుబాటు ధరల పట్టికలు ప్రదర్శించే వాళ్లం. ఎక్కడైనా గిట్టుబాటు ధర దక్కని పరిస్థితి ఉంటే వెంటనే ఆర్బీకే యాక్టివేట్(క్రియాశీలకం) అయ్యేది. జాయింట్ కలెక్టర్ దృష్టికి సమస్య వెళ్లేది. ఆయన జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మార్క్‌ఫెడ్‌ను అప్రమత్తం చేసి పంట కొనుగోలు చేసేవారు. మార్కెట్‌లో పోటీ సృష్టించే వారు. ఈ క్రమంలో మేం మార్కెట్ ఇంటర్వెన్షన్ కోసం దాదాపు రూ.7,457 కోట్లు ఖర్చు చేశాం.
- ఇప్పుడు రాష్ట్రంలో రైతు పరిస్థితి దయనీయంగా మారింది. ఈ అంశాన్ని డైవర్ట్ చేయడం కోసం 'రైతన్నా.. మీ కోసం' అని చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రైతులందరికి ధన్యవాదాలు.. అంటూ ఈనాడులో యాడ్ కూడా వేసుకున్నారు. అసలు వీళ్లు రైతుల దగ్గరకు పోయే పరిస్థితే లేదు. పోతే రైతులు తిడతారు, కొడతారు కూడా.. రైతుల దగ్గరకు పోకుండానే కార్యక్రమం విజయవంతం అయినట్టు ఆశ్చర్యకరంగా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు.

చదువుల కోసం అప్పులపాలు

విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు రూ.7,100 కోట్లు

పిల్లల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న చంద్రబాబు

విద్యార్థుల పరిస్థితి నిజంగా అగమ్య గోచరం. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పూర్తిగా అటకెక్కించారు. జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) పడిపోయింది. పిల్లల డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి. పిల్లలు చదువులు అర్ధంతరంగా ఆపేస్తున్నారు. చదువుల కోసం తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారు. మా హయాంలో క్వార్టర్ (మూడు నెలలు) పూర్తయిన వెంటనే వెరిఫికేషన్ చేసి, తర్వాత క్వార్టర్ రాక ముందే తల్లుల ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు పడేవి. 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చికి సంబంధించిన క్వార్టర్ డబ్బుల విడుదల ఎన్నికల కోడ్‌తో ఆగిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏకంగా 8 క్వార్టర్ల డబ్బు ఆపేశారు. ఒక్కో క్వార్టర్‌కు ఉజ్జాయింపుగా రూ.700 కోట్లు గవర్నమెంట్‌కు ఖర్చు అవుతుంది. అంటే 8 క్వార్టర్లకు రూ.5,600 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.700 కోట్లు ఇచ్చారు. రూ.4,900 కోట్లు బకాయి పెట్టారు. వసతి దీవెన కింద ప్రతి ఏప్రిల్లో మా ప్రభుత్వంలో రూ.1,100 కోట్లు ఇచ్చేవాళ్లం. ఫీజురీయింబర్స్‌మెంట్ కాకుండా ఇంజనీరింగ్, డిగ్రీ చదివే పిల్లలకు సంవత్సరానికి రూ.20 వేలు వసతి దీవెన కింద ఇచ్చేవాళ్లం. పాలిటెక్నిక్ చదివే పిల్లలకు రూ.15 వేలు, ఐటీఐ చదివే వారికి రూ.10 వేల చొప్పున మంజూరు చేశాం. ఇదీ ఏప్రిల్ 2024 ఎన్నికల కోడ్‌తో ఆగిపోయింది. ఏప్రిల్ 2025 నాటికి రూ.2,200 కోట్ల బకాయి ఉంది. విద్యా దీవెన బకాయిలు రూ.4,900 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.2,200 కోట్లు.. మొత్తంగా రూ.7,100 కోట్లు ప్రభుత్వం బకాయి పెట్టింది. ఈ రోజు పిల్లల పరిస్థితి ఏమిటి? మనం పిల్లలకు ఇవ్వగలిగిన ఏకైక ఆస్తి చదువు. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడగలిగి, వాళ్ల జీవితాలను మార్చుకోగలిగిన ఆస్తి చదువు. ఆ ఆయుధాన్ని వాళ్ల చేతిలో పెట్టడానికి చంద్రబాబు నాయుడు ముందుకు రావడం లేదు. చంద్రబాబు దగ్గరుండి పిల్లల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారు.

బాబు పాలనలో 29 మంది విద్యార్థులు మృతి

గత 19 నెలల్లో ప్రభుత్వ స్కూళ్లలో పరిస్థితి మారిపోయింది. స్కూళ్లకు పోయేటప్పుడు చిన్న పిల్లలు క్యారియర్లు కట్టుకుని పోతున్నారు. దాదాపు ప్రతి పిల్లాడూ క్యారియర్‌తో వెళ్తున్నారు. ఎందుకని ప్రశ్నిస్తే... స్కూలులో తిండి అస్సలు బాగోలేదన్నా, తినలేకపోతున్నాం.. అనే సమాధానం వస్తోంది. గోరుముద్ద అన్నది గాలికి ఎగిరిపోయింది. నాడు–నేడు ఆగిపోయింది. స్కూళ్లలో 3వ తరగతి నుంచే ఇంగ్లిష్ మీడియం, టోఫెల్ క్లాసులు నిలిచిపోయాయి. ఐబీ కథ దేవుడెరుగు.. ఇంగ్లిష్ మీడియమే ఎగిరిపోయింది. 8వ తరగతి పిల్లలకు ట్యాబులిచ్చేది పూర్తిగా ఆగిపోయింది. ప్రభుత్వ హాస్టళ్లలో కలుషిత తాగునీరు, కలుషిత ఆహారంతో అనారోగ్యం బారినపడి 19 నెలల చంద్రబాబు పాలన కాలంలో ఏకంగా 29 మంది పిల్లలు చనిపోయారు. (మృతి చెందిన విద్యార్థుల ఫొటోలు, పేర్లతో సహా మీడియా చూపారు. విద్యార్థులకు పెట్టే భోజనంలో వచ్చిన పురుగుల ఫొటోలనూ చూపించారు). ఇవన్నీ రాష్ట్రంలో చదువులు, పిల్లల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పడానికి సంబంధించిన కఠిన వాస్తవాలు. కొన్ని వందల మంది పిల్లలు ఆస్పత్రులపాలయ్యారు. ఫుడ్ పాయిజన్, వాటర్ కంటామినేషన్‌తో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నేను కూడా పరామర్శించాను. ఇలాంటి ఘటనలు ప్రతి రోజూ జరుగుతూనే ఉన్నాయి.

కురుపాంలోని గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలలో విద్యార్థుల మృతికి కలుషిత తాగునీరు, పారిశుద్ధ్య లోపమే కారణమని అధికారులు నిర్ధారించిన నివేదిక ఇది..


Brief Note on the Hepatitis A Outbreak – APSTW Hostel, Kurupam Mandal, Manyam District

1. Background:

An outbreak of fever and jaundice has been reported among residents of the APSTW Hostel, Kurupam Mandal, Manyam District.

A total of 50 cases has been admitted to date to King George Hospital, Visakhapatnam till now since Oct 3rd, 2025.

2. Laboratory Findings:

Laboratory investigations have confirmed Viral Hepatitis A as the main causative agent.

The outbreak is epidemiologically linked to contaminated water supply and poor environmental sanitation around the hostel premises.

వెర్రితలలు వేస్తోన్న రెడ్‌బుక్ రాజ్యాంగం

అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షసాధింపు చర్యలు

తప్పుడు సాక్ష్యాలు, తప్పుడు వాంగ్మూలాలతో అక్రమ కేసులు..

రెడ్‌బుక్ పాలనలో టీడీపీ వాళ్లు కాకుండా ఇంకెవరైనా కల్తీ లిక్కర్ తయారు చేసి విక్రయించగలరా?

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ధ్వజం

> తనపై ఉన్న లిక్కర్ కేసును నీరుగార్చేందుకు, కొట్టేయించేందుకు... వైఎస్సార్‌సీపీ పాలనలో తెచ్చిన మద్యం పాలసీని తప్పుగా చూపిస్తూ లేని లిక్కర్ స్కామ్‌ను చంద్రబాబు సృష్టించారు. ఇక రాష్ట్రంలో కుటీర పరిశ్రమల్లా కల్తీ లిక్కర్ ఫ్యాక్టరీలు పెట్టింది టీడీపీ వాళ్లే. వీళ్లదే పోలీస్ వ్యవస్థ, వీళ్లవే బెల్టు షాపులు, వీళ్లవే పర్మిట్ రూమ్‌లు. రెడ్‌బుక్ పాలనలో వీళ్లుగాక ఇంకెవరికైనా నడిపే ధైర్యం ఉందా?

> మంత్రి సంధ్యారాణి పీఏ సతీష్ అసభ్య పదజాలంతో తనను లైంగికంగా వేధిస్తున్నాడని మండలాఫీసు అటెండర్ అయిన ఒంటరి మహిళ ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వెళ్లినా, వాట్సప్ మెసేజ్‌లు చూపించినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. బాధ్యత గల ప్రభుత్వమైతే గలీజ్ మెసేజ్‌లు పెట్టిన పీఏను లోపలేయాలి.
>
> -వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం వెర్రితలలు వేస్తోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తప్పుడు సాక్ష్యాలు, తప్పుడు వాంగ్మూలాలతో వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమ కేసులతో నిర్బంధిస్తూ ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని మండిపడ్డారు. మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే...
గత 19 నెలలుగా వీళ్లే ప్రభుత్వంలో ఉన్నారు. ములకలచెరువు, ఇబ్రహీంపట్నం, అనకాపల్లి, ఆముదాలవలస, నెల్లూరు, పాలకొల్లు, రేపల్లె ఇలా అన్నిచోట్లా కల్తీ లిక్కర్ ఫ్యాక్టరీలు వీళ్లు పెట్టినవే. (రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులతో కల్తీ మద్యం ఫ్యాక్టరీల నిర్వాహకులు దిగిన ఫొటోలు, సీజ్ చేసిన కల్తీ లిక్కర్ బాటిళ్ల ఫొటోలను చూపించారు) కల్తీ మద్యం మీద నచ్చిన బ్రాండ్ పేరుతో లేబుళ్లు వేస్తున్నారు. డిస్ట్రిబ్యూషన్ చానల్ కూడా వాళ్లదే. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రబాబు నుంచి బీఫాం తీసుకుంటూ ఫొటో దిగారు. ఇబ్రహీంపట్నంలో పట్టుబడ్డ ఆయన పార్టనర్ జనార్దనరావు, సురేంద్రనాయుడులు చంద్రబాబు, లోకేశ్‌తో ఫొటోలు దిగారు. అనకాపల్లి జిల్లా పరవాడలో స్పీకర్ అయ్యన్నపాత్రుడితో, మంత్రి లోకేశ్‌తో ఇలా పలుకుబడి కలిగిన టీడీపీ నేతలతో కల్తీ లిక్కర్ మాఫియా నడుపుతున్నవాళ్లు ఎక్కడపడితే అక్కడ ఫొటోలు దిగుతున్నారు. వీళ్లదే పోలీస్ వ్యవస్థ, వీళ్లవే బెల్టు షాపులు, వీళ్లవే పర్మిట్ రూమ్‌లు. రెడ్‌బుక్ పాలనలో వీళ్లుగాక ఇంకెవరికైనా నడిపే ధైర్యం ఉందా?. కానీ, ములకలచెరువు కల్తీ మద్యం కేసులో జోగి రమేష్‌ను తీసుకుపోయారు. కల్తీ చేసిన జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి, పీఏ రాజేష్‌లను ఇంతవరకు అరెస్ట్ చేయలేదు. వీళ్ల ప్రభుత్వంలో అన్నీ వీళ్లే చేస్తూ, తప్పుడు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో... జోగి రమేష్ కల్తీ చేయిస్తున్నారంటున్నారు. ఇదెక్కడి అన్యాయం. దొంగే దొంగ దొంగ అంటున్నాడు. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి ఉపేక్షిస్తే ఎవరైనా బతకగలరా? ఒక మాజీ మంత్రి పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏంటి? జోగి రమేష్, ఆయన తమ్ముడిని అరెస్ట్ చేస్తే... రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో పాల్గొన్న రమేష్ కుమారుడిపై కేసులు పెడుతున్నారు.

మిథున్‌ను ఎందుకు అరెస్ట్ చేశారో? అని జడ్జి ఆశ్చర్యపడే పరిస్థితి

మద్యం అక్రమ కేసులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మిథున్‌రెడ్డితోపాటు ఇప్పటికే మా పార్టీకి చెందిన ఎంతోమందిని జైలుకు పంపించారు. అసలు మిథున్‌రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేశారో? ఆయనకు ఏం సంబంధమో? అని జడ్జి కూడా ఆశ్చర్యపడి తీర్పు రాసే పరిస్థితి. కృష్ణమోహన్‌రెడ్డి, ధనంజయరెడ్డి, ఎంఎస్‌సీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, రాజ్ కేసిరెడ్డిలను నిర్బంధించారు. రూ.11 కోట్లు దొరికినట్లుగా చూపిస్తున్నారు. ఆ నోట్లపై ఉన్న నంబర్ల ద్వారా ఏ బ్యాంకులో డ్రా చేశారో? ఎప్పుడు డ్రా చేశారో? చెప్పాలని బాధితులు కోర్టులో పిటిషన్ వేశారు. రెడ్ హ్యాండెడ్‌గా డబ్బు దొరికితే పక్కనపెడతారు కదా? కానీ, వీళ్లు అన్నీ కలిపేశాం అంటున్నారు. ఆ డబ్బు బయటపడితే ఇంజనీరింగ్ కాలేజీవని తెలుస్తుందని, అది తెలియకుండా లిక్కర్ అని బ్యాండ్ వేసి రూ.11 కోట్లు వీళ్లే పెట్టి కేసులు బిల్డ్ చేస్తున్నారు. వీళ్లు ఏ స్థాయికి పోతున్నారంటే... భాస్కర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వల్లభనేని వంశీ, పినిపె శ్రీకాంత్‌పై తప్పుడు కేసులు పెట్టారు. సాక్ష్యాలు సృష్టించి, అధికారులతో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పిస్తున్నారు. పోసాని కృష్ణమురళి వంటి సామాన్యులు, సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును తప్పుడు కేసులతో అరెస్ట్ చేశారు. సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లపైనా గంజాయి కేసులు పెడుతున్నారు. విశాఖపట్నంలో మా పార్టీకి చెందిన విద్యార్థి నాయకుడిపై గంజాయి కేసు పెట్టారు. రైల్వే న్యూ కాలనీలో పట్టుకున్నామని ఎఫ్ఐఆర్‌లో రాశారు. కానీ, ఇంటి దగ్గర్లోని టిఫిన్ సెంటర్‌కు వెళ్తుండగా, మద్దిలపాలెం వద్ద పట్టుకున్నట్లు, స్టేషన్‌కు తరలిస్తున్నట్లు సీసీకెమెరాలో రికార్డైంది. అతడి బైక్‌ను 14 కి.మీ. దూరంలో ఉన్న రైల్వే న్యూకాలనీకి తీసుకెళ్లారు. బాధ్యత గల ప్రభుత్వమైతే సాలూరులో ఒంటరి మహిళకు గలీజ్ మెసేజ్‌లు పెట్టిన మంత్రి పీఏను లోపలేయాలి. కానీ, కేసులు పెట్టకపోగా, బాధితురాలు దిక్కుతోచక జర్నలిస్టులకు చెబితే, ఆ వార్త రాసిన 'సాక్షి' విలేకరి మీద కేసులు పెట్టారు. ఇది రెడ్‌బుక్ పాలన వెర్రితలలు వేస్తోందనడానికి నిదర్శనం.

పిన్నెల్లిపై 16 తప్పుడు కేసులు

మా పార్టీ మాచర్ల నియోజకవర్గం సీనియర్ నాయకుడు, నాలుగు సార్లు ఎమ్మెల్యే అయిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తమ్ముడు వెంకటరామిరెడ్డిని తప్పుడు కేసులో ఇరికించాలని చూస్తున్నారు. టీడీపీకి చెందినవారి గ్రూపుల తగాదాలలో వాళ్లూవాళ్లు చంపుకొంటే మా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిపై కేసులు పెట్టారు. ఆ ఘటనపై మీడియా సాక్షిగా టీడీపీ హయాంలో... పల్నాడు జిల్లా అప్పటి ఎస్పీ శ్రీనివాసరావు ఏమన్నారో మీరే చూడండి. (ఎస్పీ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్ చూపించారు) 'గుండ్లపాడు గ్రామానికి చెందిన జె.వెంకటేశ్వరరావు అలియాస్ మద్దయ్య, జె.కోటేశ్వరరావును బ్లాక్ స్కార్పియోతో ఢీకొట్టి చంపారు. చనిపోయినవారికి తోట చంద్రయ్య కుటుంబంతో ఎలాంటి బంధుత్వం లేదు. ఇద్దరూ టీడీపీ వారే' అని ఎస్పీ చెప్పారు. అంతేకాదు హతులు, హంతకులు టీడీపీవారేనని ఏకంగా ట్వీట్ చేశారు. ఈనాడులో కూడా అదే రాశారు. కానీ, ఈ కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తమ్ముడిని అరెస్టు చేశారు. ఎక్కడన్నా న్యాయం, ధర్మం ఉందా? ఇలాంటివి చేస్తేనే నక్సలిజం పుడుతుంది. పిన్నెల్లిపై ఈ 19 నెలల్లో 16 తప్పుడు కేసుల పెట్టారు. ఆయన్ను ఇబ్బందులు పెడుతున్నారు. ఎన్నికల సమయంలో రిగ్గింగ్‌ను అడ్డుకున్నందుకు 54 రోజులు జైల్లో ఉంచారు.

జంట హత్యలపై పల్నాడు జిల్లా నాటి ఎస్పీ శ్రీనివాసరావు చెప్పిన వివరాల కోసం స్కాన్ చేయండి

నౌకాదళ సిబ్బందికి వైఎస్ జగన్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా.. నేవీ అధికారులు, సిబ్బందికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. 'మన సముద్ర తీరాలను కాపాడడంలో నౌకాదళ సిబ్బంది పాత్ర అసమానమైనది. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు.. సముద్రాలపై వారు చూపుతున్న ధైర్యం, దృఢ సంకల్పానికి హ్యాట్సాఫ్' అంటూ వైఎస్ జగన్ గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కోర్టులో లొంగిపోయిన సొసైటీ స్కామ్ నిందితుడు

రమేష్ (ఫైల్)

మంగళగిరి టౌన్ : గుంటూరు జిల్లా మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో అవినీతికి పాల్పడిన సీఈవో రాయల రమేష్ గురువారం మంగళగిరి కోర్టులో లొంగిపోయాడు. సొసైటీ స్కామ్‌లో ప్రధాన నిందితుడిగా ఉన్న ఇతను.. నకిలీ డిపాజిట్ బాండ్లతో రూ.7.98 కోట్ల నగదును మాయం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. విచారణ జరుగుతుండగానే రమేష్ అడ్వకేట్‌తో మంగళగిరి కోర్టుకు వచ్చి లొంగిపోయాడు. న్యాయస్థానం అతనికి 14 రోజుల రిమాండ్ విధించడంతో అధికారులు జిల్లా జైలుకు తరలించారు.

బెజవాడలో వారాహి శిల్క్స్ షోరూమ్ ప్రారంభం

లబ్బీపేట(విజయవాడతూర్పు): దక్షిణ భారత దేశంలోనే అతి పెద్ద వస్త్ర నందనం వారాహి శిల్క్స్ ఐదో షోరూమ్ విజయవాడ మహాత్మా గాంధీరోడ్డులోని చంద్రమౌళీపురంలో ఏర్పాటైంది. ఈ షోరూమ్‌ను గురువారం సినీ హీరో తేజ సజ్జా, హీరోయిన్ మీనాక్షి చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులతో పాటు, వారాహి సిల్క్స్ మేనేజింగ్ డైరెక్టర్లు మణిదీప్ యేచూరి, డాక్టర్ స్పందన మద్దుల పాల్గొన్నారు. మణిదీప్ యేచూరి, డాక్టర్ స్పందనలు మాట్లాడుతూ రానున్న క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి, వివాహాది వేడుకలకు కావాల్సిన అన్ని రకాల సంప్రదాయ, ఆధునిక వస్త్రాలు లభిస్తాయని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి రూ.10 వేలు కొనుగోలుపై బంగారు నాణెం, రూ.15 వేలు కొనుగోలుపై బంగారు, వెండి ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. రూ.1500 ఓచర్ రైడా ఇస్తామని ఈ అవకాశం ఈ నెల 14 వరకు ఉంటుందని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా లక్కీడ్రా నిర్వహించి విజేతలకు ఐఫోన్ బహూకరించారు. ద్వితీయ బహుమతిగా 500 గ్రాముల వెండి అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గురుకుల విద్యార్థిని కిడ్నాప్ కలకలం

పాఠశాల నుంచి తీసుకెళ్లిన యువకుడు, యువతి

రెండోరోజు తీసుకొచ్చి పాఠశాల వద్ద వదిలేసిన యువకుడు

నిందితుడు టీడీపీ కార్యకర్త.. ముమ్మిడివరం ఎమ్మెల్యే అనుచరుడు

కోనసీమ జిల్లాలో కలకలం

టీడీపీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుతో నిందితుడు మోకా గిరిబాబు

అమలాపురం టౌన్/ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం శివారు ఠాణేలంకలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ పాఠశాల నుంచి పదో తరగతి విద్యార్థినిని కిడ్నాప్ చేసి, మరుసటిరోజు వదిలేయడం కలకలం సృష్టించింది. ఆ బాలికను తీసుకెళ్లిన యువకుడు టీడీపీ కార్యకర్త, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు అనుచరుడు. బాలిక బంధువుల కథనం ప్రకారం.. జిల్లాలోని కాట్రేనికోన మండలానికి చెందిన బాలిక ఈ పాఠశాలలో చదువుకుంటోంది. పల్లంకుర్రు శివారు వడ్డివారిపేటకు చెందిన టీడీపీ కార్యకర్త మోకా గిరిబాబు బుధవారం ఆ పాఠశాల వసతి గృహానికి వెళ్లి బాలిక నాయనమ్మకు ఒంట్లో బాగోలేదని, బాలికను తనవెంట పంపించాలని కోరాడు. దీనికి అక్కడి సిబ్బంది నిరాకరించారు. మరికొంతసేపటికి ఆ బాలిక మేనమామ భార్యనని చెప్పి ఓ మహిళ వసతి గృహానికి వచ్చి బాలికను తీసుకెళ్లింది. బుధవారం సాయంత్రం వరకు ఆ బాలిక తిరిగి పాఠశాలకు చేరలేదు. దీంతో ప్రిన్సిపాల్ డి.శారద బాలిక నాయనమ్మకు ఫోన్ చేశారు. మనవరాలి కోసం తాను ఎవరినీ పంపించలేదని, బాలిక ఇంటికి రాలేదని ఆమె చెప్పడంతో ప్రిన్సిపాల్ శారద ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమలాపురం డీఎస్పీ టీఎస్‌కే ప్రసాద్, ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ బాలిక ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. బాలికను కిడ్నాప్ చేసింది మోకా గిరిబాబు అని, అతడి మరదలు అర్చన సహకరించిందని గుర్తించారు. ఎమ్మెల్యే సుబ్బరాజుతో నిందితుడు గిరిబాబు ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నిందితుడు ఆ బాలికను తీసుకొచ్చి పాఠశాల వద్ద వదిలి వెళ్లాడు. బాలిక నాయనమ్మ, బంధువులు గురువారం పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. తాము గురుకుల పాఠశాలకు వెళ్లాలంటే సవాలక్ష ఆంక్షలు చెబుతారని, అటువంటిది బయటి వ్యక్తులతో ఎలా పంపించారని ప్రశ్నించారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు బాలికను వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడిపై కిడ్నాప్, అత్యాచారం, పోక్సో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జ్వాలాసాగర్ తెలిపారు.

ప్రజా వినతులకు ప్రాధాన్యత ఏదీ?

బోసిపోయిన డిప్యూటీ సీఎం పర్యటన

వినతులు ఇచ్చేందుకు వీలుగాక వెనుదిరిగిన అర్జీదారులు

కారు దిగకుండా వెళ్లిపోయిన పవన్ కళ్యాణ్

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పవన్

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనకు గురువారం పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్ డుమ్మా కొట్టారు. వీరితో పాటు టీడీపీ, బీజేపీ క్యాడర్ సైతం డిప్యూటీ సీఎం పర్యటనలో మొహం చాటేశారు. జిల్లా కేంద్రంలో డీడీవో కార్యాలయం ప్రారంభానికి వచ్చిన పవన్.. ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 2.15 గంటల వరకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని డీడీవో కార్యాలయాలను ప్రారంభించారు. అయితే, కొన్నేళ్ల క్రితమే నిర్మించిన చిత్తూరు డీడీవో కార్యాలయ భవనాన్ని డిప్యూటీ సీఎం తాజాగా ప్రారంభించడం పలు విమర్శలకు తావిచ్చింది. మరోపక్క పవన్‌కు వినతులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలను పట్టించుకోలేదు. దీంతో గంటల తరబడి నిరీక్షించిన ప్రజలు నిరాశతో వెనుతిరిగారు. పర్యటనలో పవన్ ప్రజా వినతుల స్వీకరణకు ప్రాధాన్యం ఇవ్వలేదని పలువురు అర్జీదారులు వాపోయారు. డీడీవో కార్యాలయం ప్రారంభోత్సవం తర్వాత కూటమి ప్రజాప్రతినిధులతో రాజకీయ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి ఇచ్చిన ప్రాధాన్యత ప్రజల అర్జీల స్వీకరణకు ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకుల కంటే పోలీసులే ఎక్కువగా కనిపించారు. దీంతో పవన్ చిత్తూరు పర్యటన బోసిపోయింది. ఈ పర్యటన వల్ల జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదని పలువురు విమర్శలు గుప్పించారు.

మద్యానికి బానిసై రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య

వీరభద్రయ్య (ఫైల్)

మునికుమార్ (ఫైల్)

కలికిరి: మద్యానికి బానిసైన ఇద్దరు వ్యక్తులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన అన్నమయ్య జిల్లా కలికిరి రైల్వే స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కదిరి రైల్వే పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గుట్టపాళెం గ్రామం ఆచార్ల కొత్తపల్లికి చెందిన జి.వీరభద్రయ్య(49) భార్య, పిల్లలతో కలిసి కలికిరిలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులకు తాను భారం కాకూడదని, ఇంక బ్రతకలేనని తరచూ ఇంట్లో చెప్పేవాడు. అలాగే, సోమల మండలం ఇరికిపెంటకు చెందిన మునికుమార్(27) కలికిరి మండలంలోని మర్రికుంటపల్లికి చెందిన ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకుని కలికిరి పట్టణం అమరనాథరెడ్డి కాలనిలో నివాసం ఉంటున్నాడు. ఇతనూ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో వీరభద్రయ్య, మునికుమార్ మద్యం స్నేహితులయ్యారు. బుధవారం రాత్రి కలికిరి రైల్వే స్టేషన్ ఆవరణకు చేరుకుని మెయిన్‌లైన్ ట్రాక్‌పై మద్యం తాగి, అక్కడే పడుకున్నారు. రాత్రి 10.40 గంటల సమయంలో నాగర్‌కోయిల్–ముంబై రైలు వీరిద్దరి మీదుగా వెళ్లడంతో శరీర భాగాలు ఛిద్రమై ఇద్దరూ మృతి చెందారు. గమనించిన లోకోపైలెట్ జగదీష్ సీటీఎం రైల్వేస్టేషన్‌లో సమాచారమిచ్చారు. మృతుల తండ్రులు లింగయ్య, చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

సబ్సిడీ ఇవ్వకపోతే చావే శరణ్యం

ఇప్పటికే రెండు ఈఎంఐలు కట్టలేదు
- మూడోది కూడా కట్టకపోతే బ్యాంకులు వేలం వేస్తాయి
- 2023 నుంచి వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద అద్దె బస్సు నడుపుతున్నా
- మాకు రాయితీలు ఇవ్వకుండా బడా బాబులకు ఇస్తున్నారు
- తక్షణం సబ్సిడీ ఇవ్వకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటా
- ఎస్సీ, ఎస్టీలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది
- ఏపీఐఐసీ భవనం ఎదుట దళిత మహిళా పారిశ్రామికవేత్త ధర్నా

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు దళిత పారిశ్రామికవేత్తలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కల్పిస్తోంది. రెండు నెలలుగా దళిత పారిశ్రామికవేత్తలు చట్టప్రకారం వారికి రావాల్సిన పెట్టుబడుల రాయితీలు కోసం ధర్నా చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఏపీఐఐసీ పరిపాలన భవనంలోనే ఆత్మహత్య చేసుకుంటానంటూ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన దళిత పారిశ్రామికవేత్త కె.సత్యనారాయణమ్మ గురువారం ధర్నాకు దిగారు. గత ప్రభుత్వం హయాంలో వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం కింద రెండు బస్సులను కొనుగోలు చేసి ఏపీఎస్‌ఆర్టీసీలో అద్దెకు తిప్పుతున్నామని, దీనికి ప్రభుత్వం ప్రకటించిన రూ.42.63 లక్షల సబ్సిడీ ఇవ్వకుండా బాబు సర్కారు వేధిస్తోందంటూ పిల్లలతో కలిసి ధర్నాకు దిగారు. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చే వరకు కదిలేది లేదంటూ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఇప్పటికే బ్యాంకులకు రెండు నెలల నుంచి ఈఎంఐలు కట్టలేదని, ఇప్పుడు మూడో నెల కూడా కట్టకపోతే ఎన్‌పీఏ కింద ప్రకటించి బస్సులను కూడా తీసుకుపోతారని ఆమె వాపోయారు. ఈ నెలలో రూ.2 లక్షలు బీమా ప్రీమియం చెల్లించాలని, కనీసం అప్పులు కూడా పుట్టే పరిస్థితి లేకపోవడంతో ఆత్మహత్య తప్ప తమకు వేరే మార్గం కనపడటం లేదని గోడు వెళ్లబోసుకున్నారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్ శుభం భన్సాల్‌ను కలిసి సమస్య వినిపించినా ఎప్పటిలాగానే త్వరలో విడుదల చేస్తామంటున్నారే కానీ ఇవ్వడం లేదని, 2024లో ఇవ్వాల్సిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు తమకు ఇవ్వకుండా బడా బాబులకే ఇచ్చిందని, 2025కి సంబంధించిన ప్రోత్సాహకాలను కూడా వారికి కావాల్సిన వారికి కూటమి ప్రభుత్వం ఇస్తోందన్నారు. దళిత పారిశ్రామికవేత్తలను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు.

11న కడప మేయర్ ఎన్నిక

కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్‌పర్సన్,

12 ఎంపీపీ అధ్యక్ష పదవుల ఎన్నిక కూడా..

నోటిఫికేషన్ జారీ చేసిన ఎస్ఈసీ నీలం సాహ్ని

సాక్షి, అమరావతి: కడప మేయర్ ఎన్నికను ఈ నెల 11న నిర్వహించనున్నట్లు ఎస్‌ఈసీ నీలం సాహ్ని తెలిపారు. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. అదే రోజున కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్‌పర్సన్, 12 మండల ప్రజాపరిషత్(ఎంపీపీ) అధ్యక్షుల ఎన్నికతో పాటు రెండు మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్ష పదవులు, ఆరు గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కపిలేశ్వరపురం(బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా), విస్సన్నపేట(ఎన్టీఆర్ జిల్లా), ముద్దనూరు(వైఎస్సార్ కడప జిల్లా), పెంటపాడు (పశ్చిమగోదావరి జిల్లా), యలమంచిలి(అనకాపల్లి జిల్లా), మాచవరం (పల్నాడు జిల్లా), తంబళ్లపల్లి (అన్నమయ్య జిల్లా), విజయపురం, నింద్రా (చిత్తూరు జిల్లా), ఏర్పేడు, వరదయ్యపాలెం(తిరుపతి జిల్లా), రామగిరి(అనంతపురం) మండల ప్రజాపరిషత్ అధ్యక్ష ఎన్నికలను ఈ నెల 11న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సత్యవేడు(తిరుపతి జిల్లా), ఫిరంగిపురం (గుంటూరు జిల్లా) మండల ప్రజాపరిషత్‌లకు ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు మరో ఆరు మండల ప్రజాపరిషత్‌లకు కో–ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలను నిర్వహిస్తామన్నారు.

ఆ రీసెర్చ్ సైంటిస్ట్ తొలగింపు

- కాకినాడ జీజీహెచ్‌లో కాలం చెల్లిన కిట్లపై ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్
- ఆరోపణలపై త్రిసభ్య కమిటీ విచారణ..
- బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశం
- ల్యాబ్‌లో పెద్దఎత్తున కాలం చెల్లిన కిట్లు, రియేజంట్ల గుర్తింపు

సాక్షి ఎఫెక్ట్..

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లోని వీఆర్‌డీఎల్ ల్యాబ్ (వైరల్ రీసెర్చ్ అండ్ డయాగ్నస్టిక్ ల్యాబొరేటరీ)లో కాలంచెల్లిన కిట్లు, రియేజంట్లతో పరీక్షలు నిర్వహిస్తున్న బాగోతంపై 'రోగులతో చెలగాటం!' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. సీఎం ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర.. వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ గౌర్ ఈ ఘటనపై రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ రఘునందన్ గంభీర, జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో.. వీఆర్‌డీఎల్ రీసెర్చ్ సైంటిస్ట్ బొమ్మల వి. సురేష్‌బాబును విధుల నుంచి తొలగిస్తూ అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఆరోపణల నేపథ్యంలో రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ చైర్మన్‌గా త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ విజయశేఖర్, బయోకెమిస్ట్రీ హెచ్ఓడీ శ్రీవాణి, పాథాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి కమిటీ సభ్యులుగా వ్యవహరించి, నాలుగు గంటల పాటు విచారణ జరిపారు. అనంతరం చర్యలకు ఉపక్రమించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) నరసింహ నాయక్ ల్యాబ్‌ను సందర్శించి, జరిగిన అవకతవకలపై ఆరా తీశారు. ఎందరి ఆరోగ్య నివేదికలు తప్పులతో ఇచ్చారనే విషయంపై రికార్డులు పరిశీలించారు. ఔషధ నియంత్రణ మండలి అధికారులు సైతం గురువారం సాయంత్రం తనిఖీలు చేశారు. ల్యాబ్‌లో పెద్దఎత్తున కాలం చెల్లిన కిట్లు, రియేజంట్లను గుర్తించారు.

రోడ్డును మింగేసిన మంత్రి అనుచరులు

డిప్యూటీ తహసీల్దార్ ఇంటిపక్క రోడ్డు ఆక్రమణ, రిజిస్ట్రేషన్

ఇదేమని ప్రశ్నించిన అధికారిపై ఆగ్రహం

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించిన వైనం



ప్లాటు నంబర్ 691ఏకు దక్షిణాన ఉన్న 30 అడుగుల రోడ్డులో కొట్టం వేసిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) జగదీష్

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో మంత్రి టీజీ భరత్ అనుచరులు రెచ్చిపోతున్నారు. ఏకంగా మంత్రి పేరు చెప్పుకొని రోడ్డునే ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆక్రమించిన రోడ్డుకు పక్కన ఉన్న ఇంటి యజమాని, డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగదీష్ దీనిని ప్రశ్నించడమే నేరమైంది. ఆయనపైనే ఏకంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారు. ఈ కేసుతోపాటు సమస్య పరిష్కారానికి ప్రస్తుతం ఆయన పోరాడుతున్నారు. జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. 2006 సంవత్సరంలో నాలుగో తరగతి గృహ నిర్మాణ సముదాయంలో అటెండర్‌గా ఉన్న ఆయన 691–ఏ ప్లాటును కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అప్పుడు ఆ ప్లాటుకు లేఅవుట్ ప్రకారం దక్షిణాన 30 అడుగుల రోడ్డు సరిహద్దుగా ఉంది. ఈ రోడ్డుపై అక్రమార్కుల కన్ను పడింది. కర్నూలు జిల్లా ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం వీరికి సహకరించింది. దీంతో రోడ్డులోని సగభాగాన్ని గృహ నిర్మాణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నుంచి అక్రమార్కులు కొనుగోలు చేసి... దానిని 690సీ ప్లాటుగా సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీంతో జగదీష్ ప్లాటు సరిహద్దు మారింది. లేఅవుట్ ప్లాన్ ప్రకారం లేకపోతే విక్రయాల సమయంలో ఇబ్బందులుసహా భవిష్యత్‌లో పలు తీవ్ర సమస్యలు తలెత్తుతాయని భావించిన జగదీష్ తన సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. సమస్యపై సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు. అయినా ఫలితం లేదు. పైగా దీనిపై ప్రశ్నించడంతో ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేయించారు. ఆయన కుటుంబాన్ని బెదిరిస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్ హోదాలో ఉండే తనకే ఇలా జరిగితే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని జగదీష్ ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.. జార్జియా తీసుకెళ్లి వదిలేశాడు

- యూరప్‌లో ఒంటరిగా ఒంగోలు యువతి కష్టాలు
- కట్నం కోసం వేధిస్తూ గత నెల 19న వదిలి వెళ్లిన భర్త
- అద్దె చెల్లించలేదని ఇంటికి తాళం వేసిన యజమాని
- ఆత్మహత్య చేసుకుంటానని సోషల్ మీడియాలో వీడియో పెట్టిన బాధితురాలు
- ఒంగోలు పోలీసులకు తల్లి ఫిర్యాదు

భర్త సాయితేజతో సరస్వతి

ఒంగోలు టౌన్: 'నన్ను ప్రేమించానన్నాడు. పెళ్లి చేసుకున్నాడు. యూరప్‌లోని జార్జియా తీసుకెళ్లి రెండు నెలలు కాపురం చేసిన తర్వాత నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిపోయాడు. నేను ఒంటరిగా ఇబ్బందులు పడుతున్నా...' అని ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన సరస్వతి అనే యువతి కన్నీటి పర్యంతమవుతోంది. బాధితురాలు వీడియో ద్వారా తెలిపిన వివరాల ప్రకారం... ఒంగోలు బాలాజీనగర్‌కు చెందిన వడ్డపల్లి శ్రీరామకృష్ణ, రమాదేవి దంపతుల కుమార్తె సరస్వతి ఇంటర్మీడియెట్ చదువుకుంటూ నగరంలోని అంజయ్య రోడ్డులో ఉన్న ఒక బ్యూటీపార్లర్‌లో పనిచేసేది. బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు కొప్పుకొండ విజయలక్ష్మి ద్వారా ఆమె కుమారుడు సాయితేజ పరిచయమయ్యాడు. కొద్దిరోజులకు వారి స్నేహం ప్రేమగా మారింది. దాంతో 2024 డిసెంబరులో ఒంగోలు సమీపంలోని వల్లూరమ్మతల్లి గుడిలో సాయితేజ తల్లిదండ్రుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. కొద్ది రోజులపాటు ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండు సెంటర్లో కాపురం ఉన్నారు.

జార్జియా తీసుకువెళ్లి.. కట్నం కోసం వేధించి...

ఈ ఏడాది జూలై 15న సరస్వతిని సాయితేజ యూరప్‌లోని జార్జియా తీసుకెళ్లాడు. అక్కడ వీరిద్దరి కాపురం కొంతకాలం బాగానే సాగింది. ఈలోపు సాయితేజ తల్లిదండ్రుల ఒత్తిడితో కట్నం కోసం వేధించడం మొదలుపెట్టాడు. భార్య సరస్వతిని కొట్టేవాడు. ఈ క్రమంలో గత నెల 19వ తేదీ సరస్వతిని వదిలిపెట్టి సాయితేజ వెళ్లిపోయాడు. రెండు నెలలుగా ఇంటి అద్దె చెల్లించకపోవడంతో యజమాని తాళం వేసుకుని ఇంటిని స్వాధీనం చేసుకున్నాడు. దీంతో దేశంకాని దేశంలో చేతిలో చిల్లిగవ్వ లేకుండా నడిరోడ్డుపై సరస్వతి ఇబ్బందిపడుతోంది. మొబైల్ కూడా లేకపోవడంతో ఆంధ్రాకు చెందిన వ్యక్తుల సహాయంతో ప్రస్తుతం తలదాచుకున్నట్లు ఆమె తెలిపింది. భారత ప్రభుత్వం తనను ఆదుకోవాలని, స్వదేశానికి చేరేందుకు సాయం చేయాలని వేడుకుంది. గురువారం తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు ఆమె ఒక వీడియో సోషల్ మీడియాలో పెట్టింది. అది చూసిన సరస్వతి తల్లి రమాదేవి ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమాదేవి ఫిర్యాదు మేరకు కొప్పుకొండ సాయితేజ తల్లిదండ్రులను పిలిపించి విచారించినట్లు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. సాయితేజ జార్జియా వెళ్లినప్పటి నుంచి తమతో టచ్‌లో లేడని, ఏదైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేస్తామని వారు చెప్పినట్లు సీఐ వెల్లడించారు.

చెడును మంచితో పారద్రోలండి. మంచి పనులు చేసేవారు గొప్ప ఉపన్యాసకుల కంటే మెరుగైనవారు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 5 డిసెంబర్ 2025

రచ్చ బదులు చర్చ!

పార్లమెంటు శీతకాల సమావేశాలు ఈసారి కూడా వాయిదాల్లోనే ముగిసిపోతాయని నిరాశపడినవారికి మంగళవారం పాలక, ప్రతిపక్షాలు ఒక అంగీకారానికి రావటం ఊరట నిచ్చింది. ఎన్నికల సంఘం(ఈసీ) వివిధ రాష్ట్రాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే (సర్) పేరిట కొనసాగిస్తున్న ఓటర్ల జాబితా సవరణపై పార్లమెంటులో చర్చించాలంటూ విపక్షాలు పట్టుబట్టడం, అందుకు కేంద్రం సిద్ధపడకపోవడం పర్యవసానంగా సమావేశాల తొలి రోజు నుంచే ప్రతిష్టంభన ఏర్పడింది. చివరకు ఎన్నికల సంస్కరణల్లో భాగంగా 'సర్'ను చర్చిద్దామన్న ప్రభుత్వ ప్రతిపాదనకు విపక్షం అంగీకరించింది. దేశ ప్రజల సార్వభౌమాధికారానికి పార్లమెంటు ప్రతీక అంటారు. ప్రజా సమస్యలపై చర్చకు, దేశ ప్రగతికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవటానికి, చట్టాల రూపకల్పనకు అది ప్రధాన వేదిక. పాలకపక్ష జవాబుదారీతనాన్ని పెంచటం, ప్రజల గొంతుక వినిపించటం విపక్షాలు చేసే పని. కానీ ఆచరణలో అదంతా ఎటో కొట్టుకుపోతోంది.

లోక్‌సభ చరిత్ర గమనిస్తే దాని వర్తమాన స్థితి ఆశ్చర్యం కలిగిస్తుంది. 1952–70 మధ్య అది ఏడాదికి సగటున 121 రోజులు సమావేశమయ్యేది. అంటే అయిదేళ్లలో సగటున 605 రోజులు సమావేశాలుండేవి. అటు తర్వాత నుంచి ఏడాది సగటు 68 రోజులకొచ్చింది. అయిదేళ్ల సగటు 340 రోజులకు తగ్గింది. దాదాపు సగానికి పడిపోయిన పని దినాలైనా సజావుగా సాగుతున్న జాడ లేదు. సమావేశాలు మొదలవుతున్నాయంటే ప్రతిష్టంభన సృష్టించటమే విపక్షాల ఏకైక వ్యూహంగా మారింది. సభలో ఆందోళనలు నిర్వహించటం, ముందుకు సాగనీయకపోవటం తమ ప్రజాస్వామిక హక్కని విపక్షాలు భావిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు పార్లమెంటు ఔన్నత్యం గురించి, ప్రజాస్వామ్యం గురించి గంభీరోపన్యాసాలివ్వటం... విపక్షంలో ఉంటే సమావేశాలకు ఆటంకం కలిగించటం రివాజైంది. ఆ తర్వాత చానెళ్లకొచ్చి మహోద్రేకంతో ఊగిపోతూ ఒకరినొకరు దుమ్మెత్తి పోసుకోవటం దానికి అదనం. ఈ మొత్తం వ్యవహారంలో సామాన్య పౌరులకు పనికొచ్చేది ఒక్కటీ ఉండదు.

పార్లమెంటు సమావేశాలు సక్రమంగా సాగకపోవటం వల్ల ప్రజలకు జరిగే అన్యాయం సాధారణమైనది కాదు. ఎంతో కీలకమనుకున్న బిల్లులు సైతం ప్రవేశపెట్టిన కొన్ని రోజుల్లోనే ఆమోదం పొంది చట్టంగా మారుతున్నాయి. వాటిని అధ్యయనం చేయటానికీ, అభ్యంతరాలు చెప్పటానికీ, సవరణలు ప్రతిపాదించటానికీ సమయం ఎక్కడ? కొన్ని బిల్లులైతే నిండా గంట పాటైనా చర్చించిన దాఖలా ఉండటం లేదు. చాలా బిల్లులు విపక్షాల ఆందోళనల మధ్యే ఆమోదం పొందినట్టు ప్రకటించటం ఇటీవలి కాలంలో పెరిగింది. బడ్జెట్ ప్రతిపాదనలూ, ద్రవ్యబిల్లులు కూడా ఏ చర్చా లేకుండానే సునాయాసంగా గట్టెక్కుతున్నాయి. పార్లమెంటులో ఎంతో ప్రాధాన్యం ఉండే ప్రశ్నోత్తరాల సమయం వాయిదాల కారణంగా కుంచించుకుపోతోంది.

'సర్' చాటున తనకు సంబంధం లేని పౌరసత్వ నిర్ధారణ బాధ్యతను ఈసీ భుజానకెత్తుకుంది. ఇందువల్ల ఓటర్‌గా నమోదు కావాలంటే ముందు ఈ దేశ పౌరులమని నిరూపించుకోవాల్సిన బాధ్యత జనం పైనే పడింది. అందుకోసం గడువులోగా దాఖలు చేయాల్సిన పత్రాలు అందరి వద్దా అప్పటికప్పుడు లభ్యమయ్యేవి కాదు. తల్లితండ్రుల పుట్టుపూర్వోత్తరాలకు సంబంధించిన పత్రాలు సైతం తెచ్చివ్వాలంటే కూలీ నాలీ చేసుకునే పౌరులు ఎక్కడికని, ఎంతకని తిరుగుతారు? ఈ స్థితిలో బిహార్‌లో ఓటుహక్కు కోల్పోయిన 47 లక్షల మందిని 'విదేశీయులు'గా ముద్రేయటం సాధ్యమేనా? చిత్రమేమంటే ఇంతటి కీలకమైన నిర్ణయంపై ముందుగా పార్లమెంటు చర్చించలేదు. ప్రస్తుతం ఆ అంశాన్ని సుప్రీంకోర్టు విచారిస్తుండగా సభలో చర్చకు రాబోతోంది! ఇది కూడా మొత్తంగా ఎన్నికల సంస్కరణలపై కావటం వల్ల ఆ చర్చ కాస్తా ఎటు మళ్లుతుందో తెలియదు. ఇటీవలి కాలంలో ఈవీఎంల వింతలూ, ఎన్నికలైనాక ప్రకటించే పోలింగ్ శాతం పెరుగుతూ పోవటం వంటి అంశాల్లో ఈసీ మౌనమే సమాధానమవుతోంది. ఎన్నికల సంస్కరణల కన్నా ముందు ఈసీ పనితీరు ప్రక్షాళన, ఆ సంస్థ జవాబుదారీతనం పెంచటం వగైరాల అవసరం ఉంది. వీటన్నిటినీ పార్లమెంటు సమగ్రంగా చర్చిస్తుందా? పరస్పర నిందారోపణలతో కాలం గడుస్తుందా? ఈ నెల 9న జరగబోయే చర్చను దేశమంతా ఆసక్తితో గమనిస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బహుళ పాడ్యమి రా.3.01 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** రోహిణి ప.1.33 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** రా.6.47 నుండి 8.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.39 నుండి 9.23 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.03 వరకు, **అమృత ఘడియలు:** ఉ.10.34 నుండి 12.03 వరకు, తదుపరి రా.3.42 నుండి 5.14 వరకు.

సూర్యోదయం : 6.20
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

అవకాశం

అప్పుడప్పుడు ప్రయత్నం చేయటం కాదు. ప్రతిరోజూ చేసే సాధనే మీ భవిష్యత్తును రూపుదిద్దుతుంది. వైఫల్యాలు మీ ప్రయాణంలో ఒక భాగమని గుర్తించండి! నేర్చుకోవడానికీ, తిరిగి బంతిలా పైకి లేచేందుకూ వైఫల్యం ఒక కొత్త అవకాశం!!

– శిఖర్ ధవన్, భారత మాజీ క్రికెటర్

భయం-కోపం

భయం అనేది భావోద్వేగం కాదు. ఒక వ్యాధి. అది నాయకుడి నుంచి అనుచరులకు వ్యాపిస్తుంది. అలాగే అనుచరుల నుంచి నాయకుడికి! కోపం మరో రకమైన చెరుపు చేస్తుంది. వివేకం కోల్పోయేలా చేస్తుంది. తెలివి తక్కువ పనులకు, ప్రవర్తనకు పురికొల్పుతుంది.

– ఆనంద్ నీలకంఠన్, రచయిత

వృత్తి ధర్మం

న్యాయవాదులు కక్షిదారులను అసంతృప్తికి గురి చేయకూడదు. వారి పట్ల అలసత్వం ప్రదర్శించకూడదు. కక్షిదారులే తమకు జీవనోపాధి అనే వాస్తవాన్ని విస్మరించకూడదు. వారి పట్ల గౌరవంగా మెలగటం న్యాయవాదుల కనీస ధర్మం. ప్రాథమిక విధి.

– జస్టిస్ మంజులా చెల్లూర్, రిటైర్డ్ జడ్జి

పెద్ద ఆట



ఒక బిజినెస్‌మేన్‌గా మీరెప్పుడూ పెద్ద ఆట ఆడాలి. ఆత్మవిశ్వాసంతో ఉండాలి. అత్యవసర నిధులను అందుబాటులో ఉంచుకోవాలి. ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలి. లాభాల లెక్కలు వేసుకుంటూ ముందుకు నడుస్తుంటే చివరికి లెక్కలే మిగులుతాయి! లాభాలు కాదు!!

– సందీప్ గోయల్, 'మోగే' గ్రూప్ వ్యవస్థాపకుడు

మంత్రం

మా అమ్మ ఒక మాట అంటూ ఉండేది: "జిమ్‌లో నువ్వే అందరి కన్నా బాగా చేస్తున్నట్లయితే, జిమ్ మారిపోయే సమయం వచ్చేసిందని తెలుసుకో" అని! ఎల్లప్పుడూ కఠినమైన పోటీనే కోరుకోవాలని ఆ మాటకు అర్థం. ఆ మాట నాపై మంత్రంలా పని చేసింది.

– కూపర్ ఫ్లాగ్, టీనేజ్ బాస్కెట్ బాల్ ప్లేయర్

సినిమాలు

ఒక నటుడిగా – కన్నీళ్లతో పాటు, నవ్వును తెప్పించే; అసౌకర్యాలతో పాటు అందమైన అనుభూతులను రేకెత్తించే పాత్రలను చేయాలని నేను ధ్యేయంగా పెట్టుకున్నాను. నిత్య జీవితంలోని సుఖదుఃఖాలపై వచ్చే సినిమాలు సమాజాన్ని మెరుగుపరుస్తాయి.

– జేమ్స్ మెక్ అవోయ్, స్కాటిష్ నటుడు

జెన్-జీ అగ్నిపర్వతం పేలాక...

విశ్లేషణ

టంకశాల అశోక్

నేపాల్‌ను అల్లకల్లోలపరచి, యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యచకితం చేసిన జెన్-జీ అగ్నిపర్వతం ఇప్పటికీ నిప్పులు చిమ్ముతూనే ఉంది. సెప్టెంబర్ తిరుగుబాటుతో పాత ప్రభుత్వం కూలిపోగా ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వాన్నీ, మార్చిలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు అన్నింటినీ భయపెడుతూనే ఉంది. మావోయిస్టు పార్టీలు మొదలుకొని రాచరికపు అనుకూల మితవాద పార్టీల వరకు అన్నీ సిద్ధాంతాల మార్పిడి, నాయకత్వాల మార్పిడి, చీలికలు, పునరేకీకరణల మార్గంలో సతమతమవుతున్నాయి.

అది 'ఉద్యమం' కాదు!

జెన్-జీ తిరుగుబాటుకూ, ఎన్నికల తేదీ అయిన మార్చి 5కీ మధ్యకాలపు పరిస్థితి ఇది. నవంబర్ చివరలో సుమారు పన్నెండు రోజులపాటు నేపాల్‌లో గడిపి జెన్-జీ ఉద్యమకారులు, అన్ని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులతో పాటు, సామాన్య ప్రజలతో కలిసి మాట్లాడిన మీదట నాకు కనిపించిన పరిస్థితి ఇది. వాస్తవానికి జెన్-జీ యువతరం బయటి ప్రపంచం అనుకుంటున్నట్లు, సాంప్రదాయికమైన అర్థంలో ఉద్యమమేమీ సాగించలేదు. అక్కడ రాజవంశాల ఫ్యూడల్ పాలన, పేదరికం, ప్రజాస్వామ్య రాహిత్యాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొన్ని దశాబ్దాలుగా ఉన్నాయి. ఫలితంగా ఏర్పడిన ఒక మోస్తరు ప్రజాస్వామ్య ప్రభుత్వాలుగానీ, వాటి వైఫల్యంతో సాయుధ పోరాటం సాగించి అధికారానికి వచ్చిన మావోయిస్టులు, ఇతర కమ్యూనిస్టులు గానీ దేశ సమస్యలను పరిష్కరించలేకపోయారు. అది చాలదన్నట్లు స్వయంగా అవినీతి, అసమర్థ పాలన, నత్తనడక అభివృద్ధితో యువతరంతో పాటు మొత్తం సమాజం తీవ్ర అసంతృప్తికి గురవుతూ వచ్చింది. మావోయిస్టు పోరాటం వల్ల రాచరిక వ్యవస్థ అన్నదే ఇక లేకుండా 2008లో రద్దయి ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అవతరించిన తర్వాత యువతరం, సమాజం కొత్త ప్రభుత్వాల నుంచి చాలా ఆశించాయి. ముఖ్యంగా వేర్వేరు కమ్యూనిస్టు పార్టీల ఉమ్మడి బలమే సగానికి పైగా ఉండిన స్థితిలో! అయినప్పటికీ, ప్రజలు ఎంతగానో ఆశించిన ఈ చివరి రాజకీయ శక్తులు మూడింట రెండు వంతుల కాలం పాలించి కూడా నిరాశ పరచటం ఎండుగడ్డిపై నిప్పురవ్వ అయింది.

రాచరిక వ్యవస్థల కాలం నుంచి క్రమక్రమంగా అగ్నిపర్వతం వలె మారుతూ వచ్చిన సమాజం, కమ్యూనిస్టుల పాలనా కాలంలో మరింత లావాను కూర్చుకుని మరుగుతూ పోయింది. ఇక ఆ అగ్నిపర్వతం పేలి లావాను ఎగజిమ్మడానికి కావలసింది ఏదో ఉద్యమం కాదు. ఆ లావా కదలికలు అకస్మాత్తుగా ఒక స్థాయికి చేరటం మాత్రమే. సెప్టెంబర్‌లో సోషల్ మీడియా నిషేధంతో జరిగింది సరిగా అదే. చదువులు, నైపుణ్యాలు ఉన్నా స్థానికంగా తీవ్ర నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటూ రోజుకు రెండు వేల మంది వరకు ఉద్యోగాన్వేషణలో విదేశాలకు వెళుతున్న యువకులు అక్కడినుంచి తమ కుటుంబాలకు డబ్బు పంపేందుకు, స్థానికంగా కూడా సెల్ ఫోన్ ఆధారంగా వివిధ వృత్తులు చేసుకుంటున్నవారిలో ఒక్కసారిగా ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

◆ నేపాల్‌లో ఓ వంద జెన్-జీ బృందాలున్నాయి. అవన్నీ ఒకే కొత్త పార్టీగా ఏర్పడి ఉంటే ఎన్నికలలో గెలిచేవన్నది విస్తృతాభిప్రాయం. కానీ అటువంటిది జరగలేదు. ప్రస్తుత పార్టీలన్నీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన స్థితిలో, జెన్-జీ ఐక్య రాజకీయ వేదిక ఏర్పడక పోవటం విచారకరం.

మౌలికమైన మార్పు కోసం...

అయితే ఇదంతా సాంప్రదాయికమైన దృష్టి. నేపాల్‌లో జెన్-జీ ప్రస్తుత స్థితిని, దాని పాత్రను సంప్రదాయానికి భిన్నమైన రీతిలో అర్థం చేసుకోవటం అవసరం. యథాతథంగా జెన్-జీ అనే మాట 18–30 సంవత్సరాల వయసు వారికి వర్తించేది. కానీ వారి అసంతృప్తి మొత్తం సమాజానిది. ఇతర చోట్ల సాధారణంగా జరిగే యువతరం ఉద్యమాలకు ఇది భిన్నమైన స్థితి. అదే విధంగా, నేపాల్ జెన్-జీ డిమాండ్లు తమ నిరుద్యోగానికే పరిమితమై లేవు. తమ కుటుంబాలు, సమాజం, దేశం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటి మధ్య పరస్పర సంబంధం ఉందనే గుర్తింపు వారిలో ఉంది. వామపక్షాలు సైతం భిన్నం కాకపోవటం వారిని మరింత నిరాశకు గురి చేస్తున్నది. ఈ అవాంఛనీయ లక్షణాలు లేని పార్టీలు, ప్రభుత్వాలు, పరిపాలన, కొత్త వ్యవస్థ కావాలన్నది జెన్-జీ లక్ష్యం. మరొక విధంగా చెప్పాలంటే, వారు మౌలికంగా కోరుతున్నది వ్యవస్థాగతమైన మార్పు!

ఉద్యమానంతర అయోమయం

అదే సమయంలో జెన్-జీకి సంబంధించి కొన్ని అయోమయాలు, ప్రశ్నార్థకాలు కూడా ఉన్నాయి. వారి నిరసనలు కేవలం రెండు రోజులలోనే ఉద్భవించటం, పరాకాష్ఠకు చేరటం కూడా కాకుండా కనీసం కొద్దికాలం పాటు సాగి ఉండినా పరస్పర ఏకీభావాలతో రెండు మూడు ఐక్య వేదికలు ఏర్పడి ఉండేవి. అట్లా సాగనందువల్ల ఆ తక్షణ ఉధృతిలో దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ లెక్కలేనన్ని జెన్-జీ బృందాలు ఉనికిలోకి వచ్చాయి. రకరకాల భావజాలాలు గలవి, ఏ భావజాలం లేనివి, వేర్వేరు పెద్దాచిన్నా పార్టీలకు అనుకూలమైనవి, దేనికీ కానివి, ప్రాంతీయమైనవి, మతాలు, కులాలు, వ్యక్తుల పరంగా ఏర్పడినవి, సమష్టి ప్రయోజనాలవి, వ్యక్తిగతంగా ఆలోచించేవి – ఇట్లా పలు విధానలైనవి తేలికగా వందకు పైగా ఉంటాయి. ఇపుడు ఎన్నికలు సమీపిస్తుండగా కొన్ని బృందాలు వేర్వేరు పార్టీలతో చేరుతున్నాయి. తిరిగి రాచరికాన్ని కోరే రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీలతోనే 34 బృందాలు ఉన్నాయంటే పరిస్థితిని ఊహించవచ్చు. కొన్ని బృందాలు ఒకటై మూడు కొత్త పార్టీలు కూడా స్థాపించాయి. ఎన్నికల నాటికి ఇంకా ఏమి జరిగేదీ చెప్పలేని స్థితి.

మరొకవైపు 'జెన్-జీ వాతావరణం' అనదగ్గది ఒకటి స్పష్టంగా ఏర్పడి ఉంది. సుశీలా కర్కి ప్రధానిగా ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం నుంచి, ఆ యా పార్టీల వరకు ఎక్కడ ఏ తప్పు చేస్తున్నట్లు కనిపించినా జెన్-జీ గ్రూపులు వెంటనే విరుచుకుపడుతున్నాయి. ఈ బృందాలు విశాల వేదికగా, ఒకే కొత్త పార్టీగా ఏర్పడి ఉంటే ఎన్నికలలో గెలిచితీరేవన్నది విస్తృతంగా గల అభిప్రాయం. అటువంటి పార్టీ ఏర్పడలేదు. ఈ బృందాలు కొత్త ఓటర్లనైతే లక్షల సంఖ్యలో చేర్పించాయి. ప్రస్తుత పార్టీలన్నీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన స్థితిలో, జెన్-జీ ఐక్య రాజకీయ వేదిక ఏర్పడక పోవటం ప్రజలకు విచారకరంగా తోస్తున్నది. అంతిమంగా కొత్త ప్రభుత్వం ఏది ఏర్పడినా, 'జెన్-జీ వాతా వరణం' కొనసాగి ఆ ప్రభుత్వంపై నిఘా వేసి అదుపు చేయగలదనే ఆశాభావం అయితే వారిలో కనిపిస్తున్నది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సంక్షోభంలో విమానయానం

సింపుల్‌గా....

తక్కువ సమయంలో సుదూర గమ్యాలకు చేరుకొనే వీలు, ప్రయాణ సౌకర్యం ఉంటుందనే భావనతో విమానయానానికి మొగ్గుచూపడం సర్వసాధారణం. కానీ, కొద్దికాలంగా విమానయానమంటే ఎన్నడూ లేనంత అనిశ్చితి నెలకొనడం విడ్డూరం. విమాన సర్వీసుల్లో విపరీతమైన జాప్యాలు, ఆఖరి నిమిషంలో అనూహ్యంగా సర్వీసు రద్దవడాలు, ఎప్పుడు ఎలా చేరతామో తెలియని దుస్థితి వగైరా దేశీయంగా ప్రయాణికుల్ని భయపెడుతున్నాయి. తాజాగా 'ఇండిగో' విమానసేవల్లో నెలకొన్న సంక్షోభం దేశీయ విమానయాన రంగంలోని అనేక లోపాలకు అద్దం పడుతోంది. తక్షణం దిద్దుబాటు చర్యలను చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.

ఇప్పుడేం జరిగింది?

కొద్ది రోజులుగా దేశవ్యాప్తంగా ఇండిగో విమాన సర్వీసులు నిర్వహణపరమైన సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఒక్క డిసెంబర్ తొలి వారంలోనే కనీసం మూడు రోజులుగా కొన్ని వందల సంఖ్యలో ఫ్లైట్లు ఆఖరి నిమిషంలో రద్దయ్యాయి. ముంబయ్, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ సహా వివిధ నగరాల్లో గంటలు, పూటలకొద్దీ జాప్యాలతో లక్షలాది ప్రయాణికులు మార్గమధ్యంలో చిక్కుకుపోయారు. అత్యవసర పనుల మీదున్న జనం ఈ అంతులేని ప్రయాణ కష్టాలతో ఆగ్రహించారు. చివరకు కనివిని ఎరుగని ఈ సంక్షోభంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) దర్యాప్తు చేప ట్టింది. సంక్షోభ కారణాలను వివరించాలనీ, విమాన సర్వీసులను చక్కదిద్దేందుకు అత్యవసర ప్రణాళికను అందజేయాలనీ ఇండిగోను గురువారం ఆదేశించింది.

ఇండిగోకు ఉన్న ఇక్కట్లేమిటి?

అధికారిక గణాంకాల ప్రకారం ఇండిగో దేశీయంగా 90కి పైగా, అంతర్జాతీయంగా 45కి పైగా గమ్యస్థానాలకు ప్రయాణికులను చేరుస్తోంది. దాదాపు 400 పైచిలుకు విమానాలు దానికున్నాయి. రోజూ 2300కి పైగా విమాన సర్వీసులు నడుపుతోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో 11.8 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించింది. 2024లో కొత్తగా 58 విమానాల్ని కూడా సమకూర్చుకుంది. అయితే, విమానయానం

పెరుగుతున్న సమయంలో ఇది ఏ మాత్రం సరిపోదు. పైగా పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా తగినంతమంది పైలట్లూ లేరు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ మాటల్లో చెప్పాలంటే, సిబ్బంది కొరత వల్లే ఈ జాప్యాలు, సర్వీసుల రద్దు లాంటివన్నీ! ఎమిరేట్స్ ఈ వారంలోనే పెద్దయెత్తున నియామకాలు చేపట్టడంతో ఇండిగోకు కాక్‌పిట్, క్యాబిన్ సిబ్బంది కూడా తీవ్రంగా కొరవడినట్టు భోగట్టా.

కొత్త షరతులతో తలనొప్పి?

లోతుకు వెళితే, వైమానిక డ్యూటీ సమయ పరిమితి (ఎఫ్డీటీఎల్)కి సంబంధించిన నిబంధనలు మారాయి. వాటిలో తొలి విడత జూలై 1 నుంచి, రెండో విడతవి నవంబర్1 నుంచి అమలయ్యాయి. పైలట్ల విశ్రాంతి, నైట్‌డ్యూటీ రూల్స్ కట్టుదిట్టమయ్యాయి. పైలట్లకు ఏకబిగిన 48 గంటల విరామమివ్వాలి, వరుసగా 2 నైట్ డ్యూటీలు మించకూడదు. వీటి వల్ల, అడిగిన వెంటనే సిబ్బంది అందుబాటులో ఉండే పాత రోజులు పోయాయి. అలాగే, చలికాలంలో సాంకేతికంగా ఉండే చిన్న చిన్న చిక్కులు, ప్రతికూల వాతావరణాలు, ప్రయాణాల సీజన్ కావడంతో ఉండే రద్దీ లాంటివన్నీ కలసి తలకు మించిన భారమయ్యాయి. ఒక్క నవంబర్‌లోనే ఇండిగో 1232 సర్వీసులు రద్దు చేసింది. ఇందులో 62 శాతం దాకా చిక్కులకు సిబ్బంది కొరత, ఎఫ్డీటీఎల్ షరతులే కారణం. వందలాది సర్వీసులు రద్దవడంతో ఆ సంస్థ షేర్లు కూడా 3 శాతం పైగా పడిపోవడం గమనార్హం. మన దేశీయ విమానయాన మార్కెట్‌లో దాదాపు 65 శాతం వాటా ఇండిగోదే కావడంతో సర్వీసులో రద్దుతో ఒక్కసారిగా టికెట్ రేట్లు 3–4 రెట్లు పెరిగిపోయాయి.

ఇకపై ఏం చేయాలి?

ఇటీవల సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ సమస్యలతో ఎయిర్‌బస్‌లు స్తంభించాయి. ఇప్పుడీ ఇండిగో సమస్య. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పెరుగున్న విమానయాన మార్కెట్ మనది. పెరుగుతున్న ఆ డిమాండ్‌కు తగ్గట్టు పైలట్లు లేరు. వచ్చే దశాబ్ద కాలంలో మనకు 30 వేల మంది కొత్త పైలట్లు కావాలి. కానీ, అందుకు తగ్గ ప్రాథమిక వసతులు, శిక్షణ సౌకర్యం, నిధులు కరవే. ఇకనైనా మరోసారి ఇలాంటి సంక్షోభాలు తలెత్తకూడదంటే, అదనపు సిబ్బంది అందుబాటులో ఉండేలా నియామకాలు పెంచుకోవడం కీలకం. తక్కువ సిబ్బంది, తక్కువ జీతాలతో ఖర్చు తగ్గించుకోవాలనే పిచ్చి ఆలోచనతో పెనాల్టీల పాలై, పేరు పోగొట్టుకునే కన్నా అది మేలు. ఖర్చు గిట్టుబాటయ్యేలా చూసుకుంటూనే నిర్వహణ సామర్థ్యం బలోపేతం చేసుకొని, సమతూకం పాటించడం అత్యవసరమన్నది తాజా ఉదంతం అన్ని ఎయిర్ లైన్స్‌కూ నేర్పుతున్న పాఠం. నేర్చుకోకపోతే ఈ కష్టాల సీరియల్ కొనసాగక మానదు. ❑

దిష్టితో చెట్లు ఎండిపోవడమా?

ఇన్ బాక్స్

నేడు శాస్త్ర, సాంకేతికతలతో ప్రపంచం దూసుకుపోతోంది. మరోవైపు మూఢ నమ్మకాలు మనల్ని అధః పాతాళానికి నెడుతున్నాయి. వీటిని చదువురాని అమాయక ప్రజలే నమ్ముతారనే ఆలోచన సమాజంలో ఉంది. కానీ విద్యావంతులు, పాలకులు సైతం నమ్ముతున్న తీరు ఆశ్చర్యపరుస్తుంది. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గత కొన్ని నెలలుగా కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి తెలంగాణ వాళ్ళ దిష్టి కారణమని ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం విస్మయం కలిగిస్తోంది. సముద్రపు నీరు వెనక్కి రావడం, మురుగు కాలువ నీటిలో లవణాల శాతం పెరగడం వంటివి అసలు కారణాలని నివేదికలు చెబుతుండగా, దిష్టి గురించి మాట్లాడటం పాలకుల అజ్ఞానానికి నిదర్శనం. ఇలాంటి మాటలు ప్రాంతీయ విద్వేషాలను కూడా రగిలిస్తున్నాయి.

ఇప్పటికే మంత్రగాళ్ల పేరుతో జనం మోసపోతున్నారు. బాణామతి, చేతబడులతో ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. క్షుద్ర పూజల వంటి ఘటనలు నిత్యం ఎక్కడో ఒకచోట వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. తల్లి కడుపులోంచి పుట్టబోయే బిడ్డను ముహూర్తాలు చూసి కనే రోజులొచ్చాయి. మనిషి మరణానికి సైతం మంచీ చెడూ చూస్తున్నారు. ప్రజల్లో అంధ విశ్వాసాలు సమాజంలో ఏ స్థాయిలో ఉన్నాయో దీన్ని బట్టి అర్థమవుతుంది. ఇటీవల తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణ పనుల ప్రారంభం సందర్భంగా గర్భిణులు, వితంతువులు కొబ్బరికాయలు కొట్టడానికి వెనుకాడుతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఇంత సైన్స్ అభివృద్ధి చెందినప్పటికీ ప్రజలు శాస్త్రీయ జీవన విధానాన్ని అవలంబించకపోవడం విచారకరం.

ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో వ్యాధులను తగ్గించుకోవడానికి జంతుబలులు, నరబలుల జరిగే వార్తలు వినబడుతున్నాయి. మరోవైపు మంత్రాల నెపంతో దాడులు, హత్యలు పెరుగుతున్నాయి. మానసిక బలహీనత వలన విచక్షణ కోల్పోయి అతీంద్రియ శక్తులను నమ్మడం వల్లనే సమాజంలో ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయి. ప్రజల్లో రోజురోజుకూ శాస్త్రీయ వైఖరి, ప్రశ్నించే తత్వం లోపించడమే ఈ గుడ్డి నమ్మకాలకు కారణం. ఇదే కాకుండా పాలకుల్లో కూడా శాస్త్రీయ వైఖరి లోపించడం దీనికి ప్రధాన కారణమని చెప్పవచ్చు. మితిమీరిన మత విశ్వాసాలు, అశాస్త్రీయ బోధనలు, ప్రభుత్వ విధానాలు ప్రజల్ని మరింత మూఢత్వం దిశగా ప్రేరేపిస్తున్నాయి. దేశంలో సైన్స్ ఆవిష్కరణల కన్నా సూడో సైన్స్‌కు ఆదరణ పెరుగుతోంది. సమాజ అభివృద్ధికి మూలం విజ్ఞాన శాస్త్రమే. కావున విద్యాసంస్థల్లో శాస్త్రీయ, ప్రగతిశీల అభ్యసనం జరగాలి. ప్రభుత్వాలు హేతుబద్ధ, శాస్త్రీయ ఆలోచన విధానాలను ప్రోత్సహించాలి.

– సంపతి రమేష్ మహారాజ్ | జన విజ్ఞాన వేదిక

షెల్ కంపెనీలు 'క్లోజ్'

డేటా పాయింట్

దేశంలో కేంద్ర ప్రభుత్వం గత 5 ఏళ్లలో రికార్డు స్థాయిలో 1.85 లక్షలకు పైగా షెల్ కంపెనీలను (ఇవి 2 వరుస ఆర్థిక సంవత్సరాల్లో ఎలాంటి వ్యాపారం లేదా కార్యకలాపాలు నిర్వహించనివి) గుర్తించి, వాటి పేర్లను అధికారికంగా తొలగించింది.



ఆధారం: కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ

దుష్ట స్వభావమే శత్రువు

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

రాక్షసులనే వాళ్ళెక్కడో లంకలో ఉండరు. ప్రతివాడి మనస్సులోనూ రాక్షసత్వం ఉంటుంది. మానవులకు కలిగే దుఃఖాన్ని తొలగించాలంటే ఎవరికి వారే ఆ దుఃఖానికి కారణమైన అరిషడ్వర్గాలను నాశనం చేసే ప్రయత్నం చేయాలి. అది తెలుసుకోలేనంత కాలం తనలోని కామక్రోధాదులే తనకు దుఃఖ పరంపరను కలిగిస్తాయి. ఇందుకు విరాధుని ఉదంతమే సాక్షి.

ధ్రువుడనే ఆరేళ్ళ పసివాని తపస్సును భంగం చేయడానికి నియమితుడైన విరాధుడనే యక్షుడు రాక్షసరూపంలో అనేక ప్రయత్నాలు చేసి విఫలమయ్యాడు. రాక్షస రూపంలో ఇతరులను భయభ్రాంతుల్ని చేయటం సంతోషాన్నిస్తుందనే విషయాన్ని గ్రహించాడు. అందుకే ఆ రూపంలోనే తిరుగుతూ సాధు సజ్జనులను బాధపెడుతూ ఆనందిస్తున్నాడు. ఈ క్రమంలో ఒక యోగి అతడు ఇలా ప్రవర్తించటానికి కారణం గ్రహించి, ఆ రాక్షసత్వం విరాధునికి శాశ్వతంగా ఉండాలని శపించాడు. ఒకరోజు మునిబాలురను భయపెట్టిన క్రమంలో ఒక బాలుడు అతడికి భయపడకుండా ఎదురుతిరిగాడు. బాలుని ధైర్యానికి ఆశ్చర్యపడి అతడి తండ్రి దగ్గరకు వెళ్లి 'నీ కుమారుణ్ణి తినివేస్తా'నని కోపంతో రంకెలేశాడు. కానీ ఆ తండ్రి బాలుణ్ణి రక్షించుకోవడానికి 'అలాగే తిను, కానీ ఒక రోజు గడువు ఇవ్వు' అంటూ రోజు తర్వాత రోజుగా మూడు రోజులు గడువు అడుగుతూ వచ్చాడు. మూడవ రోజు విష్ణువు ఆ బాలుణ్ణి దాచిపెట్టడంతో ఎక్కడ ఉన్నాడో తెలియని రాక్షసుడు పెద్దగా 'అరే బాలకా! నీవెక్కడున్నాసరే మర్యాదగా వచ్చేయి. నిన్ను తింటేగాని నా ఆకలి తీరదు' అన్నాడు.

ఆ కేక వింటూనే 'ఆ, ఇక్కడే ఉన్నానండీ, వచ్చేస్తున్నా' అంటూ విరాధుని పొట్ట చీల్చుకొంటూ బయటకు వచ్చాడు భరతుడు. రాక్షసుడు చనిపోయాడు. అంతటితో అతనికి శాప విమోచనం అయ్యింది. రాక్షసునిలోని కామాది అంతశ్శత్రువులే అతడికి ఈ గతి పట్టించాయి. అంటే అతడిలో కలిగిన దుర్గుణాలే ఇన్ని బాధలు కలిగించాయి. అసలు అతడికి దుర్బుద్ధి పుట్టకుండా ఉన్నట్లయితే శాపగ్రస్థుడయ్యేవాడే కాదు; రాక్షసత్వం వచ్చి ఉండేది కాదు. కనుక మనిషిని రాక్షసునిగా మార్చేది మనిషి దుష్ట స్వభావమే!

రైతు వెన్ను విరిచిన నకిలీ విత్తనాలు

ధాన్యం నకిలీ విత్తనాలు విక్రయించిన డీలర్, ఆయనకు విత్తనాలు విక్రయించిన సీడ్ కంపెనీపై కఠినమైన చర్యలు తీసుకోవాలని రైతులు గురువారం తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఆందోళనకు దిగారు. పట్టణంలోని పూజిత ఆగ్రో సర్వీస్ సెంటర్ దుకాణంలో బీపీటీ 2782 రకం విత్తనమని చెప్పి 1,200 బస్తాలను రైతులకు విక్రయించారు. ఈ విత్తనాలతో సూళ్లూరుపేట, వరదయ్యపాళ్లెం మండలాల్లోని పలు గ్రామాల్లోని 1,200 ఎకరాల్లో వేసిన పంట నాటిన 20 రోజులకే వెన్నుదశ, బిర్రుపొట్టదశకు చేరుకుంది. దీనితో ఇవి నకిలీ విత్తనాలని నిర్ధారించుకున్న రైతులు.. వీటిని విక్రయించిన డీలర్‌ను నిలదీసి వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. - సూళ్లూరుపేట

యూరియా కోసం బారులు

ప్రకృతి విపత్తులకు ఎదురీది, కష్ట నష్టాలతో ఖరీఫ్ సాగు పూర్తి చేసి, రబీకి సిద్ధమవుతున్న రైతులకు చంద్రబాబు ప్రభుత్వం ఆదిలోనే చుక్కలు చూపిస్తోంది. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఊలపల్లి సొసైటీ వద్ద గురువారం రైతులు, మహిళా రైతులు యూరియా కోసం గంటల తరబడి పడిగాపులు కాశారు. మండలంలో దాళ్వా పంటకు 2,200 టన్నుల యూరియా అవసరమవుతుందని, ఇప్పటి వరకు 320 టన్నుల యూరియాను రైతులకు అందించామని, ఇంకా 158 టన్నులు మాత్రమే అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు. కొరత నేపథ్యంలో ఎకరాకు ఒక బస్తా మాత్రమే ఇస్తామని అంటున్నారు. - బిక్కవోలు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల ఆలయం వెలుపల జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. శ్రీనివాస్

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్, మంత్రి డీబీవీ స్వామి, ఆర్మీ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, సినీ సంగీత దర్శకుడు తమన్, నటులు ఓంకార్, అశ్విన్ తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. -తిరుమల

క్లుప్తంగా...

అప్పుల బాధతో అరటి రైతు ఆత్మహత్య

పుట్లూరు: అరటి ధరలు పతనమై తీవ్రంగా నష్టపోయిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎల్లుట్లకి చెందిన చిల్లా నాగలింగమయ్య(46) మూడెకరాల్లో అరటి సాగు చేశాడు. పంట కోత దశకు వచ్చిన సమయంలో ధర పడిపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో సాగు కోసం చేసిన అప్పులు వడ్డీలతో కలిపి రూ.15 లక్షలకు చేరుకున్నాయి. వాటిని తీర్చే మార్గం కనిపించక, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక భరోసా లేకపోవడంతో గురువారం తోట వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన తోటి రైతులు వెంటనే అతన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నాగలింగమయ్య మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య లక్ష్మిదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తిరుమలలో కన్నుల పండువగా కార్తీక దీపోత్సవం

ఆలయం లోపల ధ్వజ స్తంభం వద్ద కార్తీకదీపం వెలిగిస్తున్న టీటీడీ ఈవో

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం రాత్రి కార్తీక పౌర్ణమి దీపోత్సవాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించింది. కార్తీక పున్నమి రోజు సాయంత్రం శ్రీవారికి సాయంకాల కైంకర్యాదులు, నివేదనలు పూర్తయిన అనంతరం ఈ దీపోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఇందులో భాగంగా సా.5 నుండి రాత్రి 8.30 వరకు అత్యంత ఘనంగా జరిగిన ఈ కార్తీక పర్వ దీపోత్సవంలో మొదట శ్రీ యోగ నరసింహస్వామి ఆలయం పక్కనున్న పరిమళం అర దగ్గర కొత్త మూకుళ్లతో దీపాలను వెలిగించారు. తదుపరి వీటిని ఛత్రం, చామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ, ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు.

వక్ఫ్ ఆస్తుల ఆన్‌లైన్ గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: ఉమీద్ పోర్టల్ గడువు డిసెంబర్ 5వ తేదీతో ముగియనుండటంతో వక్ఫ్ ఆస్తుల ఆన్‌లైన్ నమోదుకు మరొక రోజు(డిసెంబర్ 6 వరకు) సమయం కేంద్రం పొడిగించిందని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ గురువారం తెలిపారు. వక్ఫ్ ఆస్తుల డిజిటలైజేషన్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మొత్తం వక్ఫ్ డేటాను అప్‌లోడ్ చేసినట్టు ఆయన వెల్లడించారు.

మద్యం మత్తులో కాలువలో పడి వృద్ధుడు మృతి

నందలూరు: అన్నమయ్య జిల్లాలోని నందలూరు పంచాయతీలో ఉన్న శివసాయి వైన్‌షాపు దగ్గర టీవీ పురం గ్రామానికి చెందిన ఎర్రగుళ్ల రోశయ్య(65) మద్యం మత్తులో కాలువలో పడి గురువారం మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు.

చినబాబు డైరెక్షన్‌లోనే పేదల ఇళ్లు నేలమట్టం

కోర్టు ఉత్తర్వులను సాకుగా చూపి భవానీపురంలో 42 ఇళ్లు కూల్చివేత

- 2.17 ఎకరాల భూమిపై కన్నేసిన 'పచ్చ'నేతలు
- చినబాబు, పార్లమెంటు ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో పక్కా ప్రణాళికతో పేదలపై కత్తి
- బాధితులు కాళ్లావేళ్లాపడ్డా కనికరించని పోలీసులు, అధికారులు
- కూల్చివేతల వెనుక రూ.కోట్లు చేతులు మారినట్టు విమర్శలు
- ఎమ్మెల్యే కార్యాలయాన్ని చుట్టుముట్టి ఆందోళన
- చంద్రబాబు ఇంటి వద్దకు వెళ్లిన బాధితులు
- విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

" నాపేరు డి.నాగరాజు. తినీతినక కష్ట పడిన సొమ్ముతో 9 ఏళ్ల క్రితం విజయ వాడ జోజినగర్‌లో స్థలం కొనుక్కున్నాను. కార్పొరేషన్‌లో ప్లాన్ తీసుకొన్నాను. బ్యాంకు రుణంతో ఇల్లు కట్టుకున్నా. నా కళ్లముందే ఆ ఇంటిని బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఈ నెలాఖరు వరకు సమయం ఉందని కోర్టు ఉత్తర్వు చూపించినా కోర్టు అమీనాగానీ, పోలీసులుగానీ పట్టించుకోలేదు. కోర్టు ఆర్డర్ కాపీని ఫోన్‌లో చూపిస్తుంటే లాయర్, అమీనా వెటకారంగా మాట్లాడారు. వ్యవస్థలు అమ్ముడు పోతుంటే నాలాంటి సామాన్యులు ఎలా బతకాలి? నాలుగు నెలల నుంచి నరకం చూపించారు. ఉన్న పళంగా నడిరోడ్డుపైకి నెట్టారు""
- ఇదీ చంద్రబాబు పాలనలో ఓ బాధితుడి ఆక్రోశం

ఇళ్ల స్థలాల్లో పడగొట్టిన శిథిలాలు

సాక్షి ప్రతినిధి,విజయవాడ/భవానీపురం(విజయవాడపశ్చిమ): చంద్రబాబు కూటమి ప్రభుత్వం పేద కుటుంబాలపై కత్తిగట్టింది. కోర్టు ఉత్తర్వులను సాకుగా చూపి బలవంతంగా విజయవాడ జోజినగర్‌లోని 42 ఇళ్లను బుధవారం నేలమట్టం చేసింది. రూపాయిరూపాయి కూడబెట్టుకొని, స్థలం కొని ఇళ్లు కట్టుకొన్న పేదల జీవితాలను రోడ్డు పాలు చేసింది. విజయవాడ నడిబొడ్డున్న ఉన్న కోట్లాది రూపాయల విలువ చేసే 2.17 ఎకరాల స్థలంపై కన్నేసిన పచ్చనేతలు పక్కా ప్రణాళికతో వ్యవస్థలను మెనేజ్ చేశారు. చినబాబు, పార్లమెంటు ప్రజాప్రతినిధి డైరెక్షన్‌లో సుప్రీం కోర్టులో స్టే ఉన్నప్పటికీ ఆగమేఘాలపై 42 ఇళ్లను నేలమట్టం చేశారు. పేదలను నడిరోడ్డు మీదకి తీసుకొచ్చారు. ఈ తతంగం వెనుక కోట్ల రూపాయలు చేతులు మారినట్లు భాదితులు బహిరంగానే విమర్శిస్తున్నారు.

బహుళ అంతస్తుల నిర్మాణం కోసమే!

విజయవాడ నడిబొడ్డున జోజినగర్‌లో ఉన్న ఈ భూమి రూ.కోట్లు విలువ చేస్తుంది. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి నుంచి ఈ స్థలాన్ని తొలుత ఒకరికి అగ్రిమెంటు చేశారు. వారు స్పందించక పోవడంతో 1980 ప్రాంతంలో స్థల యజమాని మరో వ్యక్తికి విక్రయించారు. ఆ కొనుగోలు చేసిన వ్యక్తి ప్లాట్లు వేసి 42 మందికి విక్రయించి రిజిస్ట్రేషన్లు చేశారు. ఇందులో కార్పొరేషన్ నుంచి ఇళ్ల నిర్మాణకోసం అవసరమైన అనుమతులు, విద్యుత్, తాగునీరు కనెక్షన్లు తీసుకున్నారు. బ్యాంకు నుంచి రుణాలు పొంది ఇళ్లు నిర్మించుకున్నారు.

వీటిలో చాలా ఇళ్లు ఇప్పటికే పలువురి చేతులు మారి రిజిస్ట్రేషన్లు జరిగాయి. అయితే స్థలం తొలుత అగ్రిమెంటు చేసుకున్న వ్యక్తి నుంచి పొందిన కాగితాల సాయంతో పచ్చనేతలు దొడ్డిదారిన ఓ సొసైటీని ఏర్పాటు చేసి, వారికి అనుకూలంగా అన్ని రకాల పత్రాలు సిద్ధం చేసుకుని చక్రంతిప్పారు. కోర్టు ద్వారా స్థలాన్ని కాజేయడానికి తీవ్ర యత్నం చేసి సఫలీకృతులయ్యారు. బహుళ అంతస్తుల నిర్మాణానికి బెంగళూరుకు చెందిన బడా వ్యక్తులు, చినబాబు, పార్లమెంటు ప్రజాప్రతినిధి డైరెక్షన్‌లో బుల్డోజర్లతో కూల్చివేతలకు ఒడిగట్టారు. దీంతో బాధితులు రోడ్డున పడ్డారు. ఒకవేళ తమ రిజిస్ట్రేషన్లు అక్రమమైతే వాటిని చేసిన అధికారులపైనా, భవన నిర్మాణానికి అనుమతులిచ్చిన మున్సిపాలిటీ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆందోళన ఉద్ధృతం

ఇళ్లు కోల్పోయిన బాధితుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆందోళనలను వారు ఉద్ధృతం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమ గోడు వినిపించుకునేందుకు బాధితులు బుధవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి వద్దకు వెళ్లారు. అయితే వారిని పోలీసులు అనుమతించలేదు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం.. కూల్చివేతలపై స్టే ఉందని, తాము ఖాళీ చేసేందుకు ఈనెలాఖరు వరకు సమయం ఉందని చెప్పినా అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంలో బుధవారం వాదనలు ఉన్నాయని, నాలుగు గంటలపాటు సమయం ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. గురువారం ఉదయం భవానీ పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళల పట్ల అధికారులు అసభ్యంగా ప్రవర్తించారని, శ్రీలక్ష్మి రామ కో–ఆపరేటివ్ సొసైటీ అక్రమాలకు పాల్పడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ తర్వాత బాధితులు పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయానికి వెళ్లి న్యాయం చేయాలంటూ ధర్నాకు దిగారు. ఎన్నికల సమయంలో తమ సమస్యను వివరిస్తే న్యాయం చేస్తామన్న కూటమి నేతలు ఇప్పుడు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంటినీ కూల్చారు.. పొట్టనూ కొట్టారు

శ్రీకాకుళం జిల్లా నుంచి బతుకు తెరువు కోసం వచ్చి విజయవాడలో స్థిరపడ్డాను. కష్టపడి కూడబెట్టిన సొమ్ముతో ఐదేళ్ల క్రితం ఇక్కడ స్థలం కొన్నా. అప్పు చేసి ఇల్లు నిర్మించుకున్నా. ఇంటి వద్దే గ్రైండర్లు, పిండిమర, కారం మిషన్లు పెట్టుకుని జీవిస్తున్నా. అధికారులు అకస్మాత్తుగా వచ్చి ఇంటిని నేలకూల్చారు. దీంతో కింద రూ.20లక్షలు ఖరీదు చేసే పిండి మర యంత్రాలు ధ్వంసమయ్యాయి. ఇంటిని కూల్చి, ఉపాధి పోగొట్టారు. నాకు ఇద్దరు చిన్న పిల్లలు. భవిష్యత్ అగమ్యగోచరంగా ఉంది.
– బి.యల్లారావు, జోజినగర్

కూల్చివేతల వెనుక ఎంపీ బాలశౌరి హస్తం!

ఇళ్ల కూల్చివేత వెనుక బందరు ఎంపీ బాలశౌరి హస్తమున్నట్టు తెలుస్తోందని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన వెంకట మహేష్ విమర్శించారు. స్థానిక జోజినగర్‌లోని 42 ఇళ్ల కూల్చివేత నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని గురువారం పోతిన పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ కూల్చివేతల వెనుక బందరు ఎంపీ బాలశౌరి హస్తం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఈ వ్యవహారంలో విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యే హస్తం ఉందో లేదో తేల్చాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల కూల్చివేతలో పెత్తందార్ల హస్తం ఉంది

ఇళ్ల కూల్చివేతల వెనుక పెత్తందార్ల హస్తం ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం రాత్రి ఆయన జోజినగర్ బాధితులతో మాట్లాడారు. ఇంట్లో సామాన్లను కూడా తీసుకోవడానికి సమయం ఇవ్వకుండా అడ్డువచ్చిన వారిని పక్కకు తోసేసి దౌర్జన్యంగా ఇళ్లు కూల్చివేయడం దుర్మార్గమన్నారు . అలాగే,జోజినగర్ బాధితుల తరపున పోరాటం చేస్తామని జై భీమ్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్‌కుమార్ ప్రకటించారు. గురువారం సాయంత్రం ఆయన జోజినగర్‌ను పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ ఇళ్లను జేసీబీలు, బుల్డోజర్లతో పడగొట్టిన పోలీసుల ఉద్యోగాలు ఊడదీయించే వరకు బాధితులతోనే ఉంటూ వారికి లీగల్‌గా, రాజకీయంగా మద్దతు ఇస్తానని తెలిపారు. అవసరమైతే రోడ్డుమీదకు వచ్చి పోరాడటానికి జై భీమ్ పార్టీ తరుపున సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గ సమస్యలు తెలియకుండానే ఎన్నికల 30 రోజుల ముందు ఇక్కడికి వచ్చి డబ్బు ఖర్చుపెట్టి ఎమ్మెల్యే అయిన సుజనా చౌదరి ఇళ్లు కూల్చివేస్తుంటే ఢిల్లీలో గాడిదలు కాస్తున్నాడా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలవరం రిజర్వాయర్ కాదు.. బ్యారేజే

లోక్‌సభలో మరోసారి పరోక్షంగా తేల్చిచెప్పిన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్



(Vijayawada) Link Project, is being implemented in the State of Andhra Pradesh and has been receiving sustained financial support from the Government of India. Between 2014 and 2024, an amount of ₹15,146 crore was reimbursed to the State Government. The Government of India approved the Revised Cost Estimate of ₹30,436 crore with an additional central assistance of ₹12,157 crore to facilitate timely completion of the project. The cumulative Central Assistance /financial support extended to the State of Andhra Pradesh for the Polavaram Irrigation Project stands at ₹20,658 crore till date.

పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయం రూ.30,436 కోట్లేనని కేంద్రమంత్రి ఇచ్చిన సమాధానం..

సాక్షి, అమరావతి: పోలవరం జలాశయం కాదు.. కేవలం బ్యారేజ్ మాత్రమేనని గురువారం లోక్‌సభలో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ పరోక్షంగా తేల్చిచెప్పారు. ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయం రూ.30,436 కోట్లని తెలిపారు. సకాలంలో ప్రాజెక్టును పూరి చేయడం కోసం రూ.12,157 కోట్లను అదనపు సహాయం కింద కేంద్రం ఇస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.20,658 కోట్లు విడుదల చేశామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానంపై టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అడిగిన ప్రశ్నకు మంత్రి సీఆర్ పాటిల్ రాతపూర్వకంగా సమాధానం చెప్పారు. పోలవరం ప్రాజెక్టు 2017–18 ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లుగా కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) 2019లో ఆమోదించింది. గోదావరి ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చిన మేరకు 45.72 మీటర్ల గరిష్ఠమట్టంలో నీటిని నిల్వచేసేలా పోలవరాన్ని పూర్తిచేయాలంటే ఆ మేరకు నిధులు అవసరం. కానీ.. పోలవరం ప్రాజెక్టులో నీటినిల్వ కనీసమట్టం (ఎండీడీఎల్) 41.15 మీటర్లకే పరిమితం చేస్తూ.. ప్రాజెక్టును పూర్తిచేసేలా 2024 ఆగస్టు 28న కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆ మేరకు పనులు పూర్తిచేయడానికి సవరించిన అంచనా వ్యయం రూ.30,436 కోట్లుగా తేల్చింది. ఇప్పటిదాకా విడుదల చేసిన నిధులు పోను.. ప్రాజెక్టును పూర్తిచేయడానికి అవసరమైన రూ.12,157 కోట్లను విడుదల చేస్తామని పేర్కొంది. ప్రాజెక్టును 2027 మార్చిలోగా పూర్తిచేయాలని షరతు పెట్టింది. పోలవరంలో 41.15 మీటర్ల ఎత్తుకే నీటినిల్వను పరిమితం చేస్తే.. 115.4 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయవచ్చు. కానీ.. ఆ స్థాయిలో నీటిని నిల్వచేస్తే కుడి, ఎడమ కాలువల కింద 7.20 లక్షల ఎకరాలకు నీళ్లందించడం సాధ్యం కాదని, కేవలం 1.98 లక్షల ఎకరాలకే.. అదీ గోదావరి వరదల సమయంలో మాత్రమే నీటిని అందించే అవకాశం ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 45.72 మీటర్ల ఎత్తులో 194.6 టీఎంసీలను నిల్వచేస్తే పోలవరం ఆయకట్టు 7.20 లక్షల ఎకరాలతోపాటు కృష్ణా డెల్టాలో 13.8 లక్షలు, గోదావరి డెల్టాలో 10.13 లక్షల ఎకరాలను స్థిరీకరించడంతోపాటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి 63.8 టీఎంసీలను సరఫరా చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. కానీ.. పోలవరంలో నీటినిల్వ ఎత్తును 41.15 మీటర్లకే కేంద్ర కేబినెట్ పరిమితం చేస్తూ తీర్మానం చేసినా ఆ సమావేశంలో ఉన్న టీడీపీ మంత్రులు నోరు మెదపలేదు. ఇక లోక్‌సభలో గురువారం పోలవరం సవరించిన అంచనా వ్యయం రూ.30,436 కోట్లేనని కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ రాతపూర్వకంగా తేల్చిచెప్పినా టీడీపీ ఎంపీలు మౌనం దాల్చారు. అంటే.. పోలవరంలో 41.15 మీటర్ల ఎత్తువరకే నీటినిల్వను పరిమితం చేస్తూ ప్రాజెక్టును పూర్తిచేయడానికి నిధులు ఇస్తున్నామని కేంద్రం మరోసారి స్పష్టం చేసినట్లు అర్థమవుతోంది. నీటినిల్వను 41.15 మీటర్లకు పరిమితం చేస్తే.. పోలవరం రిజర్వాయర్ కానేకాదని.. కేవలం బ్యారేజీగా మిగిలిపోతుందని నీటిపారుదలరంగ నిపుణులు చెబుతున్నారు.

2005లోనే గోదావరి-కృష్ణా అనుసంధానం

ఇక పోలవరం (గోదావరి)–విజయవాడ(కృష్ణా) అనుసంధానాన్ని ఎన్‌డబ్ల్యూడీఏ 1999లో ప్రతిపాదించిందని.. దాన్ని 2005లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిందని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ చెప్పారు. పోలవరం కుడికాలువ ద్వారా 4,666 మిలియన్ క్యూబిక్ లీటర్ల (164.82 టీఎంసీలు) గోదావరి–కృష్ణా అనుసంధానం చేపట్టిందని వివరించారు. పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు పీఎఫ్‌ఆర్‌ను 2025 మే 22న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీడబ్ల్యూసీకి సమర్పించిందని తెలిపారు. దానిపై బేసిన్‌లోని మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతోపాటు కృష్ణా, గోదావరి బోర్డుల అభిప్రాయం కోరామని, వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కలెక్టర్ సాక్షిగా 'క్రెడిట్ చోరీ'

నాడు సచివాలయం.. నేడు డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం

పాత శిలాఫలకం తెరలతో కప్పి కొత్తగా ప్రారంభోత్సవం



పాత శిలాఫలకం

నూతనంగా ప్రారంభించిన శిలాఫలకం

అనకాపల్లి టౌన్: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. అబద్ధాలనే కొనసాగిస్తూ ప్రజలను మోసం చేస్తోంది. అధికారం చేపట్టి 18 నెలలు కావస్తున్నా.. ఒక్క ఇల్లు గానీ, ఒక ప్రభుత్వ కార్యాలయం గానీ కట్టలేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో అప్పట్లోనే మంజూరై నిర్మాణంలో ఉన్న ఇళ్లను చూపిస్తూ.. ఈ ఇళ్లన్నీ మేమే కట్టేశాం అంటూ గత ప్రభుత్వం క్రెడిట్‌ను కూటమి ప్రభుత్వం చోరీ చేస్తోంది. తాజాగా అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీలో పరిధిలో గత ప్రభుత్వ హయాంలో కట్టిన సచివాలయ భవనంలోనే గురువారం డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం (డీడీవో) ప్రారంభించారు. వాస్తవానికి 2023 మే 4న రూ.40 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయం–1ను నాటి ప్రభుత్వం నిర్మించగా అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. నాలుగైదు నెలల క్రితం వరకు ఈ భవనంలో సచివాలయం నడిచింది. ఆ కార్యాలయాన్ని సచివాలయం–2లో విలీనం చేసి భవనానికి సున్నం, రంగులు వేసి గురువారం డీడీవో ప్రారంభించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ ప్రారంభకులు అని శిలాఫలకం ఏర్పాటు చేసి కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు. పక్కనే ఉన్న పాత శిలాఫలకానికి తెరకప్పి ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీసీఎం పవన్‌కళ్యాణ్ నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఎదురుగా శిలాఫలకం కనిపిస్తున్నా మరో శిలాఫలకాన్ని ఆవిష్కరించడం చర్చనీయాంశమైంది.

- కృష్ణా జిల్లా మోపిదేవిలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆర్‌వీఆర్ గ్రూప్ అధినేత, ఆర్‌వీఆర్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ చైర్మన్ రావి వీర రాఘవ చౌదరి దంపతులు గురువారం వెండి మండపాన్ని కానుకగా సమర్పించారు. సుమారు 49 కిలోల వెండితో తయారు చేసిన ఈ మండపాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందజేశారు.

ప్రభుత్వ భూమిలో అక్రమంగా స్టోన్ క్రషర్

టీడీపీ నేత జయచంద్రారెడ్డి బావమరిది గిరిధర్‌రెడ్డిపై కేసు

బి.కొత్తకోట: సస్పెన్షన్‌కు గురైన తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి డి.జయచంద్రారెడ్డి బావమరిది మంత్రి గిరిధర్‌రెడ్డిపై కోర్టు ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా స్టోన్‌క్రషర్ ఏర్పాటు చేసి, నల్లరాయిని తరలించారన్న ఫిర్యాదు నేపథ్యంలో కేసు నమోదు చేసినట్టు మైనింగ్ శాఖ మదనపల్లె ఏడీ రంగకుమార్, సీఐ గోపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. జయచంద్రారెడ్డి బావమరిది గిరిధర్‌రెడ్డి ఈ ఏడాది జూన్‌లో మెస్సర్స్ రిట్కో కంపెనీ పేరుతో బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్ట పంచాయతీ పరిధిలోని యాదలగుట్టపై క్వారీకి ఎల్‌పీఎం నంబర్–5471లో రెండు హెక్టార్లకు అనుమతి ఇవ్వాలని మైనింగ్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఎలాంటి అనుమతి ఇవ్వకపోయినా అక్కడ క్రషర్ ఏర్పాటు చేసి నడిపారు. ఎల్‌పీఎం నంబర్ 5472లో 6,623 క్యూబిక్ మీటర్ల నల్లరాయిని తొలగించి తరలించారు. ప్రభుత్వ శాఖల నుంచి అనుమతి లేకపోయినా క్రషర్ నిర్వహించడంపై అక్టోబర్ 8న రాత్రి మైనింగ్ మదనపల్లె ఏడీ రంగకుమార్, తహసీల్దార్లు బావాజాన్, శ్రీనివాసులు, విజిలెన్స్ ఏడీ సుబ్రహ్మణ్యం, పోలీసులు తనిఖీలు జరిపారు. ఐదెకరాలకుపైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి భవనాలు, స్టోన్ క్రషర్ ఏర్పాటు చేశారని, వీటికి ఒక్క అనుమతిలేదని నిర్ధారించి సీజ్ చేశారు. అక్కడ ఉన్న 6,414 క్యూబిక్ మీటర్ల 40,20,6,5 ఎంఎం కంకరను, రెండు పొక్లెయిన్లను, ఒక బుల్డోజర్, ఒక వాటర్ ట్యాంకర్, స్టోన్ క్రషర్‌ను సీజ్ చేశారు. దీనిపై మైనింగ్ శాఖ చర్యలకు ఉపక్రమించగా మదనపల్లె ఏడీ రంగకుమార్ స్థానిక కోర్టులో కేసు దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోర్టు బి.కొత్తకోట పోలీసులను ఆదేశించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పోలీసు శాఖ
C.No.01/SMART COPS/PCS&S/AP/2025 టెండరు ప్రకటన తేదీ: 01.12.2025
GeM పోర్టల్ ద్వారా ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ కోసం AP SMART COPS నిర్వహణతో పాటు రూపకల్పన, అభివృద్ధి మరియు నియోగించుట కోసం ఏజెన్సీ ఎంపిక కొరకు బిడ్లు కోరబడుతున్నవి మరియు అవి వెబ్‌సైట్ https://gem.gov.inలో లభిస్తాయి. GeM బిడ్: GEM/2025/B/6878499.
సంప్రదించు నం. 8712655704
సం/- ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, టెక్నికల్ సర్వీసెస్, ఆం.ప్ర., మంగళగిరి
DIPR RO No.18277/CL/Advt/1/1/2021-22, Dt: 04.12.2025

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No.31/2025-26/SE(W-II)/EE-IV/DB/GVMC/Dt: 01.12.2025
Number of Works : 04,
Value of Works : Rs.354.18 Lakhs
Tender Opening Dt: 03.12.2025, Closing Date : 18.12.2025
Note : Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE - IV Cell No.7842531073.
For Commissioner

రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠ్
(నేషనల్ అకాడమీ ఆఫ్ ఆయుర్వేద)
(ఆయుష్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ పరిధిలోని స్వయం ప్రతిపత్తి గల సంస్థ)
ధన్వంతరి భవన్, రోడ్ నం. 66, పంజాబి బాగ్ (వెస్ట్), న్యూఢిల్లీ–110026.
ఫోన్ నంబర్లు : 011-41681265 ఇ-మెయిల్: gsp-ravdl@gov.in
గురుశిష్య పరంపర 2026-27 క్రింద గురువుల నియామకం
'గురుశిష్య పరంపర విధానం' ద్వారా ఒక సంవత్సర "సర్టిఫికెట్ ఆఫ్ రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠ్ (CRAV)" కోర్సులో సంస్థాగతంగా అర్హత గల ఆయుర్వేద డాక్టర్లకు శిక్షణ ఇచ్చుటకు అర్హత గల వైద్యులు / ఇన్‌స్టిట్యూషన్ల నుండి రాష్ట్రీయ ఆయుర్వేద విద్యా పీఠ్, న్యూఢిల్లీ దరఖాస్తులు కోరుతోంది. ఆసక్తిగల వైద్యులు / ఇన్‌స్టిట్యూషన్లు అర్హత వివరాలు, దరఖాస్తు ఫారం నిర్ణీత ఫార్మాట్ మొ॥వాటి కొరకు ఈ విద్యాపీఠ్ వెబ్‌సైట్ www.ravdelhi.nic.in దర్శించవలెను మరియు తగు విధంగా పూర్తి చేసిన తమ దరఖాస్తు ఫారాన్ని పైన తెలిపిన ఇ-మెయిల్ మరియు చిరునామాకు (ఇ-మెయిల్ మరియు పోస్ట్ రెండింటి ద్వారా) 22 డిసెంబర్ 2025న లేదా ఆలోగా పంపవలెను.
డైరెక్టర్, రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠ్
CBC 17212/12/0003/2526

ఈ సర్కారుకు మాయరోగం!

మీ స్కామ్‌ల కోసం ప్రజల ఆరోగ్య భద్రతను దెబ్బతీస్తారా బాబూ?: వైఎస్ జగన్

ఆరోగ్యశ్రీని పూర్తిగా ఎత్తేశారు.. కొత్త వైద్య కళాశాలలు ప్రైవేటుకిస్తున్నారు

- ప్రైవేటుపరం చేసి ప్రభుత్వమే జీతాలు ఇస్తుందట.. ఇంతకన్నా పెద్ద స్కామ్ ఉందా?
- వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కోటి సంతకాలు
- ఈ నెల 16న ఆ పత్రాలను గవర్నరును కలిసి అందజేస్తాం
- అనంతరం ఆ పత్రాలతో హైకోర్టులో రిట్ పిటిషన్ వేస్తాం

సాక్షి, అమరావతి: ''చంద్రబాబు ప్రభుత్వానికి మాయరోగం వచ్చింది. ఆరోగ్యశ్రీని పూర్తిగా ఎత్తేశారు. గవర్నమెంట్ ఉన్నది ఎందుకు? ఏం చేయడం కోసం ప్రజలు నీకు అధికారం ఇచ్చారు? విద్య, వైద్యం, వ్యవసాయం, శాంతిభద్రతల పరిరక్షణ, పారదర్శక పాలన.. ఇవి కదా చేయాల్సింది. కానీ అన్నీ తిరోగమనమే. అన్నీ స్కాములే. ఏవీ పట్టించుకునే పరిస్థితి లేదు. అన్నీ ప్రైవేటీకరణే.. బాధ్యత నుంచి తప్పించుకోవడం.. ఉన్నకాడికి స్కామ్‌లు చేయడమే..'' అంటూ సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఏమన్నారంటే..

దారుణంగా ప్రజారోగ్య వ్యవస్థ

ఆరోగ్యశ్రీని పూర్తిగా ఎత్తేయడం అన్నది నిజంగా మాయరోగమే. బకాయిలు ఇవ్వకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు దాదాపుగా నిలిచిపోయాయి. ఆరోగ్యశ్రీ అమలుకు నెలకు రూ.300 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ 18 నెలలకు కలిపి రూ.5,400 కోట్లు ఇవ్వాలి. ఇటీవల నేను దీనిపై పలుదఫాలు మాట్లాడటం.. వాళ్లు కూడా (నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు) స్ట్రైక్‌లు చేయడంతో ఈ ప్రభుత్వం ఇచ్చింది కేవలం రూ.1,800 కోట్లు. అంటే ఇంకా రూ.3,600 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలున్నాయి. చివరికి మొన్న నెట్‌వర్క్ ఆస్పత్రులన్నీ సమ్మెకు దిగాయి. సమ్మె విరమించేటప్పుడు ప్రభుత్వం వాళ్లకిచ్చిన మాటకు ఇంతవరకు దిక్కు లేదు. పేదలకు ఆరోగ్య భద్రత లేని పరిస్థితి. 104, 108 సేవలను స్కాములుగా మార్చేశారు. రూ.5 కోట్లు టర్నోవర్ లేని వాటికి 104, 108 సర్వీసుల నిర్వహణను అప్పగించేశారు. ఆ వ్యక్తి ఎవరంటే.. టీడీపీ ఆఫీసులో డాక్టర్ల సెల్ అధ్యక్షుడట..! ఓ పక్క ఇంత దారుణంగా ఆరోగ్య వ్యవస్థ ఉంటే.. మరోవైపు సంజీవని అంటారు. అది ఇంకో డ్రామా.

అన్నీ గవర్నమెంట్‌వే.. లాభాలేమో ప్రైవేటు వాళ్లకు!

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణే పెద్ద స్కాము.. వాటిని తీసుకున్న వారికి మరో పెద్ద బొనాంజా.. ఓవైపున ఆరోగ్యశ్రీని ఖూనీ చేస్తూ.. మరోవైపు ప్రభుత్వ ఆస్పత్రులను పూర్తిగా హతం చేస్తూ ఇంకోవైపు గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఒక స్కాముగా మారుస్తూ ఈ ప్రభుత్వ పాలన సాగుతోంది. కొత్త గవర్నమెంట్ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం ఒక స్కాము అయితే, ఆ కాలేజీలు తీసుకున్న వారికి ఒక పెద్ద బొనాంజా కూడా ఇచ్చారు. అది ఇంకో పెద్ద స్కామ్. ఈ కాలేజీలు ప్రైవేట్ పరం అయ్యాక అందులో పని చేస్తున్న సిబ్బందికి గవర్నమెంటే జీతాలు ఇస్తుందంట. (ప్రభుత్వం జారీ చేసిన జీవో 847ను ప్రదర్శించారు). ఒక్కో టీచింగ్ హాస్పిటల్ (550 పడకల ఆసుపత్రి)లో ఉద్యోగుల జీతాల కోసం నెలకు దాదాపు రూ.5 నుంచి రూ.6 కోట్లు ఖర్చవుతుంది. అంటే ఏడాదికి రూ.60 నుంచి రూ.70 కోట్లు. రెండేళ్లకు రూ.120 నుంచి రూ.140 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం ఇస్తుంది. ఆశ్చర్యమేమిటంటే.. గవర్నమెంట్ భూమి, గవర్నమెంట్ భవనాలు, గవర్నమెంట్ సిబ్బంది, గవర్నమెంట్ జీతాలు.. కానీ ఓనర్లేమో ప్రైవేటు వాళ్లు! లాభాలేమో ప్రైవేటు వాళ్లకు! భారమేమో ప్రజలపై! ఆశ్చర్యంగా లేదా ఇది..? బొనాంజా కాదా ఇది? స్కాముల్లో అన్నిటికంటే పెద్ద స్కామ్ కాదా ఇది? ఓవైపు ప్రజా ఉద్యమం జరుగుతోంది. దానిని ఖాతరు చేయకుండా, సిగ్గు లేకుండా చంద్రబాబు స్కాములపర్వం ముందుకు పోతోంది. ఒక పక్క మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి మందికిపైగా ప్రజలు సంతకాలు చేస్తున్నారు. మరో వైపున వాటిని ఖాతరు చేయకుండా చంద్రబాబు చేస్తున్న స్కామ్‌ల్లో ఒక అడుగు ముందుకేసి ఇంకో స్కామ్ చేస్తున్నాడు.

"ఆరోగ్యశ్రీని పూర్తిగా ఎత్తేయడం అన్నది నిజంగా మాయరోగమే. బకాయిలు ఇవ్వకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు దాదాపుగా నిలిచిపోయాయి. ఆరోగ్యశ్రీకి 18 నెలలకు రూ.5,400 కోట్లు ఇవ్వాలి. కానీ ఈ ప్రభుత్వం ఇచ్చింది కేవలం రూ.1,800 కోట్లు. ఇంకా రూ.3,600 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలున్నాయి. ఇక మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణే పెద్ద స్కాము.. వాటిని తీసుకున్న వారికి మరో పెద్ద బొనాంజా..! ఈ కాలేజీలు ప్రైవేట్ పరం అయ్యాక అందులో పని చేస్తున్న సిబ్బందికి గవర్నమెంటే జీతాలు ఇస్తుందట. గవర్నమెంట్ భూమి, గవర్నమెంట్ భవనాలు, గవర్నమెంట్ సిబ్బంది, గవర్నమెంట్ జీతాలు.. కానీ ఓనర్లేమో ప్రైవేటు వాళ్లు! లాభాలేమో ప్రైవేటు వాళ్లకు! భారమేమో ప్రజలపై! బొనాంజా కాదా ఇది?"
– వైఎస్ జగన్

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

HM&FW Department - APMSIDC - Modifications to the RFPs and Draft Concession Agreements for four medical colleges (Adoni, Markapuram, Madanapalli, Pulivendula) under PPP mode in Phase-I - Orders - Issued.

2. Transfer of human resource of existing hospital and cost thereof

A. The Government of Andhra Pradesh will provide only salary for the medical and non-medical staff, transferred with the existing hospital, for two years from the 'Effective Date'. The existing list of staff to be transferred is appended.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేసిన తర్వాత... ఆ ప్రైవేట్ సంస్థకు అప్పగించే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే సిబ్బందికి ప్రభుత్వమే జీతాలు కూడా చెల్లిస్తుంది... అని స్పష్టంగా తెలియజేస్తూ 2-12-2025న చంద్రబాబు సర్కారు జారీ చేసిన జీవో నంబర్ 847 ఇది...

16న గవర్నర్‌కు కోటి సంతకాల పత్రాలు అందచేస్తాం

కొత్త గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోవడంతో రోడ్లెక్కుతున్నారు. 175 నియోజకవర్గాల్లో ప్రజలతో కలిసి మా పార్టీ భారీ ర్యాలీలు చేపట్టి ప్రజల గొంతుకను వినిపించింది. కోటిమందికి పైగా సంతకాలు చేసి ఈ ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నారు. ఈ నెల 10వ తేదీన సంతకాలు చేసిన పత్రాలను నియోజకవర్గ కేంద్రాల్లో ప్రదర్శించి ప్రజలకు, మీడియాకు అందరికీ చూపించి జిల్లా కేంద్రాలకు పంపుతారు. ఈ నెల 13వ తేదీన జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు చేసి పార్టీ సెంట్రల్ ఆఫీసుకు చేరుస్తారు. ఆ కోటి సంతకాల పత్రాలను ఈ నెల 16న గవర్నర్‌కు అందచేస్తాం. ఆ తరువాత ఈ పత్రాలతో హైకోర్టులో పిటిషన్ వేస్తాం.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గని అడగరు..

ప్రైవేటు ప్లాంట్‌కు అడుగుతారా?

విపక్షంలో ఉండగా విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్నారు..

ప్రైవేటీకరించకుండా అడ్డుకుంటామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు మాట మారుస్తారా?

ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్ కాపాడుకుంటాం... కలిసి పోరాడతాం అని చెప్పారు

ఇప్పుడేమో ఇంట్లో పడుకుంటే జీతాలివ్వాలా? తమాషాలొద్దంటూ సీరియస్ అవుతారా?

స్టీల్ ప్లాంట్ విషయంలో చంద్రబాబు మామూలు దగా చేయలేదు

పీడీ యాక్టులు పెట్టి విశాఖ ఉక్కు ఉద్యోగులను లోపల వేస్తానంటారా?

మండిపడిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

"ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు.. ప్రైవేటీకరించకుండా కాపాడుకుంటాం అంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు మాట మార్చుతున్నారు. ప్రైవేటు సంస్థ స్టీల్ ప్లాంట్ పెడితే లాభాల్లో ఉంటుందట, తమాషాలు చేయొద్దు... పీడీ యాక్ట్ పెట్టి లోపలేస్తాం అని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. సినిమాల్లో విలన్ పాత్ర ఎలా ఉంటుందో చెప్పడానికి... చంద్రబాబు వ్యవహరిస్తున్న ఈ తీరే నిదర్శనం"
– వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: విపక్షంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు... ప్రైవేటీకరించకుండా కాపాడుకుంటాం అంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు మాట మార్చుతున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా కాపాడుకున్నామని, ప్రభుత్వ రంగంలోనే నడపాలని, సొంత గని (క్యాప్టివ్ మైన్) కేటాయించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తుచేశారు. స్టీల్ ప్లాంట్ నష్టాలకు కారణం కార్మికులు కానే కాదని, సొంత గని లేకపోవడమేనని తేల్చి చెప్పారు. దీనికి ఆధారంగా రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్), స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌ఏఐఎల్) వార్షిక నివేదికలను చూపారు. ''విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గని కేటాయించాలని అడగరు కాని.. మిట్టల్ సంస్థ పెట్టే ప్రైవేటు స్టీల్ ప్లాంట్‌కు సొంత ఇనుప గని కేటాయించాలని టీడీపీ కూటమి ఎంపీలతో కేంద్రాన్ని అడిగిస్తారా?'' అంటూ చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. గురువారం మీడియాతో మాట్లాడిన జగన్ ఇంకా ఏమన్నారంటే..

అప్పుడో మాట.. ఇప్పుడో మాటా?

మా ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా అడ్డుకున్నాం. కానీ, ఎన్నికల ముందు చంద్రబాబు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ఏం మాట్లాడారు..? ఇప్పుడు ఏం మాట్లాడుతున్నారనేది చూడండి. (2021 ఫిబ్రవరి 16న చంద్రబాబు మాట్లాడిన మాటలు, 2025 నవంబర్ 15న మాట్లాడిన మాటల వీడియో క్లిప్పింగ్‌లను చూపించారు). ప్లాంట్‌ను కాపాడుకుంటాం. కలిసి పోరాడతాం అంటూ వీర డైలాగులు చెప్పారు. ఇప్పుడు ఇంట్లో పడుకుంటే జీతాలివ్వాలా? అంటున్నారు. ప్రైవేటు సంస్థ స్టీల్ ప్లాంట్ పెడితే లాభాల్లో ఉంటుందట, తమాషాలు చేయొద్దు పీడీ యాక్ట్ పెట్టి లోపలేస్తాం అని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. నిజానికి నష్టాలకు ఉద్యోగులు కారణం కాదు. విశాఖ స్టీల్‌కు సొంత గనుల్లేకనే నష్టాలు. ఆర్‌ఐఎన్ఎల్, ఎస్‌ఏఐఎల్ 2023–24 వార్షిక నివేదిక ప్రకారం.. సెయిల్, విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల కోసం చేసే వ్యయం 11.2 శాతం ఉంది. కానీ, సెయిల్‌కు ఐరన్ ఓర్ ఉంది. క్యాప్టివ్ ఐరన్ ఓర్ ఉంది. దాన్నుంచి 34.34 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్ తీసుకోవడమే కాకుండా, జార్ఖండ్ ప్రభుత్వం అనుమతితో 1.16 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను మార్కెట్‌లో అమ్ముకున్నారు. **విశాఖ స్టీల్ ప్లాంట్‌కు క్యాప్టివ్ ఐరన్ ఓర్ మైన్స్ లేవు.** అందుకే ఐరన్ ఓర్ వ్యయం 18.6 శాతం అవుతుంటే సెయిల్‌లో ఇది 9.8 శాతమే. 10 శాతం తేడా ఉంది.

RINL vs SAIL

Particulars	RINL Vizag (2023-24) Amount (Cr.)	RINL Vizag (2023-24) % of revenue	SAIL (2023-24) Amount (Cr.)	SAIL (2023-24) % of revenue
Revenue from operations	23,186.39		1,05,378.33	
Cost of materials consumed	16,770.63	72.3%	57,709.26	54.8%
Coal cost	10,490.43	45.2%	45,918.51	43.6%
Iron ore cost	4,308.00	18.6%	10,324.00	9.8%
Employee benefit expenses	2,605.19	11.2%	11,765.72	11.2%

Source – Annual reports of RINL and SAIL for financial year 2023-24

Employee benefit expenses as a % of revenues is same with respect to SAIL and RINL.

The key difference is higher Iron ore prices for RINL

విశాఖ స్టీల్ ప్లాంట్- సెయిల్ ఉద్యోగుల బెనిఫిట్ ఖర్చులు సమానమని, కేవలం ముడి ఇనుము వ్యయంలోనే భారీ తేడా ఉందని స్పష్టం చేస్తున్న సెయిల్ 2023-24 వార్షిక నివేదిక

స్టీల్ ప్లాంట్‌పై చంద్రబాబు నాడు-నేడు మాట మార్చిన వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఉద్యోగులను ముంచేశారు

సీఎం చంద్రబాబుపై మాజీ సీఎం వైఎస్ జగన్ నిప్పులు

మెరుగైన పీఆర్సీ ఇస్తామని.. ఉన్న ఛైర్మన్‌నే తొలగించారు..

జీతాలు పెంచాల్సి వస్తుందనే దుర్బుద్ధితోనే పీఆర్సీ ఛైర్మన్‌ను నియమించడం లేదు

ఉద్యోగులకు రూ.31 వేల కోట్లు బకాయిపడ్డారు

ఆప్కాస్ ఉద్యోగులకు రెండు మూడు నెలలకు ఒకసారి జీతాలు

"ఉద్యోగుల సమస్యలు చూస్తే.. ఈ డిసెంబర్ పూర్తై జనవరి వస్తే ఐదు డీఏలు ఇవ్వాల్సి ఉండగా కేవలం ఒక్కటి మాత్రమే ఇచ్చారు. అది కూడా వాయిదాల్లో ఇస్తామంటున్నారు. మెరుగైన పీఆర్‌సీ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఉన్న పీఆర్‌సీ ఛైర్మన్‌నే తీసేశారు. ఇప్పటివరకూ కొత్త ఛైర్మన్‌ను నియమించలేదు. ఉద్యోగులకు పెరిగిన జీతాలు వెంటనే ఇవ్వాల్సి వస్తుందనే దుర్బుద్ధితోనే పీఆర్సీ ఛైర్మన్‌ను నియమించలేదు. ఐఆర్ ఊసే లేదు"
– వైఎస్ జగన్

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Allowances - Dearness Allowance - Dearness Allowance enhancement of 3.64% due from 01-01-2024 to the employees of the State Government w.e.f. 01.01.2024 – Sanctioned – Orders – Issued.

11. The Dearness Allowance sanctioned in the above paras, shall be paid in cash with salary of October, 2025 payable in November 2025. The arrears on account of payment of Dearness Allowance for the period from 01-01-2024 to 30-09-2025 shall be payable to the employees at the time of their exit from Government Service.

12. In the event of death of any employee before the issue of these orders, the legal heir(s) shall be entitled to the arrears of Dearness allowance.

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ బకాయిలను వారు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత చెల్లిస్తామంటూ 20-10-25న చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 60 ఇది..

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను సీఎం చంద్రబాబు నిండా ముంచేశారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ఎన్నికల్లో చంద్రబాబు కుప్పలు తెప్పలుగా ఇచ్చిన హామీలు.. వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్న తీరును ఎండగడుతూ సర్కార్ తీరును కడిగిపారేశారు. గురువారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఏమన్నారంటే..

ఐదింటికి ఒకే డీఏ..

ఉద్యోగుల సమస్యలు ఎలా ఉన్నాయో ఒక్కసారి చూస్తే... ఈ డిసెంబర్ పూర్తయి జనవరి వస్తే ఐదు డీఏలు ఇవ్వాల్సి ఉండగా కేవలం ఒక్కటి మాత్రమే ఇచ్చారు. అది కూడా వాయిదాల్లో ఇస్తామంటున్నారు. ఆశ్చర్యం ఏమిటంటే.. డీఏ అరియర్స్‌ను రిటైర్ అయిన తర్వాత ఇస్తామని చెప్పిన ప్రభుత్వాన్ని బహుశా చరిత్రలో ఎప్పుడూ చూసి ఉండం... ఒక్క చంద్రబాబు ప్రభుత్వంలో మినహా! దానికి తగ్గట్టుగా జీవో 60 జారీ చేశారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఇంత దౌర్భాగ్యమైన జీవోను తీసుకొని వచ్చి ఉండరు (జీవో నంబర్ 60ని ప్రదర్శించారు). దీనిపై ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో దాన్ని ఉపసంహరించుకుని, వాయిదాల్లో ఇస్తామన్నారు.

ఐఆర్ లేదు.. మెరుగైన పీఆర్సీ బూటకం

మెరుగైన పీఆర్‌సీ ఇస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఉన్న పీఆర్‌సీ ఛైర్మన్‌నే తీసేశారు. ఆ స్థానంలో ఇప్పటివరకూ కొత్త ఛైర్మన్‌ను నియమించలేదు. ఛైర్మన్‌ను నియమిస్తే పీఆర్సీ రిపోర్టు ఇవ్వాలి. రిపోర్టు వస్తే దాన్ని వెంటనే అమలు చేయాలి. అమలు చేస్తే.. ఉద్యోగులకు జీతాలు పెరుగుతాయి. దీంతో ఉద్యోగులకు పెరిగిన జీతాలు వెంటనే ఇవ్వాల్సి వస్తుందనే దుర్బుద్ధితోనే పీఆర్సీ ఛైర్మన్‌ను ఇప్పటివరకూ నియమించలేదు. అధికారంలోకి రాగానే ఐఆర్ ఇస్తామని చంద్రబాబు చెప్పారు. కానీ.. ఇప్పటివరకు ఐఆర్ ఊసే లేదు. నాడు మేం అధికారంలోకి రాగానే 27 శాతం ఐఆర్ ఇచ్చాం. దాంతో ఉద్యోగుల జీతాలు పెరిగాయి. ఆశ్చర్యం ఏమిటంటే.. మా ప్రభుత్వం ఇచ్చిన జీపీఎస్(గ్యారంటీడ్ పెన్షన్ స్కీం)ను కూడా చెల్లుబాటు కాకుండా చేసి ఉద్యోగులను చంద్రబాబు త్రిశంకు స్వర్గంలోకి నెట్టాడు. మేం తెచ్చిన జీపీఎస్‌ను దేశమంతా కాపీ కొడుతున్నారు. కనీసం అదైనా అమలు చేసి ఉంటే రిటైర్ అయిన ఉద్యోగులకు బెనిఫిట్స్ వచ్చేవి. పీఆర్‌సీ బకాయిలు, పెండింగ్ డీఏలు, జీపీఎఫ్‌లు, ఏపీజీఎల్ఐలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్స్ రూపంలో ఉద్యోగులకు చంద్రబాబు ఏకంగా రూ.31 వేల కోట్లు బకాయి పడ్డారు. ఆప్కాస్(ఏపీసీఓఎస్)లో ప్రతి నెలా 1వ తేదీనే జీతాలిచ్చేలా మా ప్రభుత్వంలో చర్యలు తీసుకున్నాం. కానీ ఇప్పుడు రెండు మూడు నెలలకోసారి ఇస్తున్నారు. నేను పులివెందులకు వెళ్తే మా వాళ్లు వచ్చి వినతిపత్రం ఇచ్చారు. మీరున్నప్పుడు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు వచ్చేవి.. ఇప్పుడు ఒకటో తేదీన జీతం కథ దేవుడెరుగు.. రెండు మూడు నెలలకు ఒకసారి ఇస్తున్నారు సార్..! అని చెబుతున్నారు. గెస్ట్ లెక్చరర్లకైతే ఎనిమిది నెలలుగా జీతాలే లేవు. ఈ ప్రభుత్వంలోఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తున్నారు. దేవాలయాల్లో శానిటేషన్ పనులు కూడా కాంట్రాక్టర్లకే కట్టబెట్టేస్తున్నారు. భాస్కరనాయుడు లాంటి చంద్రబాబు బంధువులు, సన్నిహితులకే కాంట్రాక్టులు ఇస్తున్నారు.

సందట్లో సడేమియా!

అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అవినీతి కేసులను తీసేయించుకుంటున్న చంద్రబాబు

"చంద్రబాబు స్కిల్ స్కాంతో పాటు అమరావతి పేరుతో అతిపెద్ద అసైన్డ్ ల్యాండ్ స్కామ్ చేశారు. చంద్రబాబు, ఆయన బినామీలు అసైన్డ్ భూములు కొనడమే కాకుండా.. వాటిని రెగ్యులరైజ్ చేసుకోవడం మరో పెద్ద స్కాం. అదే స్థాయిలో రింగు రోడ్డు అలైన్‌మెంట్ స్కాం. సరిగ్గా హెరిటేజ్ భూముల దగ్గర రింగ్ రోడ్డు పక్కకు వెళ్లిపోతుంది. ఉచితం పేరుతో ఇసుక స్కాం కొనసాగుతూనే ఉంది. ఈ వాస్తవాలన్నింటినీ ఎప్పటికప్పుడు ప్రజా క్షేత్రంలోకి తీసుకెళ్తాం.

అవినీతి కేసుల్లో బెయిల్‌పై బయట ఉన్న చంద్రబాబు 'తానే దొంగ.. తానే పోలీస్.. తానే పబ్లిక్ ప్రాసిక్యూటర్..' అన్నట్లు వ్యవహరిస్తూ అధికారుల మీద ఒత్తిడి తీసుకొచ్చి.. తనపై కేసులను తన ప్రభుత్వం ద్వారా బరితెగించి విత్ డ్రా చేయిస్తున్నారు. చంద్రబాబు అవినీతిపై ఫిర్యాదు చేసిన అధికారులను బెదిరించి, భయపెట్టి, వారితో అబద్ధపు వాంగ్మూలాలను తీసుకుని ఒక్కో కేసును మూసేసుకుంటున్నారు. ఇదంతా ఎల్లో మీడియా ఎప్పుడైనా రాసిందా.. చూపించిందా?"
– వైఎస్ జగన్

- బెయిల్‌పై ఉన్న చంద్రబాబు షరతులు ఉల్లంఘిస్తుంటే ఎందుకు ఆయన బెయిల్ రద్దు చేయకూడదు?
- 2014–19 మధ్య సాక్ష్యాధారాలతో సహా అవినీతి కేసుల్లో పట్టుబడిన బాబు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆగ్రహం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు దుర్మార్గపు పాలన సాగిస్తూ మరో వైపు తనపై అవినీతి కేసులను సందట్లో సడేమియా మాదిరిగా ఎత్తేసుకునే కుట్ర చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. న్యాయస్థానాలు ఇచ్చిన బెయిల్ షరతులను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి కేసుల్లో బెయిల్‌పై బయట ఉన్న చంద్రబాబు 'తానే దొంగ.. తానే పోలీస్.. తానే పబ్లిక్ ప్రాసిక్యూటర్..' అన్నట్లు వ్యవహరిస్తూ అధికారుల మీద ఒత్తిడి తీసుకొచ్చి.. తనపై కేసులను తన ప్రభుత్వం ద్వారా విత్ డ్రా చేసుకుంటూ బరితెగిస్తున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు 2014–19 మధ్య ఆషామాషీ స్కాములు చేయలేదు. ఒక్క స్కిల్ స్కామ్‌లోనే వందల కోట్లు బొక్కేశారు. స్వయంగా ఆ ఫైళ్లపై చంద్రబాబు సంతకాలు చేసి డొల్ల కంపెనీలకు రూ.370 కోట్లు దోచిపెట్టారు. అక్కడేమో సీమెన్స్ ఎండీ ఆ డబ్బులు నాకు రాలేదు, నా కంపెనీయే కాదని స్టేట్‌మెంట్ ఇచ్చారు. డొల్ల కంపెనీలకు చంద్రబాబు స్వయంగా సంతకాలు పెట్టి ఫైల్ మూవ్ చేసి రూ.370 కోట్లు ఇచ్చిన కేసులో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ అయిన ఈడీ.. డొల్ల కంపెనీలు పెట్టిన వాళ్లను, డబ్బులు తీసుకున్నోళ్లను అరెస్టు చేసింది. కానీ, డబ్బులు ఇచ్చినోడిని అరెస్టు చేయలేదు. డబ్బు మాత్రం పోయింది. డబ్బు ఇచ్చినోడిని అరెస్టు చేయకుండా ప్రొటెక్ట్ చేస్తుండటం ఏంటని ఏసీబీ కోర్టు ఆయన్ను జైలుకు పంపింది' అని అన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

అతిపెద్ద అసైన్డ్ ల్యాండ్ స్కామ్

చంద్రబాబు, ఆయన బినామీలు అసైన్డ్ భూములు కొనడం ఒక స్కాం అయితే.. ఆ తర్వాత వాటిని రెగ్యులరైజ్ చేసుకోవడం మరో పెద్ద స్కాం. అదే స్థాయిలో రింగు రోడ్డు అలైన్‌మెంట్ స్కాం చేశారు. కరెక్టుగా చంద్రబాబు హెరిటేజ్ భూముల దగ్గరకు వచ్చే సరికే రింగ్ రోడ్డు పక్కకు వెళ్లిపోతుంది. మరో వైపు ఉచితం పేరుతో రూ.కోట్ల విలువైన ఇసుకను దోచేస్తున్నారు. మా హయాంలో ఏడాదికి రూ.750 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.3,750 కోట్లు ఇసుక ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది.

బ్లాక్ లిస్టులోని కంపెనీకి కాంట్రాక్టులు!

ఫైబర్ నెట్‌లో అర్హత లేని, బ్లాక్ లిస్టులో ఉన్న తన అనుచరుడి కంపెనీకి కాంట్రాక్టు కట్టబెట్టి రూ.వందల కోట్లు అప్పనంగా మింగేశారు. లిక్కర్‌లో ఎమ్మార్పీ కన్నా అధిక రేట్లకు అమ్మి తన బెల్ట్ షాపుల ద్వారా, పర్మిట్ రూముల ద్వారా, తన మాఫియా సామ్రాజ్యం ద్వారా దోచేశారు. కేబినెట్ ఆమోదం లేకుండా ప్రివిలేజ్ ఫీజును రద్దు చేసి, దాని మీద చంద్రబాబు స్వయంగా సంతకాలు పెట్టి వేల కోట్ల రూపాయల లిక్కర్ స్కాంకు తెర తీశారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిలో లిక్కర్ స్కామ్ చేస్తున్నారు. డిస్టిలరీలకు ఆర్డర్లు ఇచ్చేది ప్రైవేట్ షాపులు. అలాంటి ప్రైవేట్ షాపులన్నీ చంద్రబాబు వ్యక్తులవి కాదా? ప్రతి ఐదు బాటిళ్లకు ఒక బాటిల్ కల్తీ మద్యం అమ్మేస్తున్నారు.

చట్టం.. చంద్రబాబు చుట్టం!

ప్రజాధనాన్ని బొక్కేసిన ఈ గజదొంగను చట్టం ముందు నిలబెట్టి శిక్షించడానికి కావాల్సిన అన్ని ఆధారాలు, సాక్ష్యాలు ఉన్నా కూడా చంద్రబాబు తన అధికార బలంతో కేసులు విత్‌డ్రా చేసుకునే కుట్రలకు తెగబడ్డారు. ఫిర్యాదుదారులైన అధికారుల్ని భయపెట్టి, బెదిరించి స్టేట్‌మెంట్లు విత్‌డ్రా చేయించి, వాటిని కోర్టు ముందు పెట్టి, ఈ కేసులో ఏమీ లేదంటూ వ్యవస్థల్ని తప్పుదారి పట్టిస్తున్నారు. రెఫర్ చార్జ్ షీట్ వేయించి మూసేయిస్తున్నారు. గతంలో కూడా సేమ్ మోడస్ ఆపరెండీకి పాల్పడ్డారు. ఏలేరు స్కామ్ తీసుకున్నా అంతే. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఆ పార్టీ బ్యాంకు అకౌంట్లను, ఆ పార్టీ గుర్తును లాక్కోవడం దగ్గర నుంచి మొన్నటి తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు కోట్లు ఇస్తూ ఆడియో టేపులు, వీడియో టేపులతో అడ్డంగా దొరికిపోయిన కేసులో.. ఇవాళ్టి కేసు వరకు చట్టం ఒక వైపు, వ్యవస్థలు మరో వైపు.. చంద్రబాబుకు చుట్టాలుగా మారి దిగజారిపోయిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజల దృష్టి మళ్లించడానికే వైఎస్సార్‌సీపీ నేతలను అక్రమ కేసులతో వేధిస్తున్నారు. చంద్రబాబు చేస్తున్న ఈ అన్యాయాలను వేలెత్తి చూపిస్తూ.. సాక్ష్యాలు, ఆధారాలతో ఎప్పటికప్పుడు ప్రజల ముందు పెడతాం. వాస్తవాలు ప్రజా క్షేత్రంలోకి తీసుకెళ్తాం.

లడ్డూ ప్రసాదంపై నిరాధార నిందలా?

సీఎం చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మండిపాటు

తిరుమల లడ్డూ ప్రసాదం జంతువుల కొవ్వు కలిసిన నెయ్యితో తయారు చేశారన్నావ్..

- వాటిని భక్తులు తిన్నారన్నావ్..
- వాటికి ఆధారాలు దొరికాయా చంద్రబాబూ?
- రాజకీయ లబ్ధి కోసం తిరుమల శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీస్తారా?
- సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ ఆగ్రహం
- నెయ్యి నాణ్యత నిర్ధారించడానికి టీటీడీలో అనాదిగా అత్యంత పకడ్బందీ విధానాలు
- ఎన్‌బీఎల్ అధీకృత ల్యాబ్ నాణ్యత నిర్ధారిస్తూ సర్టిఫికెట్ ఇచ్చిన ట్యాంకర్లకే తిరుపతికి అనుమతి
- నెయ్యి నాణ్యతను ల్యాబ్‌లో మరోసారి నిర్ధారించాకే గోదాములోకి అనుమతించనున్న టీటీడీ
- నాణ్యత లేని నెయ్యిని 2014-19 మధ్య 15 సార్లు, 2019-24 మధ్య 18 సార్లు వెనక్కి పంపారు
- జూలై 2024లో కల్తీ జరిగిందని ఆరోపిస్తున్న నాలుగు నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపామని మీ ఈవోనే చెప్పారు
- మరి ఆ నెయ్యి ట్యాంకర్లను ఆగస్టులో ఎలా అనుమతించారు..
- వాటితో లడ్డూ ఎలా తయారు చేశారు?
- ఇదేగనక నిజమైతే.. మీ చైర్మన్, ఈవోపై కేసులు ఎందుకు పెట్టలేదు..? తప్పు జరిగింది మీ హయాంలోనే కదా?
- పరకామణిలో దొంగతనం చేస్తున్న దొంగను పట్టుకున్నది మేం ఏర్పాటు చేసిన అత్యాధునిక పరకామణి వల్లే
- 30 ఏళ్లుగా జీయ్యర్ స్వామి వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆ దొంగ పరకామణిలో కానుకలు లెక్కిస్తున్నాడు
- అప్పటి నుంచి దొంగతనం చేస్తున్నారేమో.. స్వామికే తెలుసు
- రూ.72 వేలు విలువైన డాలర్లు కాజేసిన ఆ దొంగ నుంచి.. రూ.14 కోట్ల విలువైన ఆస్తులను న్యాయమూర్తుల సలహా తీసుకున్నాకే టీటీడీకి రాయించుకున్నారు.. ఇదేం తప్పు?
- సింహాచలం దేవస్థానంలో డబ్బులు దొంగతనం చేస్తూ పట్టుబడిన రమణ అనే ఉద్యోగిని స్టేషన్ బెయిల్ ఇచ్చి మీరు వదిలేశారు
- ఆ దేవస్థానం చైర్మన్ అశోక్ గజపతిరాజుపై కేసు ఎందుకు పెట్టలేదు..
- ఒక్కొక్కరికి ఒక్కో న్యాయమా?

“తనకు అనుకూలంగా లేకుంటే వ్యవస్థలపై దాడి చేయించడం చంద్రబాబుకు పరిపాటే. ఏకంగా న్యాయవ్యవస్థపైనే దాడి చేస్తున్నారు. తిరుపతి జడ్జి, లోక్ అదాలత్ జడ్జిపైనే కాకుండా, ఒక సుప్రీం కోర్టు పెద్ద జడ్జి ఒత్తిడి తెచ్చారని దుష్ప్రచారానికి తెగబడ్డారు. పెద్ద జడ్జిల గురించి వీళ్లు మాట్లాడుతున్నారు. ధర్మం తెలిసిన మనుషులుగా, చట్టాలు తెలిసిన వ్యక్తులుగా టీటీడీకి మంచి చేయడం కోసం ఒక మంచి పరిష్కారం చూపుతూ ఈ జడ్జిలు సమస్య పరిష్కారంలో భాగస్వామ్యం అవ్వడం తప్పా?''

– వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ''జంతువుల కొవ్వు కలిసిన నెయ్యితో తిరుమల లడ్డూ ప్రసాదాలు తయారు చేశారని.. వాటిని భక్తులు తిన్నారని అన్నావ్..! వాటికి ఆధారాలు దొరికాయా..?'' అంటూ సీఎం చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ సూటిగా ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమల వెంకటేశ్వరస్వామి విశిష్టతను అభాసుపాలు చేస్తావా బాబూ? అంటూ మండిపడ్డారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. బెయిల్‌పై ఉన్న చంద్రబాబు షరతులను ఉల్లంఘిస్తూ.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అవినీతి కేసులను తీసేయించుకుంటున్నారని తూర్పారబట్టారు. మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఏమన్నారంటే..

ఈ ప్రశ్నలకు సమాధానం ఉందా బాబూ..?

చంద్రబాబును సూటిగా ప్రశ్నిస్తున్నా! టీటీడీ లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని.. వాటిని భక్తులు తిన్నారని చెప్పడానికి ఆధారాలు దొరికాయా? కల్తీ నెయ్యి ఆరోపణలు ఉన్న ట్యాంకర్లు ప్రసాదం తయారీ కేంద్రంలోకి వెళ్లాయా? వీటికి ఆధారాలున్నాయా? టీటీడీలో ఒక బలమైన తనిఖీ వ్యవస్థ (రోబస్ట్ ప్రొసీజర్) ఉంది. టీటీడీకి వచ్చే ఏ నెయ్యి ట్యాంకర్ అయినా ఎన్ఏబీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్) సర్టిఫికేషన్‌తోనే రావాలి. ఇది దశాబ్దాలుగా టీటీడీలో పాటిస్తున్న నిబంధన. ఈ సర్టిఫికెట్ లేకుండా తిరుమలలోకి ట్యాంకర్లు రావు. ఎన్ఏబీఎల్ సర్టిఫికెట్ ఒక్కటే సరిపోదు. టీటీడీకి ఒక సొంత ల్యాబ్ కూడా ఉంది. ఆ ల్యాబ్‌లో మళ్లీ టెస్టు పాస్ అయితేనే ట్యాంకర్ లోపలికి వెళ్తుంది. ఈ స్టాండర్డ్స్ లేకపోతే నెయ్యి ట్యాంకర్లను తిరస్కరించి, వెనక్కి పంపిస్తారు. ఇలా గతంలో చంద్రబాబు హయాంలో 15 సార్లు వెనక్కి పంపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో 18 సార్లు వెనక్కి పంపారు. టీటీడీలో బలమైన తనిఖీ వ్యవస్థ ఉందని, సమర్థవంతంగా పని చేస్తుందని చెప్పడానికి ఇవి నిదర్శనాలు. అలాంటప్పుడు తప్పు జరిగేందుకు ఆస్కారం ఎక్కడిది?

కల్తీ నెయ్యి వాడితే నీ వైఫల్యం కాదా బాబూ?

చంద్రబాబు హయాంలో, ఆయన నియమించిన టీటీడీ ఈవో టైమ్స్ నాలో(ఈవో మాట్లాడిన వీడియో ప్రదర్శించారు) స్వయంగా ఆ ట్యాంకర్ల నెయ్యిని వినియోగించలేదని చెప్పారు. సెప్టెంబర్ 20, 2024న చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నియమించిన టీటీడీ ఈవో.. నాలుగు నెయ్యి ట్యాంకర్లు టెస్టులు పాస్ కాకపోవడంతో రిజెక్ట్ చేసి వెనక్కి పంపించామని ప్రకటించారు. వాస్తవానికి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఆయన హయాంలో జూలైలో 4 ట్యాంకర్లు తిప్పి పంపారు. మళ్లీ ఆ ట్యాంకర్లు ఆగస్టులో తిరిగి వచ్చాయట! మరి అప్పుడు సీఎం ఎవరు? చంద్రబాబు కాదా..? ప్రభుత్వాన్ని నడిపేది ఆయన కాదా..? గతంలో రిజెక్టు చేసిన నెయ్యి ట్యాంకులు ఆగస్టులో తిరిగి వచ్చాయని, లడ్డూ ప్రసాదంలో వినియోగించారని సిట్ రిమాండ్ రిపోర్టులో రాసింది. అలాంటప్పుడు ఇక్కడ ఎవరిని లోపల వేయాలి? ఇదే నిజమైతే రిజెక్ట్ చేసిన నెల రోజుల తర్వాత ఆ నెయ్యి ట్యాంకులు ఎలా తిరిగి వచ్చాయి? చంద్రబాబు చెప్పినట్టుగా ఆ నెయ్యిని వాడి ఉంటే అది ఈ ప్రభుత్వ వైఫల్యం కాదా? ప్రస్తుత టీటీడీ చైర్మన్, అప్పటి టీటీడీ ఈవో ఇద్దరూ ఏం చేస్తున్నారు? వాళ్లిద్దరిపై కేసులు పెట్టి ఎందుకు అరెస్టు చేయలేదు? పైగా మాపై నిందలు వేస్తారా? చంద్రబాబు ముఠాకు దేవుడంటే భయం, భక్తీ లేదు. దుర్మార్గమైన అసత్యాలు ప్రచారం చేయడమే వీళ్ల పని. పైగా చంద్రబాబు వేసిన సిట్.. వ్యక్తులను ఇరికించాలనే ఆరాటం, తపన, తాపత్రయంతో తప్పులపై తప్పులు చేస్తూ అడ్డంగా దొరికిపోతున్నారు.

2014-19 మధ్య కిలో నెయ్యి రూ.276-రూ.314

మరి అదంతా కల్తీ నెయ్యేనా బాబూ?

స్వచ్ఛమైన నెయ్యి రూ.320కే మీరు ఎలా సప్లయ్ చేయిస్తారు? అని చంద్రబాబు, ఆయన పార్టీకి చెందిన నాయకులు ప్రశ్నలు వేశారు. నాణ్యమైనది కావాలంటే కిలో రూ.3 వేలు అవుతుందని ప్రకటించారు. చంద్రబాబు గెజిట్ పత్రిక ఈనాడు అయితే కనీసం రూ.1,000–రూ.1,600 అని రాసింది. మరి టీటీడీలో ఇప్పుడు నెయ్యి ఎంతకు కొంటున్నారు? రూ.3 వేలు ఇస్తున్నారా? రూ.1,600 లేక రూ.1,000 ఇచ్చి కొంటున్నారా? 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో ఐదేళ్లూ కిలో నెయ్యి రూ.276–314 మధ్య కొన్నాడు. ఇది రూ.320 కంటే తక్కువ కదా? కాబట్టి అదంతా కల్తీ నెయ్యేనా? దీనికి చంద్రబాబు సమాధానం చెప్పాలి. పైగా భోలే బాబా డెయిరీ విషయంలో చేస్తున్న దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. 2018 జూన్ 26న టీటీడీ బోర్డు మినిట్స్ చూస్తే భోలే బాబా ఎవరో తేలింది. హర్ష్ ఫ్రెష్ డెయిరీ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్.. భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మారింది. ఈ సంస్థ టీటీడీకి పాలు సప్లై చేయడానికి డీమ్డ్ టు క్వాలిఫై అని సర్టిఫై చేసింది చంద్రబాబు హయాంలోనే. తిరుమలకు నెయ్యిని అనేక కంపెనీలు సప్లయ్ చేస్తుంటాయి. ప్రతి 6 నెలలకోసారి టెండర్లు పిలుస్తుంటారు. ఎవరు తక్కువకు కోట్ చేస్తారో వారి దగ్గర నుంచి కొంటారు. ఇది సాధారణంగా జరిగే ప్రొసీజర్. టెండర్లలో ఎల్-1 ఎవరుంటారో వారికి కేటాయిస్తారు. ఇందులో రాజకీయ ప్రమేయం ఉండదు. దేవుడి పేరుతో రాజకీయాలు చేయడానికి వీళ్లు ప్రయత్నిస్తున్నారు. నెయ్యిని సప్లై చేసే ఏ కంపెనీ అయినా కచ్చితంగా ఎన్ఏబీఎల్ సర్టిఫికెట్ తీసుకోవాలి, టీటీడీలో ఉన్న ల్యాబ్‌లో టెస్టులు పాసవ్వాలి. అప్పుడే ట్యాంకులు లోపలకు వెళ్తాయి.



TTD Board Resolution dated 26th June, 2018

Item No : 102
Page No : 232

MARKETING DEPARTMENT (PROCUREMENT WING)

Sub: TTD - Marketing department - Tirupati - Procurement of 73,000 Kgs of Cow Ghee with Agmark Special Grade through tins for a period of six months - e-tenders invited - supply order placed on L-1 tenderer pending approval of TTD Board - Matter placed before the TTD Board for approval and ratification - Regarding.

NOTE:

1. This is with regard to procurement of 73,000 Kgs of Cow Ghee with Agmark Special Grade through tins (15 Kgs per each tin) for use in TTD Temples for preparation of Prasadams and also in MTVAC Anna prasadam complex, Tirumala for a period of six months.

1	Name of the product	Cow Ghee with Agmark Special Grade through tins
2	Requirement	72,860 Kgs (rounded to 73,000 KGs) for 6 months
3	Consumption during last six months	66,300 Kgs approx. (Tins)

5. As per procedure in vogue, the technical team have inspected the plants M/s Harsh Fresh Dairy Products Pvt. Ltd.,Uttarakhand and M/s Farmgate Agro Milch Pvt. Ltd. New Delhi on 27.05.2018 and 28.05.2018 respectively and submitted the reports duly stating that, both the dairies M/s Farmgate Agro Milch Pvt. Ltd., New Delhi and M/s Harsh Fresh Dairy Products Pvt. Ltd.,Uttarakhand were qualified technically.

Note - Harsh Fresh Dairy Products Pvt. Ltd, was the former name of Bhole Baba Organic Dairy Milk Pvt. Ltd, and the same was deemed technically qualified to supply milk by the TTD during May 2018.

టీటీడీకి పాల ఉత్పత్తులు సరఫరా చేసేందుకు భోలేబాబాకు చెందిన హర్ష్ ఫ్రెష్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ 2018లోనే సాంకేతిక అర్హత సాధించిందంటూ 26-6-2018న టీటీడీ బోర్డు చేసిన తీర్మానం కాపీ ఇది..

దుష్ప్రచారం ఆపాలని సుప్రీంకు వెళ్లింది మేం కాదా?

టీటీడీ లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం ఆపాలని, నిజాలు బయటకు తీసుకురావాలని సుప్రీం కోర్టుకు వెళ్లింది వైవీ సుబ్బారెడ్డే. అంతేగానీ టీడీపీ వాళ్లు కాదు. అలాంటిది.. సుబ్బారెడ్డిపై అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారు. వైవీ సుబ్బారెడ్డి ఇంటికి ఎప్పుడైనా వెళ్లారా? హైదరాబాద్‌లో ఆయన ఇంట్లోనే గోపూజ జరుగుతుంది. ఆయన 1978 నుంచి 35–40 సార్లు అయ్యప్పమాల ధరించి కొండకు వెళ్లి ఉంటారు. అందులోనూ ఆయనది గురుస్వామి స్థానం. అలాంటి వ్యక్తిపై ఆరోపణలు ఎందుకు చేస్తున్నారో మీకే తెలియాలి.

అది చంద్రబాబు సొంత సిట్!

లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు వేసిన సిట్ చూస్తే వాళ్ల బాగోతం తెలిసిపోతుంది. సిట్‌లో ఉన్న గోపీనాథ్ జెట్టి.. ఎన్టీఆర్ ట్రస్టులో ట్రస్టీగా పని చేసిన కృష్ణయ్యకు అత్యంత సమీప బంధువు (ఎన్టీఆర్ ట్రస్టులో ట్రస్టీగా సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరితో దిగిన ఫొటో ప్రదర్శించారు). కృష్ణయ్యపై చంద్రబాబుకు ఎంత ప్రేమ అంటే.. రిటైర్ అయిపోయిన తర్వాత కూడా ఎన్టీఆర్ ట్రస్టులో ట్రస్టీగా పెట్టుకున్నారు. ఇన్నేళ్ల తర్వాత ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు చైర్మన్‌ను చేశారు. ఇలాంటి వ్యక్తి సమీప బంధువు సిట్ ఆఫీసర్లలో ఒకరు. మరో ఆఫీసర్ డీఐజీ త్రిపాఠి. ఈ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఎలాంటి వాడో చెప్పాల్సిన పని లేదు. పల్నాడు జిల్లాలో ఆయన సృష్టించిన అల్లకల్లోలం ఇప్పటికీ ప్రజలు మర్చిపోలేదు. తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవడం కోసం భుజాన వేసుకుని పాకులాడారు. ఆ తర్వాత చంద్రబాబు ఈ అధికారిని పక్కన కూర్చోబెట్టుకుని డీఐజీ స్థానం ఇచ్చి.. ఆయన చేస్తున్న మాఫియా కలెక్షన్లలో ప్రముఖ ప్రధాన పాత్ర ఇచ్చారు. ఇలాంటోళ్లు అందరూ సిట్‌లో ఉన్నారు. మరోవైపు వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్న అనే ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి అతను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వీపీఆర్) పీఏ. వీపీఆర్ ఒక టీడీపీ ఎంపీ. ఆయన దగ్గర నుంచి ప్రతి నెలా అప్పన్న జీతం (చెక్కులు) తీసుకుంటున్నాడు. పైగా ఏపీ భవన్ ఉద్యోగి. వీపీఆర్ పీఏ, తర్వాత ఏపీ భవన్ ఉద్యోగి. మరి వైవీ సుబ్బారెడ్డి పిక్చర్‌లోకి ఎలా వచ్చారు? ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, చంద్రబాబు ఎంతసేపూ వైవీ సుబ్బారెడ్డి పీఏ అని గోబెల్స్ ప్రచారం చేస్తూ డ్రిల్ చేస్తున్నారు!.

టీటీడీలో స్కాములన్నీ బాబువే!

పరకామణి కేసులో దొంగను పట్టుకున్న పోలీసు అధికారి మరణించేలా చంద్రబాబు వ్యవస్థలను దిగజార్చాడు. ఆ రోజు హుండీ డబ్బులు లెక్కిస్తూ రూ.72 వేల విలువైన అమెరికన్ డాలర్లను చోరీ చేస్తూ ఓ వ్యక్తి దొరికిపోయాడు. ఆ దొంగను పట్టుకోవడం నేరం అవుతుందా? దీనికి ప్రాయశ్చిత్తంగా ఆ దొంగ కుటుంబ సభ్యులు రూ.14 కోట్లు విలువైన ఆస్తులను దేవుడికి ఇవ్వడం తప్పు అవుతుందా? దేశంలో అనేక చోట్ల, అనేక ఆలయాల్లో ఇలాంటి ఘటనలు గతంలో జరిగాయి. కానీ, ఎక్కడైనా ఇలా ఆస్తులు దేవుడికి ఇచ్చారా? ఈ దొంగ దొరికినప్పుడు కేసు నమోదు అయ్యింది. తిరుపతి కోర్టులో చార్జిషీట్ వేశారు. మెగా లోక్ అదాలత్ కోర్టులో కేసును పరిష్కరించారు. అన్నీ కోర్టుల పరిధిలో ప్రాపర్ కోర్టు ప్రొసీజర్‌తో జరిగాయి. జ్యుడీషియల్ ప్రాసెస్ అంతా జరిగింది. ఇందులో సాంకేతిక పరమైన అంశాలు ఏమైనా ఉంటే దర్యాప్తు చేసుకోవచ్చు తప్పు లేదు. కానీ, రాజకీయాల కోసం ఈ ఘటన జరిగినప్పుడు అక్కడ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్నాడనో.. భూమన కరుణాకర్‌రెడ్డి ఉన్నాడనో.. వారి మీద బురదజల్లాలని తప్పుడు స్టేట్‌మెంట్ కోసం అక్కడ పనిచేస్తున్న బీసీ పోలీస్ అధికారిని వేధించి, వెంటాడి, బెదిరించి, చివరకు ఆయన చనిపోయేలా చేశారు. ఆ మరణానికి ఎవరో కారణం అంటూ ఎల్లో మీడియా చేత తప్పుడు కథనాలు రాయించారు.

టీటీడీ ఈవోగా ఉన్నప్పుడు శ్యామలరావు మాట్లాడిన వీడియో కోసం స్కాన్ చేయండి

జడ్జిలపై ఆరోపణలు చేస్తూ వర్ల రామయ్య మాట్లాడిన వీడియో కోసం స్కాన్ చేయండి

మీ హయాంలో పట్టుకోలేదేం బాబూ?

ఆ దొరికిన దొంగ... 30 ఏళ్ల నుంచి జీయర్ స్వామి మఠంలో క్లర్క్‌గా పని చేస్తున్నాడు. పరకామణి లెక్కింపులో ఎన్నో ఏళ్ల నుంచి పాల్గొంటున్నాడు. కొత్తగా మా ప్రభుత్వంలో వచ్చిన వ్యక్తి కాదు. మరి గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో ఎందుకు పట్టుకోలేకపోయారు? ఆ దొంగను మేం పట్టుకున్నాం. వాస్తవానికి మేం వచ్చిన తర్వాత మా ప్రభుత్వంలో తిరుమల హుండీ డబ్బు లెక్కింపు ప్రక్రియను ఇంకా పారదర్శకంగా చేశాం. దేవుడి సొమ్ము దొంగల పాలు కాకూడదని రూ.23 కోట్లు ఖర్చు పెట్టి కొత్త పరకామణి బిల్డింగ్ కట్టాం. అత్యాధునిక కెమెరాలతో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశాం. దాన్ని సీఎం హోదాలో నేను ప్రారంభించా. 2023 ఫిబ్రవరి 5 నుంచి ఆ బిల్డింగ్‌లో పూర్తి స్థాయి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పాత భవనంలో అరకొరగా సీసీ కెమెరాలు ఉండేవి. రికార్డింగ్ క్వాలిటీ కూడా తక్కువే. బ్లయిండ్ స్పాట్స్ ఎక్కువ. వాటిని అన్నింటినీ మారుస్తూ కొత్త భవనంలో 360 డిగ్రీల కవరేజ్‌తో 4కే హెచ్‌డీ సీసీ టీవీ వ్యవస్థలు, హైబ్రీడ్ నైట్ విజన్ కెమెరాలు, ఎక్కువ రోజులు డేటా ఉండేలా మల్టీ టీమ్ రియల్ టైమ్ మానిటరింగ్ సిస్టమ్స్ తెచ్చాం. ఇవన్నీ చేసిన తర్వాత ఏప్రిల్ 4, 2023లో దొంగతనం చేస్తూ ఈ వ్యక్తి పట్టుబడ్డాడు. ఇప్పుడు చెప్పండి.. ఎవరు మంచివారు? ఇంత గొప్ప వ్యవస్థను సృష్టించినందుకు మాపై నిందలా..? ఆ వ్యక్తి దశాబ్దాలుగా ఇదే పనిచేస్తున్నాడని అనుకోవచ్చు. కానీ చంద్రబాబు హయాంలో ఎవరూ పట్టుకోలేదు. మా హయాంలో పట్టుకున్నాం. గతంలో ఏం జరిగిందో దేవుడికే తెలుసు. రూ.72 వేల విలువైన అమెరికన్ డాలర్లు దొరికితే.. ఏకంగా రూ.14 కోట్ల ఆస్తిని ఆ కుటుంబం దేవుడికి రాసిచ్చింది.

న్యాయ వ్యవస్థపైనే దాడి..!

చంద్రబాబు తనకు అనుకూలంగా లేకుంటే వ్యవస్థలపై సైతం దాడి చేయించడం పరిపాటే. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, అధికార ప్రతినిధి వర్ల రామయ్యతో మాట్లాడిస్తున్న మాటలు న్యాయ వ్యవస్థపై దాడి చేయించినట్లే! (వర్ల వీడియోను ప్రదర్శించారు)!

''23-9-2025: ప్రాపర్టీ ఓనర్ ఎవరు? కోర్టు కూడా తప్పు చేసిందా.. అనుమానం వస్తుంది. హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కోరుతున్నా.. మీ తరఫున దర్యాప్తు చేయించాలి. ఈ కేసులు సీరియస్. ఎందుకు లోక్ అదాలత్‌తో దర్యాప్తు చేయిస్తారు? తిరుపతిలో రూమర్స్ వస్తున్నాయి. ఈ జడ్జిగారికి పైనుంచి ఎవరో మరో జడ్జి చెప్పారట. నేను జడ్జి ఎవరని అడగట్లేదు. అందరం మనుషులమే. ఈ జడ్జికి పైనుంచి ఎవరో జడ్జి చెప్పారట. ఏ జడ్జి చెప్పినా.. ఇన్‌స్పెక్టర్ దర్యాప్తు చేసినా.. అన్యాయం జరిగింది మాత్రం స్వామి వారికే.

13-11-2025: తమిళనాడులో రిజిస్టర్ చేశారట ఆస్తులు. దీని వెనుక జడ్జి ఉన్నారని చెబుతున్నారు. రూ.50 లక్షల స్టాంపు డ్యూటీ కట్టారటా. ఆ రూ.50 లక్షలు ఎవరు కట్టారు?

జడ్జిలు, టీటీడీ అధికారులపై నిందలు సిగ్గుచేటు..

ఇలా ఏకంగా న్యాయవ్యవస్థపైనే చంద్రబాబు దాడి చేస్తున్నారు. తిరుపతి జడ్జి, లోక్ అదాలత్ జడ్జిపైనే కాకుండా, ఒక సుప్రీంకోర్టు పెద్ద జడ్జి ఒత్తిడి తెచ్చారని దుష్ప్రచారానికి తెగబడ్డారు. పెద్ద జడ్జిల గురించి వీళ్లు మాట్లాడుతున్నారు. ధర్మం తెలిసిన మనుషులుగా, చట్టాలు తెలిసిన వ్యక్తులుగా టీటీడీకి మంచి చేయడం కోసం ఒక మంచి పరిష్కారం చూపుతూ ఈ జడ్జిలు సమస్య పరిష్కారంలో భాగస్వామ్యం అవ్వడం తప్పా? తిరుమలకు పెద్ద పెద్ద సీనియర్ జడ్జిలు వస్తుంటారు. ఇలాంటి కేసులు ఏమైనా జరిగినప్పుడు తిరుపతిలో ఉన్న జడ్జిలు, సుప్రీం కోర్టు జడ్జిల దాకా కూడా మాట్లాడుకుంటారు. ఇలాంటి ముఖ్యమైన కేసుల్లో, దేశం మొత్తం చూస్తున్న కేసులో సలహాలు కోరతారు. జ్యుడీషియల్ పరిధిలో సలహాలు తీసుకుంటారు. ఏ తప్పూ జరగలేదు, ఏ తప్పూ చేయలేదు కాబట్టి సలహాలు తీసుకొని, ఇంప్లిమెంట్ చేశారేమో..! దాంట్లో రాజకీయం చేయడానికి ఏముంది? జడ్జిలపై, టీటీడీ అధికారులపై నిందలు వేయడం సిగ్గుచేటు.

ఒక్కొక్కరికి ఒక్కో న్యాయమా?

టీడీపీ స్టాండ్ ఎలా ఉంటుందంటే.. ఈ ఏడాది సెప్టెంబర్ 1న చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే, అత్యంత విశిష్టత కలిగిన సింహాచలంలో రూ.55 వేలు హుండీ డబ్బులు చోరీ చేస్తూ దేవస్థానం ఉద్యోగి రమణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సురేష్ పట్టుబడ్డారు. ఉద్యోగి రమణను సస్పెండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సురేష్‌ను పోలీసులకు అప్పగించి, ఆ వెంటనే స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేశారు. ఆ వ్యకిని ఎందుకు జైల్లో పెట్టలేదు? మరి చంద్రబాబు దీనిపై ఎందుకు విచారణ చేయలేదు? మొత్తం వారిద్దరి ఆస్తులపై విచారణ చేసి, వాటిని మొత్తం ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? పైగా సింహాచలం ఆలయానికి ధర్మకర్త టీడీపీకి చెందిన అశోక్ గజపతిరాజు. వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి చైర్మన్‌గా ఉంటే ఒక న్యాయం..! అదే అశోక్ గజపతిరాజు ధర్మకర్తగా ఉంటే ఇంకో న్యాయం..! మరి ఆయన మీద విచారణ ఎందుకు చేయడం లేదు? ఎక్కడైనా న్యాయం ఒక్కటే కదా!!

❖ టీటీడీలో బాబు స్కాములు ఇవీ...!

రాష్ట్రంలో దేవుడి సొమ్ముతో స్కామ్‌లు చేసింది చంద్రబాబే. తిరుచానూరు మార్కెట్ యార్డ్ నుంచి కపిలతీర్థం వరకు శ్రీనివాస సేతు 6 కిలోమీటర్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో ప్రతిపాదన చేశారు. ఇందులో 67 శాతం ఖర్చు టీటీడీ, 33 శాతం ప్రభుత్వం పెట్టాలని నిర్ణయించారు. అప్పటి తిరుపతి కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌ను చంద్రబాబు పిలిపించుకుని రూ.684 కోట్లతో శ్రీనివాససేతు కట్టేయమని చెప్పారు. అయితే, ఆ మీటింగ్‌లో టీటీడీ ప్రతినిధులు లేరు. 67 శాతం డబ్బులు టీటీడీ నుంచి తీసుకునే కార్యక్రమంలో టీటీడీ వాళ్లు ఉండరు. అసలు బోర్డు అనుమతి, ఆమోదం లేకుండా నిర్ణయం తీసుకుంటారు. ఇది కాదా స్కామ్? దీన్ని మన ప్రభుత్వం వచ్చిన తర్వాత టీటీడీ బోర్డు రీవిజిట్ చేసి రూ.40 కోట్లు ఖర్చు తగ్గించారు. కొత్త బోర్డు రాకపోయి ఉంటే ఆ రూ.40 కోట్లు ఎవరి జేబుల్లోకి పోయేవి?

❖ కమీషన్ల కోసం కక్కుర్తి!

టీటీడీ డబ్బుల్లో 10 శాతానికి మించి ప్రైవేట్ బ్యాంకుల్లో జమ చేయకూడదు. ఇది టీటీడీ రూల్. చంద్రబాబు హయాంలో కమీషన్లకు కక్కుర్తిపడి రూ.1,300 కోట్లు ఎస్ బ్యాంక్‌లో పెట్టించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత బోర్డు ఆ నిర్ణయాన్ని రీవిజిట్ చేసి ఎస్ బ్యాంక్ నుంచి ఆ డబ్బును విత్‌డ్రా చేసి జాతీయ బ్యాంకులో పెట్టింది. ఆ తర్వాత మూడు నెలలకు ఎస్ బ్యాంక్ ఆర్థికంగా కుదేలయ్యింది. ఒకవేళ చంద్రబాబు పెట్టిన రూ.1,300 కోట్లు ఎస్ బ్యాంక్‌లోనే ఉండి ఉంటే ఆ డబ్బు ఏమయ్యేది? మరి ఏది స్కామ్? మాకు ఇవన్నీ తెలిసినా కూడా టీటీడీ కాబట్టి రాజకీయాల్లో లాగకూడదని సమస్య పరిష్కరించి, సరిదిద్దాం. మన ఇప్పుడు వీళ్లు చేసేవి చూస్తుంటే అసలు ఏమీ జరగకపోయినా, మంచి చేసే కార్యక్రమం జరిగినా దాన్ని వక్రీకరిస్తూ, రివర్స్ అబద్ధాలు చెబుతున్నారు. వాస్తవానికి టీటీడీ ఒక స్వతంత్ర వ్యవస్థ. కొన్ని శతాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ విధానాలను తిరుమల తిరుపతి దేవస్థానంలో అమలు చేస్తున్నారు. అలాంటి ఆలయాన్ని, ఏకంగా దేవుడి ప్రతిష్టను మంటగలుపుతున్నామనే కనీస ధ్యాస కూడా లేకుండా, వెంకటేశ్వరస్వామి ప్రతిష్టను దిగజారుస్తూ చంద్రబాబు అత్యంత హేయమైన రాజకీయాలు చేస్తున్నారు.

ఆ 53 వేల ఎకరాలకే దిక్కులేదు..

ఇప్పుడు మళ్లీ 53 వేల ఎకరాలా? రాజధానిలో రెండో విడత భూ సమీకరణపై వైఎస్ జగన్

ఇంటర్నేషనల్ రాజధాని అంటూ బాహుబలి సెట్టింగ్స్ చూపారు

అన్నీపోనూ మిగిలిన 8 వేల ఎకరాల్లోనే సెల్ఫ్ ఫైనాన్స్ మోడల్ రాజధాని అన్నారు

- మౌలిక సదుపాయాలకే రూ.లక్ష కోట్లు కావాలని డీపీఆర్ ఇచ్చారు
- ఇప్పుడు అధికారంలోకి రాగానే స్కామ్‌లపై దృష్టి
- ఎవరెవరికి భూమి ఇవ్వాలి? ఎవరెవరి దగ్గర ఎంత పుచ్చుకోవాలి?
- చ.అ. నిర్మాణం రూ.4 వేలకు బదులు రూ.10 వేలకు ఎలా కాంట్రాక్ట్ ఇవ్వాలి?
- కిలోమీటర్ రోడ్డుకు రూ.25 కోట్లు అయ్యే చోట రూ.54 కోట్లు పెట్టి ఎలా దండుకోవాలి?
- ఇలా అన్నీ స్కాములే కాబట్టి పనులు నిరంతరం జరిగేలా స్కెచ్
- ఈయన, ఈయన బినామీలు పూలింగ్‌కు ముందుగానే ల్యాండ్ కొంటారు..
- తన బినామీలకు మాత్రం మంచి చోట ప్లాట్లు.. మిగిలిన వాళ్లకు వేరే చోట
- వేరే వాళ్లకు ఇచ్చిన ప్రాంతం ఎప్పటికీ అభివృద్ధి జరగదు.. వారంతా గాలికే

అధికారంలో ఉంటే చంద్రబాబుకు స్కాములే గుర్తుకొస్తాయి. ఎవరెవరికి భూమి ఇవ్వాలి? ఎవరెవరి దగ్గర ఎంత పుచ్చుకోవాలి? చదరపు అడుగు నిర్మాణం రూ.4 వేలు అయ్యే దగ్గర ఎలా రూ.10 వేలకు కాంట్రాక్ట్ ఇవ్వాలి? నేషనల్ హైవేలు కిలోమీటర్‌కు రూ.25 కోట్లు అయ్యే చోట రూ.54 కోట్లు పెట్టి ఎలా దండుకోవాలి? కాబట్టి రాజధానిలో పనులు నిరంతరం జరుగుతుండాలనేది ఆయన ఉద్దేశం. అందుకే ఇలా అన్నీ స్కాములు. – వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణానికి గతంలో తీసుకున్న 53 వేల ఎకరాలకే దిక్కులేదు.. ఇప్పుడు రైతుల నుంచి ఇంకో 53 వేల ఎకరాలు తీసుకోవడానికి సీఎం చంద్రబాబు వెనుకాడటం లేదని వైఎస్ జగన్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సూటిగా, స్పష్టంగా సమాధానం చెప్పారు. రాజధానిలో రెండో విడత భూ సమీకరణపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. 'అమరావతి గురించి మీరే చెప్పాలి. ఇంతకు ముందు అంతా చంద్రబాబు ఏమన్నాడు? 2014–19 మధ్య 53 వేల ఎకరాలు తీసుకుంటూ అసలు ఇది ఇంటర్నేషనల్ రాజధాని.. సింగపూర్, గింగపూర్ ఎక్కడికి పోవాలో.. మన దగ్గర నుంచే ఏదైనా కానీ.. మన రాజధానిని చూసి వాళ్లు కాపీ కొట్టే పరిస్థితుల్లోకి దీన్ని బిల్డప్ చేస్తున్నానని మనకు బాహుబలి సెట్టింగ్స్ చూపించారు. ఆ 53 వేల ఎకరాల్లో ఆయన రాజధాని కట్టింది ఎంత? రాజధాని కట్టడం కథ దేవుడెరుగు.. ఆ 53 వేల ఎకరాల్లో రోడ్లు వేయడానికి, కరెంటు ఇవ్వడానికి, డ్రెయినేజీ కనెక్షన్లు ఇవ్వడానికి, నీళ్లు ఇవ్వడానికి.. వీటికే ఎకరాకు రూ.2 కోట్లు అవుతుందని తానే డీపీఆర్ ఇచ్చాడు. అంటే ఆ 53 వేల ఎకరాలకే లక్ష కోట్ల రూపాయలు కావాలని సినిమా చూపిస్తూ రూ.5 వేల కోట్లు పెట్టాడు. మళ్లీ ఈ రోజు ఏం చేస్తున్నాడు? ఆ 53 వేల ఎకరాలు సరిపోదు అంటున్నాడు.' అని చెప్పారు.

స్కాముల కోసమే అది చాలదంటున్నారు

'ఆ రోజేమో సెల్ఫ్ ఫైనాన్స్ మోడల్ అన్నాడు. 8 వేల ఎకరాలు మిగిలిందని, దాంతోనే రాజధాని అయిపోతుందని చెప్పాడు. మళ్లీ ఈ రోజు అది చాలదంటున్నాడు. అధికారంలో ఉంటే ఆయనకు స్కాములే గుర్తుకొస్తాయి. ఎవరెవరికి భూమి ఇవ్వాలి? ఎవరెవరి దగ్గర ఎంత పుచ్చుకోవాలి? చదరపు అడుగు నిర్మాణం రూ.4 వేలు అయ్యే దగ్గర ఎలా రూ.10 వేలకు కాంట్రాక్ట్ ఇవ్వాలి. నేషనల్ హైవేలు కిలోమీటర్‌కు రూ.25 కోట్లు అయ్యే చోట రూ.54 కోట్లు పెట్టి ఎలా దండుకోవాలి? ఇలా అన్నీ స్కాములే కాబట్టి రాజధానిలో పనులు నిరంతరం జరుగుతుండాలనేది ఆయన ఉద్దేశం. ఇక్కడ జరిగేది ఒక్కటే... ఈయన, ఈయన బినామీలు ముందుగానే ల్యాండ్ కొంటారు. కొన్న తర్వాత ఆ పక్కన భూములను ల్యాండ్ పూలింగ్‌లో తీసుకుంటారు. ఆ తర్వాత తన బినామీలకు మాత్రం ప్లాట్లు ఇచ్చుకోవాల్సిన చోట ఇచ్చుకుంటాడు. మిగిలిన వాళ్లకు ప్లాట్లు వేరే చోట ఇస్తాడు. అక్కడ ఎప్పటికీ అభివృద్ధి జరగదు. అంటే మిగతా వాళ్లు గాలికి పోతారు. వేసే రోడ్లు ఏవో వీళ్ల మనుషులకు ప్లాట్లు ఇచ్చిన చోట వేసుకుంటారు' అని చెప్పారు. చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తనపై ఉన్న అవినీతి కేసులు తీసేయించుకుంటున్నారన్న ప్రశ్నకు వైఎస్ జగన్ స్పందిస్తూ.. 'ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయస్థానాల ద్వారానే పోరాటం చేయగలుగుతాం. ఎండ్ ఆఫ్ ద డే.. పై నుంచి దేవుడు చూస్తుంటాడు. ప్రజాస్వామ్యంలో ప్రజలు చూస్తుంటారు. దేవుడు, ప్రజలే చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి' అన్నారు.

పుతిన్‌కు ఘన స్వాగతం

ఎయిర్‌పోర్టుకు స్వయంగా వచ్చిన ప్రధాని మోదీ

- ప్రధాని అధికారిక నివాసానికి ఒకే కారులో వెళ్లిన ఇరువురు నేతలు
- రష్యా అధినేతకు ప్రైవేట్ విందు
- నేడు 23వ ఇండియా–రష్యా సదస్సుకు హాజరు కానున్న నేతలు

పాలెం విమానాశ్రయంలో పుతిన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రధాని మోదీ(ఇన్‌సెట్‌లో)పుతిన్‌తో ఆలింగనం

న్యూఢిల్లీ: రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో అధికారిక పర్యటనకు శ్రీకారం చుట్టారు. రష్యా నుంచి గురువారం సాయంత్రం ఢిల్లీలోని పాలం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న పుతిన్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ సాదర స్వాగతం పలికారు. భారత్, రష్యా మధ్య దశాబ్దాల స్నేహ సంబంధాలకు ప్రతీకగా ఇరువురు నేతలు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. నాలుగేళ్ల తర్వాత భారత పర్యటనకు వచ్చిన పుతిన్‌ను చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో స్వాగతించారు. పుతిన్, మోదీ చప్పట్లతో వారిని అభినందించారు. అనంతరం ఇరువురూ ఒకే కారులో మోదీ అధికారిక నివాసానికి చేరుకున్నారు. అక్కడ పుతిన్‌కు ప్రధానమంత్రి ప్రైవేట్ విందు ఇచ్చారు. పుతిన్, మోదీ ఒకే కారులో ప్రయాణించడం మూడు నెలల్లో ఇది రెండోసారి. చైనాలోని తియాంజిన్ సిటీలో జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సదస్సు సందర్భంగా వారిద్దరూ ఒకే కారులో ప్రయాణిస్తూ మాట్లాడుకున్న సంగతి తెలిసిందే. ప్రపంచంలో సంక్లిష్టమైన భౌగోళిక రాజకీయాలు, వివిధ దేశాల మధ్య ఘర్షణలు, రష్యాపై పశ్చిమ దేశాల ఆంక్షలు కొనసాగుతున్న సమయంలో పుతిన్ చిరకాల మిత్రదేశమైన ఇండియాలో పర్యటిస్తుండడం విశేషమైన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాన్ని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ప్రధాని మోదీ ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి మరీ పుతిన్ కోసం ఎయిర్‌పోర్టుకు స్వయంగా రావడం విశేషం. తన మిత్రుడు పుతిన్‌కు స్వాగతం పలకడం ఆనందంగా ఉందంటూ ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆయనతో చర్చల కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నానని పేర్కొన్నారు. భారత్–రష్యా బంధం ఇరుదేశాల ప్రజలకు ప్రయోజనం కలిగిస్తూ కాల పరీక్షకు నిలిచిందని ఉద్ఘాటించారు. మోదీ నివాసంలో విందు సమావేశం దాదాపు మూడు గంటలపాటు జరిగింది. అనంతరం పుతిన్ ఐటీసీ మౌర్య హోటల్‌కు చేరుకున్నారు. రాత్రి ఆయన అక్కడే బస చేశారు.

నేడు వరుస భేటీలు

వరుస భేటీతో పుతిన్ షెడ్యూల్ శుక్రవారం బిజీబిజీగా సాగిపోనుంది. పుతిన్‌కు ఉదయం రాష్ట్రపతి భవన్ వద్ద భారత త్రివిధ దళాలు లాంఛనంగా స్వాగతం పలుకుతాయి. అనంతరం ఆయన రాజ్‌ఘాట్‌ను సందర్శించి, మహాత్మాగాంధీకి నివాళులర్పించబోతున్నట్లు సమాచారం. ఆ తర్వాత హైదరాబాద్ హౌస్‌లో జరిగే 23వ ఇండియా–రష్యా సదస్సులో పాల్గొంటారు. ఇదే భవనంలో పుతిన్‌కు, ఆయన ప్రతినిధి బృందానికి మోదీ విందు ఇవ్వబోతున్నారు. సదస్సు తర్వాత ఇద్దరు నేతలు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేయనున్నారు. అలాగే రష్యా ప్రభుత్వం ఆధ్వర్యంలోని న్యూ ఇండియా చానల్‌ను పుతిన్ ప్రారంభిస్తారు. భారత్ మండపంలో ఫిక్కి, రాస్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే వ్యాపార సదస్సులో మోదీ, పుతిన్ పాల్గొంటారు. అనంతరం పుతిన్ గౌరవార్థం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చే విందులో పాల్గొంటారు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో పుతిన్ ఢిల్లీ నుంచి స్వదేశానికి బయలుదేరి వెళ్తారు.

కీలక ఒప్పందాలు?

ఇండియా–రష్యా సదస్సులో ముఖ్యమైన అంశాలపై చర్చించబోతున్నారు. ఈ సందర్భంగా వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, రక్షణ రంగానికి సంబంధించి రెండు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకొనే దిశగా చర్చలు జరుగనున్నాయి.

కారు పూలింగ్ ఆలోచన నాదే: పుతిన్

చైనాలోని తియాంజిన్‌లో సెప్టెంబర్ 1న భారత ప్రధాని మోదీతో కలిసి ఒకే కారులో ప్రయాణించాలన్న ఆలోచన తనదేనని పుతిన్ తెలిపారు. ఇది తమ స్నేహానికి గుర్తు అని వివరించారు. ఇండియా టుడే వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం ప్రత్యేకంగా ప్రస్తావించారు. అది ముందస్తు ప్రణాళికతో జరిగిన ఘటన కాదని అన్నారు. సదస్సు వేదిక నుంచి బయటకు వచ్చిన తర్వాత అక్కడ తన కారు సిద్ధంగా ఉందని, కలిసి వెళ్దామని తాను కోరడంతో మోదీ అంగీకరించారని చెప్పారు. షాంఘై సహకార సదస్సు ఎజెండాతోపాటు ఇతర అంశాలపై మాట్లాడుకున్నామని వెల్లడించారు.

పుతిన్‌కు భగవద్గీత బహూకరణ

ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు రష్యన్ భాషలోకి అనువదించిన భగవద్గీత ప్రతిని బహూకరించారు. భగవద్గీత బోధనలు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీ గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

భారత్–రష్యా బంధం ఎవరికీ వ్యతిరేకం కాదు

- ఇరు దేశాల ప్రయోజనాలే మాకు ముఖ్యం
- మోదీ బలమైన నాయకుడు.. ఒత్తిళ్లకు లొంగబోరు
- ముడి చమురు కొనే హక్కు భారత్‌కు ఉండకూడదా?
- ఇండియా టుడే ఇంటర్వ్యూలో పుతిన్

న్యూఢిల్లీ: భారత్, రష్యా దేశాల మధ్య సంబంధ బాంధవ్యాలు ఏ ఒక్క దేశానికీ వ్యతిరేకం కాదని రష్యా అధ్యక్షుడు పుతిన్ తేల్చిచెప్పారు. జాతీయ ప్రయోజనాల కోసమే ఇరుదేశాలు కలిసికట్టుగా పని చేస్తున్నాయని, పరస్పరం సహకరించుకుంటున్నాయని వెల్లడించారు. తమ ప్రయోజనాల పరిరక్షణే రెండు దేశాల ధ్యేయమని ఉద్ఘాటించారు. భారత ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం 50 సుంకాలు విధించడాన్ని ట్రంప్ పరోక్షంగా తప్పుపట్టారు. భారత్–రష్యా స్నేహాన్ని, అంతర్జాతీయ మార్కెట్లలో భారత్ ప్రాబల్యం పెరుగుతుండడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. రాజకీయ కారణాలతోనే భారత్‌కు అడ్డుకట్ట వేయాలన్న లక్ష్యంతో కృత్రిమ అవరోధాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. భారత పర్యటన నేపథ్యంలో పుతిన్ 'ఇండియా టుడే' వార్తా చానల్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించినప్పటికీ భారత్‌తో తమ ఇంధన బంధం ఎలాంటి ప్రభావానికి లోను కాలేదని స్పష్టంచేశారు. ఎవరు ఎన్ని రకాలుగా ఒత్తిళ్లు పెంచినా తాను గానీ, మోదీ గానీ ఇతర దేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించబోమని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సొంత ఎజెండా, సొంత లక్ష్యాలు ఉన్నాయని చెప్పారు. తమకు మాత్రం సొంత ప్రయోజనాలే ముఖ్యమని ఉద్ఘాటించారు. భారత ప్రధాని మోదీ బలమైన నాయకుడు అంటూ పుతిన్ ప్రశంసల వర్షం కురిపించారు. ఒత్తిళ్లకు మోదీ సులువుగా లొంగబోరని చెప్పారు. మోదీ ప్రధానమంత్రిగా ఉన్నందుకు భారతీయులు గర్వించాలని పేర్కొన్నారు. ఉక్రెయిన్–రష్యా ఘర్షణపైనా పుతిన్ స్పందించారు. ఈ సంక్షోభానికి అమెరికా ప్రభుత్వం ఒక శాంతియుత పరిష్కార మార్గాన్ని సూచిస్తుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు.

చట్టబద్ధమైన హక్కులు కాపాడుకుంటాం..

రష్యా నుంచి భారత్ ముడి చమురు కొంటున్నందుకు అమెరికా అభ్యంతరం వ్యక్తం చేయడాన్ని పుతిన్ ఖండించారు. రష్యా నుంచి చమురు కొనే హక్కు అమెరికాకు ఉన్నప్పుడు అదే హక్కు భారత్‌కు ఉండకూడదా? అని ప్రశ్నించారు. అమెరికా తమ దేశం నుంచి అణు ఇంధనం కొంటూనే ఉందని గుర్తుచేశారు. దాంతో అమెరికా అణు విద్యుత్ ప్లాంట్లతో ఉత్పత్తి జరుగుతోందని అన్నారు. పశ్చిమ దేశాల ఆంక్షల ప్రభావంతో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఇండియా కొంత తగ్గించుకున్నట్లు చెప్పారు. ఇది స్వల్పంగానే ఉందని పేర్కొన్నారు. భారత్‌లో చమురు, పెట్రోలియం ఉత్పత్తుల వాణిజ్యం సజావుగానే సాగుతోందని, ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టంచేశారు.

మోదీ ప్రభుత్వంలో అభద్రతాభావం

విదేశీ అతిథులు ప్రతిపక్ష నేతను కలిస్తే భయమెందుకు:రాహుల్

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వంలో అభద్రతాభావం పెరిగిపోయిందని, అందుకే విదేశాల అధినేతలు, ప్రముఖులు మన దేశానికి వచ్చినప్పుడు ప్రతిపక్ష నాయకుడితో మాట్లాడొద్దంటూ వేడుకుంటోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. విదేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో ప్రతిపక్ష నాయకుడిని కలవడం ఒక సంప్రదాయమని గుర్తుచేశారు. ప్రధాని మోదీ గానీ, విదేశాంగ శాఖ గానీ ఈ సంప్రదాయాన్ని పాటించడం లేదని విమర్శించారు. రాహుల్ గాంధీ గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. అటల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలో విదేశీ అతిథులు ప్రతిపక్ష నాయకుడిని కలిసి మాట్లాడే సంప్రదాయం చక్కగా కొనసాగిందని గుర్తుచేశారు. మోదీ అధికారంలోకి వచ్చిన పరిస్థితి మారిపోయిందని ఆక్షేపించారు.

ఐరాస ఓటింగ్ నుంచి తప్పకున్న భారత్

రష్యాకు అనుకూలంగా గైర్హాజరైన ఇండియా

ఐక్యరాజ్య సమితి: రష్యా విషయంలో భారత్ తన మిత్రధర్మాన్ని మరోసారి పాటించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలయ్యాక ఆక్రమించిన అక్కడి భూభాగాల్లోని చిన్నారులను బలవంతంగా రష్యాకు తరలించారన్న పశ్చిమదేశాల ఆరోపణలపై భారత్ మిన్నకుండిపోయింది. చిన్నారులను స్వదేశానికి రప్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఐక్యరాజ్యసమితిలో ప్రవేశపెట్టిన ఒక తీర్మానంపై ఓటింగ్ చేపట్టగా, అందులో పాల్గొనకుండా భారత్ దూరంగా ఉండిపోయింది. 193 సభ్యదేశాలున్న ఐరాస సర్వ ప్రతినిధి సభలో ఈ మేరకు చేపట్టిన ఓటింగ్‌కు అనుకూలంగా 93 ఓట్లు, వ్యతిరేకంగా 12 ఓట్ల పడ్డాయి.

ప్రైవసీ సెట్టింగ్స్ 'పబ్లిక్' చేయాల్సిందే

హెచ్–1బీ, హెచ్–4 వీసా దరఖాస్తుదారులకు అమెరికా ప్రభుత్వం ఆదేశం

న్యూయార్క్: అమెరికాలో తాత్కాలికంగా ఉద్యోగాలు చేసుకోవడానికి వీలు కల్పించే హెచ్–1బీ వీసాల కోసం, వారి జీవిత భాగస్వాములు హెచ్–4 వీసాల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే సోషల్ మీడియా ఖాతాలను గోప్యంగా ఉంచడానికి ఇకపై వీల్లేదు. ప్రొఫైల్ సెట్టింగ్స్‌ను పబ్లిక్ చేయాల్సి ఉంటుంది. అంటే అందరూ చూసేవిధంగా మార్పులు చేయాలి. ఈ మేరకు అమెరికా స్టేట్ డిపార్టుమెంట్ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అన్ని రకాల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను సెట్టింగ్స్‌ను 'పబ్లిక్'గా మార్చాలని పేర్కొంది. ఈ నెల 15 నుంచి ఈ నిబంధనను తప్పనిసరి చేస్తున్నట్లు వెల్లడించింది.

ఎక్సైజ్ బిల్లుకు ఆమోదం

- గురువారం రాజ్యసభలో మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదముద్ర
- పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై అత్యధిక సుంకం విధించనున్న కేంద్రం

సభలో మాట్లాడుతున్న మంత్రి నిర్మల

న్యూఢిల్లీ: పొగాకు, పొగాకు సంబంధ ఉత్పత్తులపై అత్యధిక సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన కేంద్ర ఎక్సైజ్ (సవరణ), బిల్లు–2025కు గురువారం పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టగా మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక కోవిడ్ కాలంలో రాష్ట్రాలు కోల్పోయిన రెవెన్యూ ఆదాయాన్ని భర్తీచేసేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ పరిహార సెస్ ముగిసిపోయాక ఈ కొత్త అత్యధిక ఎక్సైజ్ సుంకాలను విధిస్తారు. అధిక ఎక్సైజ్ సుంకం కారణంగానైనా రైతులు పొగాకు సాగును వదిలేసి ఇతర పంటల వైపు మళ్లుతారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి రాజ్యసభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానంగా నిర్మల మాట్లాడారు. ''పొగాకు సాగును రైతులు భారీగా తగ్గించుకుని ఇతర పంటల వైపు దృష్టిసారించడమే ప్రభుత్వ లక్ష్యం. ఆంధ్రప్రదేశ్, బిహార్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రైతులు ఇప్పటికే అదే బాటలో నడిచారు. దాదాపు లక్ష ఎకరాలకుపైగా సాగు భూమిలో పొగాకు సాగును వదిలేసి ఇతర పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. జీఎస్టీ పరిహార సెస్ ముగిసేదాకా పొగాకు ఉత్పత్తులను అయోగ్య ఉత్పత్తుల కేటగిరీలో 40 శాతం పన్నులే వసూలుచేస్తాం'' అని ఆమె అన్నారు. బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టరూపం దాల్చాక కేంద్ర ప్రభుత్వం సిగరెట్లు, నమిలే పొగాకు, చుట్టలు, హుక్కా, గుట్కా, ఖైనీ, జర్దా తదితర పొగాకు ఉత్పత్తులపై అధిక ఎక్సయిజ్ డ్యూటీ విధించనుంది. ముడి పొగాకుపై 60 నుంచి 70 శాతం ఎక్సైజ్ డ్యూటీ విధిస్తారు. చుట్టలు, సిగరెట్లపై 25 శాతం లేదా ప్రతి 1,000 సిగరెట్లు/చుట్టలపై గరిష్ఠంగా రూ.5,000 ఎక్సైజ్ డ్యూటీ వసూలుచేస్తారు. ఆయా సిగరెట్లు, చుట్టలకు ఫిల్టర్, నాణ్యత, పొడవు ఆధారంగా ప్రతి 1,000 చుట్టలు/సిగరెట్లపై కనిష్ఠంగా రూ.2,700, గరిష్ఠంగా రూ.11,000 ఎక్సయిజ్ సుంకం విధిస్తారు. నమిలే పొగాకుపై కేజీకి రూ.100 వసూలుచేస్తారు.

నిత్యావసర వస్తువులపై ఆరోగ్య, జాతీయభద్రతా సెస్ ఉండదు

నిత్యావసర వస్తువులపై కొత్తగా ప్రతిపాదించిన ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్‌ను విధించబోమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. పాన్ మసాలా వంటి అయోగ్య(డీమెరిట్) వస్తువులపై మాత్రమే కొత్త సెస్‌ను వసూలుచేస్తామని ఆమె పేర్కొన్నారు. ఇలా వచ్చిన రెవెన్యూను రాష్ట్రాల్లో ఆరోగ్య పథకాల కోసం ఖర్చుచేసేందుకు రాష్ట్రాలతో పంచుకుంటామని ఆమె చెప్పారు. గురువారం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్మల ఈ విషయాన్ని వెల్లడించారు.

అవగాహన కంటే ఆదాయంమీదే దృష్టిపెట్టారు

పొగాకు ఉత్పత్తుల అతి వినియోగాన్ని తగ్గించేందుకు, జనాల్లో దురలవాట్లపై దుష్ప్రభావాలపై అవగాహన పెంచడంపై దృష్టిపెట్టకుండా ప్రభుత్వం అధిక ఆదాయంపై దృష్టిసారించిందని విపక్ష పార్టీల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లు ఆమోదం పొందడానికి ముందు బిల్లుపై జరిగిన చర్చలో పలువురు ఎంపీలు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు.

నిరసన తెలుపుతున్న సోనియా, ఖర్గే తదితరులు

కాలుష్యంపై విపక్షాల నిరసన

నల్ల మాస్కులు ధరించి ఆందోళనకు దిగిన సోనియా, ఖర్గే, ప్రియాంక

సాక్షి, న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీ కాలుష్య రాజధానిగా పరవుమాసినా మోదీ ప్రభుత్వంలో ఇంచు కూడా చలనం లేదంటూ విపక్ష పార్టీలు పార్లమెంట్ వేదికగా ఆందోళనకు దిగారు. గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో ప్రభుత్వ వ్యతిరేక ప్లకార్డులు చేతబూని, నల్ల మాస్కులు ధరించిన విపక్ష పార్టీల సభ్యులు మకరద్వారం వద్ద నినాదాలతో హోరెత్తించారు. కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే సహ పలు విపక్ష పార్టీల ఎంపీలు ఆక్సిజన్ మాస్కులు ధరించి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. నిరసనలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకాగాంధీ వాద్రా తదితరులు పాల్గొన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా తొలిరోజు పార్లమెంట్ ప్రాంగణంలో ప్రసంగిస్తూ ప్రధాని మోదీ చేసిన '' శీతాకాల సుందర ప్రకృతిని ఆస్వాదించండి' వాక్యాలను పెద్ద బ్యానర్‌పై రాసి ఎంపీలంతా ప్రదర్శించారు. ''ఓవైపు పిల్లలు కాలుష్య వాయువు కారణంగా చనిపోతుంటే ఇకనైనా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించాలి. నాలాంటి వృద్ధులు సైతం ఎంతో బాధపడుతున్నారు'' అని సోనియాగాంధీ ఆవేదన వ్యక్తంచేశారు. '' ఢిల్లీవాసులంతా ఎందుకింతగా కష్టపడాలి? అని మోదీని ప్రశ్నిస్తే ఆయనేమో శీతాకాలం ఎంత బాగుందోకదా అని మాట్లాడుతున్నారు. వాయుకాలుష్యంపై బీజేపీ నిర్లక్ష్య వైఖరిపై పార్లమెంట్ వేదికగా నిలదీస్తాం'' అని ఖర్గే అన్నారు. '' రాజకీయంగానీ ఈ వాయుకాలుష్యం సమస్యపై తక్షణం నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకోవాలి. ఈ అంశం పార్లమెంట్‌లో చర్చకు రావాలి. చర్యల విషయంలో మేం ప్రభుత్వానికి మద్దతిస్తాం'' అని ప్రియాంకాగాంధీ అన్నారు.

ఏడాదిలోగా ఎలక్ట్రానిక్ టోల్

లోక్‌సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో రహదారులపై అత్యాధునిక ఎలక్ట్రానిక్ టోల్ వసూలు వ్యవస్థ అందుబాటులోకి రాబోతోందని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ప్రస్తుతం అమల్లోకి ఉన్న వ్యవస్థ ఏడాదిలోగా ముగిసిపోనుందని తెలిపారు. మల్టీ–లేన్ ఫ్రీ ఫ్లో ఎలక్ట్రానిక్ వ్యవస్థతో టోల్ ప్లాజాల వద్ద వాహనదారులు ఆగకుండా ముందుకు దూసుకెళ్లొచ్చని వెల్లడించారు. ఇందులో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ టెక్నాలజీ, కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత పరిజ్ఞానం ఉంటాయని వివరించారు. ఆయన గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. నూతన టోల్ వసూలు వ్యవస్థ ఇప్పటికే పది చోట్ల అమల్లో ఉందని, ఏడాదిలోగా దేశమంతటా విస్తరింపజేయబోతున్నట్లు ప్రకటించారు. ఎలక్ట్రానిక్ సిస్టమ్ రాకతో టోల్ ఫీజుల కోసం ఎవరూ ఆపబోరని, రోడ్లపై ఎక్కడా ఆగాల్సిన అవసరం ఉండదని అన్నారు. టోల్ గేట్ల వద్ద వాహనాల రద్దీని, రుసుముల చెల్లింపుల్లో ఆలస్యాన్ని నివారించడమే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. రూ.10 లక్షల కోట్ల విలువైన 4,500 రహదారుల ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని నితిన్ గడ్కరీ వివరించారు.

హైడ్రోజన్ కారు వాడుతున్నా

దేశంలో వాయు కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ప్రత్యామ్నాయ ఇంధనాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. కాలుష్య నివారణలో భాగంగా హైడ్రోజన్ ఇంధనంతో నడిచే టయోటా 'మిరాయ్' వాహనాన్ని తాను ఉపయోగిస్తున్నానని తెలిపారు. ఆయన గురువారం లోక్‌సభలో మాట్లాడారు. ఇది మెర్సిడెజ్ బెంజ్ కారు తరహాలోనే అంతే సౌలభ్యాన్ని ఇస్తోందని అన్నారు. మిరాయ్ అంటే జపాన్ భాషలో భవిష్యత్తు అని వెల్లడించారు. భవిష్యత్తు ఇంధనం హైడ్రోజన్ కాబోతోందని స్పష్టంచేశారు. శిలాజ ఇంధనాల దిగుమతి విలువ రూ.22 లక్షల కోట్లకు చేరిందని గడ్కరీ చెప్పారు. ఇలాంటి ఇంధనాలతో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని, ఎన్నో దుష్పరిణామాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టక తప్పదని వివరించారు. ఆధునిక ఇంధనాల ఎగుమతి విషయంలో భారత్ అగ్రస్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జీవ ఇంధనాలను ఉపయోగించేవారికి ప్రోత్సాహకాలు ఇవ్వబోతున్నట్లు గడ్కరీ ప్రకటించారు.

కొనసాగిన రద్దు పర్వం

గురువారం 550కుపైగా ఇండిగో విమానాల రద్దు

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ పౌర విమానయాన సంస్థ అయిన ఇండిగోలో విమానాల రద్దు పరంపర గురువారం సైతం కొనసాగింది. బుధవారం 200 విమానాలు రద్దుకాగా గురువారం ఒక్కరోజే మరో 550కుపైగా ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. సాంకేతిక సమస్యలు, అననుకూల వాతావరణ పరిస్థితులు, ప్రయాణికుల రద్దీ, విమాన విధుల సమయ కాలపరిమితి(ఎఫ్‌డీఐఎల్) నిబంధనల అమలు వంటి సమస్యల ధాటికి ఇండిగో విమాన సర్వీసులను కంపెనీ రద్దుచేయక తప్పలేదు. సిబ్బంది కొరత, మెరుగైన జీతభత్యాల కోసం కొందరు పైలట్లు ముందస్తు సమాచారం ఇవ్వకుండా సెలవులు పెట్టి వేరే చోట్ల ఇంటర్వ్యూలకు హాజరవడం వంటి మరెన్నో కారణాలు జతకలిసి ఇండిగో విమానసర్వీసులను మరింత ఆలస్యంచేస్తున్నాయి. దీంతో గురువారం దేశంలోని చాలా విమానాశ్రయాల్లో ఇండిగో విమానాలు ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. సమయానికి రాకపోకలను సూచించే ఆన్‌టైమ్ పంక్చువాలిటీ(ఓటీపీ) విషయంలో ఇండిగో డిసెంబర్ మూడో తేదీన కేవలం 19.7 శాతాన్ని మాత్రమే చేరుకోగల్గిదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే చెప్పేయొచ్చు. ఒక్క ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోనే 172 విమానాలు రద్దయ్యాయి. ముంబై ఎయిర్‌పోర్ట్‌లో 118, బెంగళూరులో 100, హైదరాబాద్‌లో 75, కోల్‌కతాలో 35, చెన్నైలో 26, గోవాలో 11 విమానాలు రద్దయ్యాయి. ఇండిగోలో తలెత్తిన సమస్యకు పైలట్ల కొరత సైతం కారణమన్న వార్తల నేపథ్యంలో ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఎల్‌పీఏ) ఘాటుగా స్పందించింది. ''నిరాటంకంగా విమానం నడిపే పైలట్ పూర్తి ఆరోగ్యంగా ఉండటం కోసం 'కొత్త ఫ్లైట్ డ్యూటీ, రెస్ట్ పీరియడ్' నిబంధనల ప్రకారం పైలట్ మరింతకాలం విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. ఒక పైలట్ విశ్రాంతి/సెలవులో ఉంటే అదనపు పైలట్లతో విమాన సర్వీసుల్ని కొనసాగించాలి. అంతమంది పైలట్లు ఇండిగోలో లేరు. ఇటీవల ఇండిగో కొత్త పైలట్లను నియమించుకోవడం ఆపేసింది. దీంతో పైలట్ల కొరత ఏర్పడి విమానాలను రద్దుచేయాల్సి వస్తోంది'' అని ఏఎల్‌పీఏ వ్యాఖ్యానించింది. ఇండిగో రోజుకు సగటున 2,300 విమానసర్వీసులను నడుపుతోంది.

ఫిబ్రవరి 10దాకా ఇంతే

సమస్య పూర్తిగా సద్దుమణగాలంటే ఫిబ్రవరి పదో తేదీదాకా ఆగక తప్పదని ఇండిగో గురువారం మరో బాంబు పేల్చింది. అంటే అప్పటిదాకా సమయానికి ఇండిగో విమాన రాకపోకలు సవ్యంగా ఉండకపోవచ్చని సంస్థ పరోక్షంగా అంగీకరించింది. ఈ మేరకు ఇండిగో గురువారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ)కు వివరణ ఇచ్చింది. ''రోజువారీ విమానాల సంఖ్యను డిసెంబర్ 8వ తేదీ నుంచి తగ్గిస్తాం. గతంలో మాదిరి విమానసర్వీసులు యథాతథ స్థాయికి చేరుకోవడానికి ఫిబ్రవరి10దాకా వేచి ఉంచాల్సి రావొచ్చు. రానున్న రోజుల్లో రద్దయ్యే విమానాల సంఖ్య భారీగా ఉండొచ్చు'' అని ఇండిగో స్వయంగా ప్రకటించింది.

వ్యవస్థను అపహాస్యం చేయడమే

16 ఏళ్లుగా యాసిడ్ దాడి కేసు పెండింగ్‌లో ఉండటంపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: హైకోర్టుల్లో యాసిడ్ దాడి కేసుల విచారణలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ వైఖరి వ్యవస్థను అపహాస్యం చేయడమేనంటూ తప్పుబట్టింది. పెండింగ్‌లో ఉన్న యాసిడ్ దాడి కేసుల వివరాలను నాలుగు వారాల్లోగా తమ ముందుంచాలని అన్ని హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. యాసిడ్ దాడి కేసుల సత్వరణ విచారణ కోసం ప్రత్యేక కోర్టుల ఏర్పాటు విషయం కూడా తమ పరిశీలనలో ఉందని తెలిపింది. యాసిడ్ దాడుల బాధితులను దివ్యాంగుల జాబితాలో చేర్చి వారికి సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ షహీన్ మాలిక్ అనే బాధితురాలు వేసిన పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిల ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. రోహిణి కోర్టులో 2009లో బాధితురాలు షహీన్ మాలిక్ వేసిన కేసు 16 ఏళ్లుగా పెండింగ్‌లో ఉండటంపై ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. బాధితురాలు ధర్మాసనం ఎదుట స్వయంగా హాజరై తన వాదన వినిపించారు. తనపై జరిగిన యాసిడ్ దాడిపై ఇప్పటికీ విచారణ కొనసాగుతోందని తెలిపారు. 2013 వరకు కేసులో ఎలాంటి పురోగతి లేదని, ఇప్పటికి తుది దశకు చేరుకుందని ఆమె వివరించారు.'దేశ రాజధాని పరిస్థితులే ఇలాగుంటే బాధితుల గోడు పట్టించుకునేదెవరు..? ఈ పరిస్థితి మన వ్యవస్థకు, జాతికే సిగ్గుచేటు' అని తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఈ కేసును సుమోటో తీసుకుంటున్నామని, విచారణ ఇకపై రోజువారీగా జరపాలని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేశారు. అదే సమయంలో, యాసిడ్‌ను బలవంతంగా శరీరంలోకి ఇంజెక్షన్ చేసిన, తాపించిన ఘటనలు కూడా ఉన్నాయని బాధితురాలు షహీన్ మాలిక్ తెలిపారు. యాసిడ్ శరీరంలోకి వెళ్లిన బాధితులకు కృత్రిమ ఆహారాన్ని ట్యూబుల ద్వారా అందించేంతటి తీవ్ర పరిస్థితులున్నాయని, కొందరు అంగవికలుర య్యారని కూడా ఆమె పేర్కొన్నారు. ఇది విని సీజేఐ సూర్యకాంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటివి కూడా జరిగినట్లు ఇప్పటి వరకు తమకు తెలియదన్నారు. అత్యంత ఘోరమైన, బాధితులపై తీవ్ర ప్రభావం చూపే ఇలాంటి దారుణాలపై ప్రత్యేక కోర్టుల్లో విచారణ జరపాల్సిన అవసరముందని పేర్కొన్నారు. 'ఇది వ్యవస్థను అపహాస్యం చేయడమే. ఇందుకు బాధ్యులైన వారిపై దయాదాక్షిణ్యాలు చూపించాల్సిన పనిలేదు. వారికి తగిన విధంగా శాస్తి చేయాల్సిందే'అని ఆయన వ్యాఖ్యానించారు. వివిధ హైకోర్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను నాలుగు వారాల్లోగా అందజేయాలని సంబంధిత రిజిస్ట్రార్ జనరల్స్‌ను ఈ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. అదేవిధంగా, యాసిడ్ దాడుల బాధితులు సంక్షేమ పథకాలు పొందేందుకు వీలుగా ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్ చట్టం కింద వికలాంగుల నిర్వచనంలో చేర్చే విషయమై అభిప్రాయం తెలపాల్సిందిగా కేంద్రంతోపాటు డిపార్టుమెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. అదే సమయంలో, రోహిణి కోర్టులో ఇన్నేళ్లపాటు ఈ కేసు పెండింగ్‌లో ఉండటానికి దారి తీసిన కారణాలపై వచ్చే వారం విచారణ చేపడతామని కూడా ధర్మాసనం ప్రకటించింది.

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 42.1600 టీఎంసీలు.

జిల్లా కలెక్టర్‌కు ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: జనవరిలో జరిగే ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనాలని గుంటూరు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాను డాక్టర్ గజల్ శ్రీనివాస్ కోరారు.

స్వామి సేవలో బాపట్ల కలెక్టర్



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి వార్లను గురువారం బాపట్ల జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్, సతీసమేతంగా సందర్శించారు.

మీ కోసం.. మోసమే రైతన్నా!

చంద్రబాబు సర్కారు దగాపై అన్నదాతల్లో తీవ్ర వ్యతిరేకత

అసలు విషయం పక్కన పెట్టి ఆర్భాటాలు చేయడం చంద్రబాబు సర్కారుకు వెన్నతో పెట్టిన విద్యే. ఇదే అంశం మరోమారు రైతుల విషయంలో రుజువైంది. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా.. ఆర్భాటంగా కార్యక్రమం అంటూ ఊదరగొట్టింది. రైతన్నా.. మీ కోసం అటూ మోసం చేసింది. చంద్రబాబు సర్కారుపై అన్నదాతల్లో ఉన్న వ్యతిరేకతకు భయపడి మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఈ కార్యక్రమానికి సాధ్యమైనంత దూరంగా ఉన్నారు.

- ఆర్భాటాలకే పరిమితమైన 'రైతన్నా.. మీ కోసం'
- మొక్కుబడి కార్యక్రమంతో భజనకే పరిమితం
- తమను ఆదుకునేందుకు ఏం చేశారని రైతుల ఆగ్రహం
- వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసిన చంద్రబాబు పాలన

'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమంలో కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: చంద్రబాబు ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమం గుంటూరు జిల్లాలో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. జిల్లాలో అక్కడక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని మొక్కుబడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎవరి కోసం, ఎందుకు నిర్వహించారో, దాని వల్ల ప్రయోజనం ఏంటో తెలియకుండానే అయిపోయింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతి రైతును కలవడం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం నాయకులు, కార్యకర్తలు కరపత్రాలు చేతిలో పట్టుకుని హడావుడి చేసి గ్రూపు ఫొటోలు దిగి మీడియాకు పంపడానికి పరిమితం అయ్యింది. కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులు, మంత్రులు పాల్గొన్నప్పటికీ వారు కూడా ఉపన్యాసాలకే పరిమితం అయ్యారు. మంగళగిరిలో మంత్రి నారా లోకేష్ పాల్గొనలేదు. జిల్లాలోని తాడికొండ,తెనాలి, ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కూడా ఒకే ఒక్కసారి పాల్గొన్నారు. రైతులతో ప్రత్యేక యాప్ కూడా అక్కడక్కడ ఇన్‌స్టాల్ చేయించారు. అధికారులు, రైతులు నామమాత్రంగా పాల్గొన్నారు.

హామీల అమలెక్కడ?

ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో రైతులు నిలదీస్తారనే భయంతో పార్టీ బలంగా ఉన్న ప్రాంతాలకే ఈ కార్యక్రమం పరిమితం అయ్యింది. అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ సాయం అందకపోవడం, ఉచిత పంటల బీమాకు ఎసరు, వర్షాలకు దెబ్బతిన్న పంటలకు కనీస పరిహారం అందకపోవడంపై రైతులను మాట్లాడనీయకుండా జాగ్రత్త పడ్డారు. వ్యవసాయం దండగ అనే ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో మరో మారు రైతులకు అన్యాయం జరిగింది. అన్నదాత సుఖీభవ కింద సాయం అందని దాదాపు 20 వేల మంది రైతులు తీవ్ర వేదన చెందుతున్నారు.

పేరుకే ఘనం

రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకంటూ చంద్రబాబు ప్రభుత్వం చేసిన హడావుడికి జిల్లాలో రైతుల నుంచి స్పందన కరువైంది. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు ధర అంశాల గురించి ప్రతి రైతు ఇంటికి వెళ్లి తెలియజేయాలన్నది కార్యక్రమం లక్ష్యం. సాగులో యాంత్రీకరణ లాభం, పంట మార్పిడి, ఎరువులు అధిక వినియోగంతో అనర్థాలు, సూచనలు, సలహాలను అందజేయాల్సి ఉంది. రైతుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నది కార్యక్రమ ఉద్దేశం. అయినప్పటికీ ఎక్కడా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. నిరసనల భయంతో ప్రజాప్రతినిధులు ఒక్క కార్యక్రమంలో పాల్గొని మమ అనిపించారు.

అన్నిటికీ కోతే

చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు సేవలను నిర్వీర్యం చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలకు కోతలు పెడుతూ వస్తోంది. రైతు భరోసా కేంద్రాలను అలంకార ప్రాయం చేసింది. కియోస్క్ మిషన్లను మూలన పడేసింది. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందజేయడంలో ముఖం చాటేసింది. పంటల బీమాకు ఎసరు పెట్టింది. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని పరిహాసం చేసింది. మళ్లీ పంటలు వేయాలంటే భయపడేలా చేసింది. ఇలా కూటమి ప్రభుత్వంలో రైతన్నకు చేసిన దగా చెప్పుకుంటూ పోతే చాంతాడులా ఉంది.

నాడు పండుగలా సాగు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఇంటి ముంగిటకే అన్ని సేవలు అందాయి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఐదు సంవత్సరాలు వెన్నుదన్నుగా నిలిచారు. ఏ కష్టం రాకుండా అన్ని విధాలుగా అండగా నిలిచారు. ప్రకృతి వైపరీత్యాల వేళ తగినంత సాయం అందించారు. రైతు సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి అన్నదాతకు ఆర్థిక భరోసా ఇచ్చారు. నాడు వ్యవసాయం రైతుకు పండుగలా ఉండేది. నేడు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమ్మో.. వ్యవసాయమా అనేలా చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు ముంగిటకే సేవలను తీసుకొచ్చింది. రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయం అన్నదాతల ఖాతాల్లో నేరుగా సీజన్‌కు ఉపయోగపడేలా జమ చేశారు. ఎరువులు, విత్తనాలు తగినన్ని నిత్యం అందుబాటులో ఉండేవి. పంట దిగుబడి వచ్చాక ఏ మాత్రం కష్టపడకుండా రైతులు మద్దతు ధరకే విక్రయించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దళారులు, వ్యాపారులు కూడా మోసం చేయకుండా చూశారు.

నష్టాల్లో ఉన్నా ఆదుకునే దిక్కేది?

రైతుల కోసం చంద్రబాబు ప్రభుత్వం ఉందనే మాట అవాస్తవం. ఈ ఖరీఫ్ సీజన్లో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇటీవల తుపాను ప్రభావంతో పంట నీట మునిగి రైతులు నష్టపోయారు. మండలంలో వేల ఎకరాల వరి పంట నష్టానికి గురైతే, పొన్నూరులో పంట నష్టమే లేదని ప్రభుత్వం తేల్చి పరిహారం ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేసింది. ప్రస్తుతం ఎకరానికి 30 ధాన్యం బస్తాలు కూడా రాని పరిస్థితి. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి లేక, మద్దతు ధర అందక నష్టానికి ధాన్యం విక్రయించి నష్టపోతున్నారు. రైతన్న మీకోసం కార్యక్రమం ప్రకటనలకే పరిమితమైంది. అధికారులు, పాలకులు రైతుల వద్దకు వెళ్లే పరిస్థితి లేదు. మొక్కుబడి కార్యక్రమాల ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు.

– చింతలపూడి మురళీకృష్ణ,
వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పొన్నూరు

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు

అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీదత్తాత్రేయుడు, దత్తాత్రేయ పాదాల వద్ద దత్త జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని మేడి వృక్షం వద్ద అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత దత్తాత్రేయుని విగ్రహానికి, అలాగే దత్తాత్రేయుని పాదాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి విశేష అలంకారం చేశారు. భక్తులందరికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తొమ్మిది స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు తొమ్మిది నమోదయ్యాయి. జిల్లాలోని మేడికొండూరు మండలం వరగాని చెందిన మహిళ (41), గుంటూరు ఏటీ అగ్రహారంనకు చెందిన మహిళ (55), పెదనందిపాడు మండలం కొప్పర్రుకు చెందిన మహిళ (69), గుంటూరు రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన యువకుడు (28), గుంటూరు శ్యామలానగర్‌కు చెందిన మహిళ (33), గుంటూరు దాసరిపాలెంకు చెందిన వృద్ధురాలు (73), పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడికి చెందిన మహిళ (54), ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన మహిళ (36), కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండకు చెందిన మహిళ (52) స్క్రబ్ టైఫస్ లక్షణాలతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. గుంటూరు జిల్లాలో ఇప్పటికే 31 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. నూతనంగా వచ్చిన ఆరు కేసులతో బాధితుల సంఖ్య 37కు చేరుకుంది.

డీడీవో కార్యాలయం ప్రారంభోత్సవం

తెనాలి అర్బన్: తెనాలి నాజర్‌పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని గురువారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబస్, ఎంపీడీవో అత్తోట దీప్తి, తహసీల్దార్ గోపాలకృష్ణ, తెనాలి డీడీవో కుసుమ శ్రీదేవి మాట్లాడారు. తెనాలి డీడీవో పరిధిలో తెనాలి, పొన్నూరు, చేబ్రోలు, కాకుమాను, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాలతో పాటు గ్రామ సచివాలయాలు ఉంటాయన్నారు.

గుంటూరులోనూ...

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీడీవో కార్యాలయాల ఏర్పాటు ద్వారా పరిపాలన సౌలభ్యం లభిస్తుందని, పరిపాలన వికేంద్రీకరణతో ఫైళ్ల త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ అదనపు కమిషనర్ నాగార్జున, జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయలక్ష్మి, డీపీవో బీవీ నాగసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు గాలికి.. వేడుకలు దేనికి?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెచ్చిన చదువుల పండుగ నేడు కళ తప్పింది. ప్రస్తుత చంద్రబాబు సర్కార్ ఆర్భాటం తప్ప.. చిన్నారులకు కనీసం గుక్కెడు నీరు కూడా ఇవ్వడం లేదు. బాలికలకు మరుగుదొడ్లు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటిని పక్కనపెట్టి నేడు మెగా పీటీఎం పేరుతో సర్కారు హడావుడి చేస్తోంది. విద్యార్థులు, తల్లిదండ్రులను దగా చేసేందుకు సిద్ధమైంది.

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాలలకు సకల వసతులు
- ఇప్పుడు పాలకుల నిర్లక్ష్యంతో మూలనపడిన ఆర్వో ప్లాంట్లు
- బాలికలకు సరిపడా మరుగుదొడ్లు లేక అవస్థలు
- మెగా పీటీఎం పేరిట చంద్రబాబు ప్రభుత్వం ఆర్భాటం

ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం హైస్కూల్లో మూలన పడిన ఆర్వో వాటర్ ప్లాంట్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు ఎడ్యుకేషన్: చదువుల విప్లవాన్ని తెచ్చిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుణ్యమాని ప్రభుత్వ పాఠశాలలకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సరికొత్త హంగులు సమకూరాయి. నాడు–నేడు మొదటి విడతలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,183 పాఠశాలలను రూ.283 కోట్ల వ్యయంతో ఆధునికీకరించారు. రెండో విడతలో ఒక్క గుంటూరు జిల్లాలోనే 562 స్కూళ్లలో రూ.204 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక నాడు–నేడు పనులు కుంటుపడ్డాయి. వైఎస్ జగన్ హయాంలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలోని 165 పాఠశాలల్లో కొత్తగా 584 తరగతి గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. నేడు ఆ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

మధ్యాహ్న భోజనంలోనూ..

పాఠశాలల్లో విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు అమలు చేసిన జగనన్న గోరుముద్ద కార్యక్రమం విద్యార్థుల సంతృప్తే లక్ష్యంగా విజయవంతంగా కొనసాగింది. గత ప్రభుత్వంలో రోజూ పాఠశాలల్లో 90 శాతానికి పైగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఆరగించారు. ప్రస్తుతం అది 65 శాతంగా ఉంది. జిల్లాలోని 1,074 పాఠశాలల్లో చదువుతున్న 96,576 మంది విద్యార్థుల్లో సగటున 62 వేల మంది మధ్యాహ్న భోజనం ఆరగిస్తున్నారు. మిగిలిన విద్యార్థులు ఇళ్ల దగ్గర నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారు.

ఉపాధ్యాయులపై ఖర్చుల భారం

గుంటూరు జిల్లాలోని 1,074 పాఠశాలలకు రూ.22.20 లక్షలను మాత్రమే ఈ కార్యక్రమం నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటికే పలు సమస్యలతో సతమతం అవుతున్న ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమం నిర్వహణ మరో భారంగా మారింది.

ఎప్పుడూ హడావుడే..

2014–19 మధ్య కాలంలో పాఠశాలల భవనాలకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించడం, నామమాత్రపు మెరుగులు దిద్దడమొక్కటే టీడీపీ పాలనలో అభివృద్ధిగా చెప్పారు. ఇప్పుడు కూడా అదే తంతు నడుస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్లు, సిస్టమ్స్ ఇప్పుడు మూలనపడ్డాయి. విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందడం లేదు. మెయింటెనెన్స్ లేకపోవడంతో విలువైన బ్యారీలు, మోటార్లు, ఫిల్టరేషన్ సామగ్రి పాడైపోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా నాడు–నేడు మొదటి దశలో 994 ఆర్వో వాటర్ సిస్టమ్స్, 155 మినరల్ వాటర్ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు.

అంతటా నిర్లక్ష్యమే

గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో 771 మంది, ప్రాథమిక పాఠశాలలో మరో 250 మంది చదువుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన రెండు ఆర్వో ప్లాంట్లు నేడు మూలనపడ్డాయి. విద్యార్థులు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. బాలబాలికలకు రెండే టాయిలెట్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో నిర్మించిన టాయిలెట్ సముదాయాన్ని పూర్తి చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది. పొన్నూరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి జాడే కనిపించడం లేదు. బడుల పరిసరాల్లో పిచ్చి చెట్లు పెరిగినా పట్టించుకోవడం లేదు. అదనపు తరగతి గదుల నిర్మాణాలు గతంలో దాదాపు పూర్తయ్యాయి. చివరి దశలో చంద్రబాబు సర్కారు పట్టించుకోకపోవడంతో అలాగే ఆగిపోయాయి. భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదు.

అందుబాటులోకి రాని టాయిలెట్ల బ్లాక్

N.S. LAW COLLEGE
(Affiliated to Andhra Kesari University, Ongole)
Devarajugattu (V), Peddaraveedu (Mdl), Prakasam (Dt), AP - 523 320
SPOT ADMISSIONS
A Few seats are available in 3 and 5 Years LL.B Course
Spot Admissions on : 03.12.2025.
For Admissions Contact: 86884 42544, 95025 40700
N.S. LAW College Secretary & Correspondent

ప్రారంభోత్సవం మరియు ఓపెన్ హౌస్ కార్యక్రమానికి ఆహ్వానం!
KIMS FERTILITY™ IVF CENTRE
అత్యాధునిక ఫెర్టిలిటీ & ఐవీఎఫ్ సెంటర్‌ను ఆవిష్కరించడానికి మేము సంతోషిస్తున్నాము.
దంపతుల కోసం ఉన్నత ప్రమాణాల ప్రజ్ఞాన వైద్య సేవలు మరియు హృదయపూర్వక సహాయాన్ని అందిస్తున్నాము.
శుక్రవారం 05 డిసెంబర్ 2025
ప్రారంభోత్సవ సమయం: ఉ. 10:11 ని॥లకు
ముఖ్య అతిథులు
శ్రీ హరీష్ కుమార్ గుప్తా, IPS — డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఆంధ్ర ప్రదేశ్
శ్రీ పి. వెంకట రమణ — డైరెక్టర్, డిజాస్టర్ రెస్పాన్స్ & ఫైర్ సర్వీసెస్, ఆంధ్ర ప్రదేశ్
గౌరవ అతిథులు
శ్రీమతి ఎ. తమీమ్ అన్సారియా, IAS — జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, గుంటూరు జిల్లా
శ్రీ వకుల్ జిందాల్, IPS — సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, గుంటూరు జిల్లా
శ్రీమతి డా. కె. విజయలక్ష్మి — జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి, గుంటూరు జిల్లా
కిమ్స్ ఫెర్టిలిటీని ఎందుకు ఎంచుకోవాలి?
• ఐ.వి.ఎఫ్, ఐ. సి.ఎస్.ఐ. మరియు ఐ.యు.ఐ. చికిత్సలలో సంతానోత్పత్తి విజయాల శాతం అధికంగా ఉండడం వలన,
• అత్యాధునిక ప్రయోగశాల మౌలిక సదుపాయాలు ఉండడం వలన,
• స్త్రీ, పురుష సంతానోత్పత్తి సమగ్ర నిర్ధారణ వలన
• బహుళ విభాగాల సమన్వయంతో నిర్వహణ ఉండడం వలన,
• అన్ని భాషల రోగులకు అర్థమయ్యే రీతిలో స్పష్టమైన వివరాలు అందించడం వలన,
• సంప్రదింపుల నుండి గర్భధారణ వరకు మరియు ఆపైన మీకు తోడుగా అండగా ఉండడం వలన.
మా వైద్య సదుపాయాలు
మేము ప్రతి జంటకు అనుకూలంగా రూపొందించిన పూర్తి స్థాయి ఫెర్టిలిటీ & రీప్రొడక్టివ్ సేవలను అందిస్తాము:
• ఓవులేషన్ ఇండక్షన్ విత్ టైమ్డ్ ఇంటరాక్షన్ (OITI)
• ఇంట్రాయుటరైన్ ఇన్సెమినేషన్ (IUI)
• ఇన్-విట్రో ఫెర్టిలైజేషన్ (IVF)
• ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (ICSI)
• పిజిటి-ఎ, పిజిటి-ఎమ్, పీజీటీ-ఎస్ఆర్
• హిస్టెరోస్కోపీ
• లాపరోస్కోపీ
• సెమెన్ ఎనాలిసిస్
చిరునామా: యదవల్లివారి వీధి, కొత్తపేట, గుంటూరు
అపాయింట్‌మెంట్: +91 7009 87 7009 టోల్ ఫ్రీ: 1800 202 7009 www.kimsfertility.com
ఈ వేడుకలో భాగమవ్వండి. తల్లిదండ్రుల కావాలనే ఆశలకు కొత్త ఆరంభం ఇవ్వండి!

క్లుప్తంగా...

అమరావతి నిర్మాణానికి రూ.7,380 కోట్ల అప్పు

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

సాక్షి, అమరావతి: అమరావతి నిర్మాణానికి నాబార్డ్ ద్వారా రూ.7,380.70 కోట్లు రుణం పొందడానికి అనుమతి లభించిందని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సీఆర్డీఏ 55వ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి నారాయణ మీడియాకు వివరించారు. రూ.532 కోట్లతో సీడ్ యాక్సిస్ రోడ్డును నేషనల్ హైవే–16తో అనుసంధానం చేసే టెండర్ ప్యాకేజీకి అప్రూవల్ ఫర్ అవార్డు జారీకి అథారిటీ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. లోక్ భవన్ (గవర్నర్ బంగ్లా), ఇతర భవన సముదాయాలతో పాటు జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణాలకు త్వరలో టెండర్లు పిలవనున్నట్టు చెప్పారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే ట్రాక్ తదితర నిర్మాణాలకు ల్యాండ్ పూలింగ్ ద్వారా 16,666 ఎకరాలు సేకరించనున్నట్టు తెలిపారు. గతంలో మాదిరి ఇప్పుడు కూడా రైతులకు 10 ఏళ్ల ప్యాకేజీ ఇస్తామన్నారు .

ఉపరాష్ట్రపతిని కలిసిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి, ఎస్.నిరంజన్‌రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్ ఉపరాష్ట్రపతిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.

కృష్ణా బోర్డు చైర్మన్‌గా బిశ్వాస్

సాక్షి, అమరావతి: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) చైర్మన్‌గా ఎస్. బిశ్వాస్‌ను కేంద్రం నియమించింది. ఇప్పటివరకు బోర్డు చైర్మన్‌గా పనిచేసిన అతుల్ జైన్ నవంబరు 30న పదవీ విరమణ చేశారు. దీంతో బోర్డు చైర్మన్‌గా ఎస్. బిశ్వాస్‌ను నియమిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ అండర్ సెక్రటరీ జితేంద్రకుమార్ ఉత్తర్వులు జారీచేశారు. కృష్ణా బోర్డు సమావేశాన్ని జనవరి మొదటి వారంలో నిర్వహిస్తామని.. సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై నెలాఖరులోగా అజెండాను పంపాలని కోరుతూ రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు బిశ్వాస్ గురువారం లేఖ రాశారు.

జనవరి నంచి స్లీపర్ కోచ్‌లలో బెడ్ రోల్స్

సాక్షి, అమరావతి: జనవరి 1 నుంచి ఏసీ కోచ్‌ల మాదిరిగా స్లీపర్ కోచ్‌లలో కూడా ప్రయాణికులకు బెడ్‌రోల్స్ అందించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందులో బెడ్ షీట్, దిండు కలిపి రూ.50కు అందిస్తుంది. విడిగా అయితే బెడ్‌షీట్ రూ.30, దిండు రూ.20గా నిర్ణయించింది. ఈ వెసులుబాటు మొదటి దశలో చెన్నై, హైదరాబాద్, బెంగళూరు తదితర దూర ప్రాంతాలకు ప్రయాణించే 10రైళ్లలో అమలులోకి తెస్తారు. తర్వాత దశల వారీగా అన్ని రైళ్లలో అందుబాటులోకి తెస్తారు.

ఈ-సిగరెట్లు, విదేశీ వన్యప్రాణుల స్మగ్లింగ్

దొడ్డబళ్లాపురం: బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో విదేశాల నుంచి అక్రమంగా తరలిస్తున్న ఈ–సిగరెట్లు, వన్యప్రాణులను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆగ్నేయాసియా దేశాల నుంచి వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేయగా.. పాములు, తొండలు, తేళ్లు, సాలీళ్లు వంటి కీటకాలు, కపుచినో కోతి తదితరాలు కనిపించడంతో హడలిపోయారు. వాటిని స్వాధీనం చేసుకుని ప్రయాణికులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

బీమా పథకం ఆర్‌ఎఫ్‌కు సవరణలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీమా పథకం అమలు కోసం రూపొందించిన టెండర్లకు సంబంధించిన రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్‌ఎఫ్)కు చంద్రబాబు ప్రభుత్వం పలు సవరణలు చేసింది. ఈ మేరకు వైద్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా విధానంలో ప్రైవేట్ ఇన్స్యూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాది పాటు కాంట్రాక్టు ఇచ్చి.. అనంతరం ఒక్కో ఏడాది చొప్పున మూడేళ్ల పాటు కాంట్రాక్టు పొడిగింపునకు అవకాశం కల్పించింది. కాగా, గతంలో వైఎస్ జగన్ హయాంలో రూ.25 లక్షల వరకు వైద్య సేవలతో దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీని బలోపేతం చేశారు. అంతేకాకుండా ప్రొసీజర్ల సంఖ్యను 3,257కు పెంచారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.2.5 లక్షల కవరేజ్‌తో మాత్రమే బీమా పథకం తెస్తోంది. ప్రొసీజర్లకు భారీగా కోత పెట్టేసింది. 2,550 ప్రొసీజర్లతోనే దీనిని అమలు చేయనుంది.

ఇలా 'సెలవిచ్చారు'

2026లో సెలవుల జాబితా ఇదే

సాక్షి, అమరావతి: 2026 క్యాలెండర్ ఇయర్‌లో సాధారణ సెలవులు, ఆప్షనల్ హాలిడేల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం మొత్తం 24 సెలవు దినాలు ప్రకటించింది. ఇందులో నాలుగు సెలవులు మహాశివరాత్రి, బాబూ జగ్జీవన్‌రాం జయంతి, దుర్గాష్టమి, దీపావళిలు ఆదివారం రావడంతో నికరంగా 20 సెలవులు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగులకు లభించనున్నాయి. కానీ ఈసారి అత్యధిక సెలవులు శుక్రవారం రావడంతో మధ్యలో శనివారం లీవ్ పెట్టుకుంటే వారాంతాల్లో మూడు రోజులు ఆటవిడుపు కలగనుంది. పై అధికారికి ముందస్తు సమాచారంతో గరిష్టంగా ఐదు సెలవుదినాలను వినియోగించుకునేలా 21 ఆప్షనల్ హాలిడేలను ప్రకటించింది. ఇందులో రెండు ఈద్ ఈ గదర్, మహాలయ అమావాస్య ఆదివారంతో కలిసిపోయాయి. బ్యాంకులు వంటి ఇతర వ్యాపార సంస్థలకు నెగోషబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ 1981 ద్వారా 21 సాధారణ సెలవులను ప్రకటించింది. చంద్ర దర్శనాన్ని బట్టి నిర్ణయించే రంజాన్, బక్రీద్, మొహర్రం, ఈద్ మిలాద్ ఉన్‌నబీతో పాటు హిందూ పర్వదినాల్లో ఏమైనా మార్పులు ఉంటే వాటిని ప్రసార మాధ్యమాల ద్వారా ముందుగానే తెలియజేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

2026 క్యాలెండర్ ఇయర్‌లో సాధారణ సెలవులు

సాధారణ సెలవు	తేదీ	వారం
భోగి	14-01-26	బుధవారం
మకర సంక్రాంతి	15-01-26	గురువారం
కనుమ	16-01-26	శుక్రవారం
రిపబ్లిక్ డే	26-01-26	సోమవారం
మహాశివరాత్రి	15-02-26	ఆదివారం
హోళి	03-03-26	మంగళవారం
ఉగాది	19-03-26	గురువారం
రంజాన్	20-03-26	శుక్రవారం
శ్రీరామనవమి	27-03-26	శుక్రవారం
గుడ్‌ఫ్రైడే	03-04-26	శుక్రవారం
జగ్జీవన్‌రామ్ జయంతి	05-04-26	ఆదివారం
అంబేడ్కర్ జయంతి	14-04-26	మంగళవారం
బక్రీద్	27-05-26	బుధవారం
మొహర్రం	25-06-26	గురువారం
ఇండిపెండెన్స్ డే	15-08-26	శనివారం
వరలక్ష్మీ వ్రతం	21-08-26	శుక్రవారం
మిలాద్ ఉన్ నబి	25-08-26	మంగళవారం
శ్రీకృష్ణాష్టమి	04-09-26	శుక్రవారం
వినాయక చవితి	14-09-26	సోమవారం
గాంధీ జయంతి	02-10-26	శుక్రవారం
దుర్గాష్టమి	18-10-26	ఆదివారం
విజయ దశమి	20-10-26	మంగళవారం
దీపావళి	08-11-26	ఆదివారం
క్రిస్టమస్	25-12-26	శుక్రవారం

కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ సీటు ఫీజు రూ.29 లక్షలు

చంద్రబాబు సర్కారు నిర్ణయం

సాక్షి, అమరావతి: తాము అధికారంలోకి వస్తే కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోటాను వంద రోజుల్లో రద్దు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు.. గద్దెనెక్కిన తర్వాత విద్యార్థులకు వెన్నుపోటు పొడిచారు. ఒకవైపు 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెడుతున్నారు. మరోవైపు ఆ కాలేజీల్లోని పీజీ సీట్లను అమ్మకానికి పెట్టేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో ప్రారంభించిన 5 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలకు మంజూరైన పీజీ సీట్లకు సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఒక్కో పీజీ సీటుకు రూ.29 లక్షల వసూలుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. పీజీ కోర్సుల్లో ప్రభుత్వ కోటా సీటుకు రూ.30 వేలు, సెల్ఫ్ ఫైనాన్స్ సీటుకు రూ.9 లక్షలు, ఎన్ఆర్ఐ కోటా సీటుకు రూ.29 లక్షలుగా ఫీజులు ఖరారు చేశారు. 2025–26 విద్యా సంవత్సరానికి 5 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 4 కోర్సుల్లో 60 పీజీ సీట్లను నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) మంజూరు చేసింది. రాజమండ్రి, నంద్యాల కళాశాలల్లో 16 సీట్లు చొప్పున, విజయనగరం, మచిలీపట్నం కళాశాలల్లో 12 చొప్పున, ఏలూరు కళాశాలలో 4 పీజీ సీట్లకు అడ్మిషన్లు చేపట్టనున్నారు. కాగా, 50 శాతం సీట్లు ఆలిండియా కోటాకు పోగా, మిగిలిన 50 శాతం సీట్లను రాష్ట్ర కోటాలో యూనివర్సిటీ భర్తీ చేయనుంది. ఈ 50 శాతంలో సగం కన్వీనర్ కోటాకు, 35 శాతం సెల్ఫ్‌ఫైనాన్స్, 15 శాతం ఎన్ఆర్ఐ కోటాకు కేటాయించారు.

జలదిగ్బంధంలో నెల్లూరు

- యువకుడు గల్లంతు
- 'దిత్వా' ప్రభావంతో భారీవర్షాలు

నెల్లూరు పొదలకూరు రోడ్డులోని శివాజీనగర్‌లో ఇంట్లోకి చేరిన నీరు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/విడవలూరు: దిత్వా తుపాను అల్పపీడనంగా మారి చెన్నైలోని మహాబలిపురం వద్ద తీరం దాటినా.. దాని ప్రభావంతో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలోనూ ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి నెల్లూరు నగరం అతలాకుతలమైంది. ఆత్మకూరు బస్టాండ్, మాగుంట లేఅవుట్, రామలింగాపురం అండర్ బ్రిడ్జిల వద్ద పెద్ద ఎత్తున నీరు చేరిపోయింది. విజయమహల్ గేట్ వద్ద ఉన్న బాక్స్‌టైపు బ్రిడ్జి మునిగిపోయింది. మాగుంటలేఅవుట్ అండర్ బ్రిడ్జి వద్ద కారు నీటిలో చిక్కుకుంది. నగరంలోని తూర్పుప్రాంతాలైన బాలాజీనగర్, స్టోన్ హౌస్‌పేట, హరనాథపురం తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శివారు ప్రాంతాల్లోని కాలనీలను వరదనీరు చుట్టుముట్టింది. నెల్లూరులోని టెక్కేమిట్ట రోడ్డులోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలోకి నీరు చేరింది.

నీట మునిగిన పొలాలు..

నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లోని పొలాలు నీట మునిగాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పెన్నా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. 30 వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రాథమిక లెక్కల ప్రకారం 3011 (7527.5 ఎకరాలు) హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వరినార్లు, నాట్లు 6,970 ఎకరాల్లో, శనగ 557.5 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. 6,321 మంది రైతులు నష్టపోయారు. వరద నీరు చేరడంతో వెంకటాచలం, మనుబోలు జాతీయ రహదారిపై ట్రాఫిక్ భారీగా స్తంభించింది. నెల్లూరు అతలాకుతలమవుతున్నా.. ప్రభుత్వం స్పందించడం లేదు. సహాయక చర్యలు చేపట్టడం లేదు.

కూలిన పోలీస్ స్టేషన్ సీలింగ్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు పోలీస్‌స్టేషన్లోని సీలింగ్ గురువారం వేకువజామున ఒక్కసారిగా కూలిపోయింది. సిబ్బంది వేరే గదిలో ఉండటంతో ప్రమాదం తప్పింది. ఫర్నిచర్, సీలింగ్‌కు ఉన్న ఫ్యాన్లు, లైట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఘటనాస్థలాన్ని ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్ పరిశీలించారు. ఈ స్మార్ట్ పోలీస్‌స్టేషన్‌ను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. నిర్మాణం చేపట్టిన ఏడేళ్లకే సీలింగ్ కూలిపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

యువకుడి ప్రాణం తీసిన నీటి సరదా

నెల్లూరు సిటీ: స్నేహితులతో కలిసి సరదాగా నీటి ప్రవాహాన్ని చూసేందుకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తూ వరదలో కొట్టుకుపోయి మృతి చెందిన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని పొర్లుకట్టకు చెందిన మెహ్రాజ్ మస్తాన్ (18) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. పొట్టేపాళెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద చూడటానికి సుందరంగా ఉందని తెలుసుకుని స్నేహితులతో కలిసి వెళ్లాడు. సరదాగా గడుపుతుండగా ప్రమాదవశాత్తూ ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్నేహితులు కేకలేయడంతో స్థానికులు వచ్చి ఆరా తీశారు. అప్పటికే యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలించగా.. ఓ తూము వద్ద యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. తండ్రి మహబూబ్‌బాషా ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా యువకుడు ఫిట్స్‌కు గురవడంతో ఘటన జరిగిందని సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు మృతి

ప్రమాదానికి గురైన కారు శిథిలాలనుంచి విద్యార్థుల మృతదేహాలను వెలికి తీస్తున్న పోలీసులు

- మరొకరి పరిస్థితి విషమం
- మృతులంతా విజ్ఞాన్, చలపతి విద్యాసంస్థల బీటెక్ విద్యార్థులు
- వీరిలో నలుగురు అయ్యప్ప దీక్షదారులు
- పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

మేరుగ శ్రీకాంత్

మేరుగ రామిరెడ్డి

శివరాత్రి మహేష్‌బాబు

వంగమూరి వాసు

నాదెండ్ల/యడ్లపాడు: పల్నాడు జిల్లా చిలకలూరిపేట హైవే బైపాస్‌లో గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దేవస్థానంలో నిద్ర చేద్దామని బయల్దేరగా మార్గంమధ్యంలో ఈ ప్రమాదం జరగడంతో బీటెక్ చదువుతున్న ఐదుగురు యువకులు మృత్యువాత పడ్డారు. మరొకరు ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ముందు వెళ్తున్న ట్రాలర్‌ను కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ విద్యా సంస్థల్లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఐదుగురు, చలపతి విద్యాసంస్థలకు చెందిన మరొక విద్యార్థి కలిసి తమ స్నేహితుడి కారు తీసుకుని వినుకొండ ప్రాంతంలోని విఠలాపురం గ్రామంలోని ఓ దేవస్థానంలో నిద్ర చేసేందుకు గురువారం సాయంత్రం యూనివర్సిటీ నుంచి కారులో బయల్దేరారు. వీరిలో నలుగురు అయ్యప్ప దీక్షల్లో ఉన్నారు. కారు నాదెండ్ల మండలం కుప్పగంజి వాగు సమీపంలో నూతన హైవే బైపాస్ మార్గంలోకి రాగానే.. ట్రాక్టర్ల లోడుతో ముందు వెళ్తున్న భారీ ట్రాలర్‌ను వేగంగా ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రగాయాలైన ఇద్దరిని యడ్లపాడు 108 సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన వారిలో తాళ్లూరు గ్రామానికి చెందిన మేరుగ రామిరెడ్డి, వినుకొండకు చెందిన యశ్వంత్ సాయి (నాని), వంగమూరి వాసు, మేరుగ శ్రీకాంత్, పిడుగురాళ్లకు చెందిన శివరాత్రి మహేష్‌గా గుర్తించారు. వీరిలో ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వినుకొండకు చెందిన మద్దుకూరి కార్తీక్ గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వాస్పత్రికి మృతదేహాల తరలింపు

ఇక సమాచారం అందుకున్న రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్ఐలు పుల్లారావు, టి.శివరామకృష్ణ, జి.అనిల్‌కుమార్‌తో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. హైవే సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను మళ్లించి ప్రమాదానికి గురైన వారిని వాహనాల్లో తరలించారు. జేసీబీ సాయంతో వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఐదు మృతదేహాలను చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మృతుల బంధుమిత్రులు చిలకలూరిపేట ఆస్పత్రికి చేరుకోవడంతో అక్కడ విషాద ఛాయలు అలుముకున్నాయి.

నాలుగొచ్చినా.. నరక'వేతన'

జీతమేది బాబూ?

▶ మొదటి పేజీ తరువాయి

ధ్వజమెత్తుతున్నారు. మంగళవారం రూ.3000 కోట్లు అప్పు చేసినప్పటికీ బాబు సర్కారు జీతాలు చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగులపై వ్యత్యాసం చూపడమేమిటీ?

చంద్రబాబు సర్కారు ఉద్యోగులందరూ సమానం కాదనే ధోరణిలో వ్యవహరిస్తోందని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు ముందుగా వేతనాలు చెల్లిస్తూ ఉద్యోగుల్లో విభజన తీసుకొస్తోందని, అలాగే ఇప్పటికే పలుమార్లు రోడ్డెక్కిన ఉపాధ్యాయులకు 3న జీతాలు జమ చేశారని మిగతా వారికి చెల్లించలేదు, మిగతా వారికి చెల్లించలేదని.. ఇలా ఉద్యోగుల్లో విభజన తీసుకురావడం సరికాదని ఉద్యోగవర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

చిరుద్యోగులూ ఎదురు చూపే

కూటమి సర్కారులో చిరుద్యోగులు వేతనాల కోసం ప్రతి నెలా ఎదురు చూడాల్సి వస్తోందని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. 104 ఉద్యోగులు, కాంట్రాక్ట్ లెక్చరర్లు, హోంగార్డులు, వీఆర్ఏలు, ఆరోగ్య మిత్రలు వేతనాల కోసం 10–15వ తేదీ వరకు నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన గురుకులాల్లో పనిచేసే ఉద్యోగులైతే వేతనాల కోసం పోరాటానికి సిద్ధమవుతున్నారు.

జనవరి వస్తే ఐదు డీఏలు పెండింగ్

డిసెంబర్ వచ్చేసింది జనవరి వస్తే మొత్తం ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటాయి. అయితే ప్రభుత్వం ఒక డీఏ మాత్రమే మంజూరు చేసి అదీ మూడు వాయిదాల రూపంలో చెల్లిస్తామని పేర్కొందని, ఇప్పుడు ప్రతీ నెలా వేతనాలను కూడా 1వ తేదీన కాకుండా విడతల వారీగా పలు తేదీల్లో చెల్లించే విధానాన్ని చంద్రబాబు సర్కారు అమలు చేస్తోందని ఉద్యోగ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఏ నెలా ఒకటినే జీతాల్లేవు

చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లను పట్టించుకోవడం లేదని, చులకనగా చూస్తోందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకటరామి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో ఏ నెలా ఉద్యోగులందరికీ 1న జీతాలు, పెన్షన్లు ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రతి నెలా ఉద్యోగులు జీతాల కోసం 10వ తేదీ వరకు ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏలు, హోంగార్డులు లాంటి చిరుద్యోగులకూ జీతాలు ఆలస్యం చేస్తున్నారని మండిపడ్డారు. వీఆర్ఏలు గౌరవ వేతనంతో పనిచేస్తారని, ఆ గౌరవ వేతనం కూడా సకాలంలో ఇవ్వకపోడం బాధాకరమన్నారు. రాష్ట్ర సచివాలయంలో పనిచేసే కొంతమంది ఉద్యోగులకు ఒక తేదీన మరో కొంత మందికి మరో తేదీన జీతాలు చెల్లించడం అనేది ఇప్పుడే కొత్తగా చూస్తున్నామని పేర్కొన్నారు.

ఏలూరులో అమానుషం

- అర్ధరాత్రి వేళ ఇద్దరు యువతులపై రౌడీషీటర్ల దౌర్జన్యం
- సచివాలయానికి లాక్కెళ్లి యువతిపై ఓ రౌడీషీటర్ అత్యాచారం?
- పోలీసులు సరిగా స్పందించలేదని బాధితుల ఆరోపణ
- చిన్న కేసుగా చిత్రీకరించేందుకు పోలీసుల యత్నం

ఏలూరు టౌన్: ఏలూరులో అర్ధరాత్రి వేళ అమానుష ఘటన చోటుచేసుకుంది. ఇద్దరు యువతులు ఒంటరిగా ఉన్నారని తెలుసుకుని వారి ఇంటి తలుపులు, కిటికీలు బాదుతూ ఇద్దరు రౌడీషీటర్లు భయభ్రాంతులకు గురిచేశారు. అనంతరం వారిలో ఒక యువతిని ఓ రౌడీషీటర్ కొట్టుకుంటూ సమీపంలోని సచివాలయానికి లాక్కెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తర్వాత ఇద్దరు యువతులనూ రౌడీషీటర్లు బెల్టుతో దారుణంగా కొట్టినట్లు తెలిసింది. తాము పోలీసులను ఆశ్రయిస్తే వారు సరిగ్గా స్పందించలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. చివరికి.. ఈ ఘటన పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలివీ.. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన యువతి (23) తండ్రి మరణించగా.. ఆమె తల్లితో గొడవపడి ఇంటి నుంచి వచ్చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఏలూరుకు చెందిన యువతి వద్ద ఉంటోంది. ఈ నెల 2న రాత్రివేళ వీరిద్దరూ ఇంట్లో ఒంటరిగా ఉండగా.. నగరంలోని కొత్తపేటకు చెందిన ఇద్దరు రౌడీషీటర్లు అతిగా మద్యం సేవించి అర్ధరాత్రి వేళ యువతులు ఉంటున్న ఇంటి తలుపులు, కిటికీలు బాదుతూ వారిని భయభ్రాంతులకు గురిచేశారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చిన యువతి తలుపులు తీయగా.. ఆమెను కొట్టుకుంటూ లాక్కెళ్లిన ఒక రౌడీషీటర్ సమీపంలోని సచివాలయంలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించాడు. ఆ తర్వాత యువతులిద్దరినీ బెదిరించి వెళ్లిపోయిన ఆ ఇద్దరు రౌడీషీటర్లు.. మరో గంట తర్వాత స్నేహితులతో వచ్చి యువతులను మళ్లీ బెల్టులతో ఇష్టమొచ్చినట్లు కొట్టి బెదిరించి వెళ్లారు. దీంతో బాధితులిద్దరూ నగరంలోని ఒక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు పట్టించుకోలేదని సమాచారం. అయితే, పోలీసు ఉన్నతాధికారులకు ఈ దారుణ ఘటన గురించి తెలియడంతో అత్యాచార బాధితురాలిని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నట్లు తెలిసింది. అలాగే, హడావుడిగా కేసు నమోదు చేశారు. మరోవైపు.. ఈ ఘటనను పోలీసులు చిన్న కేసుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం అనేక సందేహాలకు తావిస్తోంది. పోలీసులు ఈ ఘటనపై మీడియాకు సైతం తెలియకుండా అత్యంత గోప్యత పాటిస్తున్నారు.

ప్రైవేటు ఉద్యోగి ఆస్తులపై ఏసీబీ దర్యాప్తు తగదు

- పరకామణిలో చోరీపై సింగిల్ జడ్జి ఉత్తర్వులు సరికాదు
- రాజీ వ్యవహారాన్ని తేల్చాల్సిందే ధర్మాసనమే
- అయినప్పటికీ సింగిల్ జడ్జి నిర్దిష్ట అభిప్రాయాలపై ఉత్తర్వులిచ్చారు
- హైకోర్టుకు నివేదించిన సీనియర్ న్యాయవాది చిత్తరవు నాగేశ్వరరావు

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ కేసు రాజీ విషయంలో హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై నిందితుడు సీవీ రవికుమార్ తరఫున సీనియర్ న్యాయవాది చిత్తరవు నాగేశ్వరరావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ రవికుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. రవికుమార్ తరఫున నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. చోరీ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేయడం న్యాయసమ్మతమా.. కాదా అనే అంశాన్ని ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తేల్చాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా సింగిల్ జడ్జి వ్యవహరించారని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో రాజీపై ఆయన ఓ నిర్ణయానికి వచ్చి, అందుకు అనుగుణంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారన్నారు. రాజీ వ్యవహారాన్ని ధర్మాసనమే తేల్చాలని చెబుతూనే మరోవైపు ఆ విషయంపై పలు ఉత్తర్వులు జారీ చేశారని, ఇది ఎంతమాత్రం సరికాదని తెలిపారు. ధర్మాసనమే తేల్చాలన్నప్పుడు కేసు పూర్వాపరాల ఆధారంగా అభిప్రాయాలు వెల్లడించకుండా ఉండాల్సిందన్నారు. రూ.72 వేల విలువ చేసే 900 డాలర్ల దొంగతనం కేసులో నిందితునిగా ఉన్న రవికుమార్ టీటీడీ ఉద్యోగి కాదని, ఆయన ఓ మఠంలో ఉద్యోగి అని తెలిపారు. టీటీడీ అధికారులు సైతం ఇదే విషయాన్ని తమ కౌంటర్‌లో హైకోర్టుకు నివేదించారన్నారు. అయితే.. సింగిల్ జడ్జి మాత్రం నిందితుడు రవికుమార్‌ను ప్రభుత్వ ఉద్యోగి అని చెబుతూ, అతని ఆస్తులపై ఏసీబీ విచారణకు ఆదేశించారన్నారు. ప్రైవేటు ఉద్యోగి ఆస్తులపై దర్యాప్తు చేసే పరిధి ఏసీబీకి లేదన్నారు. సింగిల్ జడ్జి వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఏకపక్షంగా ఉన్నాయని, తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా ఉత్తర్వులిచ్చారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ధర్మాసనం స్పందిస్తూ.. సింగిల్ జడ్జి వ్యక్తం చేసినవి ప్రాథమిక అభిప్రాయాలే కదా అని ప్రశ్నించింది. సింగిల్ కేవలం అభిప్రాయాలకే పరిమితం కాలేదని, పలు విషయాలను నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, దీనిపైనే తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని న్యాయవాది నాగేశ్వరరావు చెప్పారు. తదుపరి వాదనల నిమిత్తం విచారణను ఈ నెల 11కి సీజే ధర్మాసనం వాయిదా వేసింది.

45 రోజుల్లోగా శంకుస్థాపన జరగాలి

సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల్లో 50 శాతానికి పైగా ఆమోద ప్రక్రియలోకి వచ్చాయని, 45 రోజుల్లోగా వీటికి శంకుస్థాపన జరిగేలా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సీఎం అధ్యక్షతన గురువారం సచివాలయంలో 13వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. ఇందులో రూ.20,444 కోట్ల విలువైన పెట్టుబడులకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న ఆరు కంపెనీలకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 20 రోజుల క్రితం విశాఖలో భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తే.. ఇప్పటికే రూ.7.69 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు ఆచరణ దిశగా అడుగులు వేస్తున్నాయని సీఎం చెప్పారు. 45 రోజుల్లోగా వీటన్నింటినీ గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని, క్వాంటం వ్యాలీకి సలహా మండలి నియమించాలన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనేది స్టార్టప్‌లకు ఓ మెంటార్‌గా వ్యవహరిస్తుందని, క్వాంటం వ్యాలీలో నిర్మించే ఆరు క్వాంటం టవర్లలో రెండు టవర్లను క్వాంటం అల్గారిథం డెవలప్‌మెంట్ కోసం.. మరో రెండు టవర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్‌మెంట్ కోసం కేటాయించాలని సీఎం కోరారు.

క్లుప్తంగా

రోశయ్య సేవలు మరువలేనివి

మంగళగిరి టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య సేవలు మరువలేనివని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ(వామ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగ అధ్యక్షులు దేవతి భగవన్నారాయణ పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని వామ్ కార్యాలయంలో రోశయ్య వర్ధంతిని గురువారం నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. రోశయ్యను ఆదర్శంగా తీసుకుని నేటి నాయకులు పనిచేయాల్సిన అవసరం ఉందని భగవన్నారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో వామ్ ప్రతినిధులు సుజాత, రామకృష్ణ, మురళీకృష్ణ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు గురువారం స్థానిక టీడీపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ.. తాడేపల్లి పట్టణ పరిధిలో 11వ వార్డుకు చెందిన దాసరి శివనాగేశ్వరరావుకు రూ.65,918లు, 19వ వార్డుకు చెందిన జిరుయామినికి రూ.42,746లు, 20వ వార్డుకు చెందిన మేకల ఉదయ రంజనికి రూ. 20 వేలు.. 23వ వార్డుకు చెందిన రాజవరపు వేంకటేశ్వర్లుకు రూ.74,645ల చెక్కులను అందజేశామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దారా దాసు, అద్దంకి మురళి, మేకా పుల్లారెడ్డి, కేళి వెంకటేశ్వరరావు, ఇట్టా భాస్కర్, గాజుల కృష్ణ, దోన కొండయ్య, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సామాజిక పింఛన్లు ఇవ్వాలి

దుగ్గిరాల: అర్హత కలిగిన పేదలకు సామాజిక పింఛన్లు అందించకుండా చంద్రబాబు సర్కార్ అర్హులను మోసం చేస్తోందని ఏపీ ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు అన్నారు. దుగ్గిరాల మండల కార్యాలయం వద్ద ఎంపీడీవోను గురువారం కలిసి పలు సమస్యలను వివరించి వినతిపత్రం అందించారు. నాగరాజు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో చంద్రబాబు సర్కారు నేటికీ ఒక్క నూతన సామాజిక పింఛను కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఆధార్ కార్డులో వయస్సు తప్పుగా నమోదైన నిరక్ష్యరాసులు ఏ విధంగా సరిచేసుకోవాలో అర్థం కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో పెనుమూలి గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలో ఓ యువకుడు ఇష్టపడి కొనుగోలు చేసిన ద్విచక్రవాహనం తాను కొన్న రెండేళ్ల తరువాత అదేరోజు చోరీకి గురైయ్యింది. దీంతో యువకుడు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు. పెనుమాక కొత్తూరు సెంటర్‌లో నివాసం ఉండే పలగాని జోష్ తన ద్విచక్రవాహనమైన ఏపీ40ఏక్యూ4158 వాహనాన్ని ఉద్యోగం అనంతరం ఇంటికి వచ్చి ఇంటి ముందు పార్క్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు హ్యాండిల్ లాక్ విరగ్గొట్టి బండిని బుధవారం అర్ధరాత్రి అపహరించారు. ఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి

ఫిరంగిపురం: బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో శిశు మహిళా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని పరిపాలనాధికారి కె.రవిబాబు పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు తమ వంతుగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, ఏఈ పీఆర్ శ్రీనివాసరావు, సీడీపీవో అనురాధా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతన్న మీకోసం.. ప్రకటనలకే పరిమితం!

- ఆరని ధాన్యం.. కేంద్రాల్లో కొనని వైనం
- రైతన్నల వెంటపడుతున్న దళారులు
- చేసేదిలేక తక్కువ ధరకే ధాన్యం విక్రయం

వాతావరణంలో మార్పు రాగా రాశిగా పోసిన ఆరబోసిన ధాన్యం

తాడేపల్లి రూరల్ : కూటమి ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన 'రైతన్న మీకోసం' కార్యక్రమం ప్రచారంలా కనిపిస్తోందే తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా అధిక వర్షాలు, తుపాన్లు రావడంతో దిగుబడి తగ్గింది. ఎకరానికి 37 నుంచి 40 బస్తాలు రావాల్సింది.. 30 నుంచి 35 బస్తాలు మాత్రమే ధాన్యం దిగుబడి వస్తుంది. ప్రతి మండలంలోనూ రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాగా అనుకున్న స్థాయిలో రైతుల దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం మాత్రమే తేమ శాతం ఉండాలని చెప్పింది. దీంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని, ఎండ లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే అదునుగా చేసుకుని దళారులను గ్రామాల్లో తిరిగి రైతులను భయపెడుతున్నారు.

దళారులకు విక్రయాలు..

ప్రభుత్వం 75 కేజీల బస్తాను రూ.1,750లకు మద్దతు ధర ప్రకటించగా.. దళారులు మాత్రం వాతావరణంలో వస్తున్న మార్పులను తమకు అనుకూలంగా మార్చుకుని పరిస్థితుల ప్రభావాన్ని బట్టి రూ.1,150 నుంచి రూ.1,350 వరకూ కొనుగోలు చేస్తున్నారు. రైతులు కూడా వాతావరణంలో వస్తున్న మార్పులను గమనించి అధికారులు కొంటారో లేదో తెలియక.. తేమ ఆరుతుందో లేదో తెలియక వచ్చిన ధరకు అమ్ముకుంటున్నారు. దళారులు కూడా వెంటనే రైతులకు నగదు అందించడం లేదు. వెంటనే నగదు ఇవ్వాలంటే రూ.1,300కు కొనుగోలు చేస్తే రూ.1,250 మాత్రమే ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ గ్రామాల నుంచి పదుల సంఖ్యలో దళారులు రైతులను మభ్యపెట్టి వాతావరణంలో వస్తున్న మార్పులను తమకు అనుకూలంగా మార్చుకుంటూ ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా అధికారులు మాత్రం తమకు శ్రమ తగ్గిందని, కొనుగోలు కేంద్రాల వద్దే కూర్చోవడంతో గ్రామంలో దళారులు రెచ్చిపోయి తమదైన శైలిలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న ధాన్యం నిల్వ చేసుకునే స్థలాలు లేక తక్కువ ధరకు అమ్ముకుంటున్నామని రైతులు వాపోతున్నారు.

ధాన్యం బస్తాలు

గుడివాడ నుంచి వచ్చిన వాహనంలోకి ఎగుమతి అవుతున్న ధాన్యం బస్తాలు

నడిరోడ్డుపై ఏసీసీ కార్మికుల ఆకలి కేకలు

రాస్తారోకోలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి అన్నారు. గురువారం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఏడాది పూర్తి కావడంతో ప్రకాష్‌నగర్‌లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా రాస్తారోకో నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యాజమాన్యాన్ని ఒప్పించి కార్మికులకు న్యాయం చేయడాలని డిమాండ్ చేశారు. స్థానిక శాసనసభ్యులు, మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇప్పటికే కార్మికులు 170 మంది మృతి చెందారని.. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీకి రూ.10 వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని.. అందులో రూ.43 వేల కోట్లు చెల్లించమని ఇచ్చిన కోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కోటేశ్వరరావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ.. 365 రోజులుగా సమస్య పరిష్కారానికి కార్మికులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు కె.వెంకటయ్య, బూరుగ వెంకటేశ్వర్లు, ఎస్.దుర్గారావు, నరసింహారావు, శారద, ఇమాంబి, కె.ఆదినారాయణ, నవనీతం, అంకయ్య, ప్రకాష్‌రావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మాట్లాడుతున్న అప్పారావు

మంగళగిరి టౌన్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని.. ఆ మేరకు రైతులకు భరోసా కల్పించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. కాజా గ్రామంలో గురువారం పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదని, వాతావరణ పరిస్థితులను ఆసరాగా తీసుకుని ప్రైవేటు మిల్లర్లు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కల్లాల్లోనే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని, రైతులకు మద్దతు ధర ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రైతులకు గోనె సంచులు, టార్పాలిన్ పట్టాలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోసుకునే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సింహాద్రి సుమ, ఉద్దంటి దుర్గారావు, కోటేశ్వరి, అజయ్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలి

మిద్దె సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: రాష్ట్రంలో పూర్తిగా గంజాయిని నిర్మూలించేందుకు కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధి మిద్దె సెంటర్‌లో ప్రజా కళాకారుడు పెంచలయ్య హత్యను ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గంజాయిని అరికడతామని, నేరస్తులను ఉక్కుపాదంతో అణచివేస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో మాత్రం విఫలమైందని ఆరోపించారు. పెంచలయ్య కళారూపాలతో చైతన్య పరుస్తూ, గంజాయికి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్నారని, దీనిని సహించలేని వారు పెంచలయ్యను హత్యచేయడం దారుణమన్నారు. హంతకులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీవీ జవహర్‌లాల్, ఎస్ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ, మహిళా సంఘం నాయకురాలు మీరావలి, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్‌కు గురైన బాలికల ఆచూకీ లభ్యం

విచారణ చేపట్టిన తాడేపల్లి పోలీసులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్ల మిస్సింగ్ కేసును తాడేపల్లి పోలీసులు గురువారం ఛేదించారు. సీఐ వీరేంద్రబాబు ఆదేశాల మేరకు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తన బృందంతో అనేక కోణాల్లో విచారించి కిడ్నాప్‌కు గురైన ఆ ఇద్దరు బాలికలను ఇద్దరు యువకులు కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. ప్రేమ పేరుతో ఆ ఇద్దరిని తీసుకువెళ్లి లైంగిక దాడిచేసినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయ్యింది. కిడ్నాప్ అయిన దగ్గర నుంచి ఎక్కడెక్కడ ఉన్నారు? ఎవరెవరు సహకరించారు అనే కోణాల్లో కూడా దర్యాప్తు చేపట్టారు. కిడ్నాప్ చేసిన యువకులకు కొంత మంది మంగళగిరికి చెందిన వ్యక్తులతో పాటు ఓ మహిళ సహకరించినట్లు ఈ దర్యాప్తులో తేలినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ బాలికలకు మెడికల్ పరీక్షలు నిర్వహించి, ప్రేమ పేరుతో కిడ్నాప్ చేసిన ఇద్దరు యువకులపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఘనంగా రెండో రోజు ఉద్భవ్ వేడుకలు

గిరిజన పాటలతో అలరిస్తున్న విద్యార్థులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి కేఎల్ యూనివర్సిటీలో కేంద్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్భవ్ 2025 గురువారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పలు విభాగాల్లో శాస్త్రీయ, గిరిజన పాటల పోటీలు, సంస్కృత శ్లోకాల పోటీలు, కవితా పఠనం, ఆంగ్ల పద్యాలతో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉద్భవ్ 2025లో మొదటి రోజు 18 విభాగాలు, రెండో రోజు 22 విభాగాల్లో పోటీలు.. నిర్వహించారు. శుక్రవారం 9 విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో విజేతగా నిలిచిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమి, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటూరి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ స్మరన్‌రాజు, గిరిజన సంక్షేమ శాఖ, ఎన్ఈఎస్‌టీఎస్ ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత ప్రాంతంలోనే వ్యాపారాలు చేసుకోవాలి

తెనాలి రూరల్: తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకునేవారు. తమకు పోలీసులు, మున్సిపల్ అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే వ్యాపారాలు చేసుకోవాలని డీఎస్పీ బి. జనార్ధనరావు వ్యాపారులను ఆదేశించారు. పట్టణంలో తోపుడుబండ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులకు డీఎస్పీ గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. పట్టణ వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పలు చోట్ల రోడ్లపై తోపుడుబండ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని పట్టణ వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్టేషన్‌కు పిలిపించా రు. వారితో డీఎస్పీ మాట్లాడారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్లపై వ్యాపారాలు తగవని హెచ్చరించారు. నిర్దేశించిన ప్రాంతంలో మాత్రమే వ్యాపారాలు నిర్వహించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు సహకరించాల్సిందిగా వారిని కోరారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు

క్రీడ జ్యోతితో డాక్టర్ యేసుబాబు

తెనాలిఅర్బన్: క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని నారాయణ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన డెల్టా జోన్ స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థుల్లో క్రీడ స్ఫూర్తి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ ప్రతి రోజు వ్యాయామం చేయ డంతో పాటు క్రీడల్లో పాల్గొన్నాలన్నారు. దీని వలన ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందని చెప్పారు. ఏజీఎం శివనాగరాజు మాట్లాడుతూ మూడు రోజుల పాటు స్పోర్ట్స్ మీట్ జరుగుతుందన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, తిరుపతిరావు, ప్రిన్సిపల్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

సాయి మందిరంలో దత్త హోమం

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలోని శ్రీ భగవాన్ సత్యషిర్డి సాయిబాబా మందిరంలో గురువారం దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకుని శ్రీదేవి సమేత దత్తాత్రేయ స్వామి హోమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మందిర నిర్వాహకులు మాట్లాడుతూ.. దక్షిణామూర్తిని ప్రథమ గురువు అంటారని, ఆ తరువాత దత్తాత్రేయస్వామి వారే గురువు అని తెలిపారు. దక్షిణామూర్తి మాదిరిగానే మౌనంలోనే భక్తులకు దత్తాత్రేయస్వామి జ్ఞానోపదేశం చేశారని వివరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మందిరం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

తెగుళ్ల నియంత్రణపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని శిరంగిపాలెంలో వరిపంట, వాటికి వచ్చే తెగుళ్ల నివారణపై పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏవో వాసంతి మాట్లాడుతూ.. వర్షాల కారణంగా వరి పొలాల్లో బ్యాక్టీరియల్ లీఫ్ బ్లైట్ లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. వరి కోతకు సమయం ఉన్న రైతులు యూరియా వేయకుండా పొటాష్ 20 నుంచి 30 కిలోలు ఎకరాకు చల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బదిలీ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి

మంగళగిరి టౌన్: ఎంబుక్, బదిలీ కార్మికులను వెంటనే ఆప్కాస్‌లో చేర్చాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధి ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట గురువారం రాత్రి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బదిలీ కార్మికులకు ఎఫ్ఆర్ఎస్ ప్రకటించి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమ్మెకాలపు ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు జరపాలని పేర్కొన్నారు. అనంతరం ఎంటీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ముత్యాలరావు, రజని, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్డీఏ 'గ్రీవెన్స్ డే' నిర్వహణలో స్వల్ప మార్పు

తాడికొండ: రాజధాని అమరావతిలోని తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే ఇకపై ప్రతి శనివారం రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో జరుగుతుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని రైతులు, రైతు కూలీల వినతులు, భూసంబంధిత అంశాలు, అభివృద్ధి పనులు, అలాగే ఇతర ప్రజా సమస్యలను సీఆర్డీఏ ఆధ్వర్యంలో వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. నూతన షెడ్యూల్ ప్రకారం ప్రతి శనివారం రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రీవెన్స్ జరుగుతుందని ప్రకటనలో తెలిపారు.

యువతితో అసభ్యకర ప్రవర్తన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ యువతితో ఒక యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. సేకరించిన వివరాల ప్రకారం.. ఓ యువతిని యువకుడు స్నానం చేస్తుండగా కిటికిలో నుంచి తన ఫోన్‌లో వీడియో తీశాడు. అది గమనించి యువతి పెద్దగా కేకలు వేయడంతో యువకుడు అక్కడి నుంచి రోడ్డుపైకి వచ్చి పరారైనట్లు సమాచారం. జరిగిన ఘటనపై బాధితురాలి తల్లి బుధవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన తాడేపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఫోర్జరీ నేరాలకు పాల్పడే వ్యక్తి అరెస్ట్

మంగళగిరి టౌన్: ఫోర్జరీ నేరాలకు పాల్పడే వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు గురువారం మంగళగిరి రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పెదవడ్లపూడి గ్రామానికి చెందిన షేక్ జలీల్‌ఖాన్ చినకాకాని గ్రామ పరిధిలోని 10.27 ఎకరాల భూమికి సంబంధించి అగ్రిమెంట్లను ఫోర్జరీ చేశాడు. ఆ భూములకు సంబంధించి రైతులు తనకు స్వాధీన బయానా కింద అమ్మినట్లు రైతులకు తెలియకుండా వారి సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించాడు. విషయం తెలుసుకున్న చినకాకాని గ్రామ రైతులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుచగా మంగళగిరి న్యాయస్థానం జలీల్‌ఖాన్‌కు 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

బాలల సంరక్షణపై అవగాహన



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి ఉండవల్లిలోని గాదె రామయ్య సీతారావమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ, విద్యార్థుల మానసిక, శారీక మార్పులు, మంచి నడవడికి ఉపాధ్యాయుల పాత్రపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కోఆర్డినేటర్ సిస్టర్ విద్య మాట్లాడుతూ.. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ త్వరగా మోసపోతున్న వారిలో ఎక్కువగా బాలికలే ఉంటున్నారని అన్నారు. విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలలోనే ఉంటారు కాబట్టి ఉపాధ్యాయులతో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. పిల్లల మానసిక స్థితి తెలుసుకుని వారి భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉండవల్లి పంచాయితీ కార్యదర్శి ఎ.రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజిని, గుడ్ షెపర్డ్ సిబ్బంది అత్తోట పోతరాజు, కె.అనూష, పి.అనిల్ కుమార్, ఇశ్రాయేల్, చిరంజీవి మహిళా పోలీస్ డి.సౌందర్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
PLOT FOR SALE
■ గుంటూరు సిటీకి అనుకొని ఉన్న పేరేచర్ల NRI IT కాలేజీ ప్రక్కన, ఆగికి మధ్యలో AP CRDA ప్లాట్స్ కలవు. ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఫ్రీ..ఫ్రీ. సంప్ర।। 7729075958, 9959127008

SERVICES
ASTROLOGY
■ తమిళనాడు వైదీశ్వరన్ కోయిల్ శ్రీ అగస్త్య నాడి జ్యోతిష్యాలయం మీ చేతి బొటనవేలు ముద్రతో మీ భవిష్యత్తు పూర్తిగా చెప్పబడును. అన్ని సమస్యలకు పరిష్కారం చెప్పబడును. GNT 8978215913

BUSINESS OFFER
■ వ్యాపార భాగస్వాములు కావాలి. తక్షణం వ్యాపార భాగస్వాములు వెతుకుతున్నాము. సంప్రదించండి: RSJ Inspection Service Ltd. సెల్ : 85959 24917.

■ గుంటూరు జిటి రోడ్డులో బాగా రన్నింగ్‌లో ఉన్న పేరొందిన ఫ్రాంచైజ్ రెస్టారెంట్ అమ్మకమునకు కలదు. సంప్ర।। 76709 89630

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును ✆ 8790741166

WANTED
■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, 10th పాస్ 50సం।। పై వయస్సు వారు కావలెను. 9989909698

■ గుంటూరు, మంగళగిరి, సత్తెనపల్లి, లాం, గుజ్జనగుండ్ల, ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, & గుంటూరు ఆఫీసులో DTP ఆపరేటర్ కావలెను. సం।। 9866618811, 9866618877

■ గుంటూరు బ్రాడీపేటలోని ప్రముఖ జ్యూయలరీ షోరూం వారికి 25-30సం।।ల వయస్సు, జ్యూయలరీ రిటైల్ సేల్స్‌లో 2సం।।ల అనుభవం ఉన్న సేల్స్ మెన్స్ / గర్ల్స్ కావలెను. సంప్ర।। 9848558182

■ తెనాలిలోని ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు ICU స్టాఫ్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ కావలెను. సంప్రదించండి. ఫోన్: 7702762108, 9666354489

■ Wanted Qualified Primary Teachers, Helpers & Receptionist English fluency is must. ✆ Montessori E.M. School, Gnt. 81214 00100

■ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్‌లో సేల్స్ మేనేజర్స్, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్స్, అడ్వైజర్స్ కావలెను. ఆన్‌రోల్ 30k శాలరీ ఇన్సెంటివ్+ కమీషన్ P/T స్త్రీ/పు 9949839400, 9032592584

■ కృష్ణసాయి క్లాత్ శారీస్ నందు పని చేయుటకు సేల్స్‌మెన్, హెల్పర్స్‌గా స్త్రీ/పు కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 4/1 అశోక్‌నగర్, గుంటూరు. 98855 13844

■ వెంటనే కావలెను. Ltd కంపెనీల్లో కం।। ఆపరేటర్స్, రిసెప్షనిస్ట్, అకౌంటెంట్స్, టెలికాలర్స్, సూ।। వైజర్స్, ఆఫీస్‌బాయ్స్, ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్, హెల్పర్స్ కావలెను. 10th-PG, జీ:10-25. ✆7993976590

■ ఉద్యోగ అవకాశం డిగ్రీ పూర్తిచేసిన వారికి ఫీల్డ్ వర్క్ (Field Work) కోసం వయస్సు: 30 సంవత్సరాల లోపు వారు సంప్ర।। +91 8800629648. RSJ Inspection Service Ltd

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

హిడ్మా మరణంలో ద్రోహులు వారే

- కలప వ్యాపారి మాటలు నమ్మి చికిత్స కోసం విజయవాడకు..
- ఇంటెలిజెన్స్‌కు సమాచారం ఇచ్చిన కాంట్రాక్టర్లు, వ్యాపారులు
- మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పేరిట లేఖ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/చర్ల: ఏపీలోని మారేడుమిల్లి, రంపచోడవరం ఎన్‌కౌంటర్లలో చనిపోయిన మావోయిస్టు అగ్రనేతలు హిడ్మా, శంకర్ హత్యలపై న్యాయ విచారణ జరిపించి, దోషులకు కఠిన శిక్ష విధించాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ పేరుతో గతనెల 27న జారీ చేసిన లేఖ బుధవారం వెలుగులోకి వచ్చింది. హిడ్మా ఎన్‌కౌంటర్‌కు దేవ్‌జీ కారణమంటూ మనీశ్ కుంజాం, సోనీసోరి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు పార్టీ పేర్కొంది. ఆ లేఖలోని ముఖ్య విషయాలు ఇలా ఉన్నాయి.

పోలీసులు పట్టుకొని హత్య చేశారు

'విజయవాడకు చెందిన ఒక కలప వ్యాపారిని నమ్మిన హిడ్మా, చికిత్స కోసం అక్కడకు అక్టోబర్ 27న వెళ్లాడు. ఆ తర్వాత మరికొందరు మావోయిస్టులు కూడా విజయవాడకు చేరారు. నిరాయుధులైన హిడ్మా సహా ఆరుగురిని పోలీసులు పట్టుకొని హత్య చేశారు. ఆ తర్వాత ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్టు తప్పుడు కథ అల్లారు. నవంబర్ 19న అదే జిల్లాలోని రంపచోడవరం మండలంలో ఏడుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్టు పోలీసులు ప్రకటించారు. ఈ ఘటనలోనూ నిరాయుధులైన ఏఓబీ (ఆంధ్రా–ఒడిశా స్పెషల్ జోనల్ కమిటీ) సభ్యుడు శంకర్, మరో ఆరుగురిని పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారు.

బయటకు తీసుకెళ్లిన వ్యక్తులే

నవంబర్ 9న మా బలగాల నుంచి కోసల్ అనే సభ్యుడు పారిపోయాడు. నేరుగా వెళ్లి తెలంగాణ పోలీసుల ముందు సరెండర్ అయ్యాడు. ఆయనకు హిడ్మా ప్రయాణ వివరాలన్నీ తెలుసు. వెంటనే అడవిలోకి వచ్చేయాలని పార్టీ తరఫున హిడ్మాకు సమాచారం ఇచ్చాం. ఈ సమాచారం ఆయనకు నవంబర్ 14న మధ్యాహ్నం అందింది. ఆ వెంటనే అడవిలోకి తిరిగి వచ్చేందుకు ప్రయత్నించాడు. అదేరోజు సాయంత్రం 4–5 గంటల సమయంలో పోలీసులు వారిని పట్టుకున్నారు. వారంతా పోలీసుల చేతిలో చనిపోయారు. మరో మావోయిస్టు నేత శంకర్ విషయంలోనూ ఇలాగే జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఐటీడీఏ పనులు చేసే కాంట్రాక్టర్, విజయవాడలోని కలప ఫర్నిచర్ వ్యాపారి, బిల్డర్లు 50 మంది మావోయిస్టుల అరెస్ట్‌కు కారణం. వీరే మావోయిస్టులకు ఆశ్రయం కల్పిస్తామని తీసుకెళ్లి పోలీసులకు చెప్పారు. ఫలితంగా ఎన్టీఆర్, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాలో పోలీసులకు మావోయిస్టులు పట్టుబడ్డారు. ఈ వ్యవహారమంతా ప్రభుత్వ ఇంటెలిజెన్స్ వర్గాలకు తెలుసు.

బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో 18కి చేరిన మృతుల సంఖ్య

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ – దంతెవాడ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో రెండు రోజుల పాటు జరిగిన ఎదురు కాల్పుల్లో మొత్తం 18 మంది మావోయిస్టులు మృతి చెందారు. బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో అర్ధరాత్రి వరకు 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత గురువారం తెల్లవారు జామున 4నుంచి ఉదయం 10 గంటల వరకు కొనసాగిన ఎదురు కాల్పుల్లో మరో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 18కి చేరింది.

న్యాయ విచారణ చేయాలి

ఈ మొత్తం కుట్ర వెనుక ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ఇంటెలిజెన్స్ ఏజెన్సీల హస్తం స్పష్టంగా ఉందని తెలుస్తోంది. హిడ్మా, శంకర్‌తోపాటు మొత్తం 13 మందిని అరెస్టు చేసి నకిలీ ఎన్‌కౌంటర్లు సృష్టించారు. ఈ హత్యలకు కేంద్ర ప్రభుత్వంలోని పెద్ద అధికారులు బాధ్యులు. ఇప్పుడు ఈ మొత్తం వ్యవహారంపై న్యాయ విచారణ జరగాలి. ఏపీలో అరెస్ట్ అయిన వారిలో దేవ్‌జీ, సంగ్రామ్ లేరని మావోయిస్టు పార్టీ స్పష్టం చేసింది. కానీ హిడ్మా మరణానికి దేవ్‌జీ కారణం అనే ప్రచారం జరగడం, దానికి సోని సోరి, మనీశ్ కుంజమ్ లాంటి నేతలు వంత పాడటం రాజ్యం పన్నిన కుట్రలో భాగమే.

'పనిలేని... పిల్లితల గొరిగినట్టు'

మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే కందుల వివాదాస్పద వ్యాఖ్యలు
నాయీబ్రాహ్మణులను కించపరిచారంటూ సోషల్ మీడియాలో విమర్శలు

మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే కందుల

పొదిలి రూరల్: బీసీల తోకలు కత్తిరిస్తానని హుంకరించి.. గతంలో బీసీల ఆత్మగౌరవాన్ని అపహాస్యం చేసిన చంద్రబాబు బాటలోనే టీడీపీ ఎమ్మెల్యేలు సైతం నడుస్తున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలకు వస్తున్న స్పందనను చూసి ఓర్వలేక ప్రకాశం జిల్లా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నాయీబ్రాహ్మణుల వృత్తిని పరిహసించేలా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. బుధవారం పొదిలి మండలం ఆముదాలపల్లిలో జరిగిన రైతన్నా.. మీకోసం సభలో వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలను ఉద్దేశించి 'పనిలేని... పిల్లితల గొరిగినట్టు' అంటూ ఎమ్మెల్యే నారాయణరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగింది. ఎమ్మెల్యే వ్యాఖ్యలు తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయంటూ నాయీ బ్రాహ్మణులు భగ్గుమంటున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కందులకు చేరవేశారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ.. సభలో మాట్లాడే సందర్భంలో ఫ్లోలో అలా వచ్చిందని, తాను కావాలని ఆ వ్యాఖ్యలు చేయలేదని, పొరపాటు జరిగిందని వివరణ ఇచ్చుకున్నారు.

ఆరు ఇండిగో విమానాలు రద్దు

గోపాలపట్నం (విశాఖ): సాంకేతిక కారణాలతో దేశవ్యాప్తంగా ఇండిగో విమానాలు రద్దు ప్రభావం విశాఖ విమానాశ్రయంపై కూడా పడింది. ఇక్కడ గురువారం మొత్తం ఆరు ఇండిగో విమానాలు రద్దయ్యాయని విశాఖ విమానాశ్రయం అధికారులు వెల్లడించారు. హైదరాబాద్–విశాఖ–హైదరాబాద్ (618/307), విశాఖ–బెంగళూరు–విశాఖ (217/218), చెన్నై–విశాఖ–ముంబై (557/6485), ముంబై–విశాఖ–చెన్నై (5248/845), కోల్‌కత–విశాఖ–కోల్‌కత (512/617), ఢిల్లీ–విశాఖ–ఢిల్లీ (6779/6680) విమానాలను రద్దుచేశారు.

ఏపీ అరటి రైతుల్ని కేంద్రం ఆదుకోవాలి

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో అరటి రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చెప్పారు. వారిని ఆదుకునేందుకు కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఏపీ అరటి రైతుల దీనస్థితిని సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా రాజంపేట నియోజకవర్గంలోని రైల్వేకోడూరు ప్రాంతం అరటి సాగుకు ప్రసిద్ధి అని తెలిపారు. ప్రస్తుతం ధరలు పతనం కావడంతో రైతులు కన్నీరు పెడుతున్నారని చెప్పారు. 'గతంలో టన్ను రూ.25 వేలు పలికిన అరటి ధర నేడు దారుణంగా పడిపోయింది. ప్రస్తుతం రైతులు కిలో కేవలం 50 పైసలకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ 50 పైసలతో కనీసం ఒక బిస్కెట్ గానీ, అగ్గిపెట్టె గానీ కొనుగోలు చేయలేం. రైతులు పండించిన పంటకు కోత కూలీ ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదు' అని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అండగా నిలిచినట్లు గుర్తుచేశారు. 'గత ప్రభుత్వంలో రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేశాం. ఇన్‌పుట్ సబ్సిడీని సకాలంలో అందించాం. రైతుల కోసం ప్రత్యేక కిసాన్ రైళ్లను కూడా ఏర్పాటు చేశాం. కానీ నేడు రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు' అని పేర్కొన్నారు. అరటి రైతులకు ఉచిత పంటల బీమా వర్తింపజేయాలని, నష్టపోయిన రైతులకు పెట్టుబడి సాయం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించాలని కోరారు. అరటి పంటకు కనీస మద్దతు ధరను వెంటనే ప్రకటించాలని, ఏపీ నుంచి అరటి ఎగుమతుల కోసం గతంలో మాదిరిగా మరిన్ని ప్రత్యేక రైళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కోడూరుతో పాటు అరటి సాగు ప్రాంతాల్లో పరిస్థితుల్ని కేంద్ర బృందం పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో అన్నదాతలకు ఇటువంటి దుస్థితి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేంద్ర జల సంఘం చైర్మన్‌గా అనుపమ్ ప్రసాద్

సాక్షి, అమరావతి: కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్‌గా అనుపమ్ ప్రసాద్‌ను కేంద్ర జల్ శక్తి శాఖ నియమించింది. సీడబ్ల్యూసీ చైర్మన్‌గా పనిచేసిన అతుల్ జైన్ నవంబర్ 30న పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం సీడబ్ల్యూసీ సభ్యులు(ఆర్‌ఎం)గా పనిచేస్తున్న అనుపమ్ ప్రసాద్‌కు సీడబ్ల్యూసీ చైర్మన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించాలని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు పంపిన ప్రతిపాదనపై ఆ శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆమోదం తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి మూడు నెలల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ సీడబ్ల్యూసీ చైర్మన్‌గా అనుపమ్ ప్రసాద్ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారని కేంద్ర జల్ శక్తి శాఖ అండర్ సెక్రటరీ జితేంద్ర కుమార్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అఖండ-2కు భారీ షాక్

చిత్రం విడుదల వాయిదా
మద్రాసు హైకోర్టు ఉత్తర్వులతో బ్రేక్
ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన న్యాయపరమైన చిక్కులే కారణం

సాక్షి చెన్నై: నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన అఖండ–2 చిత్రానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రావల్సిన ఈ చిత్రం విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రకటించింది. ప్రీమియర్ షో గురువారం రాత్రి ప్రదర్శించాల్సి ఉండగా దానిని రద్దుచేసినట్లు తెలిపింది. మద్రాసు హైకోర్టు నుండి వచ్చిన తాజా ఉత్తర్వుతో విడుదలకు బ్రేక్ పడింది. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి న్యాయపరమైన చిక్కులు తలెత్తడంతో సినిమా విడుదల వాయిదా పడింది. 14 రీల్స్ ప్లస్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై అనుబంధ సంస్థ ఈరోస్ ఇంటర్నేషనల్ మీడియా లిమిటెడ్ (ఈరోస్) వేసిన అప్పీల్‌ను హైకోర్టు పరిశీలించి ఈమేరకు ఆదేశించింది. ఈ రెండు సంస్థల మధ్య పాత ఆర్బిట్రేషన్ కేసు కొనసాగుతోంది, ఇందులో ఈరోస్‌కు అనుకూలంగా తీర్పు వెలువడింది. ఆ ఆర్బిట్రేషన్ ప్రకారం.. ఈరోస్‌కు దాదాపు రూ.28 కోట్లతో పాటు, అసలు చెల్లింపు తేదీ వరకు 14 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంది. ఇక కోర్టు స్పష్టంచేసిన మేరకు అఖండ–2ను ఏ రూపంలోనైనా విడుదల చేయాలంటే.. థియేటర్లు, ఇంటర్నెట్, ఉపగ్రహం లేదా ఏ ఇతర వాణిజ్య ప్లాట్‌ఫారం అయినా సరే ఈరోస్‌కు మొత్తం ఆర్బిట్రల్ అవార్డు మొత్తాన్ని చెల్లించాలి. ఈ చెల్లింపు పూర్తయ్యే వరకు విడుదల పూర్తిగా నిలిపివేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అఖండ–2 విడుదలైతే ప్రమోటర్లు పాత రుణ బాధ్యతలను పరిష్కరించకుండా వాణిజ్య లాభాలు ఆర్జించే అవకాశముందని ఈరోస్ కోర్టుకు తెలిపింది.

Authorised Dealers: Guntur: Mahavir Auto: 90109 70004; **Hyderabad:** (Jubilee Hills): Mahavir Auto: 83672 30004; (Somajiguda): Mahavir Auto: 83673 30004; (Bowenpally): Mahavir Auto: 95815 50004; (Sanath Nagar) Mahavir Auto: 96426 40005; (Kondapur): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Gachibowli): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Hyder Nagar): PPS Motors: 79934 64666; (AS Rao Nagar): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Bachupally): PPS Motors: 96424 33334; (L. B. Nagar): Mody India Cars: 77992 50000 / 95818 24365; (Attapur): Mody India Cars: 77992 50000 / 98852 20200; (Uppal): Mody India Cars: 77992 50000 / 95818 24365; **Secunderabad:** (Bowenpally): Mahavir Auto: 83674 30004; (Brigadier Sayeed Road): Mahavir Auto: 83674 30004; **Nizamabad:** PPS Motors: 79934 64666 / 79939 69888; **Vizag:** Mahavir Auto: 83676 30004; **Vijayawada:** Mahavir Auto: 83675 30004; **Tirupati:** (Renigunta Road): PPS Motors: 79934 64666; (Thookivakam Village): PPS Motors: 79959 09992; **Warangal:** Mahavir Auto: 90105 75959; **Karimnagar:** Mody India Cars: 77992 50000 / 98859 18412; **Nellore:** Mahavir Auto: 83670 30004; **Kurnool:** PPS Motors: 79934 64666; **Ananthpur:** PPS Motors: 79934 64666; **Rajmundhry:** Mahavir Auto: 79979 60437

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పార్లమెంట్‌లో తెలంగాణ

ప్రాజెక్టులన్నీ బోర్డులకే.. 2021లోనే గెజిట్!

- కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిపై కేంద్రం స్పష్టత
- లోక్‌సభలో ఎంపీ మల్లు రవి ప్రశ్నకు కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ కేంద్ర ప్రభుత్వం 2021 జూలై 15నే స్పష్టమైన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ప్రాజెక్టులను బోర్డులకు అప్పగించే అంశంపై ఇప్పటికీ ఆయా బోర్డు సమావేశాల్లో చర్చలు జరుగుతూనే ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గురువారం లోక్‌సభలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. 2021 అక్టోబర్ 14 నాటికే ప్రాజెక్టులు, హెడ్ వర్క్స్, రిజర్వాయర్లను సంబంధిత రాష్ట్రాలు బోర్డుల అధీనంలోకి అప్పగించాల్సి ఉంది. కానీ ఈ ప్రక్రియ పూర్తికాలేదని, దీనిపై బోర్డు సమావేశాల్లో నిరంతరం చర్చిస్తున్నామని మంత్రి తెలిపారు. రాయలసీమ ఎత్తిపోతల వంటి కొత్త ప్రాజెక్టుల అంశంపై స్పందిస్తూ.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014 ప్రకారం ఏ కొత్త ప్రాజెక్టు చేపట్టినా వాటి సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) తప్పనిసరిగా ఆయా బోర్డులకు సమర్పించాలని కేంద్రం తేల్చిచెప్పింది. బోర్డుల పరిశీలన అనంతరం అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాతే ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

ఎక్సైజ్ ఆదాయంలో 25% కేన్సర్ రోగులకు..

రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో పెరిగిపోతున్న నోటి కేన్సర్ బాధితులను ఆదుకునేందుకు కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ఎక్సైజ్ ద్వారా వచ్చే ఆదాయంలో 25 శాతం నిధులను కేన్సర్ ఆసుపత్రులు, బాధితుల చికిత్స కోసం కేటాయించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాజ్యసభలో 'సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు–2025'పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఈ బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ప్రకటించిన ఎంపీ రవిచంద్ర, తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల పాలనలో సాధించిన ఆర్థిక ప్రగతిని ప్రస్తావించారు. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం వంటి జిల్లాల్లో బీడీ కార్మికులు వృత్తి రీత్యా తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వద్దిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో నోటి కేన్సర్ రోగుల సంఖ్య విపరీతంగా పెరిగిందని, ఎక్సైజ్ ఆదాయంలో 25శాతం నిధులను వీరి వైద్యం కోసం కేటాయించాలని కోరారు. అంతేగాక తెలంగాణలో మద్యం షాపుల్లో గౌడ కులస్తులకు (గీత కార్మికులకు) 15 నుంచి 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, ఇదే విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసి బీసీ వర్గాలకు మేలు చేయాలని సూచించారు.

తెలంగాణలో రూ.8.28 కోట్ల గృహ రుణాలకు కేంద్రం గ్యారంటీ

లోక్‌సభలో కేంద్ర మంత్రి తోఖన్ సాహూ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–అర్బన్ 2.0 పథకంలో భాగంగా.. అనధికారిక ఆదాయ వనరులు కలిగి ఉండి, బ్యాంకుల నుంచి రుణం పొందడానికి ఇబ్బంది పడే పేదలకు అండగా నిలిచే 'క్రెడిట్ రిస్క్ గ్యారంటీ ఫండ్ ట్రస్ట్' కింద తెలంగాణలో ఇప్పటివరకు 68 రుణాలకు కేంద్రం గ్యారంటీ ఇచ్చినట్టు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహూ వెల్లడించారు. గురువారం లోక్‌సభలో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ పథకం కింద ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, అల్పాదాయ వర్గాల వారికి గరిష్టంగా రూ. 20 లక్షల వరకు ఇచ్చే గృహ రుణాలకు కేంద్రం గ్యారంటీగా ఉంటుంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో (అక్టోబర్ 31 వరకు) తెలంగాణలో 68 రుణాలకు గాను రూ. 8.28 కోట్ల మొత్తానికి గ్యారంటీ లభించింది. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో 84 రుణాలకు గాను రూ. 9.06 కోట్ల మేర గ్యారంటీ లభించినట్లు కేంద్రం తెలిపింది.

తెలంగాణ గిరిజన పల్లెలకు మహర్దశ.. కేంద్రం భారీ ప్యాకేజీ

- 'పీఎం జన్ జాతి ఉన్నత్ గ్రామ అభియాన్' కింద రాష్ట్రంలోని పలు గ్రామాల ఎంపిక
- లోక్‌సభలో కేంద్ర మంత్రి దుర్గా దాస్ ఉయికే వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ప్రధాన మంత్రి జన్ జాతి ఉన్నత్ గ్రామ అభియాన్' పథకంలో తెలంగాణకు పెద్దపీట దక్కింది. ఈ పథకం కింద తెలంగాణలోని పలు జిల్లాల్లోని గిరిజన ప్రాబల్యం ఉన్న గ్రామాలను ఎంపిక చేసినట్లు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గా దాస్ ఉయికే తెలిపారు. గురువారం లోక్‌సభలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ పథకం కింద తెలంగాణలో అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా నుంచి 150 గ్రామాలను ఎంపిక చేశారు. ఆ తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 130, కుమురం భీమ్ ఆసిఫాబాద్‌లో 102, మహబూబాబాద్‌లో 92 గ్రామాలను ఎంపిక చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ములుగు (49), నల్లగొండ (52), నాగర్‌కర్నూల్ (20) జిల్లాల్లోనూ గ్రామాలు ఈ జాబితాలో ఉన్నాయి.

తెలంగాణ రహదారులకు నిధుల ఊరట.. రూ. 367 కోట్లు విడుదల

వరంగల్ ఎంపీ కడియం కావ్య ప్రశ్నకు కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర రహదారుల అభివృద్ధి, నిర్వహణ కోసం కేంద్రం కేటాయించే సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నిధుల విడుదలలో తెలంగాణకు ఊరట లభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో అక్టోబర్ 31 నాటికి తెలంగాణ వాటా కింద రూ. 344.49 కోట్లు కేటాయించగా, అంతకంటే ఎక్కువగా రూ. 367.17 కోట్లను కేంద్రం విడుదల చేసింది. గురువారం లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గత మూడేళ్లుగా తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధుల విడుదల నిలకడగా ఉందని కేంద్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

తెలంగాణలో తగ్గిన నిరుద్యోగం

రాజ్యసభలో కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ యువతలో నిరుద్యోగ తీవ్రత గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2017–18లో రాష్ట్రంలో 15–29 ఏళ్ల వయసున్న యువతలో 23.3 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు, 2023–24 నాటికి 16.6 శాతానికి తగ్గినట్లు వెల్లడించింది. గురువారం రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

పట్టణ యువతుల్లో ఆందోళనకరంగా..

నిరుద్యోగం మొత్తం మీద తగ్గినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లోని విద్యావంతులైన యువతుల్లో మాత్రం నిరుద్యోగ సమస్య తీవ్రంగానే ఉంది. కేంద్రం విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే గణాంకాల ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల నిరుద్యోగ రేటు 17.2 శాతంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లోని మహిళల్లో ఇది ఏకంగా 30.7 శాతంగా నమోదైంది. పట్టణాల్లోని పురుషుల నిరుద్యోగ రేటు 16.7 శాతంగా ఉంది. అందువల్ల ఉపాధి కల్పన కోసం రూ. 99,446 కోట్ల వ్యయంతో 'పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' అమలు చేస్తున్నామని, దీని ద్వారా రాబోయే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు.

పంట నిల్వ సామర్థ్యంలేక రూ. 1.52 లక్షల కోట్లు ఆవిరి!

- పండ్లు, కూరగాయలు, మత్స్య సంపదలోనే అత్యధిక నష్టం
- లోక్‌సభలో ఎంపీలు ఈటల, చామల ప్రశ్నకు కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట.. కోత కోసిన తర్వాత సరైన నిల్వ సామర్థ్యం లేక, రవాణా లోపాలతో ఏటా రూ.1,52,790.42 కోట్ల మేర వృథా అవుతోందని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు గురువారం లోక్‌సభలో తెలంగాణ ఎంపీలు ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ అధ్యయనం ప్రకారం.. పంట కోత, ఆ తర్వాత దశల్లో జరుగుతున్న నష్టంలో పండ్లు, కూరగాయలే అధికంగా ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. పండ్ల వృథా వల్ల ఏటా రూ. 29,545 కోట్ల నష్టం వాటిల్లుతోంది. కూరగాయల వృథా విలువ రూ. 27,459 కోట్లుగా ఉంది. సముద్ర మత్స్య సంపద ఏకంగా రూ.29,871 కోట్ల మేర వృథా అవుతోంది. ధాన్యాల వృథా రూ.26 వేల కోట్లకు పైగా ఉందని కేంద్రం గణాంకాలను బయటపెట్టింది.

తెలంగాణ రహదారులపై మృత్యుఘోష..

- గతేడాది 7,949 మంది మృతి
- లోక్‌సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రోడ్డు ప్రమాదాల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోంది. ఒక్క 2024 సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 25,986 రోడ్డు ప్రమాదాల్లో 7,949 మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. గురువారం లోక్‌సభలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ప్రమాదాల తీవ్రత పెరిగినట్లు స్పష్టమవుతోంది. 2019లో 21,570 ప్రమాదాలు, 6,964 మరణాలు నమోదు కాగా.. 2024 నాటికి ప్రమాదాల సంఖ్య 25,986కు, మరణాల సంఖ్య 7,949కి చేరింది. ముఖ్యంగా జాతీయ రహదారులపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. 2024లో సంభవించిన మొత్తం మరణాల్లో 3,066 మంది జాతీయ రహదారులపైనే ప్రాణాలు కోల్పోగా, రాష్ట్ర రహదారులపై 686 మంది, ఇతర రోడ్లపై 4,197 మంది మృతి చెందారు.

ఏ జిల్లాలో ఎంతమంది ఏకగ్రీవమంటే...

సాక్షి, హైదరాబాద్: తొలివిడత పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డుల సభ్యుల వివరాలను గురువారం రాత్రి రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ప్రకటించింది. వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా 39 సర్పంచ్‌లు పోటీ లేకుండా ఎన్నిక కాగా, ఆ తర్వాత జాబితాలో వరుసగా... ఆదిలాబాద్ జిల్లాలో 166 సర్పంచ్ పదవులకు ఎన్నికలు నోటిఫై చేయగా 33 చోట్ల ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. నిజామాబాద్ జిల్లాలో 184 స్థానాలకు 29, నల్లగొండ జిల్లాలో 318 స్థానాలకు 22, యాదాద్రి భువనగిరి జిల్లాలో 153 సర్పంచ్‌లకు 16, సిద్దిపేటలో 163 స్థానాలు 16, నిర్మల్‌లో 136 స్థానాలకు 16, మెదక్ జిల్లాలో 160 స్థానాలకు 16 చోట్ల ఏకగ్రీవం అయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో 106 సర్పంచ్ స్థానాలకు 15, భద్రాద్రి కొత్తగూడెంలో 159 స్థానాలకు 14, నాగర్ కర్నూల్‌లో 151 స్థానాలకు 14, నారాయణపేట జిల్లాలో 67 పంచాయతీలకు 14, వరంగల్ జిల్లాలో 91 స్థానాలకు 11, కామారెడ్డిలో 167 స్థానాలకు 11, జనగామలో 110 స్థానాలకు 10 సర్పంచ్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి. రాజన్న సిరిసిల్లలో 85 సర్పంచ్‌లకు 9, ములుగు జిల్లాలో 48 స్థానాలకు 9, మహబూబాబాద్‌లో 155 స్థానాలకు 9, జయశంకర్ భూపాలపల్లిలో 82 స్థానాలకు 9, సంగారెడ్డి జిల్లాలో 136 స్థానాలకు 7, సూర్యాపేట జిల్లాలో 159 సర్పంచ్‌లకు 7, కొమురంభీం జిల్లాలో 114 స్థానాలకు 7, మంచిర్యాల జిల్లాలో 90 స్థానాలకు 6, రంగారెడ్డి జిల్లాలో 174 స్థానాలకు 6చోట్ల, వనపర్తిలో 87 సర్పంచ్‌లకు 5, హనుమకొండ జిల్లాలో 69 స్థానాలకు 4, జగిత్యాలలో 122 స్థానాలకు 4, పెద్దపల్లిలో 99 స్థానాలకు 4, కరీంనగర్ జిల్లాలో 92 సర్పంచ్‌లకు 3 స్థానాల్లో పోటీలేకుండా ఎన్నికయ్యారు.

ఏకగ్రీవ వార్డులు ఇలా...

ఆదిలాబాద్‌లో అత్యధికంగా 953 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా... ఆ తర్వాత వికారాబాద్ జిల్లాలో 2,198 వార్డులకు 652 మంది పోటీ లేకుండా గెలిచారు. ఇక వరుసగా చూస్తే... నిజామాబాద్ జిల్లాలో 1,642 వార్డులకు 575, నిర్మల్ జిల్లాలో 1,072 వార్డులకు 471 మంది, కామారెడ్డిలో 1,520 వార్డులకు 433 మంది, నల్లగొండ జిల్లాలో 2,870 వార్డుసభ్యులకు 375 మంది, జగిత్యాల జిల్లాలో 1,172 వార్డులకు 349, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,436 వార్డులకు 336, మెదక్‌లో 1,402 వార్డులకు 332 మంది చోట్ల పోటీ లేకుండా ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లాలో 1,740 వార్డులకు 323 మంది, కరీంనగర్ జిల్లాలో 866 స్థానాలకు 276, మంచిర్యాలలో 816 వార్డులకు 268, మహబూబాబాద్‌లో 1,338 స్థానాలకు 266, మహబూబ్‌నగర్ జిల్లాలో 1,188 వార్డులకు 264, యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,286 వార్డులకు 243, జనగామలో 1,024 వార్డులకు 228, రాజన్న సిరిసిల్లలో 748 వార్డులకు 227, సిద్దిపేట జిల్లాలో 1,432 వార్డులకు గాను 224, వరంగల్‌లో 800 స్థానాలకు 215 చోట్ల, పెద్దపల్లి జిల్లాలో 896 వార్డులకు 211 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నారాయణపేట జిల్లాలో 572 వార్డులకు 210, నాగర్‌కర్నూల్‌లో 1326 వార్డులకు 208, సూర్యాపేటలో 1,442 వార్డులకు 198, రంగారెడ్డిలో 1530 వార్డులకు 190, హనుమకొండ జిల్లాలో 658 వార్డులకు 153, జయశంకర్ భూపాలపల్లిలో 712 స్థానాలకు 151, ములుగులో 420 వార్డులకు 128, సంగారెడ్డి జిల్లాలో 1,246 వార్డులకు 113, వనపర్తి జిల్లాలో 780 వార్డులకు 104, జోగుళాంబ గద్వాలలో 974 వార్డులకు 79 చోట్ల పోటీ లేకుండా ఎన్నికయ్యారు.

ఉపసర్పంచ్ ఎన్నికకు...

ఏదైనా గ్రామపంచాయతీలోని వార్డులన్నీ ఏకగ్రీవమైన పక్షంలో పోటీచేసే అభ్యర్థుల జాబితాను ప్రకటించిన రోజునే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని జిల్లా కలెక్టర్లు, డీపీఓలు, ఎంపీడీఓలకు ఎస్ఈసీ సూచించింది. దీనికి సంబంధించి ముందుగా జిల్లా కలెక్టర్ల నుంచి 'నిరభ్యంతర సర్టిఫికెట్' తీసుకోవాలని, నిబంధనలకు అనుగుణంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు సంబంధించిన నోటిఫికేషన్ జారీచేయాలని తెలిపింది. కొన్ని గ్రామపంచాయతీల్లో ఒకటి, రెండు వార్డుల్లోనూ ఎన్నికలు జరగాల్సి ఉంటే, ఆ ఎన్నిక పూర్తయ్యాక ఓట్లు లెక్కించాక ఉప సర్పంచ్ ఎన్నికను చేపట్టాలని పేర్కొంది.

ఎన్నికల హామీల అమలుకు రూ. వేలకోట్లు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ఎన్నికల హామీల అమలుకు వేల కోట్ల రూపాయలు వెచ్చించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఆ వివరాలు ఇలా..

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కింద సగటున రోజుకు ఏకంగా 34.32 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు పథకాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 1వ తేదీ నాటికి రూ. 8,402 కోట్ల మేరకు మహిళలు బస్సుల్లో ప్రయాణించారు.
- పేదింటి మహిళలకు గ్యాస్ ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం రూ. 500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రంలో 42.90 లక్షల కుటుంబాలు గ్యాస్ సబ్సిడీతో లబ్ధి పొందుతున్నాయి. వీరి పేరిట ప్రభుత్వం రూ.700 కోట్ల సబ్సిడీని భరిస్తోంది.
- గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లలోపు విద్యుత్తు వాడే గృహ వినియోగదారులందరికీ జీరో బిల్లులు జారీ చేసింది. దీంతో దాదాపు 52.28 లక్షల కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గింది. ఇప్పటివరకు రూ. 3,438 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసింది.
- ఎకరానికి రూ.12 వేల చొప్పున రాష్ట్రంలోని రైతులందరికీ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తోంది. మొత్తం 1,57,51,000 ఎకరాలకు సంబంధించి 69,86,548 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈ నిధులు జమ చేసింది. గత సీజన్‌లో కేవలం 9 రోజుల్లోనే రూ.8744 కోట్లు జమ చేసింది. అలాగే భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు ఆర్థిక సహాయం అందించే 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద, రెండు విడతల్లో రూ.6,000 చొప్పున డబ్బు జమ చేసింది.
- సన్న ధాన్యం పండించే రైతులను ప్రోత్సహించేందుకు క్వింటాల్ కు రూ. 500 అదనంగా బోనస్ రూపంలో ప్రభుత్వం అందిస్తోంది. ఈ సీజన్లో ఇప్పటికే సన్నాలు అమ్మిన రైతులకు రూ.314 కోట్ల బోనస్ చెల్లించింది.
- రైతులకు ఒకేసారి రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేసే కార్యక్రమం ద్వారా ఏకంగా 25.35 లక్షల మంది రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేసింది. తొలి ఏడాదిలోనే రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసింది.
- ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఈ ఏడాది ప్రతి శాసనసభా నియోజకవర్గానికి 3,500 చొప్పున రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే మూడు లక్షలకు పైగా ఇళ్లు నిర్మాణ దశలో ఉండగా, నిర్మాణాలు పూర్తిచేసుకున్న ఇళ్లకు రూ.3,200 కోట్లకు పైగా నిధులు ప్రభుత్వం విడుదల చేసింది.
- ఆరోగ్య శ్రీ పరిధిని రూ. 10 లక్షలకు పెంచింది. ఈ పథకం ద్వారా గుర్తించిన 1835 రకాల జబ్బులకు వైద్యం చేయించుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోపే ఆరోగ్య శ్రీ ట్రస్టు ద్వారా ఆమోదం పొందే వ్యవస్థను తయారు చేసింది.
- ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం 78 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటికి ప్రభుత్వం రూ.15,600 కోట్ల బడ్జెట్ కేటాయించింది.

నాలుగేళ్లలో 4194 ఎక్సైజ్ కేసులు

- 824 వాహనాలు జప్తు
- 24,236 కిలోల గంజాయి స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: గంజాయి, డ్రగ్స్ కట్టడిలో భాగంగా 2021 నుంచి 2025 వరకు 7,131 మంది నిందితులపై 4,194 కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్ శాఖ కమిషనర్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 24,236 కేజీల గంజాయిని, 21,035 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి రవాణాకు వినియోగించిన 1,824 వాహనాలను సీజ్ చేసినట్టు వెల్లడించారు. డ్రగ్స్ పరంగా చూస్తే.. 2803.13 ఎండీఎంఏ, 689 ఎల్ఎస్‌డీ బ్లాస్ట్స్, 46.47 కేజీల హ్యాష్ ఆయిల్, 383 గ్రాముల కొకైన్, 701.3 గ్రాముల హెరాయిన్, 227.6 గ్రాముల నల్లమందును స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన కేసులలో శిక్షల పురోగతి 3.23 శాతంగా ఉందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన 2014 నుంచి 2022 వరకు ఎక్సైజ్‌శాఖ నమోదు చేసిన కేసులలో 22 కేసుల్లో శిక్షలు పడగా, 2023 నుంచి 2025 వరకు 49 కేసుల్లో 152 మందికి శిక్షలు ఖరారయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం 2,659 గంజాయి, డ్రగ్స్ కేసులు కోర్టుల్లో విచారణ పెండింగ్‌లో ఉన్నట్టు ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'నగర్ వన యోజన పథకం' కింద 46 నగర వనాలు

- వన్యప్రాణుల సంరక్షణకు ప్రతిశిబిరంలో 5 మంది వాచర్లతో 110 బేస్ క్యాంపులు...
- అటవీ శాఖ ద్వివార్షిక ప్రగతి నివేదిక (2023–25)లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం 'నగర్ వన యోజన పథకం' కింద రాష్ట్రానికి 46 నగర వనాలను మంజూరు చేసింది. వీటి అభివృద్ధికి రూ. 18.90 కోట్లు కేటాయించింది. ఈ మొత్తాన్ని పచ్చదనం పెంపుదల, మొక్కలు నాటడం, అవగాహన కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం పెంపుదల తదితర అంశాల నిర్వహణకు వినియోగిస్తారు. రెండోదశలో భాగంగా 14 నగర్ వన వాటికలను కేటాయించగా వాటిలో 13 ఇప్పటికే పూర్తయినట్టు....తాజాగా తెలంగాణ అటవీ శాఖ ద్వివార్షిక ప్రగతి నివేదిక (2023–25)లో వెల్లడించింది. వన్యప్రాణుల పరిరక్షణ బలోపేతానికి... ప్రతి శిబిరంలో 5 మంది వాచర్లతో 110 బేస్ క్యాంపులు... ముఖ్యంగా పులులు, అడవి జంతువుల పర్యవేక్షణకు 241 జంతు ట్రాకర్లు ఏర్పాటు చేసినట్టు ఇందులో పేర్కొన్నారు. రక్షిత ప్రాంతాలలో 14 చెక్ పోస్టులు, అక్రమ కార్యకలాపాల నియంత్రణకు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని కృష్ణా నది వెంబడి నాలుగు నది పెట్రోలింగ్ పార్టీలు ప్రవేశపెట్టినట్టు తెలిపారు. అటవీ వన్యప్రాణుల నేరాలను తనిఖీ చేయడానికి 6 మొబైల్ స్ట్రైక్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్‌లో తీవ్రమైన వన్యప్రాణుల నేరాల దర్యాప్తునకు అటవీ, పోలీసు అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశారు.

క్రియాశీలంగా టీపీసీబీ..

ఈ నివేదిక ప్రకారం...తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పర్యావరణ చట్టాలు, నియమాలను అమలు చేసే చట్టబద్ధమైన అధికారాలు కలిగిన సంస్థ. కాలుష్య సంభావ్యత ఆధారంగా సెంట్రల్ పీసీబీ 4 రకాల పరిశ్రమలను (అతి ఎరుపు, ఎరుపు, నారింజ, ఆకుపచ్చ తెలుపు) వర్గాలుగా వర్గీకరించింది. టీజీపీసీబీ పరిధిలోకి వచ్చే మొత్తం పరిశ్రమలు 12,264 రాష్ట్రంలో ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 2,193 నీటి కాలుష్య కారక పరిశ్రమలు, 3,164 వాయు కాలుష్య కారక పరిశ్రమలు ఉన్నట్టుగా గుర్తించారు. 2024 జనవరి, నుంచి 2025 అక్టోబర్ వరకు పరిశ్రమల నుంచి 7,966 మురుగునీటి / ప్రవాహదార వ్యర్థాల నమూనాలు, 3,807 గాలి నమూనాలను సేకరించి పీసీబీ విశ్లేషించారు. ప్రభావవంతమైన ఫిర్యాదుల పరిష్కారాన్ని నిర్ధారించి, టీజీపీసీబీ టోల్–ఫ్రీ నంబర్ (10741), ఆన్‌లైన్ ఫిర్యాదు యాప్ 'జనవాణి–కాలుష్య నివారిణి'ని ప్రారంభించింది. బల్క్ డ్రగ్, రసాయన పరిశ్రమల నుంచి వచ్చే ప్రధాన నీటి కాలుష్యాన్ని జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జెడ్ఎల్‌డీ) వ్యవస్థలను కఠినంగా అమలు చేస్తున్నారు. పరిశ్రమలలో శుద్ధి చేయబడిన మురుగునీటి పునర్వినియోగాన్ని పీసీబీ ప్రోత్సహిస్తోంది. 2024 జనవరి, నుంచి 2025 అక్టోబర్ వరకు...మొత్తం 2,069 పరిశ్రమలను సమీక్షించారు. 305 పరిశ్రమలకు మూసివేత ఉత్తర్వులు / ఉత్పత్తిని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. షరతులకు అనుగుణంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత 697 పరిశ్రమలకు మూసివేత రద్దు ఉత్తర్వులు జారీ చేశారు.

రెండేళ్ల పాలనపై శ్వేతపత్రం

బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలను మోసం చేసి రెండేళ్లు పూర్తి చేసుకున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు చేసుకుంటోందని ఎద్దేవా చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం డీకే అరుణ విలేకరులతో మాట్లాడారు. హిందువుల మనోభావాలను దెబ్బ తీసేలా, గ్రామ దేవతలను అవమానించిన సీఎం రేవంత్ రెడ్డిని పొలిమేరలదాకా తరిమి కొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. హిల్ట్ పి పాలసీ పేరిట భూముల కుంభకోణానికి తెరలేపి, రూ.లక్షల కోట్లు జేబులో వేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. జూరాల ప్రాజెక్టును కాపాడేందుకు ఇరిగేషన్ వంతెన నిర్మాణంపై పునరాలోచన చేయాలని కోరారు. రెండేళ్లుగా గ్రామ పంచాయతీలకు నయాపైసా విడుదల చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి, నాయకులకు ఓటు అడిగే నైతిక అర్హత లేదన్నారు.

డీజీపీ కార్యాలయంలో రోశయ్య వర్ధంతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారిక కార్యక్రమంగా మాజీ గవర్నర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య వర్ధంతిని గురువారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసిన రోశయ్య సేవలను ఆయన స్మరించుకున్నారు. కార్యక్రమంలో శాంతి భద్రతల ఏఐజీ రమణకుమార్, పోలీస్ అధికారులు, డీజీపీ కార్యాలయ మినిస్ట్రీయల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం పెట్టండి

బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రెండేళ్ల పాలనలో చేసిన అప్పులు, రైజింగ్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కోసం చేసే వ్యయం వంటి వివరాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ డిమాండ్ చేశారు. రెండేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దివాళా పరిస్థితికి నెట్టేసి, రూ. 2 లక్షల కోట్లకుపైగా కొత్త అప్పులు మోపిన కాంగ్రెస్ ప్రభుత్వం...తన పాలనా వైఫల్యాలను దాచిపెట్టేందుకు 'రైజింగ్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' పేరుతో కొత్త నాటకం ఆడుతోందని మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 'రైజింగ్ తెలంగాణ' పేరిట నడుపుతున్నది అంతా నాటకమేనని విమర్శించారు.ఈ సమ్మిట్ కేవలం ప్రచార ఆర్భాటానికేనని, కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక దుర్వినియోగం, ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేని తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే అన్నారు. అసలు ఇది తెలంగాణ రైజింగ్ కాదని– రైజింగ్ డెబ్ట్స్, రైజింగ్ ఇన్‌ఫ్లేషన్, రైజింగ్ పవర్ టారిఫ్స్, రైజింగ్ లైస్ మాత్రమేనని ఎద్దేవాచేశారు. రేవంత్ సర్కార్‌లో నిజంగా 'రైజ్' అవుతున్నది ఏదైనా ఉందంటే, అది అప్పు తీసుకునే దురాశ, ప్రచారం కోసం ఖర్చు చేసే పిచ్చి మాత్రమేనంటూ ఎద్దేవా చేశారు.

హిందూ దేవతల్ని దూషిస్తే బుద్ధి చెబుతాం

వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ బాలస్వామి

సాక్షి, హైదరాబాద్: ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ దేవతలను దూషించడం ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డిని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ప్రశ్నించారు. హిందూ విధానాలు, హిందూ ఆరాధన పద్ధతులను అవమానించే రీతిలో మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని గురువారం ఒక ప్రకటనలో ఆయన హెచ్చరించారు. చెట్టును, పుట్టను, మట్టిని, పామును, కుక్కను, ఎలుకను, బల్లిని కూడా పూజించే ఆరాధ్య భావం హిందువులలో ఉందని స్పష్టం చేశారు. ప్రకృతిని ఆరాధిస్తూ.. గాలి, నీరు, నిప్పు పంచభూతాలను కూడా పూజించే గొప్ప సంస్కృతి హిందువులదని పేర్కొన్నారు. హిందువుల అభిప్రాయాలు, పూజా విధానాలను ఎగతాళి చేసిన ముఖ్యమంత్రి హిందూ సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని బాలస్వామి డిమాండ్ చేశారు.

సాగుబడి

అనూరాధ కార్తె: డిసెంబర్ 2 వరకు
జ్యేష్ఠ కార్తె: 3 నుంచి

డిసెంబర్ 5
ప్రపంచ నేలల దినోత్సవం

World Soil Day

ఐక్యరాజ్యసమితి ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ఆధ్వర్యంలో డిసెంబర్ 5న ప్రపంచ నేలల దినోత్సవం జరుపుకుంటున్నాం. 2025 నేలల దినోత్సవం కోసం 'ఆరోగ్యకరమైన నగరాలకు ఆరోగ్యకరమైన నేలలే పునాది' అనే థీమ్‌ను తీసుకుంది. ఆహార భద్రత, పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యం, స్థిరమైన అభివృద్ధికి దోహదపడటంలో నేలలు పోషించే కీలక పాత్ర గురించి ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో, రైతుల్లో, పాలకుల్లో అవగాహన పెంపొందించటానికి ప్రతి సంవత్సరం నేలల దినోత్సవం జరుపుకుంటున్నాం. థాయిలాండ్ ప్రభుత్వం చొరవతో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం ద్వారా ప్రపంచ నేలల దినోత్సవాన్ని జరుపుకోవటం 2014లో ప్రారంభమైంది. ఎఫ్ఏఓ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వేడుకగా నేలల పండుగ జరుగుతోంది.

ఆరోగ్యకరమైన నగరాలు నేలలు

గ్రామీణ ప్రకృతి దృశ్యాలలో మాత్రమే కాకుండా పట్టణ వాతావరణాల్లో కూడా నేలలు పోషించే ముఖ్యమైన పాత్రను ఐరాస ఆహార వ్యవసాయ సంస్థ హైలైట్ చేస్తోంది. అందుకే ఈ సంవత్సరం 'ఆరోగ్యకరమైన నగరాలకు ఆరోగ్యకరమైన నేలలు' అనే థీమ్ తీసుకుంది. ఉష్ణోగ్రత, నీటిని నియంత్రించడం నుంచి, గాలి నాణ్యతను మెరుగుపరచడం, పచ్చని ప్రదేశాలకు పునాది కావడం వరకు నేలల ప్రాధాన్యత విస్తరించి ఉంది. ఆరోగ్యకరమైన నేలలు వాతావరణ మార్పులను నిలువరించటం, జీవవైవిధ్యాన్ని కాపాడటం ద్వారా మానవ శ్రేయస్సుకు స్థిరమైన పట్టణాలు, నగరాల అభివృద్ధికి ఎలా దోహదపడుతుందో ఈ ఏడాది నేలల దినోత్సవం సందర్భంగా ఎఫ్ఏఓ తెలియజెప్తోంది. ఆరోగ్యం ఒక్కటే (వన్ హెల్త్) అనే ప్రచారోద్యమం ద్వారా నేలల ఆరోగ్యం, జంతుజాలం ఆరోగ్యం, మనుషుల ఆరోగ్యం వేర్వేరు కాదు పరస్పరాధారితాలనే చైతన్యాన్ని ప్రజల్లో, పాలకుల్లో పాదుకొల్పటానికి ఎఫ్ఏఓ కృషి చేస్తోంది. ఈ భావనను గ్రీన్ సిటీస్ ఇనిషియేటివ్ ద్వారా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 300కు పైగా నగరాలకు వన్ హెల్త్ స్ఫూర్తిని అందిస్తోంది.

నేల సీలింగ్

నగరాలు, పట్టణ ప్రాంతాల్లో నేలల ఆరోగ్యం ఎందుకు దెబ్బతింటోంది? సాయిల్ సీలింగ్ ఒక ముఖ్య కారణం. నేల సీలింగ్ అంటే కాంక్రీటు లేదా తారు రోడ్లను మట్టి కనిపించకుండా ప్లాస్టింగ్ చేసెయ్యటం. భవనాలు లేదా ఇతర నిర్మాణాలతో నేలను పూర్తిగా కప్పేయటం. వర్షపు నీరు, గాలి, ఎండ నేలకు సోకనివ్వని పదార్థాలతో నేల ఉపరితలాన్ని శాశ్వతంగా కప్పేస్తున్నాం. ఒక్కసారి మట్టిని కాంక్రీటు నిర్మాణాలు, తారు, సిమెంటుతో కప్పేస్తే వాటిని సులభంగా తొలగించలేం. దీని వల్ల నేల పర్యావరణ పరంగా తాను సహజంగా అందించే సేవలను నగరాలు, పట్టణాలకు అందించలేని స్థితిలో కాంక్రీటు అడుగున మిన్నకుండిపోతోంది.

నగరాల శ్రేయస్సుకు నేలలు కీలకం

నగరాలు చల్లగా, పచ్చగా, సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన నేలలు కీలకమని ఎఫ్ఏఓ నొక్కిచెప్తోంది. పట్టణాలు, నగరాల్లో మట్టి కనపడకుండా కాంక్రీటు, తారు, సిమెంటు పూయటం వల్ల నేలలు వేడిని బంధిస్తాయి. వరదలను తీవ్రతరం చేస్తాయి. గాలి శీతలీకరణ కోసం ఇంధన అవసరాలను పెంచుతాయి. 2050 నాటికి నగరాల్లో మూడింట రెండు వంతుల మంది ప్రజలు నివసించే అవకాశం ఉందని అంచనా. పట్టణ, నగర ప్రాంతాల్లో నేలను పూర్తిగా కప్పిపెట్టేయకుండా వీలైనంత సహజంగా ఉంచగలిగితే ఆరోగ్యకరమైన నగరాల నిర్మాణం చేసుకోవచ్చు. వైవిధ్యమైన వృక్ష సంపద నగరాలను చల్లబరచడానికి, కర్బనాన్ని నిల్వ చేయడానికి, నీటిని గ్రహించడానికి, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి, ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొనే శక్తిని ఇనుమడింపజేయటానికి ఆరోగ్యకరమైన నేలలు దోహదం చేస్తాయి.

నేలల సజీవ శక్తి

పట్టణ నేలలను కాంక్రీటుతో కప్పేయటం వల్ల కాలుష్యం పెరుగుతోంది. నేల ఉత్పాదకత నాశనమవుతోంది. జీవవైవిధ్యం దెబ్బతింటోంది. మట్టి దాదాపు 59% జీవ జాతులకు ఆవాసం. నేలలను కాంక్రీటు మయం చెయ్యటం అంటే నేలల జీవ శక్తిని హరించటమే. నేలల సజీవ శక్తిని రక్షించడం వల్ల నేల ఉత్పాదకత, పోషకాల రీసైక్లింగ్, నీటి వడపోత వంటి సేవలకు అంతరాయం లేకుండా ఉంటుంది. తారు, సిమెంటుతో మూసివేయకుండా నేలలను ఉంచితే పచ్చని చెట్లకు జీవాన్నిస్తాయి. తద్వారా పట్టణ వాతావరణాన్ని భూతాపాన్ని తట్టుకొని ఆరోగ్యంగా ఉండేలా నేలలు బలోపేతం చేయగలుగుతాయి.

నేలల పునరుద్ధరణ ఆరోగ్యకరం

ట్రాఫిక్, పరిశ్రమలు, శుద్ధి చేయని మురుగునీరు, ఘన వ్యర్థాలు పట్టణాలు, నగర ప్రాంతాల్లో నేల కాలుష్యానికి దారితీస్తాయి. పర్యావరణం, ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తాయి. నేలల ప్రాధాన్యాన్ని గుర్తించడం, నిర్వహించడం, పునరుద్ధరించడం వల్ల ప్రాణాంతక అనారోగ్యాలను నివారించవచ్చు, తగ్గించవచ్చని ఎఫ్ఏఓ చెబుతోంది. ఆరోగ్యకరమైన నేలల పునరుద్ధరణ ద్వారా పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయం, తోటలు, ఇంటి పంటలు, మిద్దె తోటలు, పచ్చని ప్రదేశాలకు ఊతం ఇవ్వటం ద్వారా ఆరోగ్యకరమైన నగరాలను నిర్మించుకోవచ్చని పేర్కొంది.

సాగు నేలను మింగేస్తున్న నగరాలు

నానాటికీ పంట భూముల విస్తీర్ణం తగ్గిపోతోంది. నగరాలు, పట్టణాలు విస్తరిస్తూ పోతున్నాయి. ప్రపంచ సగటు ఉత్పాదకశక్తి కంటే 1.77 రెట్లు ఎక్కువ ఉత్పాదకత కలిగిన పంట భూముల్లోకి పట్టణాలు, నగరాల విస్తరణ జరుగుతుందని ఎఫ్ఏఓ భావిస్తోంది. 2030 నాటికి నగరాలు, పట్టణాల విస్తరణ ప్రపంచ వ్యవసాయ భూముల్లో 2.4% మేరకు హరిస్తుంది. ఫలితంగా 2000లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఆహారోత్పత్తిలో 3–4% వరకు ఆహారోత్పత్తి తగ్గిపోతుందని అంచనా.

సమగ్ర భూ వినియోగం, పటిష్ట పట్టణ ప్రణాళిక, పరిమిత స్థలంలోనే పట్టణాభివృద్ధి, వ్యవసాయ– ఆహార పంపిణీ వ్యవస్థల ఏకీకరణ ద్వారా నగరీకరణ ముప్పు నుంచి పంట భూములను రక్షించడం, నేలలను కాపాడటం సాధ్యమవుతుందని ఎఫ్ఏఓ చెబుతోంది. ఆహార భద్రతకు, స్థిరమైన నగరాలను నిర్మించడానికి ఈ చర్యలు చాలా ముఖ్యమైనవని సూచిస్తోంది.

అర్బన్ అగ్రికల్చర్‌తో జీవనోపాధి

పట్టణాలు, నగరాలు, వాటి పరిసర ప్రాంతాల్లో నేల ఆరోగ్యాన్ని నిలబెట్టుకోవడం ద్వారా వ్యవసాయ ఆహార పంపిణీ వ్యవస్థలను కాపాడుకోవచ్చు. చక్కని నిర్వహణలో ఉన్న, ఆరోగ్యకరమైన నేలల్లో పట్టణ వ్యవసాయాన్ని నగరవాసులకు నేర్పించటం ద్వారా వారికి ఆహార భద్రత, పోషకాహార భద్రత కల్పించటంతో పాటు జీవనోపాధిని కూడా కల్పించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా పండిస్తున్న కూరగాయలు, చిక్కుళ్ళు, దుంపలలో 10% వరకు అర్బన్ అగ్రికల్చర్‌లోనే ఉత్పత్తి అవుతోంది. నగరాలు, పట్టణాల సామాజిక, ఆర్థిక, పర్యావరణ వ్యవస్థలో, వన్–హెల్త్ భావనలో అంతర్భాగంగానే అర్బన్ అగ్రికల్చర్‌ను చూడాల్సి ఉంటుందని.. గ్రామీణ వ్యవసాయానికి ఇది గొడ్డలి పెట్టు కాదని ఎఫ్ఏఓ స్పష్టం చేసింది.

నగరాలకు పచ్చందాలు

నగరాల్లో నేలలను పరిరక్షిస్తే చెట్లతో నిండిన ఆరోగ్యకరమైన పచ్చని ప్రదేశాలు వినోదాన్ని, మనోల్లాసాన్ని ప్రజలకు అందిస్తాయి. అంతేకాకుండా మానవ ఆరోగ్యం, శ్రేయస్సుకు కూడా అర్బన్ ఆరోగ్యకర నేలలు దోహదం చేస్తాయి. ఎందుకంటే వాన నీటిని పీల్చుకుంటూ సజీవంగా ఉండే నేలల్లోని సూక్ష్మజీవులు ప్రజలు, ముఖ్యంగా పిల్లల్లో, రోగనిరోధక వ్యవస్థ అభివృద్ధికి సహాయపడుతుందని ఎఫ్ఏఓ తెలిపింది.

వ్యర్థాలే నేలకు బలిమి

ప్రపంచ మునిసిపల్ వ్యర్థాలలో 70 %ను ఉత్పత్తి చేసే నగరాల్లో వ్యర్థాల నిర్వహణ ఒక ప్రధాన సమస్య. సేంద్రియ వ్యర్థాలను కంపోస్టుగా మార్చి వాడితే దాదాపు 20% ఆహారోత్పత్తి పెరుగుతుంది. పట్టణ సేంద్రియ వ్యర్థాలను బ్లాక్ సోల్జర్ ఫ్లై ఈగలకు మేపటం ద్వారా సురక్షితంగా ప్రాసెస్ చేస్తే కంపోస్ట్, బయోచార్ ఉత్పత్తి అవుతాయి. వీటిని అర్బన్ ప్రాంతాల్లో చెట్లకు వేయవచ్చు. ఈ వ్యర్థాలు పట్టణ నేలలకు పోషకాలను తిరిగి ఇవ్వగలవు. టెర్రస్ కిచెన్ గార్డెన్లకు, పచ్చని ప్రదేశాలకు పట్టణ వ్యర్థాలు ఎరువుగా మారతాయి. తద్వారా నగరాలను వాతావరణ మిత్రులుగా మారుస్తాయని ఎఫ్ఏఓ తెలిపింది.

నేలల ఆరోగ్యమే పెట్టుబడి

పట్టణాలు, నగరాల్లో నేలలను ఆరోగ్యకరంగా ఉంచితే అవి తిరిగి నగరానికి అందించే ప్రయోజనాలను మనం గుర్తించటం లేదు. దీన్ని గుర్తించకపోవడం వల్ల నగరాలు వరదలపాలవుతున్నాయి. వేడి కొలుములుగా మారుతున్నాయి. కాలుష్యానికి గురవుతున్నాయి. ఆరోగ్యకరమైన నేలలపై ఖర్చు పెట్టటం అనేది భవిష్యత్తు కోసం పెట్టుబడి పెట్టటమేనని గుర్తించాలని ఎఫ్ఏఓ చెబుతోంది. అర్బన్ ప్రాంతాల ఆరోగ్యాన్ని కాపాడటానికి, పట్టణ వ్యవస్థలను బలోపేతం చేయడానికి ముందస్తుగా పెట్టే పెట్టుబడిగా భావించి.. నగరాలు, పట్టణాల్లో నేలలను సహజంగా, సజీవంగా ఉంచటం కోసం నిధులు ఖర్చు చెయ్యాలని ఎఫ్ఏఓ సూచించింది.



మూడింట రెండు వంతులు

ప్రపంచంలోని 80% కంటే ఎక్కువ ఆహారం ఆరోగ్యకరమైన నేలలపై ఆధారపడిన గ్రామీణ చిన్న, సన్నకారు కుటుంబ రైతులే అందిస్తున్నారు. 2050 నాటికి మూడింట రెండు వంతుల మంది ప్రజలు నగరాల్లో నివసించే అవకాశం ఉంది. అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లోని నేలలు పట్టణ జనాభాకు ఆహారం ఇవ్వడానికి, రైతుల జీవనోపాధిని నిలబెట్టడానికి, ప్రపంచ ఆహార భద్రతను బలోపేతం చేయడానికి అవసరం. అందువల్ల గ్రామీణ పొలాల్లో భూముల పునరుజ్జీవనానికి దోహదపడే ప్రకృతి అనుకూల వ్యవసాయాన్ని ప్రోత్సహించే బాధ్యత నగర ప్రజలకు ఉంది.

నగరాలకు నేలల రక్షణ

ఆరోగ్యకరమైన నేలలు వరదలు, కొండచరియలు విరిగిపడటం, నేల కోత నుంచి నగరాలను నిశ్శబ్దంగా రక్షిస్తాయి. ఈ నేలల్లో పెరిగే మొక్కల వేర్లలో పదుల మిల్లీమీటర్ల వర్షపాతాన్ని నేలలు నిలుపుకుంటాయి. తద్వారా, చక్కని నిర్వహణలోని నేలలు నగర ప్రాంతాలకు పర్యావరణ పరంగా రక్షణ కల్పిస్తాయి. కాంక్రీటు, తారు, సిమెంటు చేయని నేలలో పెరిగే చెట్లు వాన నీటిని భూమిలోకి ఇంకింపజేయటం ద్వారా వరద ప్రవాహాన్ని తగ్గిస్తాయి. కోతను నివారిస్తాయి. పట్టణ మౌలిక సదుపాయాలకు విపత్తుల ముప్పును తగ్గుతుంది. పట్టణాలు, నగరాల్లో ప్రజలు, పాలకుల శ్రద్ధ వల్ల ఆరోగ్యకరంగా మిగిలిన నేలలు భూతాపోన్నతిని తట్టుకునే శక్తిని పట్టణాలు, నగరాలకు పెంచుతాయి.



– నిర్వహణ: పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

మీకు తెలుసా?

- ★ మన ఆహార పదార్థాల్లో 95% వ్యవసాయ భూముల్లోనే పండుతున్నాయి.
- ★ 33% నేలలు భూసారాన్ని కోల్పోయి క్షీణించిపోతున్నాయి.
- ★ భూమిపైన ఉండే కేవలం 2-3 సెం.మీ. మట్టిని ప్రకృతిసిద్ధంగా పెంపొందించడానికి 1,000 సంవత్సరాల వరకు పట్టవచ్చు. అందుకే మట్టిని జాతి సంపదగా గుర్తించి సంరక్షించుకోవాలి.
- ★ నేల పోషకాల గని. మొక్కలకు అవసరమైన 18 సహజంగా లభించే రసాయన మూలకాలలో 15ను నేలలే సరఫరా చేస్తాయి.
- ★ భూమిపై ఉన్న ప్రజల కంటే ఒక టేబుల్ స్పూన్ మట్టిలో ఎక్కువ జీవులు ఉన్నాయి.
- ★ ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల మంది ప్రజలు తాము తినే ఆహారంలో సూక్ష్మపోషకాల కొరతతో బాధపడుతున్నారు. దీన్నే 'పైకి కనిపించని ఆకలి' అని పిలుస్తారు. సాగు భూముల్లో జీవాన్ని, సారాన్ని పెంపొందించుకుంటే పంట దిగుబడుల్లో పౌష్టిక విలువలు పెరిగి ఈ హిడెన్ హంగర్ తగ్గుతుంది.
- ★ సాగు భూముల్లో ప్రస్తుతం విధ్వంసకరమైన పద్ధతులు అనుసరిస్తున్నాం. సాగు భూముల్లో ఆరోగ్యదాయకమైన వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తే 58% వరకు ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని ఒక అంచనా.
- ★ భూమిపై జీవిస్తున్న దాదాపు 59% జీవజాతులకు నేలే నిలయం.

బిజినెస్ రీల్

ఉచిత క్రెడిట్ స్కోరు కోసం యస్ బ్యాంక్ మైక్రోసైట్

ముంబై: ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ తాజాగా 'స్కోర్‌క్యాహువా.బ్యాంక్.ఇన్' పేరిట మైక్రో సైట్‌ని ప్రవేశపెట్టింది. క్రెడిట్ స్కోర్‌ను ఉచితంగా చెక్ చేసుకునేందుకు, రుణాల సంబంధ అంశాలు, క్రెడిట్ ప్రొఫైల్ ప్రాధాన్యత గురించి తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. క్రెడిట్ స్కోర్‌పై అవగాహన పెంచేందుకు, రుణాల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం వల్ల వచ్చే ప్రయోజనాలను తెలియజేసేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద దీన్ని రూపొందించినట్లు యస్ బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఇందులో ఆర్థిక అంశాల సంబంధిత బ్లాగ్‌లు, వీడియోలు క్రెడిట్ స్కోరుపై అపోహలు తొలగించే సమాచారం మొదలైనవి ఉంటాయి. ఈ సందర్భంగా నాలుగు టీవీ ప్రకటనలను కూడా బ్యాంకు ఆవిష్కరించింది.

తిలక్‌నగర్ నుంచి ఇంపీరియల్ బ్లూ

కొనుగోలు పూర్తి చేసిన కంపెనీ

న్యూఢిల్లీ: లిక్కర్ తయారీ కంపెనీ తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ ఇంపీరియల్ బ్లూ బిజినెస్‌ను పూర్తిగా సొంతం చేసుకుంది. పెర్నార్డ్ రికార్డ్ ఇండియా(పీఆర్ఐ) నుంచి స్లంప్ సేల్ పద్ధతిలో ఇంపీరియల్ బ్లూ విభాగాన్ని తిలక్‌నగర్ కొనుగోలు చేసింది. మేన్షన్ హౌస్ బ్రాందీ, కొరియర్ నెపోలియన్ బ్రాందీ, మేన్షన్ హౌస్ గోల్డ్ విస్కీ, బ్లూ లాగూన్ జిన్ బ్రాండ్ల కంపెనీ ఇందుకు రూ. 3,442 కోట్లు వెచ్చించింది. లావాదేవీ పూర్తయిన నాలుగేళ్ల తదుపరి మరో 2.8 కోట్ల యూరోలు చెల్లించవలసి ఉన్నట్లు తిలక్‌నగర్ వెల్లడించింది. ఇంపీరియల్ బ్లూ కొనుగోలుతో దేశీయంగా వేగవంత వృద్ధిలో ఉన్న విస్కీ మార్కెట్లోని దిగ్గజ కంపెనీలలో ఒకటిగా తిలక్‌నగర్ అవతరించనుంది. అమ్మకాల పరిమాణంరీత్యా ఇంపీరియల్ బ్లూ దేశీయంగా మూడో పెద్ద బ్రాండ్‌గా నిలుస్తోంది. గతేడాది(2024–25)లో రూ. 3,067 కోట్ల ఆదాయం సాధించింది. ఇంపీరియల్ బ్లూ బిజినెస్ కొనుగోలుకి ఈ ఏడాది జూలైలో పీఆర్ఐతో తిలక్‌నగర్ తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-12-2025

విశాఖ	640–00
చిత్తూరు	663–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	645–00
విజయవాడ	670–00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	651–00
వరంగల్	653–00
రిటైల్ ధర	7.11

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,565.00	1.51
HDFCLIFE	763.15	1.49
TCS	3,227.00	1.48
SBILIFE	2,000.70	1.41
BEL	409	1.25

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDIGO	5,461.50	-2.39
RELIANCE	1,525.30	-0.88
HINDALCO	811	-0.65
MARUTI	15,979.00	-0.64
TITAN	3,794.00	-0.62

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,714
ఎన్ఎస్ఈ	88,337
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,19,710
ఎఫ్ఐఐ	- 1,944
డీఐఐ	+ 3,661

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	59.82 (రాత్రి 11.30కు)	$ 58.95 (క్రితం ముగింపు)
బ్రెంట్	63.47 (రాత్రి 11.30కు)	$ 62.67 (క్రితం ముగింపు)

అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌కు డిమాండ్

- నిర్వహణ ఆస్తులు రూ.2.5 లక్షల కోట్లు
- ఏడాది కాలంలో 13 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ: అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌కు ఇన్వెస్టర్ల నుంచి ఆదరణ పెరుగుతోంది. పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ప్రాధాన్యం చూపిస్తుండడంతో అక్టోబర్ చివరికి నాటికి అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ నిర్వహణలోని పెట్టుబడులు (ఏయూఎం) రూ.2.5 లక్షల కోట్లకు చేరాయి. ఏడాది కాలంలో ఏయూఎం విలువ 13 శాతం పెరిగింది. 2024 అక్టోబర్ చివరికి వీటి విలువ రూ.2.21 లక్షల కోట్లుగా ఉంది. ఈక్విటీ సూచీలు ఏడాదికి పైగా దీర్ఘకాలం పాటు దిద్దుబాటును చవిచూసిన కాలంలో అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్స్ ఆస్తులు పెరగడం అన్నది.. ఇన్వెస్టర్లు ఈక్విటీ, హైబ్రిడ్‌తో కలయిక ద్వారా పెట్టుబడుల వృద్ధితో పాటు స్థిరత్వానికి ప్రాధాన్యం చూపిస్తున్నట్టు తెలుస్తోంది. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ నిర్వహణలోని ఫోలియోలు ఏడాది కాలంలో 4 లక్షలు పెరిగి అక్టోబర్ చివరికి 60.44 లక్షలకు చేరాయి. 2024 అక్టోబర్ చివరికి ఇవి 56.41 లక్షలుగా ఉన్నాయి. ఒక పథకంలో ఒక ఇన్వెస్టర్ పెట్టుబడికి కేటాయించే సంఖ్యను ఫోలియోగా చెబుతారు. ఇలా ఒకే ఇన్వెస్టర్‌కు ఒకటికి మించిన పథకాల్లో ఫోలియోలు ఉండొచ్చు.

మెరుగైన రాబడులు

అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ బలమైన రాబడులు ఇస్తుండడం కూడా ఇన్వెస్టర్లు వీటిల్లో మరింత పెట్టుబడులకు ముందుకొస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విభాగం గత ఏడాది కాలంలో 7 శాతం చొప్పున సగటు రాబడినివ్వగా, రెండేళ్లలో 16.5 శాతం (వార్షిక) చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టాయి. ఐదేళ్ల కాలంలోనూ 17 శాతం రాబడినిచ్చాయి. రెండు, ఐదేళ్ల కాలాల్లో నిఫ్టీ 50 హైబ్రిడ్ కాంపోజిట్ డెట్ 65:35 ఇండెక్స్‌ను అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ పనితీరు పరంగా అధిగమించినట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ అండ్ డెట్ ఈ విభాగంలో పనితీరు పరంగా ముందుంది. రెండేళ్లలో ఏటా 19.6 శాతం చొప్పున కాంపౌండెడ్ రాబడిని ఇచ్చింది. ఐదేళ్లో అయితే ఏటా 24.7 శాతం రాబడి తెచ్చిపెట్టింది. ఆ తర్వాత మహీంద్రా మాన్యులైఫ్ అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్ రెండేళ్ల కాలంలో ఏటా 19.3 శాతం, ఐదేళ్లలో ఏటా 20.4 శాతం చొప్పున ఇన్వెస్టర్లకు రాబడిని అందించింది. బంధన్, ఎడెల్‌వీజ్, ఇన్వెస్కో ఇండియా అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ సైతం రెండేళ్ల కాలంలో ఏటా 18–19% మధ్య, ఐదేళ్లలో ఏటా 16.5–19.9% మధ్య ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టాయి. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ అండ్ డెట్ ఫండ్, మహీంద్రా మాన్యులైఫ్ అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్ ఇక మీదటా దీర్ఘకాలంలో మెరుగైన పనితీరు చూపించగలవని విశ్లేషకుల అంచనా.

భవిష్యత్తులో మరింత డిమాండ్..

''ఈక్విటీ–డెట్ కలయికతో ఉంటాయి కనుక రెండు విభాగాల నుంచి ఈ ఫండ్స్ ప్రయోజనం పొందుతాయి. బలమైన విభాగంగా బ్యాలన్స్‌డ్ ఫండ్స్ ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఈక్విటీ విభాగంలో హెచ్చుతగ్గులు ఉన్న కాలంలో డెట్ పెట్టుబడులు రాబడులకు రక్షణ కల్పిస్తాయి. ఈక్విటీ పెట్టుబడులు వృద్ధిని చూస్తున్న తరుణంలో మంచి రాబడులను సొంతం చేసుకుంటాయి. మధ్యస్థ లేదా తక్కువ రిస్క్‌తో కూడిన ఇన్వెస్టర్లకు ఇవి ఎంతో అనుకూలం''అని మావెనార్క్ వెల్త్ సీఈవో శంతను అవస్థి తెలిపారు. సెబీ నిబంధనల ప్రకారం అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ మొత్తం పెట్టుబడుల్లో 65–80 శాతం మధ్య ఈక్విటీల్లో, మిగిలినది డెట్‌లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది.

పోకో నుంచి సీ85 స్మార్ట్‌ఫోన్

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్స్ బ్రాండ్ పోకో తమ కొత్త 5జీ హ్యాండ్‌సెట్ సీ85ని డిసెంబర్ 9న అధికారికంగా ఆవిష్కరించనున్నట్లు వెల్లడించింది. మన్నిక, స్టయిల్‌పై ప్రధానంగా దృష్టి పెడుతూ 6000 ఎంఏహెచ్ బ్యాటరీ, 33వాట్స్ ఫాస్ట్ చార్జింగ్, 10వాట్స్ రివర్స్ చార్జింగ్‌లాంటి ప్రత్యేకతలతో దీన్ని రూపొందించినట్లు వివరించింది. తరచుగా చార్జింగ్ చేయాల్సిన అవసరం లేకుండా సాధారణ యూసేజీతో ఇది రెండు రోజులు పని చేయగలిగే సామర్థ్యంతో ఉంటుందని కంపెనీ పేర్కొంది.

నేడే ఆర్‌బీఐ ఎంపీసీ నిర్ణయాలు

- రెపో రేటును పావు శాతం తగ్గించొచ్చన్న అంచనాలు
- రూపాయి పతనం నేపథ్యంలో నిర్ణయంపై ఆసక్తి

ముంబై: ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) తన కీలక నిర్ణయాలను శుక్రవారం ప్రకటించనుంది. రెపో రేటును పావు శాతం తగ్గించొచ్చని ఎక్కువ మంది విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొందరు విశ్లేషకులు యథాతథ స్థితినే కొనసాగించొచ్చని భావిస్తున్నారు. ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో అత్యంత కనిష్ట స్థాయి 0.3 శాతానికి దిగిరావడం రెపో రేటు తగ్గింపునకు వీలు కల్పిస్తుందని కొందరు ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. అదే సమయంలో జీడీపీ వృద్ధి క్యూ2లో 8.2 శాతానికి బలపడడం, విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళుతున్న కారణంగా రూపాయి బక్కచిక్కుతున్న వేళ.. యథాతథ స్థితిని కొనసాగించొచ్చన్నది కొందరి విశ్లేషణగా ఉంది. ఈ అంచనాల నడుమ ఆర్‌బీఐ తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మూడు విడతల్లో ఆర్‌బీఐ రెపో రేటును ఒక శాతం తగ్గించడంతో 5.5 శాతానికి దిగిరావడం తెలిసిందే. సీఆర్ఆర్‌ను సైతం ఒక శాతం తగ్గించడంతో 3 శాతానికి దిగొచ్చింది.

భారత వృద్ధి 7.4 %

- అంచనాలు పెంచిన ఫిచ్
- గత అంచనా 6.9 శాతం
- రెపో పావు శాతం తగ్గించొచ్చని అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి అంచాలను పెంచుతున్నట్టు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ రేటింగ్స్ ప్రకటించింది. 2025–26లో 6.9 శాతం వృద్ధి నమోదుకావొచ్చన్న గత అంచనాను 7.4 శాతానికి పెంచింది. ఈ ఏడాది ప్రైవేటు వినియోగం వృద్ధికి ప్రధాన చోదకంగా ఉన్నట్టు వివరించింది. దీనికి తోడు ఇటీవల చేపట్టిన జీఎస్‌టీ సంస్కరణలతో సెంటిమెంట్ మెరుగుపడినట్టు తెలిపింది. ద్రవ్యోల్బణం గణనీయంగా దిగిరావడంతో ఆర్‌బీఐ డిసెంబర్ సమీక్షలో మరో పావు శాతం రెపో రేటును తగ్గించి, 5.25 శాతం చేయొచ్చని అంచనా వేసింది. 2025లో 100 బేసిస్ పాయింట్లు (ఒక శాతం) తగ్గింపునకు ఇది అదనమని పేర్కొంది. జూన్ త్రైమాసికంలో (క్యూ1) 7.8 శాతం, సెప్టెంబర్ త్రైమాసికంలో (క్యూ2) 8.2 శాతం చొప్పున జీడీపీ వృద్ధి నమోదు కావడంతో ఫిచ్ రేటింగ్స్ తన అంచనాలను సవరించినట్టయింది. కాకపోతే ద్వితీయ ఆరు నెలల్లో వృద్ధి రేటు కొంత నిదానించొచ్చని పేర్కొంది. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2026–27) భారత్ జీడీపీ వృద్ధి 6.4 శాతానికి తగ్గుతుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. ఆర్థిక పరిస్థితులు సరళంగా మారితే వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో ప్రైవేటు పెట్టుబడులు పుంజుకోవచ్చని పేర్కొంది. అక్టోబర్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 0.3 శాతానికి తగ్గడం తెలిసిందే. సెప్టెంబర్ 22 నుంచి జీఎస్‌టీ కింద 375 ఉత్పత్తులపై రేట్లు తగ్గడం ఇందుకు అనుకూలించింది.

బ్రూక్‌ఫీల్డ్ రీట్ రూ.3,500 కోట్లు సమీకరణ

సంస్థాగత ఇన్వెస్టర్లకు యూనిట్ల విక్రయం

న్యూఢిల్లీ: బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్ (రీట్) సంస్థాగత ఇన్వెస్టర్లకు యూనిట్ల విక్రయం ద్వారా రూ.3,500 కోట్లు సమీకరించనుంది. ఇందులో భాగంగా క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ఇష్యూని గురువారం ప్రారంభించింది. ఒక్కో యూనిట్ ఫ్లోర్ ప్రైస్‌గా రూ.327.33ను నిర్ణయించింది. ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు యూనిట్ల కేటాయింపు ద్వారా నిధులు సమీకరించే ప్రతిపాదనకు కంపెనీ బోర్డు గత వారం ఆమోదం తెలపడం గమనార్హం. బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రీట్‌ను నిర్వహించే బ్రూక్‌ప్రాప్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల కమిటీ డిసెంబర్ 4న క్యూఐపీ ప్రారంభించేందుకు నిర్ణయించినట్టు కంపెనీ స్టాక్ ఎక్స్చేంజ్‌లకు సమాచారం ఇచ్చింది. దేశవ్యాప్తంగా ఢిల్లీ, ముంబై, గురుగ్రామ్, నోయిడా, కోల్‌కతాలో 10 గ్రేడ్–ఏ ఆస్తులను బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రీట్ నిర్వహిస్తోంది. మొత్తం 29.1 మిలియన్ చదరపు అడుగుల వాణిజ్య స్థలాలను లీజుకు ఇవ్వగా, 0.6 మిలియన్ చదరపు అడుగులు నిర్మాణ దశలో ఉంది.

వేతనాల్లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ జీసీసీలు టాప్..

- డేటా సైంటిస్టుకు రూ. 46.9 లక్షల వరకు వార్షిక ప్యాకేజీ
- తర్వాత స్థానాల్లో రిటైల్, బ్యాంకింగ్, బీమా సెంటర్లు
- కెరియర్‌నెట్ నివేదిక

ముంబై: జూనియర్ల నుంచి సీనియర్ల వరకు వివిధ విభాగాలవ్యాప్తంగా అనుభవాన్ని బట్టి అత్యధిక వేతనాలివ్వడంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) అగ్రస్థానాన్ని దక్కించుకున్నాయి. రిటైల్, కమర్షియల్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా రంగ జీసీసీలు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. టాలెంట్ సొల్యూషన్స్ సేవల సంస్థ కెరియర్‌నెట్ రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వివిధ రంగాలకు చెందిన 50,000 మంది ప్రొఫెషనల్స్ జీతభత్యాల డేటా ఆధారంగా సంస్థ దీన్ని రూపొందించింది. దీని ప్రకారం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో డేటా సైంటిస్టుకు రూ. 22.1 లక్షల నుంచి రూ. 46.9 లక్షల వార్షిక ప్యాకేజీ ఉంటోంది.

అదే రిటైల్ బ్యాంకింగ్, ఇన్సూరెన్స్‌లో చూస్తే వరుసగా రూ. 19.90–44.50 లక్షలు, రూ. 18.40 – 44.30 లక్షల స్థాయిలో ఉంటోంది. ఇక ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో జూనియర్ స్థాయిలోని ఫుల్ స్టాక్ డెవలపర్లకు రూ. 20.7 లక్షల స్థాయిలో, సీనియర్‌లకు రూ. 47.5 లక్షల స్థాయిలో వేతనాలు ఉంటున్నాయి. అటు స్క్రమ్ మాస్టర్, సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్‌లాంటి ఉద్యోగాలకు ప్రారంభంలో ఒక మోస్తరు వేతనాలు ఉన్నా క్రమంగా, భారీ స్థాయికి చేరుతున్నాయి.

రష్యాకి మరిన్ని ఎగుమతులపై దృష్టి

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ: వాణిజ్య లోటును భర్తీ చేసుకునే దిశగా రష్యాకు ఎగుమతులను మరింతగా పెంచుకోవడానికి ఆస్కారం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. వినియోగ వస్తువులు, ఆహారోత్పత్తులు, వాహనాలు, ట్రాక్టర్లు, భారీ వాణిజ్య వాహనాలు, స్మార్ట్‌ఫోన్స్ లాంటి ఎలక్ట్రానిక్స్ మొదలైన విభాగాల్లో అవకాశాలు ఉన్నాయని ఇరు దేశాల వ్యాపార వర్గాలతో భేటీలో ఆయన పేర్కొన్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం 70 బిలియన్ డాలర్లకు చేరుకుందని మంత్రి తెలిపారు. అమెరికా భారీ టారిఫ్‌లను భారత్, పాశ్చాత్య దేశాల ఆంక్షలను రష్యా ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమీప భవిష్యత్తులో వాణిజ్య అసమానతలను తొలగించుకునే దిశగా కలిసి పని చేయాల్సి ఉందని పేర్కొన్నారు. 2024–25లో రష్యాకు భారత్ ఎగుమతులు 4.96 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 63.8 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2023–24లో 56.89 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య లోటు 59 బిలియన్ డాలర్లకు చేరింది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్దేశించుకున్నాయి. భారత పర్యటనకి వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బృంద సభ్యుడు, ప్రెసిడెన్షియల్ ఆఫీస్ డిప్యుటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మ్యాక్సిమ్ ఒరెష్కిన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్ నుంచి ఫార్మా, వ్యవసాయం, టెలికం పరికరాల్లాంటి ఆరు విభాగాల్లో ఎగుమతులు పెరిగేందుకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్, అమెరికా మధ్య సంబంధాలు సున్నితంగా మారిన తరుణంలో భారత్‌లో పుతిన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

ఏకీకృత రిటైల్ లైసెన్సు విధానం ఉండాలి

ప్రభుత్వానికి రిటైల్ పరిశ్రమ వినతి

న్యూఢిల్లీ: 'వన్ నేషన్, వన్ రిటైల్ లైసెన్స్' పేరిట దేశవ్యాప్తంగా ఒకే విధమైన రిటైల్ లైసెన్సింగ్ విధానాన్ని అమలు చేయాలని కేంద్రాన్ని రిటైల్ పరిశ్రమ కోరింది. అలాగే, నిబంధనలను సరళతరం చేయాలని విజ్ఞప్తి చేసింది. పాలసీల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కలిసి పని చేయాలని కోరింది. 'రిటైల్ వ్యాపారం నిర్వహించాలంటే అనేకానేక లైసెన్సులు కావాల్సి ఉంటోంది. ఈ నేపథ్యంలో సింగిల్ విండో, డిజిటల్ అనుమతులు, నిర్దిష్ట కాలవ్యవధిలో క్లియరెన్సులు ఉండేలా వన్ నేషన్, వన్ రిటైల్ లైసెన్స్ విధానాన్ని మనం అమలు చేసే అవకాశం ఉంటుందా అనేది పరిశీలించాలి' అని పరిశ్రమ సమాఖ్య సీఐఐ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా స్పెన్సర్ రిటైల్ సీఈవో అనుజ్ సింగ్ తెలిపారు. నిబంధనల సంక్లిష్టతలను, రాష్ట్రాలవారీగా ఉండే వ్యత్యాసాలను సరిచేస్తే పరిశ్రమ వృద్ధికి ఊతం లభిస్తుందని సింగ్ చెప్పారు. ప్రస్తుతం 1.3 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న భారత రిటైల్ పరిశ్రమ అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందని, 2030 నాటికి 2 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుతుందనే అంచనాలు నెలకొన్నాయని ఆయన పేర్కొన్నారు. కేవలం కొద్ది నగరాలకే పరిమితం కాకుండా ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి స్థాయిని దాటి చిన్న పట్టణాలు కూడా వినియోగానికి హాట్‌స్పాట్స్‌గా మారుతున్నాయని సింగ్ చెప్పారు.

17 లక్షల వెండి ఐటమ్‌లకు హాల్‌మార్కింగ్

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ: వెండి ఆభరణాల నాణ్యతను ప్రామాణికంగా ధృవీకరించే దిశగా కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలో 17.35 లక్షల ఐటమ్‌లను హాల్‌మార్కింగ్ (హెచ్‌యూఐడీ) చేసినట్లు కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) ప్రామాణిక మార్కుకి అదనంగా ప్రతి ఉత్పత్తిపై విశిష్టమైన ఆరు అంకెల కోడ్‌ను, సిల్వర్ అనే పదం, స్వచ్ఛత గ్రేడ్ వివరాలను ముద్రిస్తారని సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. సదరు ఉత్పత్తి ప్రమాణాలను ధృవీకరించిన అసేయర్–హాల్‌మార్కింగ్ సెంటర్‌ని కూడా ట్రాక్ చేసేందుకు ఈ వివరాలు ఉపయోగపడతాయి. బీఐఎస్ కేర్ మొబైల్ యాప్‌లో హెచ్‌యూఐడీని ఎంటర్ చేసి హాల్‌మార్క్ గల వెండి ఆభరణాల ప్రామాణికతను వినియోగదారులు తక్షణం తెలుసుకోవచ్చు.

లెన్స్‌కార్ట్ లాభం 20 % అప్

న్యూఢిల్లీ: ఐవేర్ కంపెనీ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 103.4 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత క్యూ2లో నమోదైన రూ. 86.3 కోట్లతో పోలిస్తే ఇది 19.8 శాతం అధికం. ఉత్పత్తులపై మార్జిన్ 68.1 శాతం నుంచి 69.2 శాతానికి పెరిగింది. అటు ఆదాయం రూ. 1,736 కోట్ల నుంచి రూ. 2,096 కోట్లకు (21 శాతం వృద్ధి) చేరింది. రెండు కీలక విభాగాలు – కంటి పరీక్షలు, కళ్లద్దాల అమ్మకాలు – వరుసగా 44.3 శాతం, 20.2 శాతం మేర పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో తాము 1.3 కోట్ల కంటి పరీక్షలు చేసినట్లు సంస్థ సీఈవో పీయూష్ బన్సల్ తెలిపారు. అంతకు రెండేళ్ల క్రితం చేసిన 50 లక్షలతో పోలిస్తే ఇది వార్షికంగా 63 శాతం వృద్ధి అని పేర్కొన్నారు.

ఏఐతో మీడియాపై భారీ ప్రభావం

- టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి
- మీడియా, వినోద పరిశ్రమకు ఐఅండ్‌బీ కార్యదర్శి జాజు సూచన

ముంబై: కృత్రిమ మేథ (ఏఐ)లాంటి టెక్నాలజీలు మీడియా, వినోద రంగంపై (ఎంఅండ్ఈ) పెను ప్రభావం చూపుతున్నాయని కేంద్ర సమాచార, ప్రసార (ఐఅండ్‌బీ) శాఖ కార్యదర్శి సంజయ్ జాజు చెప్పారు. ఈ నేపథ్యంలో సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడంపై మరింతగా దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. డైరెక్ట్ టు మొబైల్ బ్రాడ్‌కాస్టింగ్ ప్రాజెక్టుపై ఐఐటీ కాన్పూర్‌లో పరిశోధనలు జరుగుతున్నాయని సీఐఐ బిగ్ పిక్చర్ సమిట్ 2025లో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఏఐ వల్ల టెక్నాలజీలో మరిన్ని మార్పులు రాబోతున్నాయని, వాటిలో సానుకూలాంశాలను ఉపయోగించుకోవాలని జాజు తెలిపారు. దీని వల్ల పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన జరుగుతుందని, ఉత్పాదకత పెరుగుతుందని పేర్కొన్నారు. వందలో ఒక్క వంతు ఖర్చుతో పదిలో ఒక వంతు సమయంలో ఏదైనా పని పూర్తయితే, ఉత్పాదకత తప్పకుండా పెరుగుతుందని జాజు చెప్పారు.

కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా 2030 నాటికి మీడియా, వినోద రంగం (ఎంఅండ్ఈ) భవిష్యత్ పరిస్థితుల గురించి రూపొందించిన సీఐఐ శ్వేతపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వం, పరిశ్రమ అంచనాల ప్రకారం ఈ పరిశ్రమ ఏటా 7 శాతం వృద్ధితో 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరనుందని జాజు చెప్పారు. ఆహారం, నీడ, దుస్తుల్లాగే వినోదమనేది నాగరికత మూల స్తంభాల్లో ఒకటని, ఆర్థిక వృద్ధితో పాటు సమాజ శ్రేయస్సుకు కూడా కీలకమని పేర్కొన్నారు. భారత దేశపు క్రియేటివ్ ఎకానమి ప్రస్తుతం 1 కోటి మందికి పైగా జీవనోపాధి కల్పిస్తోందని, రూ. 3 లక్షల కోట్ల మేర స్థూల దేశీయోత్పత్తికి దోహదపడుతోందని ఆయన చెప్పారు.

ఇంతటి కీలకమైన వినోద రంగాన్ని ఏఐ మార్చివేస్తున్న తరుణంలో కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోకపోతే అంతర్జాతీయంగా మన వాటా తగ్గిపోతుందన్నారు. వర్ధమాన ఆర్థిక శక్తిగా భారత దేశ గాథలను ప్రపంచానికి వినిపించాల్సిన, చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం ప్రభుత్వం తన వంతు సహాయాన్ని పరిశ్రమకు అందిస్తుందని చెప్పారు.

టాటా కామ్ గూటికి కమోషన్ ఇంక్

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం టాటా కమ్యూనికేషన్స్ తాజాగా ఏఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ సాస్ ప్లాట్‌ఫామ్ సంస్థ కమోషన్ ఇంక్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేసింది. యూఎస్, భారత్‌లో కార్యకలాపాలు విస్తరించిన సంస్థలో 51 శాతం వాటాకు రూ. 227 కోట్లు వెచ్చించింది. కంపెనీలో ప్రస్తుత వాటాదారుల వాటా కొనుగోలుతోపాటు.. మూలధన పెట్టుబడులకు నిధులు వినియోగించనుంది. కమోషన్ ఇంక్‌ను సొంతం చేసుకోవడం ద్వారా డిజిటల్ ఫ్యాబ్రిక్‌లో సామర్థ్యాలను సమ్మిళితం చేయనున్నట్లు టాటా కమ్యూనికేషన్స్ పేర్కొంది. సొంత ఏఐ అమలు, ఏఐ ఫస్ట్ సంస్థగా అవతరించడంలో తాజా కొనుగోలు సహకరించనున్నట్లు తెలియజేసింది.

పతకాలతో ఇషాన్ దాస్, వర్షిత్, సుహాస్ ప్రీతమ్, గౌతమ్ శశివర్ధన్

తెలంగాణ స్విమ్మర్లకు నాలుగు పతకాలు

సాక్షి, హైదరాబాద్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్లు నాలుగు పతకాలు సాధించారు. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ పోటీల్లో అండర్–19 బాలుర విభాగంలో సుహాస్ ప్రీతమ్ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో స్వర్ణ పతకం గెలిచాడు. సుహాస్ 2 నిమిషాల 06.28 సెకన్లలో రేసును ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. కేరళ తరఫున బరిలోకి దిగిన ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్ మొంగం తీర్థు సామ (2ని:11.24 సెకన్లు) కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. అండర్–19 బాలుర 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో తెలంగాణకు చెందిన ధూళిపూడి వర్షిత్ (4ని:40.41 సెకన్లు) రజత పతకం సంపాదించాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మొంగం తీర్థు సామ (4ని:39.85 సెకన్లు) స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. అండర్–17 బాలుర 50 మీటర్ల బటర్‌ఫ్లయ్‌లో తెలంగాణకు చెందిన ఇషాన్ దాస్ (25.93 సెకన్లు) రజతం , గౌతమ్ శశివర్ధన్ (26.25 సెకన్లు) కాంస్యం సాధించారు.

క్వార్టర్ ఫైనల్లో తరుణ్

గువాహటి: టాప్ సీడ్ హోదాకు తగ్గట్టు ఆడిన హైదరాబాద్ షట్లర్ తరుణ్ మన్నేపల్లి... గువాహటి ఓపెన్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో తరుణ్ 21–13, 21–16తో మెరాబా లువాంగ్ మైస్నం (భారత్)పై గెలిచాడు. భారత్‌కే చెందిన మిథున్ మంజునాథ్, తుషార్ సువీర్, శంకర్ సరస్వత్, సనీత్ దయానంద్ కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని–రోహన్ కపూర్ (భారత్) జోడీ కూడా క్వార్టర్ ఫైనల్ చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో రుత్విక–రోహన్ ద్వయం 21–19, 21–14తో వీ యా హెర్న్–వనీ గోబి (మలేసియా) జంటను ఓడించింది. మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణులు తన్వీ శర్మ, తాన్యా హేమంత్, తస్నిమ్ మీర్, అష్మిత చాలిహా, అనుపమ, ఇషారాణి బారువా కూడా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల డబుల్స్‌లో పృథ్వీ కృష్ణమూర్తి–సాయిప్రతీక్ జోడీ... మహిళల డబుల్స్‌లో కవిప్రియ సెల్వం–సిమ్రన్; అశ్విని–శిఖా గౌతమ్; రిదువర్షిణి–నర్ధన; ప్రియ–శ్రుతి జోడీలు కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాయి.

రూట్... ఎట్టకేలకు!

- ఆస్ట్రేలియా గడ్డపై తొలి శతకం నమోదు
- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 325/9
- 6 వికెట్లతో అదరగొట్టిన స్టార్క్
- టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్టార్మ్ పేసర్‌గా రికార్డు

స్టార్క్

రూట్

బ్రిస్బేన్: స్టార్ బ్యాటర్ జో రూట్ (202 బంతుల్లో 135 బ్యాటింగ్; 15 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. ఫలితంగా ఆస్ట్రేలియాతో 'యాషెస్' సిరీస్ రెండో టెస్టులో ఇంగ్లండ్ మంచి స్కోరు దిశగా సాగుతోంది. తొలి టెస్టులో ఆసీస్ చేతిలో ఘోర పరాజయం ఎదుర్కొన్న ఇంగ్లండ్... బ్రిస్బేన్‌లోని 'గాబా' మైదానంలో జరుగుతున్న రెండో టెస్టులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. పచ్చికతో కూడిన పిచ్‌పై తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. మాజీ కెప్టెన్ రూట్... ఆస్ట్రేలియా గడ్డపై తొలి 'యాషెస్' సెంచరీ ఖాతాలో వేసుకోగా... జాక్ క్రాలీ (93 బంతుల్లో 76; 11 ఫోర్లు) అర్ధశతకంతో మెరిశాడు. గులాబీ బంతితో మరోసారి నిప్పులు చెరిగిన ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ 71 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఎడంచేతి వాటం పేసర్‌గా రికార్డుల్లోకెక్కాడు. హ్యారీ బ్రూక్ (31; 4 ఫోర్లు), జోఫ్రా ఆర్చర్ (32 బ్యాటింగ్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. బెన్ డకెట్ (0), ఒలీ పోప్ (0), జేమీ స్మిత్ (0), బ్రైడన్ కార్స్ (0) డకౌట్ కాగా... కెప్టెన్ బెన్ స్టోక్స్(19), విల్ జాక్స్ (19) ప్రభావం చూపలేకపోయారు. రూట్‌తో పాటు జోఫ్రా ఆర్చర్ (26 బంతుల్లో 32 బ్యాటింగ్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ నెసర్, స్కాట్ బోలాండ్ చెరో వికెట్ పడగొట్టారు.

స్టార్క్ 'డబుల్ స్ట్రోక్'

సీమ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్‌ను స్టార్క్ ఓ ఆటాడుకున్నాడు. 'పింక్ బాల్' టెస్టుల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా కొనసాగుతున్న స్టార్క్... మరోసారి తన సత్తా చాటాడు. తొలి ఓవర్ చివరి బంతికి డకెట్‌ను అవుట్ చేసిన అతడు... తన తదుపరి ఓవర్‌లో ఒలీ పోప్‌ను వెనక్కి పంపాడు. దీంతో ఇంగ్లండ్ జట్టు 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఇగ్లండ్‌ను రూట్ ఆదుకున్నాడు. క్రాలీతో కలిసి మూడో వికెట్‌కు 117 పరుగులు జోడించాడు. దీంతో ఇంగ్లండ్ కోలుకున్నట్లే అనుకుంటే... స్వల్ప వ్యవధిలో ఆ జట్టు కీలక వికెట్లు కోల్పోయి తిరిగి కష్టాల్లో పడింది. బ్రూక్‌ను స్టార్క్ అవుట్ చేయగా...

బెన్ స్టోక్స్ రనౌటయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా... ఏమాత్రం వెనక్కి తగ్గని 34 ఏళ్ల రూట్... 83 బంతుల్లో అర్ధశతకం... 181 బంతుల్లో సెంచరీ తన పేరిట రాసుకున్నాడు. ఇప్పటి వరకు నాలుగు సార్లు ఇంగ్లండ్‌లో పర్యటించిన రూట్‌కు కంగారూ గడ్డపై ఇదే తొలి సెంచరీ. తొలి రెండు సెషన్‌లలో 98 పరుగుల చొప్పున చేసి రెండేసి వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్ జట్టు... ఫ్లడ్ లైట్ల వెలుతురులో సాగిన మూడో సెషన్‌లో ఐదు వికెట్లు చేజార్చుకుంది. పేస్‌కు స్వర్గధామమైన మైదానంలో ఆసీస్ జట్టు స్పిన్నర్ లయన్ లేకుండా ఐదుగురు పేసర్లతోనే బరిలోకి దిగింది. కంగారూ పేసర్లు బంతి బంతికీ పరీక్ష పెడుతున్నా... క్రీజులో మొండిగా నిలిచిన రూట్... అబేధ్యమైన ఆఖరి వికెట్‌కు ఆర్చర్‌తో కలిసి 61 పరుగులు జోడించాడు. ఫలితంగా 2018 జనవరి తర్వాత తొలిసారి ఇంగ్లండ్ జట్టు... ఆస్ట్రేలియాలో 300 పైచిలుకు పరుగులు చేయగలిగింది. ఇంగ్లండ్ మాజీ ఆటగాడు రాబిన్ స్మిత్ మృతికి సంతాపంగా ఇరు జట్ల ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో నల్ల రిబ్బన్లతో బరిలోకి దిగారు.

1 టెస్టుల్లో అత్యధిక (418) వికెట్లు తీసిన లెఫ్టార్మ్ పేసర్‌గా స్టార్క్ రికార్డుల్లోకెక్కాడు. గతంలో ఈ రికార్డు వసీమ్ అక్రమ్ (414 ; పాకిస్తాన్) పేరిట ఉండగా... తాజా మ్యాచ్‌లో బ్రూక్‌ను అవుట్ చేయడంతో ద్వారా స్టార్క్ అతడిని అధిగమించాడు.

40 టెస్టు క్రికెట్‌లో రూట్ సెంచరీల సంఖ్య. అత్యధిక శతకాలు చేసిన ప్లేయర్ల జాబితాలో రూట్ నాలుగో స్థానంలో ఉన్నాడు. సచిన్ టెండూల్కర్ (51 ; భారత్), జాక్వస్ కలిస్ (45 ; దక్షిణాఫ్రికా), రికీ పాంటింగ్ (41 ; ఆస్ట్రేలియా) తొలి మూడో స్థానాల్లో ఉన్నారు. ఆస్ట్రేలియా గడ్డపై రూట్‌కు ఇదే తొలి శతకం.

రచిన్

లాథమ్

రచిన్, లాథమ్ భారీ శతకాలు

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్ 417/4 ● వెస్టిండీస్‌తో తొలి టెస్టు ● 481 పరుగుల ఆధిక్యంలో కివీస్

క్రైస్ట్‌చర్చ్: రచిన్ రవీంద్ర (185 బంతుల్లో 176; 27 ఫోర్లు, 1 సిక్స్), టామ్ లాథమ్ (250 బంతుల్లో 145; 12 ఫోర్లు) భారీ సెంచరీలతో కదంతొక్కారు. ఫలితంగా వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ జట్టు భారీ స్కోరు దిశగా దూసుకెళ్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 32/0తో గురువారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్... చివరకు 95 ఓవర్లలో 4 వికెట్లకు 417 పరుగులు చేసింది. విండీస్ బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోగా... కివీస్ బ్యాటర్లు విజృంభించారు. డెవాన్ కాన్వే (37; 7 ఫోర్లు) మంచి ఆరంభాన్ని భారీ స్కోరుగా మలచలేకపోగా... సీనియర్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ (9) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. ఈ దశలో రచిన్ రవీంద్రతో కలిసి కెప్టెన్ లాథమ్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఆరంభంలో ఆచితూచి ఆడిన ఈ జంట ఒక్కసారి క్రీజులో కుదురుకున్నాక స్వేచ్ఛగా షాట్‌లు ఆడింది. లాథమ్ కాస్త నిదానంగా ఆడినా... రచిన్ మాత్రం రెచ్చిపోయాడు. బౌలర్‌తో సంబంధం లేకుండా వన్డే తరహాలో దంచి కొట్టాడు. ఈ జంట మూడో వికెట్‌కు 279 పరుగులు జోడించింది. ఆ తర్వాత ఈ ఇద్దరూ అవుట్ కాగా... విల్ యంగ్ (21 బ్యాటింగ్; 3 ఫోర్లు), బ్రాస్‌వెల్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకు ముందు న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 231 పరుగులు చేయగా... వెస్టిండీస్ 167 పరుగులు చేసింది. మరో రెండు రోజు ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం (64 పరుగులు) కలుపుకొని న్యూజిలాండ్ ఓవరాల్‌గా 481 పరుగుల ఆధిక్యంలో ఉంది. వెస్టిండీస్ బౌలర్లలో రోచ్, షీల్డ్స్ చెరో రెండు వికెట్లు పగొట్టారు.

నరైన్ @600

అబుదాబి: స్టార్ స్పిన్నర్ సునీల్ నరైన్ టి20ల్లో 600 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా పలు లీగ్‌ల్లో ఆడుతున్న నరైన్... ఇంటర్నేషనల్ లీగ్ (ఐఎల్) టి20లో ఈ ఘనత సాధించాడు. గతంలో రషీద్ ఖాన్ (681; అఫ్గానిస్తాన్), డ్వేన్ బ్రావో (631; వెస్టిండీస్) మాత్రమే ఈ ఘనత సాధించగా... ఈ జాబితాలో నరైన్ కూడా చేరాడు. ఐఎల్ టి20 లీగ్‌లో నరైన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీకి చెందిన అబుదాబి నైట్ రైడర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. షార్జా వేదికగా జరిగిన పోరులో అబుదాబి నైట్ రైడర్స్ జట్టు 39 పరుగుల తేడాతో షార్జా వారియర్స్‌పై గెలిచింది. నరైన్ ఒక వికెట్ తీశాడు.

నేను గెలిచేందుకు మా వాణ్ని ఓడిపొమ్మంటానా?

పియాస్ట్రి రేసులో ఉంటాడు ● మెక్‌లారెన్ డ్రైవర్ నోరిస్ వ్యాఖ్య

అబుదాబి: ఈ సీజన్ ఫార్ములావన్ చాంపియన్‌షిప్ కోసం జట్టు సహచరుడు పియాస్ట్రితో ఎలాంటి మంతనాలు ఉండవని లాండో నోరిస్ వ్యాఖ్యానించాడు. మెక్‌లారెన్ డ్రైవర్లలో నోరిస్ 408 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఆస్కార్ పియాస్ట్రి 392 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. గత ఆదివారం ఖతర్ గ్రాండ్‌ప్రి గెలుపొందడంతో రెడ్‌బుల్ రేసర్ వెర్‌స్టాపెన్ (396) రెండో స్థానంలోకి దూసుకురావడంతోనే ఈ సీజన్ 'ఫార్ములా' ఆఖరి మజిలీకి చేరింది. ఈ ఆదివారం జరిగే అబుదాబి గ్రాండ్‌ప్రిపై రేసింగ్ ప్రియుల ఆసక్తిని పెంచింది. ఈ రేసుకు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో పియాస్ట్రి, వెర్‌స్టాపెన్‌లతో కలిసి నోరిస్ పాల్గొన్నాడు. 'నిజాయితీగా చెబుతున్నా... గెలవాలని నాకున్నా గెలిపించేందుకు సహకరించమని అడగను. దీనికి ఆస్కార్ ఒప్పుకుంటాడో లేదో తెలీదు. తప్పనిసరి అని నేను భావించను' అని నోరిస్ స్పష్టం చేశాడు. ఇద్దరు మెక్‌లారెన్ డ్రైవర్ల (పియాస్ట్రి, నోరిస్)లో నోరిస్‌కే టైటిల్ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎంతలా అంటే అబుదాబిలో వెర్‌స్టాపెన్ గెలిచినా కూడా నోరిస్ టాప్–3లో ఉంటే చాలు మెక్‌లారెన్ జట్టు 17 ఏళ్ల తర్వాత ఫార్ములావన్ విజేతగా నిలుస్తుంది. 2008లో హామిల్టన్ తర్వాత మరే మెక్‌లారెన్ డ్రైవర్ విజేతగా నిలువలేకపోయాడు. మరోవైపు వెర్‌స్టాపెన్ మాట్లాడుతూ ఆఖరి రేసులో ఏమైనా జరగొచ్చని, రేసు ఆషామాషీగా ఉండబోదని చెప్పాడు.

అభిషేక్ ఆల్‌రౌండ్ షో

9 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 34 పరుగులు

బౌలింగ్‌లో 3 వికెట్లు ● పుదుచ్చేరిపై పంజాబ్ గెలుపు ● ముస్తాక్ అలీ టి20 టోర్నమెంట్

అభిషేక్

సాక్షి, హైదరాబాద్: టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ (9 బంతుల్లో 34; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు; 3/23) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టాడు. దేశవాళీ టి20 టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా గురువారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ జట్టు 54 పరుగుల తేడాతో పుదుచ్చేరిపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అభిషేక్ క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించగా... సలీల్ అరోరా (44 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), సాన్‌వీర్ సింగ్ (38; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), నమన్ ధీర్ (37; 3 ఫోర్లు, 1 సిక్స్), రమణ్‌దీప్ సింగ్ (34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) తలాకొన్ని పరుగులు చేశారు. పుదుచ్చేరి బౌలర్లలో విజయ్ రాజా రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో పుదుచ్చేరి 18.4 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటైంది. సిదాక్ సింగ్ (61; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేయగా... మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అభిషేక్ 4 ఓవర్లలో 23 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. ఆయుశ్ గోయల్ 3 వికెట్లు తీశాడు. ఈ టోర్నీలో ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లాడిన పంజాబ్ 3 విజయాలు, 2 పరాజయాలతో 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని గ్రూప్ 'సి'లో రెండో స్థానంలో ఉంది. ఇదే గ్రూప్‌లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో హర్యానా 7 వికెట్ల తేడాతో హిమాచల్ ప్రదేశ్‌పై గెలిచింది.

ముంబైకి కేరళ షాక్

ముస్తాక్ అలీ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టుకు షాక్ తగిలింది. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబై జట్టు 15 పరుగుల తేడాతో కేరళ చేతిలో పరాజయం పాలైంది. మొదట కేరళ 20 ఓవర్లలో 5 వికెట్లకు 178 పరుగులు చేసింది. కెప్టెన్ సంజూ సామ్సన్ (28 బంతుల్లో 46; 8 ఫోర్లు, 1 సిక్స్), విష్ణు వినోద్ (43 నాటౌట్; 3 ఫోర్లు), మొహమ్మద్ అజహరుద్దీన్ (32; 3 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' షర్ఫుద్దీన్ (15 బంతుల్లో 35 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ముంబై బౌలర్లలో శివమ్ దూబే, శార్దుల్ ఠాకూర్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం ముంబై జట్టు అనూహ్యంగా ఓడింది. లక్ష్యం పెద్దది కాకపోయినా... ముంబై జట్టు 19.4 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. గత మ్యాచ్ సెంచరీ హీరో సర్ఫరాజ్ ఖాన్ (40 బంతుల్లో 52; 8 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో రాణించగా... టీమిండియా టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32; 4 ఫోర్లు), అజింక్యా రహానే (32; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. అయితే ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో కేరళ బౌలర్ కేఎమ్ ఆసిఫ్ మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. తొలి బంతికి సాయిరాజ్ పాటిల్ (13)ను అవుట్ చేసిన అతడు... మూడో బంతికి సూర్యకుమార్ యాదవ్‌ను, నాలుగో బంతికి శార్దుల్ ఠాకూర్ (0)ను పెవిలియన్‌కు పంపాడు. దీంతో ఒక్కసారిగా ఒత్తిడిలో పడ్డ ముంబై విజయానికి దూరమైంది. ఆసిఫ్ 24 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఇతర మ్యాచ్‌ల్లో రాజస్తాన్ 2 వికెట్ల తేడాతో సౌరాష్ట్రపై, అస్సాం 58 పరుగుల తేడాతో విదర్భపై, ఉత్తరప్రదేశ్ 40 పరుగుల తేడాతో చండీగఢ్‌పై, జార్ఖండ్ 7 వికెట్ల తేడాతో ఉత్తరాఖండ్‌పై, గోవా 5 వికెట్ల తేడాతో బిహార్‌పై, ఢిల్లీ 5 వికెట్ల తేడాతో కర్ణాటకపై, ఒడిశా ఒక పరుగు తేడాతో రైల్వేస్‌పై, మధ్యప్రదేశ్ 21 పరుగుల తేడాతో మహారాష్ట్రపై, తమిళనాడు 61 పరుగుల తేడాతో త్రిపురపై విజయాలు సాధించాయి.

న్యూయార్క్‌లోని రాక్‌ఫెల్లర్ సెంటర్‌లో 93వ వార్షిక క్రిస్మస్ ట్రీ లైటింగ్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది

పోలెండ్ రాజధాని వార్సాలోని జంకోవీ స్క్వేర్‌లో ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ ట్రీ

వచ్చే జనవరిలో మొదలయ్యే మాఘ మేళా కోసం యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో సంగమ్ వద్ద గంగా నదిపై ఏర్పాటు చేసిన తేలియాడే వంతెన

జడ్జీల రిటైర్మెంట్ వయస్సు పెంపు యోచన లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు పెంపు ప్రతిపాదనేదీ లేదని కేంద్రం గురువారం రాజ్యసభలో తెలిపింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ మేరకు ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. హైకోర్టుల్లో మంజూరైన మొత్తం 1,122 జడ్జీల పోస్టులకుగాను 297 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి, 97 ప్రతిపాదనలు పరిశీలన దశలో ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఎలాంటి ప్రతిపాదనలు లేవని స్పష్టం చేశారు.

సట్లెజ్, బియాస్ నుంచి పాక్‌కు నీటి ప్రవాహం లేదు

న్యూఢిల్లీ: వర్షాకాలంలో మినహా సట్లెజ్, బియాస్ నదుల నీటిని సరిహద్దులు దాటి పాకిస్తాన్‌లోకి వెళ్లనివ్వడం లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. వర్షాకాలంలో పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలతో ఈ రెండు నదులకు వరదలు వచ్చినప్పుడు మాత్రం అదనపు జలాలను మాత్రమే పాకిస్తాన్‌లోకి వదులుతున్నామని వివరించింది. లోక్‌సభలో జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి ఈ మేరకు ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

పాక్‌లో మైనారిటీల ప్రార్థనాస్థలాలు 37 మాత్రమే

ఇస్లామాబాద్: పాకిస్తాన్ వ్యాప్తంగా ఉన్న 1,817 హిందూ ఆలయాలు, సిక్కు గురుద్వారాల్లో ప్రస్తుతం కార్యకలాపాలు జరుగుతున్నవి 37 మాత్రమే. పాకిస్తానీ పార్లమెంటరీ కమిటీ నివేదిక ఈ విషయం వెల్లడించింది. హిందూ ప్రార్థనా స్థలాలు 1,285 కాగా, గురుద్వారాలు 532 ఉన్నాయని ఆ నివేదిక పేర్కొంది. వీటిలో ప్రస్తుతం పనిచేసేవి 37 మాత్రమేనంది. ఇది చాలా తక్కువ సంఖ్య అని, మైనారిటీల ప్రార్థనాస్థలాల పునరుద్ధరణ తక్షణమే చేపట్టాలని కమిటీ సూచించింది. మత వారసత్వాన్ని పరిరక్షించాలని కోరింది.

బసంత్ వేడుకల్లో పతంగులపై నిషేధం ఎత్తివేత

లాహోర్: పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ దాదాపు 20 ఏళ్ల తర్వాత బసంత్ వేడుకల సందర్భంగా పతంగులను ఎగురవేయడంపై నిషేధం తొలగించింది. కళాకారులు, పౌర సంఘాల నేతల ఒత్తిళ్ల నేపథ్యంలో మరియమ్ నవాజ్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. శీతాకాల నిష్క్రమణకు గుర్తుగా జరిగే బసంత్ వేడుకల్లో గాలి పటాలను ఎగురవేయడం శతాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. అయితే, పతంగుల కారణంగా పలు ప్రమాదాల్లో యువకులు, చిన్నారుల మరణాలు సంభవించడంతో ప్రభుత్వం 2005లో నిషేధం విధించింది.

కార్తీక దీపం వివాదంపై తమిళనాడు బీజేపీ చీఫ్ అరెస్టు

మదురై: సుబ్రమణ్య స్వామి ఆలయం ఉన్న తిరుప్పరన్‌కున్‌డ్రమ్ కొండపై కార్తీక దీపం వెలిగించేందుకు ప్రయత్నించిన తమిళనాడు బీజేపీ చీఫ్ నాయనార్ నాగేంద్రన్‌తోపాటు హిందూ మున్నాని సంస్థ కార్యకర్తలను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. కొండపై కార్తీక దీపం వెలిగించరాదంటూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం కొట్టివేసింది. పైపెచ్చు వారికి రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. దీంతో, నాయనార్ నాగేంద్రన్ తదితరులు కొండపైకి వెళ్లేందుకు ప్రయత్నించారు. కొండపై ఉన్న రాతి స్తంభంపై కార్తీక దీపం వెలిగించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లేదంటూ పోలీసులు చెప్పినా పట్టించుకోకుండా వెళ్తుండటంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. కొద్దిసేపటి తర్వాత వారిని వదిలివేస్తామని పోలీసులు చెప్పారు. ఈ అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది.

నా గుండె పగిలింది

ఎయిర్ ఇండియాలో సితార్ ధ్వంసం
- అనౌష్క శంకర్ తీవ్ర ఆవేదన
- సంస్థ నిర్లక్ష్యంపై ఆగ్రహం

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా విమానంలో తన సితార్ ధ్వంసం కావడంపై అంతర్జాతీయ సంగీతకారిణి అనౌష్క శంకర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిర్ ఇండియా విమానంలో తన ప్రియమైన సితార్ ధ్వంసం కావడంతో ఆమె భగ్గుమన్నారు. 'ఒక భారతీయ వాయిద్యానికి కూడా ఈ దేశపు విమాన సంస్థలో భద్రత లేదా?'.. అంటూ సోషల్ మీడియాలో నిప్పులు చెరిగారు. పదిహేనేళ్ల తన కెరీర్‌లో ఇలా జరగడం ఇదే మొదటిసారని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం, తన ఇన్‌స్ట్రాగామ్‌లో పోస్ట్ చేసిన వీడియో సంగీత ప్రియులను కలచివేసింది. విలువైన సితార్ దిగువ భాగంలో ఏర్పడిన లోతైన పగులును ఆమె చూపించారు. 'నా సితార్ శృతి తప్పిందేమోనని ముందు భావించాను. వాయించడానికి తీసుకున్నప్పుడే ఈ దారుణం తెలిసింది'.. అని కన్నీటి పర్యంతమయ్యారు. 'చాలా కాలం తర్వాత ఎయిర్ ఇండియాను ఎంచుకున్నాను. నా వాయిద్యానికే ఇలా ఎందుకు జరిగింది? ప్రత్యేక హార్డ్–కేసులు ఉన్నా, హ్యాండ్లింగ్ రుసుములు వసూలు చేసినా ఇంత దారుణమైన నిర్లక్ష్యమా?'.. అని ఆమె నిలదీశారు.

పరిశీలిస్తున్నామన్న ఎయిర్ ఇండియా

అనౌష్క తన విమాన వివరాలను, ఎక్కడ దిగారనేది చెప్పనప్పటికీ, ఎయిర్ ఇండియా ప్రతినిధి గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, 'మా అతిథి అనుభవించిన బాధకు చింతిస్తున్నాం. ఈ వాయిద్యం సాంస్కృతిక ప్రాధాన్యం మాకు తెలుసు'.. అని పేర్కొన్నారు. నష్టానికి గల కారణాలను నిర్ధారించలేకపోతున్నామని చెప్పిన సంస్థ, ఢిల్లీ విమానాశ్రయంలోని సీసీటీవీ ఫుటేజీతో సహా సమగ్ర విచారణ ప్రారంభించినట్లు తెలిపింది.

భారత్ పర్యటనకు ముందే..

జనవరి 30న హైదరాబాద్‌తో ప్రారంభం కానున్న తన భారత పర్యటనకు అనౌష్క శంకర్ సిద్ధమవుతున్న తరుణంలో ఈ ఘటన జరగడం పలువురు కళాకారుల్ని కలచివేసింది. ఈ సంఘటన హృదయ విదారకమని ప్రముఖ కళాకారులు జాకిర్ ఖాన్, విశాల్ దడ్లాని పేర్కొన్నారు. గాయకుడు పాపోన్ స్పందిస్తూ, 'ఈ రోజుల్లో శ్రద్ధ కరువైంది. అసలు శ్రద్ధ అనే భావమే కనుమరుగైందేమో! ఇది విచారకరం'.. అంటూ ఎయిర్ ఇండియా తీరుపై మండిపడ్డారు. గతంలోనూ ప్రయాణ సమస్యలు 44 ఏళ్ల శంకర్ గత ఏడాది కూడా ప్రయాణ సమస్యలను ఎదుర్కొన్నారు. ఆమె తన యూరోపియన్ టూర్ చివరి షో కోసం బెర్లిన్‌లో ఉన్నప్పుడు, దుస్తులు, వాయిద్యానికి అవసరమైన 'మిజ్రాబ్స్' (వేళ్లకు ధరించే ఫిక్స్‌డ్ పికర్స్) ఉన్న లగేజీని పోగొట్టుకున్నారు.

పదేపదే తప్పిదాలా?

సంగీత కళాకారులకు ఇలాంటి చేదు అనుభవాలు కొత్తేమీ కాదు. 2010లో సరోద్ విద్వాంసుడు ఉస్తాద్ అమ్జద్ అలీ ఖాన్ వాయిద్యం ఎయిర్ ఇండియాలో దెబ్బతినగా, 2019లో పండిట్ శుభేంద్ర రావు సితార్ కూడా ఈ సంస్థ విమానంలోనే దెబ్బ తింది. తాజా ఘటనతో, విమానయాన సంస్థలు కళాకారుల విలువైన వాయిద్యాల భద్రత విషయంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం మరోసారి తెరపైకి వచ్చింది.

ఎల్గార్ పరిషత్ కేసులో ప్రొఫెసర్ హనీబాబుకు బెయిల్

ముంబై: ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ హనీబాబుకు బెయిల్ మంజూరు అయ్యింది. ఎల్గార్ పరిషత్ కేసులో నిందితుడిగా ఉన్న ఢిల్లీ యూనివర్సిటీ మాజీ అసోసియేట్ ప్రొఫెసర్ హనీ బాబు.. విచారణ లేకుండానే ఐదేళ్లకు పైగా జెలు శిక్ష అనుభవించారు. ఈ నేపథ్యంలో బాంబే హైకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. ఈ ఏడాది అక్టోబర్ మొదటి వారంలో ఈ కేసులో విచారణ పూర్తి చేసిన జస్టిస్ ఎ.ఎస్.గడ్కరీ, ఆర్.ఆర్.భోంస్లేలతో కూడిన డివిజన్ బెంచ్, ఆయనను విడుదల చేయాలని, లక్ష రూపాయల వ్యక్తిగత బాండ్‌ను సమర్పించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టులో అప్పీలు చేయడానికి ఈ ఉత్తర్వును నిలిపివేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) హైకోర్టును కోరింది. బాబు ఇప్పటికే విచారణలేకుండానే సుదీర్ఘ కాలం జైలులో ఉన్నారని, విచారణ ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేనందున ఎన్ఐఏ అప్పీలును తిరస్కరించింది. ఆయన పూర్తి పేరు హనీబాబు ముసలియార్వీట్టిల్ తరయిల్. యూపీలోని గౌతమ్ బుద్ధ నగర్‌కు చెందిన వ్యక్తి. 2017 డిసెంబర్ 31న పూణేలోని శనివార్‌వాడలో కబీర్‌కళా మంచ్ నిర్వహించిన ఎల్గార్ పరిషత్ కార్యక్రమంలో ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారనే ఆరోపణలపై 2020 జూలైలో ఎన్ఐఏ అరెస్టు చేసింది. నిషేధిత సీపీఐ(ఎంఎల్) నాయకుల సూచనల మేరకు మావోయిస్టు కార్యకలాపాలు, భావజాలాన్ని హనీబాబు ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. 59 ఏళ్ల హనీ బాబు అప్పటి నుంచి తలోజా జైలులో ఉన్నారు.

ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ సస్పెన్షన్

- 'బాబ్రీ'లాంటి మసీదు నిర్మిస్తాననడంపై టీఎంసీ సీరియస్
- ఆయన్ను ద్రోహిగా పేర్కొన్న సీఎం మమతా బెనర్జీ

బహరాంపూర్: పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో బాబ్రీ మసీదు వంటి మసీదు నిర్మాణాన్ని ఈ నెల 6వ తేదీన ప్రారంభిస్తానంటూ టీఎంసీ ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ చేసిన ప్రకటన సంచలనం రేపింది. బాబ్రీ మసీదు విధ్వంసం జరిగిన డిసెంబర్ 6వ తేదీని పురస్కరించుకుని దీని నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన పేర్కొనడాన్ని అధికార టీఎంసీ సీరియస్‌గా తీసుకుంది. ఆయన్ను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. అయితే, కబీర్ మాత్రం వెనక్కి తగ్గలేదు. శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని, త్వరలోనే కొత్త పార్టీని ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు. తనను అరెస్ట్ చేయాలని చూసినా తలపెట్టిన కార్యక్రమాన్ని కొనసాగించి తీరుతానన్నారు. టీఎంసీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ కబీర్ పేరును నేరుగా ప్రస్తావించకుండా తీవ్రంగా మండిపడ్డారు. బీజేపీ నుంచి డబ్బులు తీసుకుని మత విద్వేషాలను రెచ్చగొడుతున్న ద్రోహిగా అభివర్ణించారు. ప్రతి మతంలోనూ ద్రోహులున్నారు. ఎన్నికల సమయంలో ఉద్రిక్తతలు సృష్టించడమే వీరి పని అని పేర్కొన్నారు. ఈ పరిణామాలపై సీనియర్ మంత్రి ఫిర్హాద్ హకీమ్ మీడియాతో మాట్లాడారు. మత రాజకీయాలకు పాల్పడుతున్న కబీర్‌పై టీఎంసీ కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఇక నుంచి ఆయనతో టీఎంసీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. మసీదును ఎవరైనా నిర్మించొచ్చు. అదే సమయంలో మత పరంగా రెచ్చగొట్టడం తగదు. బాధ్యతాయుతంగా వ్యవహరించే మా పార్టీ ఇటువంటి వాటిని ప్రోత్సహించదు'అని ఆయన తెలిపారు.

స్నేహ 'వృక్షం'

లండన్ నగరంలోని ట్రాఫాల్గర్ స్క్వేర్.. డిసెంబర్ నెల వచ్చిందంటే చాలు, పండుగ శోభతో నిండిపోతుంది. ఆ స్క్వేర్ మధ్యలో నిటారుగా.. వేలాది కాంతులతో వెలిగిపోయే ఒక అద్భుతమైన క్రిస్మస్ చెట్టు కనువిందు చేస్తుంది. ఇది కేవలం ఒక చెట్టు కాదు.. నార్వేజియన్ ప్రజల హృదయం నుండి వచ్చిన ఒక కృతజ్ఞతా బహుమతి. లండన్, నార్వే రాజధాని ఓస్లో నగరాల మధ్య కొనసాగుతున్న ఈ వార్షిక సంప్రదాయం వెనుక దాగిన కథ, మానవ సంబంధాల గొప్పతనాన్ని, చరిత్రను గుర్తు చేస్తుంది.

కష్టకాలంలో పుట్టిన స్నేహం

ఈ బంధానికి రెండో ప్రపంచ యుద్ధం కల్లోలంలో పునాదులు ఏర్పడ్డాయి. 1940లో, నాజీ జర్మనీ నార్వేపై దండెత్తినప్పుడు, అప్పటి నార్వే రాజు హాకాన్–7, అతని ప్రభుత్వ ప్రతినిధులు లండన్‌కు శరణార్థులుగా వచ్చారు. అక్కడే ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. బ్రిటన్ గడ్డ నుండే నార్వేజియన్ ప్రతిఘటన ఉద్యమానికి బలం చేకూర్చారు. అంతేకాదు, నాజీలు రేడియోలను నిషేధించినా, బీబీసీ సహకారంతో లండన్ నుండి రహస్యంగా నార్వేజియన్ భాషలో వార్తలను ప్రసారం చేసేవారు. ఆ వార్తలు నార్వే దేశ ప్రజలకు ధైర్యాన్ని, ఆశను నింపిన జీవనాడులు. నిరాశలో ఉన్న వేలాది నార్వేజియన్లకు అక్షరాలా అవి ఓ సాంత్వన!

హృదయం నుండి వచ్చిన కానుక

యుద్ధం ముగిసిన తర్వాత, నార్వే ప్రజలు తమకు ఆశ్రయం ఇచ్చి, తమ స్వాతంత్ర్య పోరాటానికి సహాయం చేసినందుకు బ్రిటన్‌పై అపారమైన కృతజ్ఞతను చూపాలనుకున్నారు. ఆ ప్రేమే 1947లో ఓస్లో నగర పాలక సంస్థ ఈ వార్షిక క్రిస్మస్ ట్రీ బహుమతిని ప్రకటించడానికి దారి తీసింది. ఈ బహుమతి కేవలం అలంకరణ వస్తువు కాదు. 'ఓస్లో ప్రజల స్వేచ్ఛా స్ఫూర్తికి లండన్ ప్రజలు ఇచ్చిన అండ'కు ప్రతీక.

'ఎవర్ ఓస్లో'సాహస యాత్ర

ఏటా ఓస్లో అడవుల్లో పెరిగే నార్వేజియన్ స్ప్రూస్ జాతి చెట్టును మాత్రమే ఎంపిక చేస్తారు. కొన్నేళ్ల ముందుగానే నాణ్యమైన చెట్లను గుర్తించి, వాటికి ప్రత్యేక సంరక్షణ అందిస్తారు. ఈ ఏడాది చెట్టుకు ముద్దుగా 'ఎవర్ ఓస్లో'అని పేరు పెట్టారు. సుమారు 60 ఏళ్ల వయసు, 20 మీటర్ల ఎత్తు ఉన్న ఈ చెట్టు, వేలాది చెట్ల నుండి ఎంపికైంది. నవంబర్ 21న జరిగిన ప్రత్యేక వేడుకలో దీనిని నరికి,



ఓ ప్రత్యేక ఉయ్యాలలో ఉంచి, రోడ్డు మార్గంలో ఓడరేవుకు తరలించారు. అక్కడి నుండి మొదలైంది అసలు ప్రయాణం. దాదాపు 26 గంటల పాటు సముద్రంలో ప్రయాణించాక ఆ చెట్టు లండన్‌కు చేరుకుంది. లండన్ చేరుకున్నాక, దాన్ని ట్రక్కులో ట్రాఫాల్గర్ స్క్వేర్‌కు తరలించారు. ఈ ప్రయాణమంతా ఆ చెట్టు.. రెండు దేశాల స్నేహ సందేశాన్ని మోసుకొచ్చిన ఒక రాయబారిలా సాగింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సంప్రదాయ దీపాలంకరణ

సోషల్ మీడియాలో ఈ చెట్టును 'బ్రిటన్ జాతీయ నిధి'గా అభివర్ణిస్తారు. ఏటా డిసెంబర్ మొదటి గురువారం జరిగే దీపాలంకరణ వేడుకతో లండన్‌లో క్రిస్మస్ కౌంట్‌డౌన్ మొదలవుతుంది. ఈ చెట్టుకు నార్వేజియన్ సంప్రదాయం ప్రకారం నిలువు వరుసలలో దీపాలను అమరుస్తారు. ఈ కాంతులు.. స్క్వేర్‌లోని ప్రజలకు ఆశ, శాంతి సందేశాన్ని ఇస్తాయి. ఈ క్రిస్మస్ ట్రీ, జనవరి 5 వరకు ట్రాఫాల్గర్ స్క్వేర్‌లో ప్రకాశిస్తూనే ఉంటుంది. ఆ తర్వాత దీనిని కంపోస్ట్ తయారీకి వినియోగిస్తారు. ప్రతి క్రిస్మస్‌కు నార్వే పంపే ఈ ట్రీ బహుమతి, కేవలం పండుగ ఆనందం కోసం కాదు. యుద్ధ గాయాలను, మళ్లీ వెలిగించిన ఆశలను గుర్తుచేసే శాశ్వత చిహ్నం. ట్రాఫాల్గర్ స్క్వేర్‌లో ఈ దీపాలు వెలిగిన ప్రతిసారీ, అది క్రిస్మస్‌కు సంకేతం మాత్రమే కాదు.. కష్టకాలంలో ఒక దేశం మరో దేశానికి ఇచ్చిన అండ.. సాటి మనిషిపై చూపిన మానవత్వం.. నేటికీ సజీవంగా ఉన్నాయనడానికి హృదయపూర్వకమైన, శాశ్వతమైన కృతజ్ఞతా వెలుగు!

బీఎల్‌వోలపై పనిభారం తగ్గించండి

- ఎస్ఐఆర్ కోసం ఈసీకి అదనంగా సిబ్బందిని ఇవ్వండి
- రాష్ట్రాలను ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల కమిషన్ పలు రాష్ట్రాల్లో చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)లో పాల్గొనే బూత్ లెవల్ అధికారు(బీఎల్‌వో)లపై పని ఒత్తిడి తగ్గించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. వారిపై పనిభారం తగ్గించేందుకు వీలుగా మరింత మంది సిబ్బందిని కేటాయించాలని సంబంధిత రాష్ట్రాలను ఆదేశించింది. ఎస్ఐఆర్‌ను గడువులోగా పూర్తి చేయాలంటూ బీఎల్‌వోలపై ఈసీ ఒత్తిడి పెంచుతోందని, అలా చేయని వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం కింద చర్యలు తీసుకుంటోందని, ఈ పరిస్థితుల్లో వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు కూడా ఉన్నాయని నటుడు విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) సుప్రీంలో పిటిషన్ వేసింది. దీనిని గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం విచారణ చేపట్టింది. బీఎల్‌వోలుగా విధులు నిర్వర్తిస్తున్న టీచర్లు, అంగన్‌వాడీ సిబ్బంది వంటి వారిపై ఒత్తిడి చేయడం, కేసులు నమోదు చేయడం వంటి ఆపేలా ఈసీని ఆదేశించాలని ఈ సందర్భంగా పిటిషనర్ తరపున సీనియర్ లాయర్ గోపాల్ శంకరనారాయణన్ కోరారు. 'రాష్ట్రాలు ఎస్ఐఆర్ కోసం ఈసీకి అదనంగా సిబ్బందిని కేటాయిస్తే సరిపోతుంది. పనిగంటలు తగ్గి, బీఎల్‌వోలపై ఒత్తిడి కూడా తగ్గిపోతుంది. ఇలాంటి ఇబ్బందులుంటే రాష్ట్రాలు పరిష్కరించుకోవాలి. ఎస్ఐఆర్ జరుగుతున్న రాష్ట్రాలు అవసరమైన మేరకు అదనంగా సిబ్బందిని నియమించుకోవాలి'అని ధర్మాసనం పేర్కొంది. 'సిబ్బంది ఎవరైనా ప్రత్యేక కారణాలతో మినహాయింపు కోరిన పక్షంలో సంబంధిత రాష్ట్ర ఉన్నతాధికారి అలాంటి కేసులను పరిస్థితులను బట్టి డీల్ చేయాలి. వేరొకరిని ఆస్థానంలో నియమించాలి'అని ధర్మాసనం వివరించింది. అలా ప్రత్యామ్నాయం ఇవ్వలేనప్పుడు, ఆ ఉద్యోగిని బాధ్యతల నుంచి ఉపసంహరించుకోవాలనడం తమ ఉద్దేశం కాదని కూడా ధర్మాసనం స్పష్టతనిచ్చింది. విధుల్లో మరణించిన బీఎల్‌వోల కుటుంబాలకు పరిహారం ఇవ్వడం వంటి అంశాలపై తర్వాత వేరుగా ఆదేశాలిస్తామని తెలిపింది.

మహిళా న్యాయవాదులకు 30శాతం రిజర్వేషన్లు కల్పించండి

బీసీఐకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: రాష్ట్ర బార్‌కౌన్సిల్ ఎన్నికల్లో మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)కి సుప్రీంకోర్టు సూచించింది. 'రాష్ట్ర బార్‌కౌన్సిల్‌లలో 30శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా బీసీఐ నియమాలను రూపొందిస్తుందని ఆశిస్తున్నాం. కొన్ని ఆఫీస్ బేరర్ పోస్టులు కూడా అందుబాటులో ఉండాలి'ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర బార్ కౌన్సిల్‌లలో మహిళా ప్రాతినిధ్యం తప్పనిసరి చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం అటువంటి రిజర్వేషన్లను అమలు చేయడానికి అడ్వకేట్స్ చట్టానికి సవరణలు అవసరమని బీసీఐకి తెలిపింది. అయితే రాష్ట్రాల బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రక్రియలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, తక్షణ మార్పులు కష్టమని బీసీఐ తరపు న్యాయవాది గురుకుమార్ ధర్మాసనానికి తెలిపారు. అంతేకాదు.. మహిళా న్యాయవాదులు పోటీ చేయడంపై ఆయన అనుమానం వ్యక్తం చేయగా.. మహిళా న్యాయవాదుల సర్వే ఆధారంగా సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ నిర్వహించిన వర్క్‌షాప్‌ను ధర్మాసనం ప్రస్తావించింది. 83 మంది శాతం మహిళా న్యాయవాదులు బీసీఐలో సభ్యులుగా ఉండాలని కోరుకుంటున్నారని వెల్లడించింది. ఒక ఆఫీస్ బేరర్ పదవిని మహిళా న్యాయవాదులకు రిజర్వ్ చేయాలని సూచించింది.

ఎమ్మెల్యే మమ్‌కూట్టతిల్‌ను బహిష్కరించిన కాంగ్రెస్

అత్యాచారం కేసులో బెయిల్ నిరాకరించిన కోర్టు

తిరువనంతపురం: పలు తీవ్ర ఆరోపణలతోపాటు లైంగిక వేధింపుల కేసు నమోదైన ఎమ్మెల్యే రాహుల్ మమ్‌కూట్టతిల్‌ను కాంగ్రెస్ పార్టీ బహిష్కరించింది. ఇప్పటికే ఈయన్ను సస్పెండ్ చేసిన కాంగ్రెస్ గురువారం పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించింది. ఈ మేరకు కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మమ్‌కూట్టతిల్‌పై వచ్చిన తీవ్ర ఆరోపణలను పరిశీలించిన మీదట ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. లైంగిక వేధింపు కేసులో మమ్‌కూట్టతిల్‌కు స్థానిక కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. మమ్‌కూట్టతిల్ పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై రెండు రోజులపాటు ఇరుపక్షాల వాదనలు విన్న తిరువనంతపురంలోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి నజీరా ఎస్. గురువారం పిటిషన్‌ను తిరస్కరిస్తూ తీర్పు వెలువరించారు. ఓ మహిళపై అత్యాచారం చేయడంతోపాటు ఆమెకు బలవంతంగా గర్భస్రావం చేయించిన ఆరోపణలపై మమ్‌కూట్టతిల్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. బాధితురాలి ప్రైవేట్ ఫొటోలను బహిర్గతం చేస్తానంటూ బెదిరించడంపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఆరోపణలపై విచారణకు సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దేశం విడిచి వెళ్లకుండా ఆయనపై లుకౌట్ నోటీస్ సైతం జారీ అయ్యింది. కేరళ విడిచి దొంగచాటుగా తమిళనాడు, కర్నాటకకు వెళ్లి ఉంటారని అనుమానిస్తున్న పోలీసులు ఆయన కోసం అన్వేషణ ముమ్మరం చేశారు.

మసీదులు, మదర్సాల్లో సీసీటీవీ కెమెరాలు

లోక్‌సభలో బీజేపీ ఎంపీ అరుణ్ గోవిల్ డిమాండ్

న్యూఢిల్లీ: దేశంలో మసీదులు, మదర్సాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బీజేపీ ఎంపీ అరుణ్ గోవిల్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. భద్రతను మెరుగుపర్చడానికి కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని చెప్పారు. ఈ డిమాండ్ ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదని అన్నారు. దేశ భద్రత, ప్రజల జీవితాలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే తాను మాట్లాడుతున్నానని వివరించారు. దేశవ్యాప్తంగా ఆలయాలు, చర్చిలు, పాఠశాలలు, కళాశాలల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారని, అదే తరహాలో మసీదులు, మదర్సాల్లో సైతం ఏర్పాటు చేయాలని తేల్చిచెప్పారు. మసీదులు, మదర్సాలకు వెళ్లేవారికి దీంతో తగిన భద్రత లభిస్తుందని తెలిపారు. ఇస్లాం మతానికి పుట్టినిల్లయిన మక్కాలో కూడా సీసీటీవీ కెమెరాలు ఉన్నాయని అరుణ్ గోవిల్ గుర్తుచేశారు. మసీదులు, మదర్సాల్లో కెమెరాల విషయంలో దేశవ్యాప్తంగా ఒక ఏకీకృత విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్మీపై వ్యాఖ్యల కేసులో రాహుల్‌కు ఊరట

న్యూఢిల్లీ: ఆర్మీకి వ్యతిరేకంగా వ్యాఖ్యానించినట్లు ఆరోపణలున్న కేసులో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. దిగువ కోర్టు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోరాదంటూ గతంలో ఇచ్చిన స్టేను వచ్చే ఏడాది ఏప్రిల్ 22వ తేదీ వరకు పొడిగిస్తూ గురువారం ఆదేశాలిచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం రాహుల్ గాంధీ వేసిన అప్పీల్‌ను పరిశీలించింది. దీనిపై సమగ్ర విచారణ చేపడతామని పేర్కొంది. 2022లో భారత్ జోడో యాత్ర సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై కేసు నమోదైంది. ఈ కేసులో దిగువ కోర్టు ఆయనకు సమన్లు జారీ చేసింది.

నివాస భవనాన్ని హాస్టల్‌కు లీజుకిచ్చినా జీఎస్టీ ఉండదు: సుప్రీం

న్యూఢిల్లీ: నివాస భవనాన్ని విద్యార్థులు, ఉద్యోగుల కోసం హాస్టల్‌గా ఉపయోగించినా జీఎస్టీ నుంచి మినహాయింపు కొనసాగుతుందని సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి కర్నాటక హైకోర్టు వెలువరించిన తీర్పును జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం గురువారం సమర్థించింది. భవనం యజమాని, లీజుదారు మధ్య జరిగిన లావాదేవీపై 18 శాతం జీఎస్టీ విధించినట్లయితే మినహాయింపు ఉద్దేశాన్ని దెబ్బతీసినట్లే అవుతుందని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో అంతిమంగా ఆ భవనాన్ని నివాసంగానే వాడుతున్నందున జీఎస్టీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపింది. జీఎస్టీకి సంబంధించిన 13వ నిబంధన ప్రకారం ఆ భవనం రెసిడెన్స్ కిందికి రాదని, పన్ను చెల్లించాల్సిందేనని అథారిటీ ఆఫ్ అడ్వాన్స్ రూలింగ్(ఏఏఆర్), అప్పిలేట్ అథారిటీ ఫర్ అడ్వాన్స్ రూలింగ్‌లు తీర్పు ఇవ్వగా కర్నాటక హైకోర్టు దానిన్ని గతంలో తోసిపుచ్చింది.

షేక్ హసీనా కుమారుడిపై అరెస్టు వారెంట్ జారీ

ఢాకా: మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజిబ్ వాజెద్ జాయ్‌పై బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రిబ్యునల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఐటీ నిపుణుడైన 54 ఏళ్ల జాయ్.. మాజీ ప్రధానికి ఐసీటీ వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన అమెరికాలో ఉంటున్నారు. అప్పటి ఐసీటీ వ్యవహారాల మంత్రి జునైద్ అహ్మద్ పాలక్‌పై కూడా ఇదే వారెంట్ జారీ అయింది. అయితే.. ఆయన ఇప్పటికే జైలులో ఉన్నారు. జూలైలో విద్యార్థుల నేతృత్వంలో జరిగిన నిరసనను అత్యంత క్రూరంగా అణచివేసేందుకు ప్రయత్నించార న్న ఆరోపణలపై మాజీ ప్రధాని హసీనాకు, అప్పటి హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌కు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. నెల రోజుల తరువాత గురువారం జాయ్‌పై అరెస్టు వారెంట్ జారీ అయ్యింది.

చికిత్సకోసం ఖలీదా జియా లండన్‌కు!

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియాను మెరుగైన చికిత్సకోసం లండన్ తరలిస్తున్నారు. బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ) అధినేత్రి అయిన జియా ఊపిరితిత్తులు, గుండెలో ఇన్ఫెక్షన్ల కారణంగా నవంబర్ చివరి వారంలో ఆస్పత్రిలో చేరారు. వారంరోజుల్లో ఆమె ఆరోగ్యం మరింత విషమంగా మారింది. ప్రభుత్వ తాత్కాలిక చీఫ్ మహమ్మద్ యూనస్ బుధవారం ఆస్పత్రిని సందర్శించారు. ఆమె ఆరోగ్య గురించి ఆరా తీశారు. జియా కుమారుడు బీఎన్‌పీ తాత్కాలిక చైర్ పర్సన్ తారిక్ రెహమాన్ 2008 నుంచి లండన్‌లో ఉంటున్నారు. తల్లి అనారోగ్యం గురించి ఆయన సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. అవామీ లీగ్ పాలనలో అప్పటి సైనిక మద్దతుతో మాజీ ప్రధాని షేక్ హసీనా అవినీతి, క్రిమినల్ కేసుల్లో ఆయనను దోషిగా తేల్చడంతో తాను, తన దేశానికి వెళ్లలేకపోతున్నానని పేర్కొన్నారు.

ఎడారిలో కూలిన అమెరికా యుద్ధ విమానం

ట్రోనా (యూఎస్): అమెరికా వైమానిక దళానికి చెందిన అత్యాధునిక యుద్ధ విమానం కాలిఫోర్నియా ఎడారిలో కూలిపోయింది. పైలట్ ముందుచూపుతో విమానం కుప్పకూలడానికి ముందే పారాచూట్ సహాయంతో సురక్షితంగా బయటపడ్డారు. యుద్ధ విన్యాసాల ప్రదర్శన స్క్వాడ్రన్ (థండర్‌బర్డ్స్)కు చెందిన యుద్ధ విమానం దక్షిణ కాలిఫోర్నియాలోని ట్రోనా ఎయిర్‌పోర్ట్ సమీపంలో కూలిపోయిందనీ సైన్యం తెలిపింది. కానీ.. పైలట్ స్వల్ప గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించింది. బుధవారం ఉదయం 10:45 గంటల ప్రాంతంలో శిక్షణలో ఉండగా ఎఫ్–16ఇ ఫైటర్ ఫాల్కన్ కూలిపోయిందని తెలిపింది. ఈ ప్రమాదంపై దర్యాప్తు నిర్వహిస్తున్నామని ఎయిర్‌ఫోర్స్ ఒక ప్రకటనలో తెలిపింది. నేవీకి చెందిన థండర్‌బర్డ్స్, బ్లూ ఏంజిల్స్ స్క్వాడ్రన్‌లోని ఫైటర్ జెట్స్ యుద్ధ విన్యాసాలకు ప్రసిద్ధి. అతి సమీపంగా ఎగరడంలో శిక్షణ పొందినవి. దశాబ్దాలుగా ఉపయోగిస్తున్న విమానాలు పదుల సంఖ్యలో ప్రమాదాలకు గురయ్యాయి.

మిజోరం మాజీ గవర్నర్ స్వరాజ్ కౌశల్ కన్నుమూత

న్యూఢిల్లీ: మిజోరం మాజీ గవర్నర్, బీజేపీ దివంగత సీనియర్ నేత సుష్మా స్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్(73)గురువారం మధ్యాహ్నం కన్నుమూశారు. సీనియర్ లాయర్ కూడా అయిన స్వరాజ్ కౌశల్ ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో ఆయన కుమార్తె, బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్, కుటుంబసభ్యులు ఆయన్ను వెంటనే ఎయిమ్స్‌కు తీసుకెళ్లారు. అయితే, ఆయన అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారని బీజేపీ తెలిపింది. లోధి రోడ్డులోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిపారు. బాన్సురీ స్వరాజ్ తండ్రి చితికి నిప్పంటించారు. అంత్యక్రియల్లో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మెఘ్వాల్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు, తల్కటోరా రోడ్డులోని 10వ నంబర్ అధికార నివాసంలో ఉంచిన కౌశల్ భౌతిక కాయానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పలువురు కేంద్ర మంత్రులు ఆర్‌ఎస్ఎస్ నేతలు శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దేనికి ఆపాదించవచ్చు?

భారత న్యాయ వ్యవస్థ

దిగువ కోర్టులు (Subordinate Courts)

భారత రాజ్యాంగంలోని ఆరో భాగంలో ప్రకరణలు 233 నుంచి 237 వరకు సబార్డినేట్ కోర్టులు (అధీన న్యాయస్థానాలు) గురించి ప్రస్తావించారు. హైకోర్టు తర్వాత వచ్చే దిగువ కోర్టులను 'సబార్డినేట్ కోర్టులు' అంటారు. వీటిలో జిల్లా కోర్టులు, సిటీ సివిల్ కోర్టులు, మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులు ఉంటాయి.

సిటీ సివిల్ కోర్టులు, జిల్లా అదనపు న్యాయ మూర్తి, సంయుక్త న్యాయమూర్తి, అదనపు న్యాయ మూర్తి, సెషన్స్ జడ్జీలకు 'జిల్లా జడ్జీ' హోదా ఉంటుంది.

ప్రకరణ 50 ప్రకారం అధీన న్యాయస్థాలను కార్యనిర్వాహక శాఖ నుంచి వేరు చేశారు. కింది న్యాయస్థానాలపై అప్పీళ్లు, పర్యవేక్షణాధికార పరిధి తోపాటు న్యాయమూర్తులపై పరిపాలనా నియంత్రణను హైకోర్టు కలిగి ఉంటుంది.

- ప్రకరణ 233 ప్రకారం జిల్లా న్యాయమూర్తుల నియామకం, పదోన్నతి విషయాల్లో గవర్నర్ హైకోర్టును సంప్రదిస్తారు.
- ప్రకరణ 243 ప్రకారం న్యాయమూర్తులతో పాటు న్యాయశాఖ సర్వీసుకు చెందిన ఇతర ఉద్యోగుల నియామకం విషయంలో, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తోపాటు హైకోర్టును కూడా గవర్నర్ సంప్రదించాలి.
- జిల్లా కోర్టులు, వాటి కింది కోర్టుల్లో పనిచేసే నిమ్న స్థాయి ఉద్యోగాల నియామకం, పదోన్నతి, సెలవు మంజూరు లాంటి వ్యవహారాలపై నియంత్రణను హైకోర్టుకు ఇచ్చారు.

జాతీయ న్యాయ మండలి (National Judicial Council)

లోక్‌సభ 2008 అక్టోబరు 8న న్యాయమూర్తుల విచారణ బిల్లు–2006ను ఉపసంహరించి, దానిస్థానంలో న్యాయమూర్తుల విచారణ సవరణ బిల్లు–2008ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదిత బిల్లు జాతీయ న్యాయమండలి (ఎన్.జె.సి.) ఏర్పాటుకు ఆవకాశం కల్పిస్తుంది.

ఇందులోని ముఖ్యాంశాలు..

- ఉన్నత స్థానాల్లో ఉన్న న్యాయమూర్తులపై వచ్చిన ఫిర్యాదుల దర్యాప్తు, నిర్ణీత ప్రక్రియను అవలంబించడం ద్వారా ఫిర్యాదులు వచ్చిన వారిపై తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేసే అధికారం ఈ మండలికి ఉంటుంది.
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీం కోర్టుకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, అత్యధిక సీనియారిటీ ఉన్న ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు (వీరిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు) ఈ మండలిలో సభ్యులుగా ఉంటారు.
- సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులపై ఎన్.జె.సి.కి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదుపై ప్రాథమిక పరిశీలన చేసి, విచారణ జరిపే అధికారం ఎన్.జె.సి.కి ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న న్యాయమూర్తి దోషిగా నిరూపణ అయితే, ఆ న్యాయమూర్తిని పార్లమెంట్‌లో అభిశంసించడం ద్వారా పదవి నుంచి తొలగించాలని ఎన్.జె.సి. సూచించవచ్చు. దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు నిరూపణ అయితే.. ఆ ప్రవర్తన పదవి నుంచి తొలగించాల్సినంత తీవ్రమైంది కాకపోతే హెచ్చరించడం, మందలించడం, అభిశంసించడం లేదా నిర్ణీత కాలంపాటు ఏవిధమైన న్యాయపరమైన బాధ్యతలు అప్పగించకపోవడం, పదవీ విరమణ కోరడం లాంటి చర్యలు తీసుకోవచ్చు.
- న్యాయమూర్తిని తొలగించాలని కోరుతూ చేసిన తీర్మానం ప్రాతిపదికగా లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ స్పీకర్ నివేదిస్తే.. న్యాయ మండలి స్వల్ప చర్యను సిఫారసు చేయడం, తీసుకోవడంగానీ చేయలేదు.

ఈ ప్రతిపాదిత బిల్లు న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత తీసుకువస్తుంది. దాని ప్రతిష్ఠను కూడా ఇనుమడింపజేస్తుంది.

గ్రామ న్యాయాలయాలు

గ్రామ న్యాయాలయాల బిల్లు–2008 పార్లమెంటు ఉభయ సభలు డిసెంబర్ 3న ఆమోదించాయి. గ్రామ న్యాయాలయాల చట్టాన్ని 2009 అక్టోబరు 2 (గాంధీ జయంతి సందర్భంగా) నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. ఈ చట్టం ద్వారా దేశవ్యాప్తంగా బ్లాక్ స్థాయిలో 5,067 కోర్టులను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. దేశంలోని గ్రామీణ ప్రజలు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయం పొందడానికి వీలవుతుంది. గ్రామ న్యాయాలయాలు చట్టం ప్రకారం దేశంలోని వివిధ గ్రామాల్లో సంచార న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తారు. ఈ న్యాయస్థానాల్లో విచారణను న్యాయాధికారి (ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్) నిర్వహిస్తారు.

రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత హైకోర్టులను సంప్రదించి ఈ న్యాయాధికారులను నియమిస్తాయి.

గ్రామ న్యాయాలయాలు విచారించే కేసులు

క్రిమినల్, సివిల్ కేసులు, మరణశిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష, రెండు సంవత్సరాలకు పైగా శిక్ష విధింపునకు సంబంధించిన కేసులు మినహా మిగిలిన అన్ని రకాల వివాదాలపై గ్రామ న్యాయాలయాలు విచారణ నిర్వహిస్తాయి. దొంగతనం, దొంగిలించిన వస్తువులను తీసుకోవడం లేదా తన వద్ద ఉంచుకోవడం, దొంగిలించిన వస్తువులు లేదా ఆస్తిని దాచడానికి సహకరించడం (వాటి విలువ రూ. 20,000లకు పైగా లేని సందర్భాల్లో),ఆస్తి కొనుగోలు,భూమిని సాగు చేసుకోవడం, బోరుబావి లేదా సాధారణ బావి నుంచి నీటిని వినియోగించుకోవడం లాంటి కేసులను న్యాయాలయాలు విచారిస్తాయి.

సెషన్స్ కోర్టుకు అప్పీల్ చేసే అవకాశం

గ్రామ న్యాయాలయాలు ఇచ్చే తీర్పులను సవాలు చేస్తూ సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. అప్పీలు దాఖలు చేసిన ఆరు నెలల్లోగా సెషన్స్ కోర్టులు విచారణ జరిపి, తీర్పు ప్రకటించాలి.

లోక్ అదాలత్ (ప్రజా న్యాయస్థానం)

న్యాయస్థానాల్లో కొన్ని కారణాల వల్ల కేసులు పరిష్కరించడంలో ఎక్కువ జాప్యం జరుగుతుంది.

గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల
ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

వాది, ప్రతివాదులు కూడా కొన్ని సందర్భాల్లో పరిష్కారాలకు సముఖంగా ఉండక కాలయాపన చేస్తుంటారు. కేసులను త్వరితగతిన పరిష్కరించడం కోసం ప్రత్యామ్నాయ వివాద విచారణ (Alternative Dispute Resolution) పద్ధతిలో లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేస్తారు.

- లోక్ అదాలత్ పద్ధతిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.ఎన్. భగవతి ప్రచారంలోకి తీసుకు వచ్చారు.
- 1982లో గుజరాత్‌లో మొదటిసారిగా లోక్ అదాలత్‌లను ప్రారంభించారు.
- 1987లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం ద్వారా లోక్ అదాలత్‌లకు చట్టబద్ధత కల్పించారు. నిర్దేశిక నియమాల్లో ప్రకరణ 39ఎ ప్రకారం ప్రజలకు ఉచిత న్యాయ సలహా అందించాలని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే వీటిని ఏర్పాటు చేశారు.

సులభంగా పరిష్కరించగలిగే కొన్ని రకాల కేసులను పెద్ద మనుషుల మధ్యవర్తిత్వంలో పరిష్కరించడానికి చట్టబద్ధమైన ప్రతిపత్తి కలిగిస్తూ 'లోక్ అదాలత్' పేరుతో ప్రజా న్యాయస్థానాలనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ పేదలకు ఉచితంగా న్యాయం అందిస్తుంది. సాధారణ న్యాయస్థానాల్లో పనిచేస్తున్న న్యాయమూర్తి లోక్ అదాలత్ న్యాయాధిపతిగా కూడా వ్యవహరిస్తారు. ఈ విధానం వల్ల కేసులను పరిష్కరించడంలో ఆలస్యాన్ని నివారించవచ్చు.

లోక్ అదాలత్ నిర్మాణం

సుప్రీంకోర్టు, హైకోర్టు, లీగల్ సర్వీసెస్ కమిటీ, రాష్ట్ర, జిల్లా స్థాయి లీగల్ సర్వీస్ కమిటీలు లోక్ అదాలత్‌లను నిర్వహించవచ్చు. ఇందులో జిల్లా ప్రస్తుత న్యాయమూర్తి లేదా పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి, అదేవిధంగా వివిధ రంగాల్లో ప్రముఖులు.. ముఖ్యంగా న్యాయశాస్త్రం, సామాజిక సేవ, నిమ్న వర్గాల వికాసానికి కృషి చేస్తున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. లోక్ అదాలత్ ఇచ్చే తీర్పులు అంతిమం. వీటిని సాధారణంగా అప్పీల్ చేసుకోవడానికి వీలు లేదు. పార్లమెంట్ 2002లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం–1987కు సవరణ చేసి శాశ్వత పద్ధతిలో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసింది.దీని ప్రకారం శాశ్వత లోక్ అదాలత్‌కు జిల్లా న్యాయమూర్తి లేదా అదనపు న్యాయమూర్తి చైర్మన్‌గా ఉంటారు. పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్‌లో ఇద్దరు నిష్ణాతులను ప్రభుత్వాలు నామినేట్ చేస్తాయి.

లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే అంశాలు

మోటారు వాహనాలు, ఇన్సూరెన్సు క్లెయిమ్‌లు, కాంట్రాక్టులకు సంబంధించిన వివాదాలు, వివాహ సంబంధ కేసులు, భూ సేకరణ, బ్యాంకు లోన్‌లకు సంబంధించిన కేసులు ఉభయ వర్గాల అంగీకారంతో లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరంగా, సంతృప్తికరంగా పరిష్కారమవుతున్నాయి. ఇవి ప్రత్యేక తరహాలో రూపొందించిన న్యాయస్థానాలు. ప్రజలకు సత్వరమే న్యాయాన్ని అందించడం ఈ లోక్ అదాలత్‌ల ముఖ్య ఉద్దేశం.

వినియోగదారుల ఫోరాలు (Consumer Forums)

వినియోగదారులు, అమ్మకందారులకు మధ్య తలెత్తే వివాదాలు వినియోగదారుల ఫోరాల్లో పరిష్కారమవుతున్నాయి. ఇటీవల ఆధునిక రాజ్యాల్లో వినియోగదారుల హక్కులపై చైతన్యం పెరగడం వల్ల ఈ హక్కులకు భంగం కలిగితే వీటి ద్వారా పరిష్కారాలు ఇస్తున్నారు. ఇలా ఈ నూతన న్యాయస్థానాలు ప్రజా న్యాయస్థానాలుగా ఆదరణ పొందుతున్నాయి. 1986లో వినియోదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని చేశారు. ఇవి మూడు స్థాయిల్లో పనిచేస్తాయి. జిల్లా స్థాయిలో పనిచేసే ఫోరాలు రూ.20 లక్షల లోపు విలువ ఉన్న కేసులను, రాష్ట్ర స్థాయిలోని ఫోరాలు రూ. 20 లక్షల నుంచి ఒక కోటి వరకు విలువ ఉన్న కేసులను, జాతీయ స్థాయిలోని ఫోరం కోటి రూపాయలకు పైగా విలువ ఉన్న కేసులను పరిశీలిస్తాయి. వినియోగదారుడు 100 రూపాయల రుసుం చెల్లించి ఫిర్యాదు చేయవచ్చు. సాధారణ న్యాయస్థానాల్లా న్యాయప్రకియలు ఉండవు. వినియోగదారుడు తన వాదనను స్వయంగా వినిపించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. హైకోర్టు, సుప్రీంకోర్టుల న్యాయమూర్తులకు సంబంధించి ఏ విషయంలో పోలికలు ఉన్నాయి?
   ఎ) తొలగింపు బి) రాజీనామా
   సి) స్వతంత్ర ప్రతిపత్తి డి) పైవన్నీ
2. సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష అధికారం నుంచి మినహాయించిన అంశం?
   ఎ) పార్లమెంటరీ ప్రక్రియలు
   బి) మంత్రి మండలి సలహా
   సి) సభాధ్యక్షుల నిర్ణయాలు
   డి) పైవన్నీ
3. కిందివాటిలో కొలీజియం వ్యవస్థలోని లోపం ఏది?
   ఎ) వృత్తిపరమైన ప్రీతి
   బి) పారదర్శకత లేకపోవడం
   సి) అనూహ్యమైన జాప్యం
   డి) పైవన్నీ
4. జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌కు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   ఎ) ఇది రాజ్యాంగపరమైన సంస్థ
   బి) న్యాయ నియామకాలు, ఖాళీలను గుర్తిస్తుంది.
   సి) దీనికి అధిపతిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉంటారు
   డి) పైవన్నీ సరైనవే
5. సుప్రీం కోర్టు తీర్పులను ...
   ఎ) రాష్ట్రపతి మార్చవచ్చు
   బి) పార్లమెంటు మార్చవచ్చు
   సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మార్చవచ్చు
   డి) ఏదీకాదు
6. కింది ఏ అంశాలను సుప్రీంకోర్టు ఆవిష్కరించింది?
   ఎ) ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం
   బి) మౌలిక నిర్మాణ సూత్రం
   సి) కొలీజియం భావన
   డి) పైవన్నీ
7. అమెరికా సుప్రీంకోర్టుకు భారత సుప్రీంకోర్టుకు మధ్య తేడా?
   ఎ) న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు
   బి) అపరిమిత న్యాయ సమీక్ష అధికారం
   సి) ఎ, బి
   డి) ఏదీకాదు
8. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దేనికి ఆపాదించవచ్చు?
   ఎ) న్యాయ సమీక్ష
   బి) న్యాయశాఖ క్రియాశీలత
   సి) న్యాయశాఖ పవిత్రత
   డి) న్యాయశాఖ ఆధిక్యత
9. సుప్రీంకోర్టును రాజ్యాంగ పరిరక్షణకర్తగా పేర్కొంటారు. దీనికి ప్రాతిపదిక?
   ఎ) జీతభత్యాలు
   బి) స్వతంత్ర సర్వీసులు
   సి) న్యాయ సమీక్ష
   డి) న్యాయశాఖ ఆధిక్యం
10. ప్రజా ప్రయోజానాల వ్యాజ్యం సుప్రీంకోర్టులో ప్రారంభమైనప్పుడు నాటి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
    ఎ) ఎం. హిదయతుల్లా
    బి) వి.ఆర్. క్రిష్ణ అయ్యర్
    సి) పి.ఎన్. భగవతి
    డి) ఎ.ఎస్.ఆనంద్
11. కింది ఏ కోర్టు లేదా కోర్టులను 'కోర్ట్ ఆఫ్ రికార్డ్స్'గా పరిగణిస్తారు?
    ఎ) సుప్రీంకోర్టు బి) హైకోర్టు
    సి) జిల్లా కోర్టు డి) ఎ, బి
12. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను తర్వాత కాలంలో మార్చవచ్చు. దీన్ని ఏమంటారు?
    ఎ) క్యూరేటివ్ పిటిషన్
    బి) రివిజన్ పిటిషన్
    సి) ప్రాస్పెక్టివ్ ఓవర్ రూలింగ్
    డి) స్టేర్ డెసిసిస్

సమాధానాలు

1) డి; 2) డి; 3) డి; 4) డి; 5) డి; 6) డి; 7) సి; 8) బి; 9) సి; 10) సి; 11) డి; 12) సి.

నన్నయ రాసిన 'అమ్మ కోసం' పాఠ్య భాగం ఏ ప్రక్రియ?

డీసెట్‌లో తెలుగు సబ్జెక్టు కీలక పాత్ర పోషిస్తోంది. కాబట్టి అభ్యర్థులు అశ్రద్ధ చేయకుండా తెలుగుపై పట్టు సాధించాలి. ఇందులో ఎక్కువగా కవులు, రచయితలు, వారి కాలాలు, బిరుదులు, రచనలు, కావ్య ప్రక్రియలు, ప్రసిద్ధ కొటేషన్లు, సాహిత్య అంశాలు, సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, అర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు, ప్రకృతి- వికృతులు, జాతీయాలు- సామెతలు, ప్రత్యక్ష కథనం- పరోక్ష కథనం, నామ్నీకరణం, వాక్య భేదాలు తదితర వ్యాకరణఅంశాలపై ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. 8, 9, 10 తరగతుల కొత్త పాఠ్య పుస్తకాలను సేకరించి సొంత నోట్సు ప్రిపేర్ చేసుకోవాలి.

8వ తరగతి - తెలుగు

కవులు - పరిచయం

1. **గంగాపురం హనుమచ్ఛర్మ (1925–96):**
   గొప్ప కవి పండితులు, రాజకీయవేత్త, సమాజ సేవకులు
   పాఠ్యభాగం: దుందుభి
   ప్రక్రియ : గేయం
   ఇతివృత్తం: పర్యావరణం
   రచనా విశేషాలు: ఋగ్వేద విజ్ఞానం, దుందుభి (నదీకావ్యం), మల్కిభరామ, గోపన
2. **డా. బిరుదురాజు రామరాజు (1925–2010):**
   జానపద సాహితీ వేత్త
   పాఠ్యభాగం: మన సంస్కృతి
   ప్రక్రియ: వ్యాసం
   ఇతివృత్తం: సంస్కృతి
   రచనా విశేషాలు: తెలుగు జానపద గేయ సాహిత్యం, చరిత్రకెక్కిన చరితార్థులు, ఆంధ్ర యోగులు, మరుగుపడిన మాణిక్యాలు, ఉర్దూ, తెలుగు నిఘంటువులు, శ్రీ సత్యసాయి విన్నపాలు, తెలుగు వీరుడు, వీరగాథలు, అల్లూరి సీతారామరాజు, తెలుగు జానపద రామాయణం, తెలుగు సాహిత్యోద్యమకారులు, తెలంగాణ పల్లెపాటలు, తెలంగాణ పిల్లల పాటలు .
3. **నన్నయ (11వ శతాబ్దం):**
   బిరుదు: ఆదికవి, వాగానుశాసనుడు.
   పాఠ్యభాగం: అమ్మ కోసం
   ప్రక్రియ: పద్యం
   ఇతివృత్తం: మాతృభక్తి
   రచనా విశేషాలు: మహాభారతం, ఆంధ్రశబ్ద చింతామణి, చాముండికా విలాసం, ఇంద్ర విజయం.
4. **కొండూరు వీరరాఘవాచార్యులు (20వ శతాబ్దం):**
   పాఠ్యభాగం: నీతి పరిమళాలు
   ప్రక్రియ: శతకం
   ఇతివృత్తం: నైతిక విలువలు
   రచనా విశేషాలు: మిత్ర సాహస్రి
5. **శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) (1910–83):**
   బిరుదు: మహాకవి, అభ్యుదయ కవిత్వ మూలవిరాట్టు.
   పాఠ్యభాగం: ప్రతిజ్ఞ **ప్రక్రియ:** గీతం
   ఇతివృత్తం: సామాజిక చైతన్యం
   రచనా విశేషాలు: ప్రభవ (భావ కవితా సంపుటి), మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, మూడు యాభైలు, చరమరాత్రి, మరో ప్రస్థానం, సిప్రాలి, కార్టూన్ కవితలు, 1999 రేడియో నాటికలు, అనంతం (ఆత్మకథ).

6. **నార్ల వెంకటేశ్వరరావు (1908):**
   పత్రికా సంపాదకులు, కవి, విమర్శకులు, నాటక కర్త.
   పాఠ్యభాగం: అజంతా చిత్రాలు
   ప్రక్రియ: యాత్రా రచన
   రచనా విశేషాలు: రష్యన్ కథలు(అనువాద రచన), నరకంలో హరిశ్చంద్రుడు (నాటకం), నార్లవారి మాట (శతకం), కొత్తగడ్డ (నాటికల సంపుటి), సీత జోస్యం.
7. **గౌరన (15వ శతాబ్దం):**
   బిరుదు: చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి, ప్రతివాద గజ పంచాననుడు.
   పాఠ్యభాగం: హరిశ్చంద్రుడు
   ప్రక్రియ : ద్విపద కావ్యం
   రచనా విశేషాలు: నవనాథ చరిత్ర (ద్విపద కావ్యం), హరిశ్చంద్రోపాఖ్యానం (ద్విపద కావ్యం), లక్షణ దీపిక (సంస్కృత గ్రంథం).
8. **వట్టికోట ఆళ్వారుస్వామి (1915–61):**
   గొప్ప నవలాకారుడు
   పాఠ్యభాగం: చిన్నప్పుడే
   ప్రక్రియ : కథానిక
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: ప్రజల మనిషి (ప్రసిద్ధ నవల), గంగు (ప్రసిద్ధ నవల), జైలు లోపల (కథల సంపుటి).
9. **డా. సి. నారాయణ రెడ్డి (సినారె) (1931):**
   బిరుదు: పద్మభూషణ్
   పాఠ్యభాగం: జీవన భాష్యం
   ప్రక్రియ: గజల్
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర, ప్రపంచ పదులు, మట్టిమనిషి ఆకాశం, సినారె గజళ్లు, మంటలూ - మానవుడు, అక్షరాల గవాక్షాలు, రుతుచక్రం.
10. **డా. ఇరివెంటి కృష్ణమూర్తి (1930–89):**
    రచనా విశేషాలు: తెలుగు ఉత్తర భారత సాహిత్యాలు, చాటువులు, వాగ్భూషణమ్, వేగు చుక్కలు, వెలుగు బాటలు, అడుగు జాడలు, కవి సమయాలు (సిద్ధాంత గ్రంథం).
11. **అయ్యలరాజు రామభద్రుడు (16వ శతాబ్దం):**
    పాఠ్యభాగం: సముద్ర లంఘనం
    ప్రక్రియ: ప్రబంధం
    రచనా విశేషాలు: రామాభ్యుదయం (ప్రబంధం), సకలకథాసారా సంగ్రహం
12. **నండూరి రామమోహన్‌రావు (1927–2011):** పత్రికా సంపాదకులు.
    పాఠ్యభాగం: సంస్కరణ
    ప్రక్రియ: వార్తావ్యాఖ్య
    రచనా విశేషాలు: విశ్వరూపం, నరావతారం, విశ్వదర్శనం, పల్లవి - అనుపల్లవి, చిరంజీవులు, నండూరి రామమోహనరావు వ్యాఖ్యావళి, చిలక చెప్పిన రహస్యం, మయూర కన్య, హరివిల్లు (పిల్లల గేయాలు).
13. **ఎస్.టి. జ్ఞానానందకవి (1922–2011):**
    బిరుదు: పద్మశ్రీ
    పాఠ్యభాగం: సందేశం
    ఇతివృత్తం: జాతీయ సమైక్యత
    రచనా విశేషాలు: దీనబంధు శతకం, ఆమ్రపాలి, పాంచజన్యం, క్రీస్తు శతకం, నా జీవిత గాథ, కూలి నుంచి కళాప్రపూర్ణ వరకు.

వివిధ శతక కవులు – రచనా విశేషాలు:

- భర్తృహరి (7వ శతాబ్దం) – సుభాషిత త్రిశతి
- ధూర్జటి (16వ శతాబ్దం) – శ్రీకాళహస్తీశ్వర శతకం
- తాళ్లపాక పెద్ద తిరుమలయ్య (16వ శతాబ్దం) – వేంకటేశ్వర శతకం
- మారద వెంకయ్య (17వ శతాబ్దం) – భాస్కర శతకం
- కంచర్ల గోపన్న (17వ శతాబ్దం) – దాశరథీ శతకం
- నీలకంఠ దీక్షితులు (17వ శతాబ్దం) – సభారంజన శతకం (మూల కర్త)
- ఏనుగు లక్ష్మణ కవి (18వ శతాబ్దం) – సుభాషిత రత్నావళి
- ఏలూరిపాటి అనంతరామయ్య (20వ శతాబ్దం) – సభారంజన శతకం (అనువాద కర్త)

మాదిరి ప్రశ్నలు

1. గంగాపురం హనుమచ్ఛర్మ రాసిన దుందుభి ఒక ?
   1) ప్రేమ కావ్యం 2) నదీ కావ్యం
   3) వచన కావ్యం 4) అనువాద కావ్యం
2. మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురం ప్రాంతంలో ఏ నదిని 'దేవసేన' అని పిలుస్తారు?
   1) తుంగభద్ర 2) కృష్ణా
   3) మంజీర 4) దుందుభి
3. తెలుగు జానపద గేయ సాహిత్యం ఎవరి పరిశోధన గ్రంథం?
   1) బిరుదురాజు రామరాజు
   2) ఎన్.టి. జ్ఞానానంద కవి
   3) నాయని కృష్ణకుమారి
   4) ఇరివెంటి కృష్ణమూర్తి
4. బిరుదురాజు రామరాజు స్వస్థలం?
   1) కల్వకుర్తి (మహబూబ్ నగర్)
   2) దేవనూరు (వరంగల్)
   3) కవుతవరం (కృష్ణా)
   4) నకిరేకల్ (నల్గొండ)
5. కింది వాటిలో బిరుదురాజు రామరాజు రచన కానిది?
   1) తెలుగు వీరుడు
   2) తెలుగు జానపద రామాయణం
   3) తెలుగు జానపద గేయగాథలు
   4) తెలంగాణ పల్లె పాటలు
6. అనువాద పద్ధతి, శైలిలో తర్వాత తరం కవులకు మార్గదర్శకుడు?
   1) నన్నయ 2) తిక్కన
   3) ఎర్రన 4) శ్రీనాథుడు
7. నన్నయ రాసిన 'అమ్మ కోసం' పాఠ్య భాగం ఏ ప్రక్రియ?
   1) పురాణం 2) ఇతిహాసం
   3) ప్రబంధం 4) పురాణేతిహాసం
8. కిందివాటిలో నన్నయ కవిత్వంలో ప్రధాన లక్షణం కానిది?
   1) అక్షర రమ్యత
   2) ప్రసన్న కథా కలితార్థయుక్తి
   3) సూక్తి వైచిత్రి
   4) నానారుచిరార్థసూక్తి నిధిత్వం
9. సభారంజన శతకం- మూలకర్త?
   1) భర్తృహరి
   2) కొండూరు వీరరాఘవాచార్యులు
   3) ఏలూరిపాటి అనంతరామయ్య
   4) నీలకంఠ దీక్షితులు
10. కొండూరు వీరరాఘవాచార్యులు రాసిన శతకం ?
    1) మిత్రసాహస్రి
    2) సభారంజన శతకం
    3) మిత్రార్థ శతకం 4) వేంకటేశ శతకం
11. నీతి, భక్తి, వైరాగ్యాలను ప్రధానంగా బోధించే రచనలు?
    1) పురాణాలు 2) ఇతిహాసాలు
    3) శతకాలు 4) ఖండకావ్యాలు
12. శ్రీశ్రీ 18వ ఏట వెలువరించిన 'ప్రభవ' ఒక?
    1) అభ్యుదయ కవితా సంపుటి
    2) వచన కవితా సంపుటి
    3) విప్లవ కవితా సంపుటి
    4) భావ కవితా సంపుటి
13. చరమరాత్రి కథల ద్వారా చైతన్య స్రవంతి పద్ధతిని తెలుగు రచనలలో ప్రవేశ పెట్టిన వారు?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) శ్రీశ్రీ
    3) నార్ల వేంకటేశ్వరరావు
    4) త్రిపురనేని గోపీచంద్
14. కృష్ణాజిల్లా కవుతవరంలో జన్మించిన నార్ల వేంకటేశ్వరరావు ఒక గొప్ప?
    1) పత్రికా సంపాదకుడు
    2) కవి, విమర్శకుడు
    3) నాటక కర్త 4) పైవన్నీ
15. రష్యన్ కథలను తెలుగువారికి అందించిన రచయిత?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) సామల సదాశివ
    3) నార్ల వేంకటేశ్వర రావు
    4) నండూరి రామమోహనరావు
16. 'చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి' అని ఎవరికి బిరుదు?
    1) గౌరన
    2) అయ్యలరాజు రామభద్రుడు
    3) కొరవి గోపరాజు
    4) శ్రీకృష్ణదేవరాయలు

సమాధానాలు

1) 2; 2) 4; 3) 1; 4) 2; 5) 3; 6) 1; 7) 2; 8) 3; 9) 4; 10) 1; 11) 3; 12) 4; 13) 2; 14) 4; 15) 3; 16) 1.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లకు అపెక్స్ బ్యాంక్?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఎకానమీ

గ్రామీణ వ్యవసాయ పరపతి

గ్రామీణాభివృద్ధి, భారత ఆర్థికాభివృద్ధికి చుక్కాని వంటిది. గ్రామాలు సుసంపన్నంగా ఉన్నప్పుడే భారత్ అన్ని రంగాల్లో వెలుగొందుతుంది. కానీ నేటి గ్రామీణ భారతం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. అందుకు ప్రధాన కారణం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉండడం. డబ్బుతో ముడిపడి ఉన్న ఆధునిక వ్యవసాయా నికి సరిపడ పెట్టుబడి పెట్టే ఆర్థిక స్తోమత లేక రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. వ్యవసాయం ద్వారా సంపాదించిన ఆదాయం అధిక వడ్డీతో తీసుకున్న రుణాల చెల్లింపునకే సరిపోనప్పుడు రైతన్నకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతుంది.

'రాయల్ కమిషన్' చెప్పినట్లుగా మనదేశంలో రైతు అప్పులతో పుడుతున్నాడు. అప్పులతో నివసిస్తూ చివరకు అప్పులతో మరణిస్తున్నాడు.

గ్రామీణ రుణగ్రస్థత

భారత గ్రామీణాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్య వ్యవసాయ రుణగ్రస్థత. ఇది దేశ వ్యవసాయాభివృద్ధిని కుంటుపరుస్తుంది. గ్రామీణుల్లో చాలామంది తమ ఆర్థిక అవసరాల కోసం ఎక్కువగా అప్పులు చేస్తుంటారు. వీటిలో కొంతభాగం కుటుంబ అవసరాలకు, మిగిలిన దాన్ని వ్యవసాయ పెట్టుబడికి వినియోగిస్తున్నారు. అనేక కారణాల వల్ల గ్రామీణులు ఆ అప్పులను పూర్తిగా తీర్చలేక రుణగ్రస్థులవుతున్నారు. ఈ పరిస్థితిని 'గ్రామీణ రుణగ్రస్థత' (Rural Indebtedness) అంటారు.

కారణాలు

పేదరికం, వారసత్వంగా వచ్చిన అప్పులు, పెరిగిన వ్యవసాయ ఖర్చులు, వ్యవసాయ రంగం వెనుకబాటుతనం, అల్ప ఉత్పాదకత, భూమి కౌలు రుసుం అధికంగా ఉండడం, సాంఘిక, మతపరమైన కట్టుబాట్లు, ఆచారాల కోసం చేసే వ్యయం, వడ్డీ వ్యాపారుల మీద అధికంగా ఆధారపడటం, ప్రభుత్వ పరపతి సదుపాయాలు తగినంతగా లేకపోవడం, అనారోగ్యం, దురలవాట్లు మొదలైనవి.

పరిణామాలు

అధిక రుణభారం వల్ల వ్యవసాయదారుడి పెట్టుబడి శక్తి క్షీణిస్తుంది. తద్వారా దిగుబడి తగ్గి, ఉత్పత్తి తక్కువై ఆహార కొరత ఏర్పడుతుంది. ఆహార సరఫరా తక్కువ అవడం వల్ల డిమాండ్ అధికమై ప్రజల ఆహార ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. ప్రజల మిగులు ఆదాయం తగ్గడం వల్ల పారిశ్రామిక, సేవారంగాల ఉత్పత్తులకు డిమాండ్ తగ్గుతుంది. అపుడు ఆర్థిక వ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అది ప్రజల విద్యా, వైద్య, ఆరోగ్య స్థితిగతులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రభుత్వ సంస్థాగత పరపతి సౌకర్యాల కోసం, రైతుల రుణాలు మాఫీ చేయాలని ఉద్యమాలు పుడతాయి. వీటికి ప్రభుత్వ స్పందన సానుకూలంగా లేకపోతే అవి హింసాత్మకంగా మారి సమాజ భద్రతకు సవాలుగా మారుతాయి.

నివారణ చర్యలు

వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా ప్రభుత్వ సంస్థాగత పరపతి సౌకర్యాలను గ్రామీణ రైతులకు అధికంగా అందించాలి. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ప్రభుత్వం నియంత్రించి అధిక వడ్డీ వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలి. కరువు పరిస్థితుల్లో రైతు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసి సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని ఎప్పటి కప్పుడు అందజేయాలి.

గ్రామీణ పరపతిపై ప్రభుత్వ చర్యలు

- గ్రామీణ రుణగ్రస్థతను నిర్మూలించడానికే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) 'గోర్వాలా' అధ్యక్షతన 'అఖిల భారత గ్రామీణ పరపతి పరిశీలన సంఘం'(1954)ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రధానంగా సహకార పరపతి సంఘాలను ఎక్కువ సంఖ్యలో స్థాపించాలని, సహకార మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలని సూచించింది.
- గోర్వాలా నివేదిక ప్రకారం ప్రభుత్వం 1955లో 'ఇంపీరియల్ బ్యాంక్'ను జాతీయం చేసి 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)'గా మార్చింది.
- ఈ కమిటీ సూచనల మేరకు 1956లో ఆర్‌బీఐ గ్రామీణ రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందించడానికి 'జాతీయ వ్యవసాయ పరపతి – దీర్ఘకాలిక కార్యకలాపాల నిధి'ని ఏర్పాటుచేసింది. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రైతులను ఆదుకోవడానికీ 'జాతీయ వ్యవసాయ పరపతి స్థిరీకరణ నిధి'ని ప్రారంభించింది.
- ప్రభుత్వం వ్యవసాయ పరపతిని అధికం చేసే క్రమంలో 1969లో 14 వాణిజ్య బ్యాం కులు, 1980లో 6 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేసింది.
- 1963లో 'వ్యవసాయ పునర్విత్త సంస్థ'ను స్థాపించారు.
- ప్రొఫెసర్ ఎమ్. నరసింహం కమిటీ సిఫారసు ఆధారంగా ప్రభుత్వం 1975 అక్టోబర్ 2న 'ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ (RRB)లను స్థాపించింది.
- వ్యవసాయ గ్రామీణాభివృద్ధికి సంస్థాగతమైన ఏర్పాట్ల సమీక్షించడం కోసం క్రాఫికార్డ్ (CRAFICARD) కమిటీ (1979)ను ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సూచనల ప్రకారం 1982 జూలై 12న 'జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్'(NABARD)ను ఏర్పా టు చేసింది. ఇది ఆర్‌ఆర్‌బీల విధానాలను పర్యవేక్షించే అత్యున్నత బ్యాంక్ (Apex Bank). దీన్ని ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా స్థాపించాయి. ఆర్‌ఆర్‌బీల కు, ఆర్‌బీఐకి మధ్య నాబార్డ్ సంధానకర్తగా వ్యవహరిస్తుంది. రాష్ట్ర సహకార బ్యాంక్ (SCB)లకు, ఆర్‌ఆర్‌బీలకు ఇది ప్రత్యక్షంగా రుణ సహాయం అందిస్తుంది. రైతులకు నేరుగా రుణాలను అందించదు.
- గ్రామీణ పరపతిపై సూచనలిచ్చే ఉద్దేశం తో ఆర్.వి.గుప్తా నేతృత్వంలో 1997లో ఆర్‌బీఐ ఒక పరిశీలన సంఘాన్ని నియమించింది. ఈ కమిటీ గ్రామ పరపతిని ప్రోత్సహించే మార్గదర్శక సూత్రాలను సూచించింది. రైతు క్లబ్‌లను స్థాపించి, వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక విజ్ఞానాన్ని రైతులకు అందించేలా వాణిజ్య బ్యాంకులు కృషిచేయాలని సిఫారసు చేసింది.
- రైతులకు అవసరమైన పరపతిని సకాలం లో అందించడానికి మనదేశంలో 1904 లోనే 'సహకార సంస్థలు' ఆవిర్భవించాయి. వీటిని మొదట 1961లో, ఆ తర్వాత 1976లోనూ పునర్వ్యవస్థీకరించారు. ఆ తర్వాత అమల్లోకి వచ్చిన 'ఏకగవాక్ష విధానం' (Single window system) సహకార పరపతి విధానంలో నూతన చైతన్యం కలిగించింది. ఇది రైతులకు పరపతి సౌకర్యాలను సులభతరం చేసింది.

వ్యవసాయ పరపతి- వర్గీకరణ

వ్యవసాయ ఉత్పాదకాల కొనుగోలుకు, వ్యవసాయ పనులు చేపట్టడానికి అవసరమైన పరపతిని వ్యవసాయ పరపతి అంటారు. రైతులు తమ పరపతి అవసరాలను వివిధ మార్గాల ద్వారా తీర్చుకుంటున్నారు. అవి రెండురకాలు.

1. **సంస్థాగతమైన పరపతి మార్గాలు:** ప్రభుత్వం, సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు అందించే పరపతి సౌకర్యాలు.
2. **సంస్థాగతం కాని పరపతి మార్గాలు:** ప్రభుత్వ నియంత్రణ లేని సంస్థలు, ఎలాంటి చట్ట పరమైన విధి విధానాలు లేని వడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, స్నేహితులు, బంధువులు, భూస్వాముల నుంచి తీసుకునే అప్పులు. నేడు రైతులకు ఈ మార్గాల నుంచే అధికంగా పరపతి లభిస్తుంది. దీనికి వడ్డీ అధికంగా ఉండటం వల్ల రైతులు ఆర్థిక దోపిడికి గురవుతున్నారు. కాబట్టి ప్రభుత్వం సంస్థాగతం కాని పరపతి సంస్థలను నియం త్రించడానికి ప్రయత్నిస్తోంది. 'అఖిల భారత గ్రామీణ పరపతి పరిశీలన సంఘం' కాలవ్యవధి ఆధారంగా సంస్థాగతమైన పరపతి మార్గాలను 3 రకాలుగా వర్గీకరించింది.

1. **స్వల్పకాలిక పరపతి:**
12 నుంచి 15 నెలల వ్యవధిలో తిరిగి చెల్లించాల్సిన వ్యవసాయ రుణాలను 'స్వల్పకాలిక పరపతి' అంటారు. సాధారణంగా పంట చేతికి రాగానే రైతులు ఈ రుణాలను తీర్చేస్తారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పశువుల మేత కొనుగోలు, కూలీల వేతనాలు, పంట ను మార్కెట్‌కు తరలించడానికి అయ్యే రవాణా వ్యయానికి ఈ స్వల్పకాలిక రుణా లను రైతులు ఉపయోగించుకుంటారు.

2. **మధ్యకాలిక పరపతి:**
15 నెలల నుంచి 5 ఏళ్ల వ్యవధిలో ఈ రుణాలను తిరిగి చెల్లించాలి. పశువులు, వ్యవసాయ పనిముట్లు కొనుగోలు, బావుల తవ్వకం, భూమిని మెరుగుపర్చడం కోసం ఈ రుణాలను తీసుకుంటారు.

3. **దీర్ఘకాలిక పరపతి:**
5 నుంచి 20 ఏళ్ల కాలవ్యవధిలో తిరిగి చెల్లించే రుణాలు.ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, ఎలక్ట్రిక్ మోటార్ల కొనుగోలు, శాశ్వతంగా భూమిని అభివృద్ధి చేయడం, అదనంగా భూమి కొనుగోలు చేయడానికి... అధిక మొత్తంలో డబ్బు అవసరం అవుతుంది. దీన్ని తక్కువ కాలంలో తీర్చడం వీలుకాదు. ఎక్కువ వాయిదాల్లో రైతులు ఆ రుణాలను తీర్చడానికి అనువుగా ఈ పరపతి సౌకర్యం సహాయపడుతుంది.

- టి.డబ్ల్యూ. షుల్జ్ అభిప్రాయం ప్రకారం 'ఇండియాలో పరపతి కొరత మూలంగా వ్యవసాయాభివృద్ధి కుంటుపడడమే కాకుండా, వ్యవసాయాన్ని ఆధునికీకరించే ప్రక్రియలో వేగం తగ్గింది'. దీన్ని బట్టి వ్యవసాయంలో ప్రగతిని స్థిరీకరించడానికి పరపతి కీలకపాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు.

తక్కావి రుణాలు

సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లు, వాణిజ్య బ్యాంక్‌లు, రైతులకు పరపతి సౌకర్యాలను అందించక ముందు ప్రభుత్వమే నేరుగా రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను ఇచ్చేది. ముఖ్యంగా కరువు కాట కాలు, వరదలు మొదలైన ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులను ఆదుకోవడానికి ఇచ్చే రుణాలను 'తక్కావి' రుణాలంటారు. రైతులు ఈ రుణాలను తక్కువ వడ్డీతో, ఎక్కువ వాయిదాల్లో తీర్చేటట్లుగా వెసులుబాటు ఉండేది. అయితే కఠినమైన నియమాలు ఉండటం, మంజూరు చేయడంతో జాప్యం వల్ల ఇవి ఆదరణ కోల్పోయాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఇందిరాగాంధీ ఏ బ్యాంక్‌లను జాతీయం చేశారు?
ఎ) గ్రామీణ బ్యాంక్‌లు
బి) వాణిజ్య బ్యాంక్‌లు
సి) భారతీయ స్టేట్ బ్యాంక్‌లు
డి) పైవన్నీ

2. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1975 బి) 1978 సి) 1980 డి) 1982

3. గ్రామీణ రుణగ్రస్థతకు ప్రధాన కారణం
ఎ) రైతులు వ్యాపారస్తుల నుంచి తీసుకున్న రుణాలకు అధికంగా వడ్డీ చెల్లించడం
బి) వ్యవసాయ కమతాలు చిన్నవిగా ఉండీ దిగుబడి తక్కువై రైతుల ఆదాయం తగ్గటం
సి) పెళ్లిళ్లు, పుట్టుక, పండుగలు, చావులు కార్యక్రమాల కోసం గ్రామీణులు అధికంగా ఖర్చుచేసి అప్పుల పాలవడం
డి) పైవన్నీ

4. ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లకు అపెక్స్ బ్యాంక్ ?
ఎ) RBI బి) SBI
సి) NABARD
డి) DCB

5. 'తక్కావి రుణాలు' అంటే ఏమిటి?
ఎ) ప్రభుత్వం నామమాత్రపు వడ్డీతో రైతులకిచ్చే అతిస్వల్పకాలిక రుణాలు
బి) వ్యవసాయ పనిముట్ల కొనుగోలు కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకిచ్చే రుణాలు
సి) ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్కువ వడ్డీ, ఎక్కువ వాయిదాల్లో తీర్చేలా ప్రభుత్వం రైతులకిచ్చే రుణాలు
డి) సహకార సంస్థలు, గ్రామీణ బ్యాంక్‌లు అతి తక్కువ వడ్డీతో రైతులకిచ్చే స్వల్ప కాలిక దీర్ఘకాలిక రుణాలు

6. రామయ్య పశువులను కొనుగోలు చేయటానికి రుణం కోసం బ్యాంక్‌కు దరఖాస్తు చేశాడు. అపుడు బ్యాంక్ ఏ రకమైన రుణాన్ని అతడికి మంజూరు చేస్తుంది?
ఎ) స్వల్పకాలిక రుణం
బి) అతి స్వల్పకాలిక రుణం
సి) మధ్యకాలిక రుణం డి) దీర్ఘకాలిక రుణం

7. కిందివాటిలో రైతులకు ప్రత్యక్షంగా రుణాలివ్వని సంస్థ?
ఎ) ప్రాథమిక భూ అభివృద్ధి బ్యాంకులు
బి) ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు
సి) ఎస్‌బీఐ
డి) నాబార్డ్

8. నాబార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసిన కమిటీ?
ఎ) క్రాఫికార్డ్ కమిటీ బి) సరయూ కమిటీ
సి) నరసింహం కమిటీ డి) గోర్వాలా కమిటీ

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) సి;
5) సి; 6) సి; 7) డి; 8) ఎ.

Innovation in marketing is same as ...

BANK EXAMS
MARKETING AWARENESS

1. The fact that services are sold, produced and consumed at the same time refers to which of the following service characteristics?
a) Intangibility b) Inseparability
c) Variability d) Perishability
e) None of the above

2. Electronic shopping, TV shopping is related with:
a) Advertising
b) Personal Selling
c) Direct Marketing
d) In direct Marketing
e) Personal buying

3. The purpose of which of the following type of advertising is to create repeat purchases?
a) Reminder b) Reinforcement
c) Persuasive d) Informative
e) None of the above

4. ______ is the process of evaluating each market segment's attractiveness and selecting one or more segments to enter.
a) Mass marketing
b) Market segmentation
c) Market targeting
d) Market positioning
e) None of the above

5. The technique of focus on advertising of non-competitive brand with the other brand is called:
a) Cross-promotions
b) Tie-in promotions
c) Premiums d) All the above
e) None of the above

6. Labelling, packaging are associated with:
a) Price mix
b) Product mix
c) Place mix
d) Promotion mix
e) Cost mix

7. Entry of laggards is in which stage of PLC (Product Life Cycle)?
a) First b) Second
c) Third d) Fourth
e) Fifth

8. ______ factors are the most popular bases for segmenting customer groups.
a) Geographic b) Demographic
c) Psychographic
d) Behavioural
e) None of the above

9. A method in which various products are combined at the same price is:
a) Promotional pricing
b) Product-bundle pricing
c) Captive product pricing
d) Optional product pricing
e) All the above

10. Differentiation in pricing for various geographical customers:
a) Price skimming
b) Psychological pricing
c) Pricing variations
d) Geographical pricing
e) None of the above

11. According to the American Marketing Association, which of the following is marketing of products that are presumed to be environmentally safe?
a) Gray Marketing
b) Green Marketing
c) Global Marketing
d) Social Marketing
e) Internet Marketing

12. One of the following is not included in the 7 Ps of Marketing. Find the same ______.
a) Placement b) Price
c) Production d) Promotion
e) Product

13. Innovation in marketing is same as
a) Motivation b) Perspiration
c) Aspiration d) Creativity
e) Team work

14. A call marketing terms means?
a) A newly introduced product
b) Territory allocation for salesperson
c) A Call Centers
d) A Sales meeting
e) To visit a prospect

15. Bank ATMs are______
a) Delivery outlets
b) Market plans
c) Personalized Products
d) Tools for overcoming buyers resistance
e) Motivating tools

16. The USP of current account is ______
a) High minimum balance
b) No restrictions on transactions
c) No internet payable
d) Restricted deposits
e) Easy credits

17. The target group for SME Loan is ______
a) All salaried persons
b) Govt. undertakings
c) All entrepreneurs
d) All students e)All housewives

18. ______ is a principle of enlightened marketing that requires a company seek real product and marketing improvements.
a) Innovative marketing
b) Consumer-oriented marketing
c) Value marketing
d) Sense-of-mission marketing
e) None of the above

19. NAV is the price of______
a) Entire fund value
b) One unit of a fund
c) Surrender value
d) Average value of shares
e) Dividends paid in a year

20. A Master policy in the case of Life insurance indicates ______
a) Policy is sale
b) Policy is in the name of servant
c) Only one life is assured
d) There are several beneficiaries
e) Life assured should be a male

21. The biggest or greatest amount of involvement in a foreign market comes through which of the following?
a) Exporting b) Joint venturing
c) Licensing
d) Direct investment
e) None of the above

22. Financial inclusion needs canvassing the accounts of ______
a) Financial Institutions
b) NRIs
c) HNIs
d) Housewives
e) Persons below a specified income level

23. Facilities for sale and purchase of agricultural products are available in ______
a) Commodity exchange
b) Regulated market
c) Stock exchange
d) Unregulated market
e) None of the above

24. The company that overlooks new and better ways to do things will eventually lose customers to another company that has found a better way of serving customer needs is a major tenet of:
a) Innovative marketing
b) Consumer-oriented marketing
c) Value marketing
d) Sense-of-mission marketing
e) None of the above

25. All of the following would be ways to segment within the category of psychographic segmentation EXCEPT:
a) Social class b) Occupation
c) Lifestyle d) Personality
e) Creativity

26. In terms of execution styles, a family seated at the dinner table enjoying the advertised product would be an example of which of the following types of advertising?
a) Slice of life b) Lifestyle
c) Mood or imagery
d) Personality symbol
e) Personality

27. A child in the United States is normally exposed to all of the following values EXCEPT:
a) Achievement and success
b) Activity and involvement
c) Material comfort
d) Collectivism
e) None of the above

28. ______ has contractual authority to sell a manufacturer's entire output.
a) Selling agents
b) Rack jobbers
c) Manufacturer's agents
d) Purchasing agents
e) None of these

29. Sellers that handle their own exports are engaged in:
a) Direct exporting
b) Indirect exporting
c) Licensing
d) Contract manufacturing
e) None of the above

30. More and more salespeople are being evaluated and compensated based on different measures than in the past. All of the following are illustrations of those measures EXCEPT:
a) Long-term customer satisfaction
b) Competitive predatory pricing performance
c) Full customer service
d) Retention rates
e) None of the above

31. ______ includes practices such as overstating the product's features or performance, luring the customer to the store for a bargain that is out of stock, or running rigged contests.
a) Deceptive promotion
b) Deceptive packaging
c) Deceptive pricing
d) Deceptive cost structure
e) None of the above

32. The type of sales presentation approach that requires good listening and problem-solving skills is the:
a) Canned approach
b) Formula approach
c) Need-satisfaction approach
d) Critical-thinking approach
e) None of the above

33. In terms of special product life cycles, a ______ is a basic and distinctive mode of expression.
a) genre b) style
c) fashion d) fad e) None

KEY

1) b 2) c 3) a 4) c 5) a
6) b 7) d 8) a 9) b 10) d
11) b 12) c 13) d 14) e 15) c
16) b 17) c 18) a 19) b 20) d
21) d 22) e 23) d 24) a 25) b
26) a 27) d 28) a 29) a 30) a
31) b 32) a 33) b

ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దేనికి ఆపాదించవచ్చు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

భారత న్యాయ వ్యవస్థ

దిగువ కోర్టులు (Subordinate Courts)

భారత రాజ్యాంగంలోని ఆరో భాగంలో ప్రకరణలు 233 నుంచి 237 వరకు సబార్డినేట్ కోర్టులు (అధీన న్యాయస్థానాలు) గురించి ప్రస్తావించారు. హైకోర్టు తర్వాత వచ్చే దిగువ కోర్టులను 'సబార్డినేట్ కోర్టులు' అంటారు. వీటిలో జిల్లా కోర్టులు, సిటీ సివిల్ కోర్టులు, మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులు ఉంటాయి.

సిటీ సివిల్ కోర్టులు, జిల్లా అదనపు న్యాయమూర్తి, సంయుక్త న్యాయమూర్తి, అదనపు న్యాయమూర్తి, సెషన్స్ జడ్జీలకు 'జిల్లా జడ్జీ' హోదా ఉంటుంది.

ప్రకరణ 50 ప్రకారం అధీన న్యాయస్థాలను కార్యనిర్వాహక శాఖ నుంచి వేరు చేశారు. కింది న్యాయస్థానాలపై అప్పీళ్లు, పర్యవేక్షణాధికార పరిధితోపాటు న్యాయమూర్తులపై పరిపాలనా నియంత్రణను హైకోర్టు కలిగి ఉంటుంది.

- ప్రకరణ 233 ప్రకారం జిల్లా న్యాయమూర్తుల నియామకం, పదోన్నతి విషయాల్లో గవర్నర్ హైకోర్టును సంప్రదిస్తారు.
- ప్రకరణ 243 ప్రకారం న్యాయమూర్తులతో పాటు న్యాయశాఖ సర్వీసుకు చెందిన ఇతర ఉద్యోగుల నియామకం విషయంలో, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తోపాటు హైకోర్టును కూడా గవర్నర్ సంప్రదించాలి.
- జిల్లా కోర్టులు, వాటి కింది కోర్టుల్లో పనిచేసే నిమ్న స్థాయి ఉద్యోగాల నియామకం, పదోన్నతి, సెలవు మంజూరు లాంటి వ్యవహారాలపై నియంత్రణను హైకోర్టుకు ఇచ్చారు.

జాతీయ న్యాయ మండలి (National Judicial Council)

లోక్‌సభ 2008 అక్టోబరు 8న న్యాయమూర్తుల విచారణ బిల్లు–2006ను ఉపసంహరించి, దానిస్థానంలో న్యాయమూర్తుల విచారణ సవరణ బిల్లు–2008ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదిత బిల్లు జాతీయ న్యాయమండలి (ఎన్.జె.సి.) ఏర్పాటుకు ఆవకాశం కల్పిస్తుంది.

ఇందులోని ముఖ్యాంశాలు..

- ఉన్నత స్థానాల్లో ఉన్న న్యాయమూర్తులపై వచ్చిన ఫిర్యాదుల దర్యాప్తు, నిర్ణీత ప్రక్రియను అవలంబించడం ద్వారా ఫిర్యాదులు వచ్చిన వారిపై తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేసే అధికారం ఈ మండలికి ఉంటుంది.
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీం కోర్టుకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, అత్యధిక సీనియారిటీ ఉన్న ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు (వీరిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు) ఈ మండలిలో సభ్యులుగా ఉంటారు.
- సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులపై ఎన్.జె.సి.కి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదుపై ప్రాథమిక పరిశీలన చేసి, విచారణ జరిపే అధికారం ఎన్.జె.సి.కి ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న న్యాయమూర్తి దోషిగా నిరూపణ అయితే, ఆ న్యాయమూర్తిని పార్లమెంట్‌లో అభిశంసించడం ద్వారా పదవి నుంచి తొలగించాలని ఎన్.జె.సి. సూచించవచ్చు. దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు నిరూపణ అయితే.. ఆ ప్రవర్తన పదవి నుంచి తొలగించాల్సినంత తీవ్రమైంది కాకపోతే హెచ్చరించడం, మందలించడం, అభిశంసించడం లేదా నిర్ణీత కాలంపాటు ఏవిధమైన న్యాయపరమైన బాధ్యతలు అప్పగించకపోవడం, పదవీ విరమణ కోరడం లాంటి చర్యలు తీసుకోవచ్చు.
- న్యాయమూర్తిని తొలగించాలని కోరుతూ చేసిన తీర్మానం ప్రాతిపదికగా లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ స్పీకర్ నివేదిస్తే.. న్యాయ మండలి స్వల్ప చర్యను సిఫారసు చేయడం, తీసుకోవడంగానీ చేయలేదు.

ఈ ప్రతిపాదిత బిల్లు న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత తీసుకువస్తుంది. దాని ప్రతిష్ఠను కూడా ఇనుమడింపజేస్తుంది.

గ్రామ న్యాయాలయాలు

గ్రామ న్యాయాలయాల బిల్లు–2008 పార్లమెంటు ఉభయ సభలు డిసెంబర్ 3న ఆమోదించాయి. గ్రామ న్యాయాలయాల చట్టాన్ని 2009 అక్టోబరు 2 (గాంధీ జయంతి సందర్భంగా) నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. ఈ చట్టం ద్వారా దేశవ్యాప్తంగా బ్లాక్ స్థాయిలో 5,067 కోర్టులను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. దేశంలోని గ్రామీణ ప్రజలు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయం పొందడానికి వీలవుతుంది. గ్రామ న్యాయాలయాలు చట్టం ప్రకారం దేశంలోని వివిధ గ్రామాల్లో సంచార న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తారు. ఈ న్యాయస్థానాల్లో విచారణను న్యాయాధికారి (ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్) నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత హైకోర్టులను సంప్రదించి ఈ న్యాయాధికారులను నియమిస్తాయి.

గ్రామ న్యాయాలయాలు విచారించే కేసులు

క్రిమినల్, సివిల్ కేసులు, మరణశిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష, రెండు సంవత్సరాలకు పైగా శిక్ష విధింపునకు సంబంధించిన కేసులు మినహా మిగిలిన అన్ని రకాల వివాదాలపై గ్రామ న్యాయాలయాలు విచారణ నిర్వహిస్తాయి. దొంగతనం, దొంగిలించిన వస్తువులను తీసుకోవడం లేదా తన వద్ద ఉంచుకోవడం, దొంగిలించిన వస్తువులు లేదా ఆస్తిని దాచడానికి సహకరించడం (వాటి విలువ రూ. 20,000లకు పైగా లేని సందర్భాల్లో),ఆస్తి కొనుగోలు,భూమిని సాగు చేసుకోవడం, బోరుబావి లేదా సాధారణ బావి నుంచి నీటిని వినియోగించుకోవడం లాంటి కేసులను న్యాయాలయాలు విచారిస్తాయి.

సెషన్స్ కోర్టుకు అప్పీల్ చేసే అవకాశం

గ్రామ న్యాయాలయాలు ఇచ్చే తీర్పులను సవాలు చేస్తూ సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. అప్పీలు దాఖలు చేసిన ఆరు నెలల్లోగా సెషన్స్ కోర్టులు విచారణ జరిపి, తీర్పు ప్రకటించాలి.

లోక్ అదాలత్ (ప్రజా న్యాయస్థానం)

న్యాయస్థానాల్లో కొన్ని కారణాల వల్ల కేసులు పరిష్కరించడంలో ఎక్కువ జాప్యం జరుగుతుంది. వాది, ప్రతివాదులు కూడా కొన్ని సందర్భాల్లో పరిష్కారాలకు సముఖంగా ఉండక కాలయాపన చేస్తుంటారు. కేసులను త్వరితగతిన పరిష్కరించడం కోసం ప్రత్యామ్నాయ వివాద విచారణ (Alternative Dispute Resolution) పద్ధతిలో లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేస్తారు.

- లోక్ అదాలత్ పద్ధతిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.ఎన్. భగవతి ప్రచారంలోకి తీసుకు వచ్చారు.
- 1982లో గుజరాత్‌లో మొదటిసారిగా లోక్ అదాలత్‌లను ప్రారంభించారు.
- 1987లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం ద్వారా లోక్ అదాలత్‌లకు చట్టబద్ధత కల్పించారు. నిర్దేశిక నియమాల్లో ప్రకరణ 39ఎ ప్రకారం ప్రజలకు ఉచిత న్యాయ సలహా అందించాలని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే వీటిని ఏర్పాటు చేశారు.

సులభంగా పరిష్కరించగలిగే కొన్ని రకాల కేసులను పెద్ద మనుషుల మధ్యవర్తిత్వంలో పరిష్కరించడానికి చట్టబద్ధమైన ప్రతిపత్తి కలిగిస్తూ 'లోక్ అదాలత్' పేరుతో ప్రజా న్యాయస్థానాలనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ పేదలకు ఉచితంగా న్యాయం అందిస్తుంది. సాధారణ న్యాయస్థానాల్లో పనిచేస్తున్న న్యాయమూర్తి లోక్ అదాలత్ న్యాయాధిపతిగా కూడా వ్యవహరిస్తారు. ఈ విధానం వల్ల కేసులను పరిష్కరించడంలో ఆలస్యాన్ని నివారించవచ్చు.

లోక్ అదాలత్ నిర్మాణం

సుప్రీంకోర్టు, హైకోర్టు, లీగల్ సర్వీసెస్ కమిటీ, రాష్ట్ర, జిల్లా స్థాయి లీగల్ సర్వీస్ కమిటీలు లోక్ అదాలత్‌లను నిర్వహించవచ్చు. ఇందులో జిల్లా ప్రస్తుత న్యాయమూర్తి లేదా పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి, అదేవిధంగా వివిధ రంగాల్లో ప్రముఖులు.. ముఖ్యంగా న్యాయశాస్త్రం, సామాజిక సేవ, నిమ్న వర్గాల వికాసానికి కృషి చేస్తున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. లోక్ అదాలత్ ఇచ్చే తీర్పులు అంతిమం. వీటిని సాధారణంగా అప్పీల్ చేసుకోవడానికి వీలు లేదు. పార్లమెంట్ 2002లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం–1987కు సవరణ చేసి శాశ్వత పద్ధతిలో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసింది.దీని ప్రకారం శాశ్వత లోక్ అదాలత్‌కు జిల్లా న్యాయమూర్తి లేదా అదనపు న్యాయమూర్తి చైర్మన్‌గా ఉంటారు. పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్‌లో ఇద్దరు నిష్ణాతులను ప్రభుత్వాలు నామినేట్ చేస్తాయి.

లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే అంశాలు

మోటారు వాహనాలు, ఇన్సూరెన్సు క్లెయిమ్‌లు, కాంట్రాక్టులకు సంబంధించిన వివాదాలు, వివాహ సంబంధ కేసులు, భూ సేకరణ, బ్యాంకు లోన్‌లకు సంబంధించిన కేసులు ఉభయ వర్గాల అంగీకారంతో లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరంగా, సంతృప్తికరంగా పరిష్కారమవుతున్నాయి. ఇవి ప్రత్యేక తరహాలో రూపొందించిన న్యాయస్థానాలు. ప్రజలకు సత్వరమే న్యాయాన్ని అందించడం ఈ లోక్ అదాలత్‌ల ముఖ్య ఉద్దేశం.

వినియోగదారుల ఫోరాలు (Consumer Forums)

వినియోగదారులు, అమ్మకందారులకు మధ్య తలెత్తే వివాదాలు వినియోగదారుల ఫోరాల్లో పరిష్కారమవుతున్నాయి. ఇటీవల ఆధునిక రాజ్యాల్లో వినియోగదారుల హక్కులపై చైతన్యం పెరగడం వల్ల ఈ హక్కులకు భంగం కలిగితే వీటి ద్వారా పరిష్కారాలు ఇస్తున్నారు. ఇలా ఈ నూతన న్యాయస్థానాలు ప్రజా న్యాయస్థానాలుగా ఆదరణ పొందుతున్నాయి. 1986లో వినియోదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని చేశారు. ఇవి మూడు స్థాయిల్లో పనిచేస్తాయి. జిల్లా స్థాయిలో పనిచేసే ఫోరాలు రూ.20 లక్షల లోపు విలువ ఉన్న కేసులను, రాష్ట్ర స్థాయిలోని ఫోరాలు రూ. 20 లక్షల నుంచి ఒక కోటి వరకు విలువ ఉన్న కేసులను, జాతీయ స్థాయిలోని ఫోరం కోటి రూపాయలకు పైగా విలువ ఉన్న కేసులను పరిశీలిస్తాయి. వినియోగదారుడు 100 రూపాయల రుసుం చెల్లించి ఫిర్యాదు చేయవచ్చు. సాధారణ న్యాయస్థానాల్లా న్యాయప్రకియలు ఉండవు. వినియోగదారుడు తన వాదనను స్వయంగా వినిపించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. హైకోర్టు, సుప్రీంకోర్టుల న్యాయమూర్తులకు సంబంధించి ఏ విషయంలో పోలికలు ఉన్నాయి?
   ఎ) తొలగింపు బి) రాజీనామా
   సి) స్వతంత్ర ప్రతిపత్తి డి) పైవన్నీ
2. సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష అధికారం నుంచి మినహాయించిన అంశం?
   ఎ) పార్లమెంటరీ ప్రక్రియలు
   బి) మంత్రి మండలి సలహా
   సి) సభాధ్యక్షుల నిర్ణయాలు
   డి) పైవన్నీ
3. కిందివాటిలో కొలీజియం వ్యవస్థలోని లోపం ఏది?
   ఎ) వృత్తిపరమైన ప్రీతి
   బి) పారదర్శకత లేకపోవడం
   సి) అనూహ్యమైన జాప్యం
   డి) పైవన్నీ
4. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ కు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   ఎ) ఇది రాజ్యాంగపరమైన సంస్థ
   బి) న్యాయ నియామకాలు, ఖాళీలను గుర్తిస్తుంది.
   సి) దీనికి అధిపతిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉంటారు
   డి) పైవన్నీ సరైనవే
5. సుప్రీం కోర్టు తీర్పులను ...
   ఎ) రాష్ట్రపతి మార్చవచ్చు
   బి) పార్లమెంటు మార్చవచ్చు
   సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మార్చవచ్చు
   డి) ఏదీకాదు
6. కింది ఏ అంశాలను సుప్రీంకోర్టు ఆవిష్కరించింది?
   ఎ) ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం
   బి) మౌలిక నిర్మాణ సూత్రం
   సి) కొలీజియం భావన
   డి) పైవన్నీ
7. అమెరికా సుప్రీంకోర్టుకు భారత సుప్రీంకోర్టుకు మధ్య తేడా?
   ఎ) న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు
   బి) అపరిమిత న్యాయ సమీక్ష అధికారం
   సి) ఎ, బి
   డి) ఏదీకాదు
8. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దేనికి ఆపాదించవచ్చు?
   ఎ) న్యాయ సమీక్ష
   బి) న్యాయశాఖ క్రియాశీలత
   సి) న్యాయశాఖ పవిత్రత
   డి) న్యాయశాఖ ఆధిక్యత
9. సుప్రీంకోర్టును రాజ్యాంగ పరిరక్షణకర్తగా పేర్కొంటారు. దీనికి ప్రాతిపదిక?
   ఎ) జీతభత్యాలు
   బి) స్వతంత్ర సర్వీసులు
   సి) న్యాయ సమీక్ష
   డి) న్యాయశాఖ ఆధిక్యం
10. ప్రజా ప్రయోజానాల వ్యాజ్యం సుప్రీంకోర్టులో ప్రారంభమైనప్పుడు నాటి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
    ఎ) ఎం. హిదయతుల్లా
    బి) వి.ఆర్. క్రిష్ణ అయ్యర్
    సి) పి.ఎన్. భగవతి
    డి) ఎ.ఎస్.ఆనంద్
11. కింది ఏ కోర్టు లేదా కోర్టులను 'కోర్ట్ ఆఫ్ రికార్డ్స్'గా పరిగణిస్తారు?
    ఎ) సుప్రీంకోర్టు బి) హైకోర్టు
    సి) జిల్లా కోర్టు డి) ఎ, బి
12. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను తర్వాత కాలంలో మార్చవచ్చు. దీన్ని ఏమంటారు?
    ఎ) క్యూరేటివ్ పిటిషన్
    బి) రివిజన్ పిటిషన్
    సి) ప్రాస్పెక్టివ్ ఓవర్ రూలింగ్
    డి) స్టేర్ డెసిసిస్

సమాధానాలు

1) డి; 2) డి; 3) డి; 4) డి; 5) డి; 6) డి; 7) సి; 8) బి; 9) సి; 10) సి; 11) డి; 12) సి.

నన్నయ రాసిన 'అమ్మ కోసం' పాఠ్య భాగం ఏ ప్రక్రియ?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

డీసెట్‌లో తెలుగు సబ్జెక్టు కీలక పాత్ర పోషిస్తోంది. కాబట్టి అభ్యర్థులు అశ్రద్ధ చేయకుండా తెలుగుపై పట్టు సాధించాలి. ఇందులో ఎక్కువగా కవులు, రచయితలు, వారి కాలాలు, బిరుదులు, రచనలు, కావ్య ప్రక్రియలు, ప్రసిద్ధ కొటేషన్లు, సాహిత్య అంశాలు, సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, అర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు, ప్రకృతి- వికృతులు, జాతీయాలు- సామెతలు, ప్రత్యక్ష కథనం- పరోక్ష కథనం, నామ్నీకరణం, వాక్య భేదాలు తదితర వ్యాకరణఅంశాలపై ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. 8, 9, 10 తరగతుల కొత్త పాఠ్య పుస్తకాలను సేకరించి సొంత నోట్సు ప్రిపేర్ చేసుకోవాలి.

8వ తరగతి - తెలుగు

కవులు - పరిచయం

1. **గంగాపురం హనుమచ్ఛర్మ (1925–96):**
   గొప్ప కవి పండితులు, రాజకీయవేత్త, సమాజ సేవకులు
   పాఠ్యభాగం: దుందుభి
   ప్రక్రియ : గేయం
   ఇతివృత్తం: పర్యావరణం
   రచనా విశేషాలు: రుగ్వేద విజ్ఞానం, దుందుభి (నదీకావ్యం), మల్కిభరామ, గోపన
2. **డా. బిరుదురాజు రామరాజు (1925–2010):**
   జానపద సాహితీ వేత్త
   పాఠ్యభాగం: మన సంస్కృతి
   ప్రక్రియ: వ్యాసం
   ఇతివృత్తం: సంస్కృతి
   రచనా విశేషాలు: తెలుగు జానపద గేయ సాహిత్యం, చరిత్రకెక్కిన చరితార్థులు, ఆంధ్ర యోగులు, మరుగుపడిన మాణిక్యాలు, ఉర్దూ, తెలుగు నిఘంటువులు, శ్రీ సత్యసాయి విన్నపాలు, తెలుగు వీరుడు, వీరగాథలు, అల్లూరి సీతారామరాజు, తెలుగు జానపద రామాయణం, తెలుగు సాహిత్యోద్యమకారులు, తెలంగాణ పల్లెపాటలు, తెలంగాణ పిల్లల పాటలు .
3. **నన్నయ (11వ శతాబ్దం):**
   బిరుదు: ఆదికవి, వాగానుశాసనుడు.
   పాఠ్యభాగం: అమ్మ కోసం
   ప్రక్రియ: పద్యం
   ఇతివృత్తం: మాతృభక్తి
   రచనా విశేషాలు: మహాభారతం, ఆంధ్రశబ్ద చింతామణి, చాముండికా విలాసం, ఇంద్ర విజయం.
4. **కొండూరు వీరరాఘవాచార్యులు (20వ శతాబ్దం):**
   పాఠ్యభాగం: నీతి పరిమళాలు
   ప్రక్రియ: శతకం
   ఇతివృత్తం: నైతిక విలువలు
   రచనా విశేషాలు: మిత్ర సాహస్రి
5. **శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) (1910–83):**
   బిరుదు: మహాకవి, అభ్యుదయ కవిత్వ మూలవిరాట్టు.
   పాఠ్యభాగం: ప్రతిజ్ఞ **ప్రక్రియ:** గీతం
   ఇతివృత్తం: సామాజిక చైతన్యం
   రచనా విశేషాలు: ప్రభవ (భావ కవితా సంపుటి), మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, మూడు యాభైలు, చరమరాత్రి, మరో ప్రస్థానం, సిప్రాలి, కార్టూన్ కవితలు, 1999 రేడియో నాటికలు, అనంతం (ఆత్మకథ).
6. **నార్ల వెంకటేశ్వరరావు (1908):**
   పత్రికా సంపాదకులు, కవి, విమర్శకులు, నాటక కర్త.
   పాఠ్యభాగం: అజంతా చిత్రాలు
   ప్రక్రియ: యాత్రా రచన
   రచనా విశేషాలు: రష్యన్ కథలు(అనువాద రచన), నరకంలో హరిశ్చంద్రుడు (నాటకం), నార్లవారి మాట (శతకం), కొత్తగడ్డ (నాటికల సంపుటి), సీత జోస్యం.
7. **గౌరన (15వ శతాబ్దం):**
   బిరుదు: చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి, ప్రతివాద గజ పంచాననుడు.
   పాఠ్యభాగం: హరిశ్చంద్రుడు
   ప్రక్రియ : ద్విపద కావ్యం
   రచనా విశేషాలు: నవనాథ చరిత్ర (ద్విపద కావ్యం), హరిశ్చంద్రోపాఖ్యానం (ద్విపద కావ్యం), లక్షణ దీపిక (సంస్కృత గ్రంథం).
8. **వట్టికోట ఆళ్వారుస్వామి (1915–61):**
   గొప్ప నవలాకారుడు
   పాఠ్యభాగం: చిన్నప్పుడే
   ప్రక్రియ : కథానిక
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: ప్రజల మనిషి (ప్రసిద్ధ నవల), గంగు (ప్రసిద్ధ నవల), జైలు లోపల (కథల సంపుటి).
9. **డా. సి. నారాయణ రెడ్డి (సినారె) (1931):**
   బిరుదు: పద్మభూషణ్
   పాఠ్యభాగం: జీవన భాష్యం
   ప్రక్రియ: గజల్
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర, ప్రపంచ పదులు, మట్టిమనిషి ఆకాశం, సినారె గజళ్లు, మంటలూ - మానవుడు, అక్షరాల గవాక్షాలు, రుతుచక్రం.
10. **డా. ఇరివెంటి కృష్ణమూర్తి (1930–89):**
    రచనా విశేషాలు: తెలుగు ఉత్తర భారత సాహిత్యాలు, చాటువులు, వాగ్భూషణమ్, వేగు చుక్కలు, వెలుగు బాటలు, అడుగు జాడలు, కవి సమయాలు (సిద్ధాంత గ్రంథం).
11. **అయ్యలరాజు రామభద్రుడు (16వ శతాబ్దం):**
    పాఠ్యభాగం: సముద్ర లంఘనం
    ప్రక్రియ: ప్రబంధం
    రచనా విశేషాలు: రామాభ్యుదయం (ప్రబంధం), సకలకథాసారా సంగ్రహం
12. **నండూరి రామమోహన్‌రావు (1927–2011):** పత్రికా సంపాదకులు.
    పాఠ్యభాగం: సంస్కరణ
    ప్రక్రియ: వార్తావ్యాఖ్య
    రచనా విశేషాలు: విశ్వరూపం, నరావతారం, విశ్వదర్శనం, పల్లవి - అనుపల్లవి, చిరంజీవులు, నండూరి రామమోహనరావు వ్యాఖ్యావళి, చిలక చెప్పిన రహస్యం, మయూర కన్య, హరివిల్లు (పిల్లల గేయాలు).
13. **ఎస్.టి. జ్ఞానానందకవి (1922–2011):**
    బిరుదు: పద్మశ్రీ
    పాఠ్యభాగం: సందేశం
    ఇతివృత్తం: జాతీయ సమైక్యత
    రచనా విశేషాలు: దీనబంధు శతకం, ఆమ్రపాలి, పాంచజన్యం, క్రీస్తు శతకం, నా జీవిత గాథ, కూలి నుంచి కళాప్రపూర్ణ వరకు.

వివిధ శతక కవులు – రచనా విశేషాలు:

- భర్తృహరి (7వ శతాబ్దం) – సుభాషిత త్రిశతి
- ధూర్జటి (16వ శతాబ్దం) – శ్రీకాళహస్తీశ్వర శతకం
- తాళ్లపాక పెద్ద తిరుమలయ్య (16వ శతాబ్దం) – వేంకటేశ్వర శతకం
- మారద వెంకయ్య (17వ శతాబ్దం) – భాస్కర శతకం
- కంచర్ల గోపన్న (17వ శతాబ్దం) – దాశరథీ శతకం
- నీలకంఠ దీక్షితులు (17వ శతాబ్దం) – సభారంజన శతకం (మూల కర్త)
- ఏనుగు లక్ష్మణ కవి (18వ శతాబ్దం) – సుభాషిత రత్నావళి
- ఏలూరిపాటి అనంతరామయ్య (20వ శతాబ్దం) – సభారంజన శతకం (అనువాద కర్త)

మాదిరి ప్రశ్నలు

1. గంగాపురం హనుమచ్ఛర్మ రాసిన దుందుభి ఒక ?
   1) ప్రేమ కావ్యం 2) నదీ కావ్యం
   3) వచన కావ్యం 4) అనువాద కావ్యం
2. మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురం ప్రాంతంలో ఏ నదిని 'దేవసేన' అని పిలుస్తారు?
   1) తుంగభద్ర 2) కృష్ణా
   3) మంజీర 4) దుందుభి
3. తెలుగు జానపద గేయ సాహిత్యం ఎవరి పరిశోధన గ్రంథం?
   1) బిరుదురాజు రామరాజు
   2) ఎస్.టి. జ్ఞానానంద కవి
   3) నాయని కృష్ణకుమారి
   4) ఇరివెంటి కృష్ణమూర్తి
4. బిరుదురాజు రామరాజు స్వస్థలం?
   1) కల్వకుర్తి (మహబూబ్ నగర్)
   2) దేవనూరు (వరంగల్)
   3) కవుతవరం (కృష్ణా)
   4) నకిరేకల్ (నల్గొండ)
5. కింది వాటిలో బిరుదురాజు రామరాజు రచన కానిది?
   1) తెలుగు వీరుడు
   2) తెలుగు జానపద రామాయణం
   3) తెలుగు జానపద గేయగాథలు
   4) తెలంగాణ పల్లె పాటలు
6. అనువాద పద్ధతి, శైలిలో తర్వాత తరం కవులకు మార్గదర్శకుడు?
   1) నన్నయ 2) తిక్కన
   3) ఎర్రన 4) శ్రీనాథుడు
7. నన్నయ రాసిన 'అమ్మ కోసం' పాఠ్య భాగం ఏ ప్రక్రియ?
   1) పురాణం 2) ఇతిహాసం
   3) ప్రబంధం 4) పురాణేతిహాసం
8. కిందివాటిలో నన్నయ కవిత్వంలో ప్రధాన లక్షణం కానిది?
   1) అక్షర రమ్యత
   2) ప్రసన్న కథా కలితార్థయుక్తి
   3) సూక్తి వైచిత్రి
   4) నానారుచిరార్థసూక్తి నిధిత్వం
9. సభారంజన శతకం- మూలకర్త?
   1) భర్తృహరి
   2) కొండూరు వీరరాఘవాచార్యులు
   3) ఏలూరిపాటి అనంతరామయ్య
   4) నీలకంఠ దీక్షితులు
10. కొండూరు వీరరాఘవాచార్యులు రాసిన శతకం ?
    1) మిత్రసాహస్రి
    2) సభారంజన శతకం
    3) మిత్రార్థ శతకం 4) వేంకటేశ శతకం
11. నీతి, భక్తి, వైరాగ్యాలను ప్రధానంగా బోధించే రచనలు?
    1) పురాణాలు 2) ఇతిహాసాలు
    3) శతకాలు 4) ఖండకావ్యాలు
12. శ్రీశ్రీ 18వ ఏట వెలువరించిన 'ప్రభవ' ఒక?
    1) అభ్యుదయ కవితా సంపుటి
    2) వచన కవితా సంపుటి
    3) విప్లవ కవితా సంపుటి
    4) భావ కవితా సంపుటి
13. చరమరాత్రి కథల ద్వారా చైతన్య స్రవంతి పద్ధతిని తెలుగు రచనలలో ప్రవేశ పెట్టిన వారు?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) శ్రీశ్రీ
    3) నార్ల వేంకటేశ్వరరావు
    4) త్రిపురనేని గోపీచంద్
14. కృష్ణాజిల్లా కవుతవరంలో జన్మించిన నార్ల వేంకటేశ్వరరావు ఒక గొప్ప?
    1) పత్రికా సంపాదకుడు
    2) కవి, విమర్శకుడు
    3) నాటక కర్త 4) పైవన్నీ
15. రష్యన్ కథలను తెలుగువారికి అందించిన రచయిత?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) సామల సదాశివ
    3) నార్ల వేంకటేశ్వర రావు
    4) నండూరి రామమోహనరావు
16. 'చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి' అని ఎవరికి బిరుదు?
    1) గౌరన
    2) అయ్యలరాజు రామభద్రుడు
    3) కొరవి గోపరాజు
    4) శ్రీకృష్ణదేవరాయలు

సమాధానాలు

1) 2; 2) 4; 3) 1; 4) 2; 5) 3; 6) 1; 7) 2; 8) 3; 9) 4; 10) 1; 11) 3; 12) 4; 13) 2; 14) 4; 15) 3; 16) 1.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లకు అపెక్స్ బ్యాంక్?

గ్రామీణ వ్యవసాయ పరపతి

గ్రామీణాభివృద్ధి, భారత ఆర్థికాభివృద్ధికి చుక్కాని వంటిది. గ్రామాలు సుసంపన్నంగా ఉన్నప్పుడే భారత్ అన్ని రంగాల్లో వెలుగొందుతుంది. కానీ నేటి గ్రామీణ భారతం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. అందుకు ప్రధాన కారణం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉండడం. డబ్బుతో ముడిపడి ఉన్న ఆధునిక వ్యవసాయా నికి సరిపడ పెట్టుబడి పెట్టే ఆర్థిక స్తోమత లేక రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. వ్యవసాయం ద్వారా సంపాదించిన ఆదాయం అధిక వడ్డీతో తీసుకున్న రుణాల చెల్లింపునకే సరిపోనప్పుడు రైతన్నకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతుంది.

'రాయల్ కమిషన్' చెప్పినట్లుగా మనదేశంలో రైతు అప్పులతో పుడుతున్నాడు. అప్పులతో నివసిస్తూ చివరకు అప్పులతో మరణిస్తున్నాడు.

గ్రామీణ రుణగ్రస్థత

భారత గ్రామీణాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్య వ్యవసాయ రుణగ్రస్థత. ఇది దేశ వ్యవసాయాభివృద్ధిని కుంటుపరుస్తుంది. గ్రామీణుల్లో చాలామంది తమ ఆర్థిక అవసరాల కోసం ఎక్కువగా అప్పులు చేస్తుంటారు. వీటిలో కొంతభాగం కుటుంబ అవసరాలకు, మిగిలిన దాన్ని వ్యవసాయ పెట్టుబడికి వినియోగిస్తున్నారు. అనేక కారణాల వల్ల గ్రామీణులు ఆ అప్పులను పూర్తిగా తీర్చలేక రుణగ్రస్థులవుతున్నారు. ఈ పరిస్థితిని 'గ్రామీణ రుణగ్రస్థత' (Rural Indebtedness) అంటారు.

కారణాలు

పేదరికం, వారసత్వంగా వచ్చిన అప్పులు, పెరిగిన వ్యవసాయ ఖర్చులు, వ్యవసాయ రంగం వెనుకబాటుతనం, అల్ప ఉత్పాదకత, భూమి కౌలు రుసుం అధికంగా ఉండడం, సాంఘిక, మతపరమైన కట్టుబాట్లు, ఆచారాల కోసం చేసే వ్యయం, వడ్డీ వ్యాపారుల మీద అధికంగా ఆధారపడటం, ప్రభుత్వ పరపతి సదుపాయాలు తగినంతగా లేకపోవడం, అనారోగ్యం, దురలవాట్లు మొదలైనవి.

పరిణామాలు

అధిక రుణభారం వల్ల వ్యవసాయదారుడి పెట్టుబడి శక్తి క్షీణిస్తుంది. తద్వారా దిగుబడి తగ్గి, ఉత్పత్తి తక్కువై ఆహార కొరత ఏర్పడుతుంది. ఆహార సరఫరా తక్కువ అవడం వల్ల డిమాండ్ అధికమై ప్రజల ఆహార ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. ప్రజల మిగులు ఆదాయం తగ్గడం వల్ల పారిశ్రామిక, సేవారంగాల ఉత్పత్తులకు డిమాండ్ తగ్గుతుంది. అపుడు ఆర్థిక వ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అది ప్రజల విద్యా, వైద్య, ఆరోగ్య స్థితిగతులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రభుత్వ సంస్థాగత పరపతి సౌకర్యాల కోసం, రైతుల రుణాలు మాఫీ చేయాలని ఉద్యమాలు పుడతాయి. వీటికి ప్రభుత్వ స్పందన సానుకూలంగా లేకపోతే అవి హింసాత్మకంగా మారి సమాజ భద్రతకు సవాలుగా మారుతాయి.

నివారణ చర్యలు

వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా ప్రభుత్వ సంస్థాగత పరపతి సౌకర్యాలను గ్రామీణ రైతులకు అధికంగా అందించాలి. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ప్రభుత్వం నియంత్రించి అధిక వడ్డీ వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలి. కరువు పరిస్థితుల్లో రైతు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసి సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని ఎప్పటి కప్పుడు అందజేయాలి.

గ్రామీణ పరపతిపై ప్రభుత్వ చర్యలు

- ❖ గ్రామీణ రుణగ్రస్థతను నిర్మూలించడానికే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) 'గోర్వాలా' అధ్యక్షతన 'అఖిల భారత గ్రామీణ పరపతి పరిశీలన సంఘం'(1954)ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రధానంగా సహకార పరపతి సంఘాలను ఎక్కువ సంఖ్యలో స్థాపించాలని, సహకార మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలని సూచించింది.
- ❖ గోర్వాలా నివేదిక ప్రకారం ప్రభుత్వం 1955లో 'ఇంపీరియల్ బ్యాంక్'ను జాతీయం చేసి 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)'గా మార్చింది.
- ❖ ఈ కమిటీ సూచనల మేరకు 1956లో ఆర్‌బీఐ గ్రామీణ రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందించడానికి 'జాతీయ వ్యవసాయ పరపతి – దీర్ఘకాలిక కార్యకలాపాల నిధి'ని ఏర్పాటుచేసింది. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రైతులను ఆదుకోవడానికీ 'జాతీయ వ్యవసాయ పరపతి స్థిరీకరణ నిధి'ని ప్రారంభించింది.
- ❖ ప్రభుత్వం వ్యవసాయ పరపతిని అధికం చేసే క్రమంలో 1969లో 14 వాణిజ్య బ్యాం కులు, 1980లో 6 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేసింది.
- ❖ 1963లో 'వ్యవసాయ పునర్విత్త సంస్థ'ను స్థాపించారు.
- ❖ ప్రొఫెసర్ ఎమ్. నరసింహం కమిటీ సిఫారసు ఆధారంగా ప్రభుత్వం 1975 అక్టోబర్ 2న 'ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్' (RRB)లను స్థాపించింది.
- ❖ వ్యవసాయ గ్రామీణాభివృద్ధికి సంస్థాగతమైన ఏర్పాట్ల సమీక్షించడం కోసం క్రాఫికార్డ్ (CRAFICARD) కమిటీ (1979)ను ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సూచనల ప్రకారం 1982 జూలై 12న 'జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్'(NABARD)ను ఏర్పా టు చేసింది. ఇది ఆర్ఆర్‌బీల విధానాలను పర్యవేక్షించే అత్యున్నత బ్యాంక్ (Apex Bank). దీన్ని ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా స్థాపించాయి. ఆర్ఆర్‌బీల కు, ఆర్‌బీఐకి మధ్య నాబార్డ్ సంధానకర్తగా వ్యవహరిస్తుంది. రాష్ట్ర సహకార బ్యాంక్ (SCB)లకు, ఆర్ఆర్‌బీలకు ఇది ప్రత్యక్షంగా రుణ సహాయం అందిస్తుంది. రైతులకు నేరుగా రుణాలను అందించదు.
- ❖ గ్రామీణ పరపతిపై సూచనలిచ్చే ఉద్దేశం తో ఆర్.వి.గుప్తా నేతృత్వంలో 1997లో ఆర్‌బీఐ ఒక పరిశీలన సంఘాన్ని నియమించింది. ఈ కమిటీ గ్రామ పరపతిని ప్రోత్సహించే మార్గదర్శక సూత్రాలను సూచించింది. రైతు క్లబ్‌లను స్థాపించి, వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక విజ్ఞానాన్ని రైతులకు అందించేలా వాణిజ్య బ్యాంకులు కృషిచేయాలని సిఫారసు చేసింది.
- ❖ రైతులకు అవసరమైన పరపతిని సకాలం లో అందించడానికి మనదేశంలో 1904 లోనే 'సహకార సంస్థలు' ఆవిర్భవించాయి. వీటిని మొదట 1961లో, ఆ తర్వాత 1976లోనూ పునర్వ్యవస్థీకరించారు. ఆ తర్వాత అమల్లోకి వచ్చిన 'ఏకగవాక్ష విధానం' (Single window system) సహకార పరపతి విధానంలో నూతన చైతన్యం కలిగించింది. ఇది రైతులకు పరపతి సౌకర్యాలను సులభతరం చేసింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ

వ్యవసాయ పరపతి- వర్గీకరణ

వ్యవసాయ ఉత్పాదకాల కొనుగోలుకు, వ్యవసాయ పనులు చేపట్టడానికి అవసరమైన పరపతిని వ్యవసాయ పరపతి అంటారు. రైతులు తమ పరపతి అవసరాలను వివిధ మార్గాల ద్వారా తీర్చుకుంటున్నారు. అవి రెండురకాలు.

1. **సంస్థాగతమైన పరపతి మార్గాలు:** ప్రభుత్వం, సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు అందించే పరపతి సౌకర్యాలు.
2. **సంస్థాగతం కాని పరపతి మార్గాలు:** ప్రభుత్వ నియంత్రణ లేని సంస్థలు, ఎలాంటి చట్ట పరమైన విధి విధానాలు లేని వడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, స్నేహితులు, బంధువులు, భూస్వాముల నుంచి తీసుకునే అప్పులు. నేడు రైతులకు ఈ మార్గాల నుంచే అధికంగా పరపతి లభిస్తుంది. దీనికి వడ్డీ అధికంగా ఉండటం వల్ల రైతులు ఆర్థిక దోపిడికి గురవుతున్నారు. కాబట్టి ప్రభుత్వం సంస్థాగతం కాని పరపతి సంస్థలను నియం త్రించడానికి ప్రయత్నిస్తోంది. 'అఖిల భారత గ్రామీణ పరపతి పరిశీలన సంఘం' కాలవ్యవధి ఆధారంగా సంస్థాగతమైన పరపతి మార్గాలను 3 రకాలుగా వర్గీకరించింది.

1. **స్వల్పకాలిక పరపతి:**
   12 నుంచి 15 నెలల వ్యవధిలో తిరిగి చెల్లించాల్సిన వ్యవసాయ రుణాలను 'స్వల్పకాలిక పరపతి' అంటారు. సాధారణంగా పంట చేతికి రాగానే రైతులు ఈ రుణాలను తీర్చేస్తారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పశువుల మేత కొనుగోలు, కూలీల వేతనాలు, పంట ను మార్కెట్‌కు తరలించడానికి అయ్యే రవాణా వ్యయానికి ఈ స్వల్పకాలిక రుణా లను రైతులు ఉపయోగించుకుంటారు.
2. **మధ్యకాలిక పరపతి:**
   15 నెలల నుంచి 5 ఏళ్ల వ్యవధిలో ఈ రుణాలను తిరిగి చెల్లించాలి. పశువులు, వ్యవసాయ పనిముట్లు కొనుగోలు, బావుల తవ్వకం, భూమిని మెరుగుపర్చడం కోసం ఈ రుణాలను తీసుకుంటారు.
3. **దీర్ఘకాలిక పరపతి:**
   5 నుంచి 20 ఏళ్ల కాలవ్యవధిలో తిరిగి చెల్లించే రుణాలు.ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, ఎలక్ట్రిక్ మోటార్ల కొనుగోలు, శాశ్వతంగా భూమిని అభివృద్ధి చేయడం, అదనంగా భూమి కొనుగోలు చేయడానికి... అధిక మొత్తంలో డబ్బు అవసరం అవుతుంది. దీన్ని తక్కువ కాలంలో తీర్చడం వీలుకాదు. ఎక్కువ వాయిదాల్లో రైతులు ఆ రుణాలను తీర్చడానికి అనువుగా ఈ పరపతి సౌకర్యం సహాయపడుతుంది.

- ❖ టి.డబ్ల్యూ. షుల్జ్ అభిప్రాయం ప్రకారం 'ఇండియాలో పరపతి కొరత మూలంగా వ్యవసాయాభివృద్ధి కుంటుపడడమే కాకుండా, వ్యవసాయాన్ని ఆధునికీకరించే ప్రక్రియలో వేగం తగ్గింది'. దీన్ని బట్టి వ్యవసాయంలో ప్రగతిని స్థిరీకరించడానికీ పరపతి కీలకపాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు.

తక్కావి రుణాలు

సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లు, వాణిజ్య బ్యాంక్‌లు, రైతులకు పరపతి సౌకర్యాలను అందించక ముందు ప్రభుత్వమే నేరుగా రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను ఇచ్చేది. ముఖ్యంగా కరువు కాట కాలు, వరదలు మొదలైన ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులను ఆదుకోవడానికి ఇచ్చే రుణాలను 'తక్కావి' రుణాలంటారు. రైతులు ఈ రుణాలను తక్కువ వడ్డీతో, ఎక్కువ వాయిదాల్లో తీర్చేటట్లుగా వెసులుబాటు ఉండేది. అయితే కఠినమైన నియమాలు ఉండటం, మంజూరు చేయడంతో జాప్యం వల్ల ఇవి ఆదరణ కోల్పోయాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఇందిరాగాంధీ ఏ బ్యాంక్‌లను జాతీయం చేశారు?
ఎ) గ్రామీణ బ్యాంక్‌లు
బి) వాణిజ్య బ్యాంక్‌లు
సి) భారతీయ స్టేట్ బ్యాంక్‌లు
డి) పైవన్నీ

2. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1975 బి) 1978 సి) 1980 డి) 1982

3. గ్రామీణ రుణగ్రస్థతకు ప్రధాన కారణం
ఎ) రైతులు వ్యాపారస్తుల నుంచి తీసుకున్న రుణాలకు అధికంగా వడ్డీ చెల్లించడం
బి) వ్యవసాయ కమతాలు చిన్నవిగా ఉండీ దిగుబడి తక్కువై రైతుల ఆదాయం తగ్గటం
సి) పెళ్లిళ్లు, పుట్టుక, పండుగలు, చావులు కార్యక్రమాల కోసం గ్రామీణులు అధికంగా ఖర్చుచేసి అప్పుల పాలవడం
డి) పైవన్నీ

4. ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లకు అపెక్స్ బ్యాంక్ ?
ఎ) RBI బి) SBI
సి) NABARD
డి) DCB

5. 'తక్కావి రుణాలు' అంటే ఏమిటి?
ఎ) ప్రభుత్వం నామమాత్రపు వడ్డీతో రైతులకిచ్చే అతిస్వల్పకాలిక రుణాలు
బి) వ్యవసాయ పనిముట్ల కొనుగోలు కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకిచ్చే రుణాలు
సి) ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్కువ వడ్డీ, ఎక్కువ వాయిదాల్లో తీర్చేలా ప్రభుత్వం రైతులకిచ్చే రుణాలు
డి) సహకార సంస్థలు, గ్రామీణ బ్యాంక్‌లు అతి తక్కువ వడ్డీతో రైతులకిచ్చే స్వల్ప కాలిక దీర్ఘకాలిక రుణాలు

6. రామయ్య పశువులను కొనుగోలు చేయటానికి రుణం కోసం బ్యాంక్‌కు దరఖాస్తు చేశాడు. అపుడు బ్యాంక్ ఏ రకమైన రుణాన్ని అతడికి మంజూరు చేస్తుంది?
ఎ) స్వల్పకాలిక రుణం
బి) అతి స్వల్పకాలిక రుణం
సి) మధ్యకాలిక రుణం డి) దీర్ఘకాలిక రుణం

7. కిందివాటిలో రైతులకు ప్రత్యక్షంగా రుణాలివ్వని సంస్థ?
ఎ) ప్రాథమిక భూ అభివృద్ధి బ్యాంకులు
బి) ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు
సి) ఎస్‌బీఐ
డి) నాబార్డ్

8. నాబార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసిన కమిటీ?
ఎ) క్రాఫికార్డ్ కమిటీ బి) సరయూ కమిటీ
సి) నరసింహం కమిటీ డి) గోర్వాలా కమిటీ

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) సి;
5) సి; 6) సి; 7) డి; 8) ఎ.

Innovation in marketing is same as ...

BANK EXAMS

MARKETING AWARENESS

1. The fact that services are sold, produced and consumed at the same time refers to which of the following service characteristics?
   a) Intangibility b) Inseparability
   c) Variability d) Perishability
   e) None of the above
2. Electronic shopping, TV shopping is related with:
   a) Advertising
   b) Personal Selling
   c) Direct Marketing
   d) In direct Marketing
   e) Personal buying
3. The purpose of which of the following type of advertising is to create repeat purchases?
   a) Reminder b) Reinforcement
   c) Persuasive d) Informative
   e) None of the above
4. ______ is the process of evaluating each market segment's attractiveness and selecting one or more segments to enter.
   a) Mass marketing
   b) Market segmentation
   c) Market targeting
   d) Market positioning
   e) None of the above
5. The technique of focus on advertising of non-competitive brand with the other brand is called:
   a) Cross-promotions
   b) Tie-in promotions
   c) Premiums d) All the above
   e) None of the above
6. Labelling, packaging are associated with:
   a) Price mix
   b) Product mix
   c) Place mix
   d) Promotion mix
   e) Cost mix
7. Entry of laggards is in which stage of PLC (Product Life Cycle)?
   a) First d) Second
   c) Third d) Fourth
   e) Fifth
8. ______ factors are the most popular bases for segmenting customer groups.
   a) Geographic b) Demographic
   c) Psychographic
   d) Behavioural
   e) None of the above
9. A method in which various products are combined at the same price is:
   a) Promotional pricing
   b) Product-bundle pricing
   c) Captive product pricing
   d) Optional product pricing
   e) All the above
10. Differentiation in pricing for various geographical customers:
    a) Price skimming
    b) Psychological pricing
    c) Pricing variations
    d) Geographical pricing
    e) None of the above
11. According to the American Marketing Association, which of the following is marketing of products that are presumed to be environmentally safe?
    a) Gray Marketing
    b) Green Marketing
    c) Global Marketing
    d) Social Marketing
    e) Internet Marketing
12. One of the following is not included in the 7 Ps of Marketing. Find the same ______.
    a) Placement b) Price
    c) Production d) Promotion
    e) Product
13. Innovation in marketing is same as
    a) Motivation b) Perspiration
    c) Aspiration d) Creativity
    e) Team work
14. A call marketing terms means?
    a) A newly introduced product
    b) Territory allocation for salesperson
    c) A Call Centers
    d) A Sales meeting
    e) To visit a prospect
15. Bank ATMs are______
    a) Delivery outlets
    b) Market plans
    c) Personalized Products
    d) Tools for overcoming buyers resistance
    e) Motivating tools
16. The USP of current account is ______
    a) High minimum balance
    b) No restrictions on transactions
    c) No internet payable
    d) Restricted deposits
    e) Easy credits
17. The target group for SME Loan is ______
    a) All salaried persons
    b) Govt. undertakings
    c) All entrepreneurs
    d) All students e)All housewives
18. ______ is a principle of enlightened marketing that requires a company seek real product and marketing improvements.
    a) Innovative marketing
    b) Consumer-oriented marketing
    c) Value marketing
    d) Sense-of-mission marketing
    e) None of the above
19. NAV is the price of______
    a) Entire fund value
    b) One unit of a fund
    c) Surrender value
    d) Average value of shares
    e) Dividends paid in a year
20. A Master policy in the case of Life insurance indicates ______
    a) Policy is sale
    b) Policy is in the name of servant
    c) Only one life is assured
    d) There are several beneficiaries
    e) Life assured should be a male
21. The biggest or greatest amount of involvement in a foreign market comes through which of the following?
    a) Exporting b) Joint venturing
    c) Licensing
    d) Direct investment
    e) None of the above
22. Financial inclusion needs canvassing the accounts of ______
    a) Financial Institutions
    b) NRIs
    c) HNIs
    d) Housewives
    e) Persons below a specified income level
23. Facilities for sale and purchase of agricultural products are available in ______
    a) Commodity exchange
    b) Regulated market
    c) Stock exchange
    d) Unregulated market
    e) None of the above
24. The company that overlooks new and better ways to do things will eventually lose customers to another company that has found a better way of serving customer needs is a major tenet of:
    a) Innovative marketing
    b) Consumer-oriented marketing
    c) Value marketing
    d) Sense-of-mission marketing
    e) None of the above
25. All of the following would be ways to segment within the category of psychographic segmentation EXCEPT:
    a) Social class b) Occupation
    c) Lifestyle d) Personality
    e) Creativity
26. In terms of execution styles, a family seated at the dinner table enjoying the advertised product would be an example of which of the following types of advertising?
    a) Slice of life b) Lifestyle
    c) Mood or imagery
    d) Personality symbol
    e) Personality
27. A child in the United States is normally exposed to all of the following values EXCEPT:
    a) Achievement and success
    b) Activity and involvement
    c) Material comfort
    d) Collectivism
    e) None of the above
28. ______ has contractual authority to sell a manufacturer's entire output.
    a) Selling agents
    b) Rack jobbers
    c) Manufacturer's agents
    d) Purchasing agents
    e) None of these
29. Sellers that handle their own exports are engaged in:
    a) Direct exporting
    b) Indirect exporting
    c) Licensing
    d) Contract manufacturing
    e) None of the above
30. More and more salespeople are being evaluated and compensated based on different measures than in the past. All of the following are illustrations of those measures EXCEPT:
    a) Long-term customer satisfaction
    b) Competitive predatory pricing performance
    c) Full customer service
    d) Retention rates
    e) None of the above
31. ______ includes practices such as overstating the product's features or performance, luring the customer to the store for a bargain that is out of stock, or running rigged contests.
    a) Deceptive promotion
    b) Deceptive packaging
    c) Deceptive pricing
    d) Deceptive cost structure
    e) None of the above
32. The type of sales presentation approach that requires good listening and problem-solving skills is the:
    a) Canned approach
    b) Formula approach
    c) Need-satisfaction approach
    d) Critical-thinking approach
    e) None of the above
33. In terms of special product life cycles, a ______ is a basic and distinctive mode of expression.
    a) genre b) style
    c) fashion d) fad e) None

KEY

1) b	2) c	3) a	4) c	5) a
6) b	7) d	8) b	9) b	10) d
11) b	12) c	13) d	14) e	15) c
16) b	17) c	18) a	19) b	20) d
21) d	22) e	23) d	24) a	25) b
26) a	27) d	28) a	29) a	30) a
31) b	32) a	33) b		